

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI



ఆదివారం | 4-5-2025 | పేజీలు: 14 + 4 + 28 పేజీల ఆదివారం అనుబంధం | వెల (Price) : Rs. 8.00 | సంపుటి (Volume) :23 సంచిక (Issue) : 35 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, వైశాఖమాసం, శుక్లపక్షం; తిథి: సప్తమి ఉ.7.19 తదుపరి అష్టమి; నక్షత్రం: పుష్యమి మ.12.53 ఆశ్లేష; వర్జ్యం: రా.2.17-తె.3.57; దుర్ముహూర్తం: సా.4.51-5.42; అమృతఘడియలు: ఉ.6.23-8.01; రాహుకాలం: సా.4.30-6.00; సూర్యోదయం: 5.51; సూర్యాస్తమయం: 6.32 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru





Infinity Learn

NEET-2024 లో

720కి 720 మార్కులతో ఓపెన్ కేటగిరిలో ఆలిండియా ఫస్ట్ ర్యాంక్

మన శ్రీచైతన్య విద్యార్థిదే

అత్యధిక డాక్టర్ సీట్లు సాధించిన

శ్రీచైతన్య హైదరాబాద్ రెసిడెన్షియల్ క్యాంపస్‌ల విద్యార్థులు



Sri Chitanya's TOP RANKS IN ALL INDIA OPEN CATEGORY

Rank	Name	App. No.
43	ISHA KOTHARI	APP.NO. 240410220941*
50	G BHANUTEJA SAI	APP.NO. 240410268320
53	KALYAN V	APP.NO. 240410311464
76	DARSH PAGHDAR	APP.NO. 240410987668
81	P PAVAN KUMAR	APP.NO. 240411179822
85	V MUKHESH	APP.NO. 240411513902
94	UJJWAL KUMAR	APP.NO. 240410577616
117	ADI SETHI	
131	ISHAN AJAY KADUSKAR	
138	PRATYUSH MALAV	
155	DRON JAIN	
165	Y RESHMA NYSHITHA	
169	GORANTLA LAASYA	
180	SURYANDEEP PARIDA	
190	MANTHAN DINESH BAJAJ	
209	KAVYA CHITARA	
211	PRATHAM BUDHWAR	
217	V SNEHA SWARNIMA	
219	G VENKATA NRIPESH	
221	CHALLAGUNDLA SAIPRAV	
222	UDAY KIRAR	
248	OM VATS	
254	SIRIGIRI MOKSHASRI	
257	KOSURI SAI LIKITH	
304	RACHAPALLE BHAVITHA	
312	NEHAL H PRASAN	
313	P MEHARBABA ROHITHA	
316	KRISH JAIN	
357	YELLU SRISHANTH REDDY	
392	VEDANT AMLATHE	
420	SARAGADAM PAVANI	
450	NILAY SUCHAK	
463	LIKESH REDDY KATHI	
464	DANDU SAIKIRAN REDDY	
476	KONDREDDY HIMAJA	
478	ANYA ASHOK RAO	
480	GOLLAPUDI DIVYA SRI	
487	JOY GUPTA	
542	C SRAVAN KUMAR REDDY	
549	MD AZHAAN SAAD	
551	NIYATI JAIN	
603	MANT SIDHU	
621	MUSKU PRIYA HASINI	
630	GOLLAPALLI RIJEYA	
632	POOLA DIVYA TEJA	
650	PERA SATHVIK	
669	BEESETTI JAIDEEP	
690	ABHIJEET	
691	MEENSH SURI	
718	JUREDDI MARUTHI	
734	MBURI AAKARSH VARMA	
753	MANYA JAIN	
794	ALOOR PRANEETHA	
797	PRIYANSH CHITTORA	
807	BHARANIDHARAN	
810	JYOTIRGAMYA ACHARYA	
844	MAYANK GUPTA	
908	A VENKATA JAYANTH	
943	SANUDEEP DASH	
945	J SRI RAM YADAV	
960	D RAHUL VARMA	
1043	BHUNETI TRIJAL REDDY	
1045	M VEMULA SAI ASHMITHA	
1052	C GURUCHARAN YADAV	
1062	JAYASHETTY ADITYA	
1074	RUSHIL WAGH	
1082	MAS KASA	
1111	A MASWITHA	
1147	VEERA VENKATA NIKHIL K	
1153	YERRA SIRI PRIYA	
1157	A MUHAIMIN FATHIMA	
1189	P NEEHARIKA REDDY	
1198	BODLA AASHRITHA	
1215	JENJETI DEEKSHITHA SAI	
1233	AND RAJ	
1276	J BHARGAV SUMANTH	
1282	AMOGH PAREEK	
1303	T RESHMITHA	
1318	P RENDRA TAGOOR	
1374	PAVITHRAN R V	
1385	P SRI VATSAL	
1405	SURABHI	
1417	MUSTAFA AHMED	
1441	MOHSIN SHAIKH	
1447	VELURI SRIRAM	
1453	SARTHAK	
1459	SOJOKE RAHUL	
1484	HIMAJA ANUMULA	APP.NO. 240410436559
1543	VARVI K	APP.NO. 240410096350
1561	VISWABHARAT VEMPATI	APP.NO. 240410404359
1610	ANSHUL MANOHAR ANDE	APP.NO. 240410160263
1624	GANDI VENKATA RAMA	APP.NO. 240410683873
1749	KASHISH	APP.NO. 240410000563
1766	Y VENKATA SASIDHAR	APP.NO. 240410709942
1858	YALLA HARIKANTH	APP.NO. 240410945781
1870	DEEPIKA GANDICHERLA	APP.NO. 240410554462
1931	K MADHAV VENIGALLA	APP.NO. 240410535860
1940	AMEDA REE REDDY	APP.NO. 240410041738
1949	KARUMULLA PREETHI	APP.NO. 240410295850
1950	GA KARTHIK JARUGULLA	APP.NO. 240410321593

WHILE OTHERS TEACH, WE TRANSFORM ASPIRANTS INTO TOPPERS

ఆహ్లాదకరమైన విద్యాలయ ప్రాంగణాలతో.. విశాలమైన అధునాతనమైన తరగతి గదులతో విద్యార్థులకు స్ఫూర్తిని కలిగించే వాతావరణంలో.. విద్యార్థినీ విద్యార్థులకు ప్రత్యేక రెసిడెన్షియల్ క్యాంపస్‌లలో నీట్ లాంగ్‌టర్మ్ శిక్షణ ఇస్తున్నాయి. శ్రీచైతన్య విద్యా సంస్థలు ఫుల్లీ ఫర్నిష్డ్ గదులు, హైజినిక్ ఫుడ్, పరిశుభ్రమైన కిచెన్, డైనింగ్ హాల్స్‌తో ఇంటిని మరిపించే వాతావరణాన్ని కల్పిస్తున్నాయి.



GIRLS-RESIDENTIAL AC CAMPUS
SAI SOUDHAM-2
Near Sai Soudham, Ameenpur, Hyderabad.



BOYS-RESIDENTIAL AC CAMPUS
AGASTYA SRI BHAVAN-1 VAIDYAH
Beside Oakridge INTL School, Bowrampet, Hyd.



BOYS-RESIDENTIAL AC CAMPUS
RV HOUSE & RV CASA
Nagole, Hyderabad.



GIRLS-RESIDENTIAL AC CAMPUS
ZONAL CAMPUS
Bandlaguda, Nagole, Hyderabad.



BOYS-RESIDENTIAL
PANANIYA CAMPUS
Dilsukhnagar, Hyderabad.

VAIDYAH-26
NEET LONGTERM PROGRAM
SCHOLARSHIP TEST

Announcing the VAIDYAH Scholarship Test!
Up to 100% Scholarships for NEET 2026 Aspirants

Date: 15th May 2025
Mode: Online & Offline

Sri Chaitanya's revolutionary **VAIDYAH Program** for NEET Long-Term aspirants has delivered unmatched success in NEET . With a focused curriculum, expert mentorship and rigorous training, 2 out of every 3 students have achieved their dream of entering top government medical colleges!

- Up to 100% Scholarships for NEET 2026 Aspirants A New Benchmark in NEET Coaching Excellence!
- Personalized guidance by senior faculty
- Daily practice & intensive revision
- Stress-free, student-friendly learning environment
- Proven track record of top ranks and high selection ratio

Call: 040 - 66 06 06 06 | Register at: Scan QR Code

Scan QR Code for NEET Long-term

Extraordinary Performance from Longterm - VAIDYAH 2024

Student Name	Marks in 2023	Marks in 2024	Increase in Marks in NEET-2024
OM VATS	491	710	219
KASHISH	528	696	168
A REDDY MANASWITHA	510	700	190
METTUPALLY DHARANESH	301	638	337
ERLA JHON VICTOR	309	606	297
M LAKSHMI ASRITHA	310	656	346
MADHIRE HIMADHYUTHI	310	647	337
K VENU GOPAL	310	621	311
VALISHETTY AKHIL VARMA	313	653	340
JANNU SAI MOUNIKA	315	634	319
VARTHYA SIDDHU	315	626	311
EDDANDI RUCHITHA	320	622	302
PAPPU AKSHAY	326	622	296
ARYAN SATYANARAYAN P	330	645	315
YENDRA SNEHA REDDY	332	639	307
LANKA NIRDOSH	333	631	298
KANDUKUR VAISHNAVI	335	651	316
M VENKATA SAI SATHWIK	335	638	303
K NAGA SATYANARAYANA	339	661	322
NAILAH ATHER KHAN	339	657	318
ANURAG RAKESH BASA	341	643	302
NAYANAPATRUNI NEELIMA	349	665	316
G LAKSHMI AKASH REDDY	354	655	301

SRI CHAITANYA ACADEMY SUCHITRA: 7093127444 | KUKATPALLY: 9515111593 | HIMAYATH NAGAR: 9177444341 | TRIMULGHERRY: 9177444837 | AMEERPET: 9515111054 | DILSUKHNAGAR: 9177444326 | KONDAPUR: 9515111428

HYDERABAD: BOYS RESI : RV HOUSE A/C - **NAGOLE:** 99592 76669, 9177529351 | PANANIYA - 9177529351 | BANDLAGUDA - 8247008202 | AGASTYA SRI A/C 1- 9177345533, 9177538074, 9000553444, AGASTYA SRI A/C 2-9949436457, 9441015639, 9177538334. | **HYDERABAD :** GIRLS RESI: VYDEHI BHAVAN - 9642395095 | SAI SOWDHAM 2 A/C-9177507382, 9154935042, 9000511444 | LAND MARK - 9177417654, 9177224151, 7702737417 | HYDERABAD: DAYS: **DSNR ZONAL** - 9849999057 | **NARAYANAGUDA & CHIKKADPALLY**-9177561296, 9177561332, 9154137370 | **KPHB** RAMAN BHAVAN (KUKATPALLY) - 9491881101, 9885172536 | **KUKATPALLY** - 9177711845, 9177210888 | SHANKARI BHAVAN **MADINAGUDA**- 9177221710, 9948545969 | RATAN TATA **SANATH NAGAR** - 9100263369, 9100066274| DR BSRAO SOUDHAM, **AMEERPET**- 9100066270, 9177857862.

T & C apply | Note: Any inadvertent error published in this advertisement could be brought to our notice.
Note: The information is as per students feedback | *DLP

శ్రీచైతన్య
విద్యాసంస్థలు

www.srichaitanya.net | Ph: 040 66 06 06 06

www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

ఆదివారం | 4-5-2025 | పేజీలు: 14 + 4 + 28 పేజీల ఆదివారం అనుబంధం | వెల (Price) : Rs. 8.00 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 35 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, వైశాఖమాసం, శుక్లపక్షం; తిథి: సప్తమి ఉ.7.19 తదుపరి అష్టమి; నక్షత్రం: పుష్యమి మ.12.53 ఆశ్లేష; వర్జ్యం: రా.2.17-తె.3.57; దుర్ముహూర్తం: సా.4.51-5.42; అమృతఘడియలు: ఉ.6.23-8.01; రాహుకాలం: సా.4.30-6.00; సూర్యోదయం: 5.51; సూర్యాస్తమయం: 6.32 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI



ఆదివారం | 4-5-2025 | పేజీలు: 14 + 4 + 28 పేజీల ఆదివారం అనుబంధం | వెల (Price) : Rs. 8.00 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 35 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, వైశాఖమాసం, శుక్లపక్షం; తిథి: సప్తమి ఉ.7.19 తదుపరి అష్టమి; నక్షత్రం: పుష్యమి మ.12.53 ఆశ్లేష వర్జ్యం: రా.2.17-తె.3.57; దుర్ముహూర్తం: సా.4.51-5.42; అమృతఘడియలు: ఉ.6.23-8.01; రాహుకాలం: సా.4.30-6.00; సూర్యోదయం: 5.51; సూర్యాస్తమయం: 6.32 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru


కశ్మీర్‌లోని దాల్ సరస్సు వద్ద పహారా కాస్తున్న ఓ జవాను

వాణిజ్యం బంద్!

పాక్ నుంచి అన్నిరకాల దిగుమతులపై భారత్ నిషేధం

ప్రత్యక్ష, పరోక్ష దిగుమతులన్నింటికీ వర్తిస్తుందని స్పష్టీకరణ

కొరియర్లు, పార్సిల్ సేవలు కూడా పూర్తిగా నిలిపివేత

పాక్ నౌకలేవీ భారత పోర్టుల్లోకి రాకుండా నిషేధం

భారత్ నుంచి దిగుమతులను ఇప్పటికే నిలిపేసిన పాక్

ఇరు దేశాల మధ్య రూ. 80 వేల కోట్లకుపైనే వాణిజ్యం

న్యూఢిల్లీ, మే 3: పహల్గాం ఉగ్రదాడి, అనంతర పరిణామాల నేపథ్యంలో పాకిస్థాన్ నుంచి అన్నిరకాల దిగుమతులను నిలిపివేస్తున్నట్టు భారత్ ప్రకటించింది. పాక్‌లో తయారైన, పాక్ నుంచి వచ్చే ప్రత్యక్ష, పరోక్ష దిగుమతులు ఏవైనా సరే ఈ నిషేధం వర్తిస్తుందని శనివారం స్పష్టం చేసింది. అంతేకాదు ఆ దేశం నుంచి వచ్చే కొరియర్లు, పార్సిళ్ల వంటి వాటిని కూడా పూర్తిగా నిలిపివేస్తున్నట్టు తెలిపింది. మరోవైపు భారత్‌లోని అన్ని నౌకాశ్రయాల్లోకి పాక్‌కు చెందిన, పాక్ జెండా ఉన్న ఎలాంటి నౌకలు ప్రవేశించకూడదంటూ నిషేధం విధించింది. ఇదే సమయంలో భారత నౌకలేవీ కూడా పాకిస్థాన్ పోర్టులకు వెళ్లవద్దని సూచించింది. "ప్రత్యక్షంగా, పరోక్షంగా పాకిస్థాన్‌లో ఉత్పత్తి అయిన, ఆ దేశం నుంచి

మిగతా 2వ పేజీలో...

నావికాదళం సిద్ధం!

అరేబియా సముద్రంలో లైవ్ ఫైరింగ్ డ్రిల్

యుద్ధంలోలాగే అసలైన ఆయుధాలతో లక్ష్యాలపై దాడి

మోదీతో నేవీ చీఫ్ అడ్మిరల్ భేటీ

సింధు జలాలు మళ్లించే ఏ నిర్మాణమైనా ధ్వంసం చేస్తాం!

పాక్ రక్షణ మంత్రి ఆసిఫ్ వ్యాఖ్య

450 కి.మీ.ల బాలిస్టిక్ క్షిపణిని పరీక్షించిన పాక్

2

అనుమతిస్తే పాక్‌లో మానవబాంబుగా పేలుతా

కర్ణాటక మంత్రి జమీర్ అహ్మద్

ఫ్యూచర్ సిటీలో.. ఈ-సిటీ

రాష్ట్రంలో మూడో ఎలక్ట్రానిక్స్ ఉత్పాదక క్లస్టర్‌గా నిర్మాణం

ఇప్పటికే రంగారెడ్డి జిల్లా మహేశ్వరం, రావిర్యాలలో రెండు ఈఎంసీలు

వేలాది మందికి ఉపాధి.. మరిన్ని స్థాపిస్తాం

ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు వెల్లడి

300 కోట్ల మేర తైవాన్ టెలికాం పెట్టుబడులు

5జీ నెట్‌వర్క్స్, నెట్‌వర్కింగ్ పరికరాల తయారీ

10 ఎకరాల్లో పరిశ్రమ.. 2,500 మందికి ఉపాధి

త్వరలో యంగ్ ఇండియా స్పోర్ట్స్ వర్సిటీ

మంత్రిని కలిసిన సీఎస్ రామకృష్ణారావు



హైదరాబాద్, మే 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక పథకం.. ఫ్యూచర్ సిటీలో ఎలక్ట్రానిక్ సిటీ(ఈ-సిటీ) ఏర్పాటు కానుంది. రంగారెడ్డి జిల్లా మహేశ్వరంలో టీజీఐఐసీ ఆధ్వర్యంలో ఇప్పటికే 310 ఎకరాల్లో ఎలక్ట్రానిక్స్ ఉత్పాదక క్లస్టర్(ఈఎంసీ) ఉంది. ఇందులో పలు విదేశీ కంపెనీలు పరిశ్రమలను స్థాపించాయి. రావిర్యాలలోనూ 602 ఎకరాల్లో ఈఎంసీ క్లస్టర్‌ను ఏర్పాటు చేయగా.. ఎలక్ట్రిక్ వాహనాల తయారీ కంపెనీలు ఉత్పాదకతను ప్రారంభించాయి. కొత్తగా రానున్న ఈ-సిటీ మూడో ఎలక్ట్రానిక్స్ క్లస్టర్ కానుంది. మహేశ్వరంలో ఇప్పటికే ఎల్‌ఈడీ టీవీల తయారీ కంపెనీ రేడియంట్ అప్లయన్సెస్ ద్వారా ఏటా 45 లక్షల యూనిట్ల ఉత్పత్తి జరుగుతుండగా.. 4 వేల మంది ఉపాధిపొందుతున్నారు. రూ.700 కోట్ల పెట్టుబడులతో ఏర్పాటైన ప్రీమియర్ ఏజెన్సీస్ అనే కంపెనీ సౌర విద్యుత్తుకు సంబంధించి ఫలకాలు, ఇతర విడిభాగాలను ఉత్పత్తి చేస్తోంది. రూ.600 కోట్ల పెట్టుబడులతో వచ్చిన ఒలెక్ట్రా గ్రీన్‌టెక్ కంపెనీ ఏటా 10 వేల ఎలక్ట్రిక్ బస్సులను తయారు చేస్తోంది. బీబీటీ ఎలక్ట్రిక్ సంస్థ ఆటో-రిక్షాలను తయారు చేస్తోంది. ఇటీవల సీఎం

మిగతా 9వ పేజీలో...

ఎల్‌ఆర్‌ఎస్ రాయితీ గడువు

మరో నెల పొడిగింపు

9

పురపాలక శాఖ ఉత్తర్వులు

రాయితీతో ఇప్పటిదాకా వచ్చిన ఆదాయం 1,900 కోట్లు

అమరావతి.. కొందరిదా?

అందరిదా?


కొత్త పలుకు!

ఏపీ రాజధాని అమరావతి నిర్మాణానికి గ్రహణాలన్నీ ఇప్పుడు తొలగిపోయాయి. అమరావతి చంద్రబాబుది కాదు. లోకేశ్‌ది కాదు. ఆ సామాజిక వర్గానిదీ కాదు. రేపటికోసం నిర్మితం కాబోతున్న నగరమది. రేపటి తరం ఆ ఫలితాలను అందుకుంటుంది.

కులాలపరంగా ఏపీ అతి సున్నితమైన రాష్ట్రం. కులం కోసం కత్తులు దూసుకుంటారు. తెలంగాణలో మాదిరి ఈ రాష్ట్రం నాది-మాకు రాజధాని లేకపోతే ఎలా? అన్న భావన తక్కువ. ఈ కారణంగానే ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అమరావతి కొందరిదే అన్న భావనను ఒక వర్గం ప్రజల్లో బలంగా వ్యాపింపజేయడంలో జగన్ రెడ్డి సక్సెస్ అయ్యారు.

జగన్ సంప్రదాయ రాజకీయాలను నమ్ముకోరు. ఈ కారణంగా ఎవరూ ఊహించని మార్గాల నుంచి రాజధాని నిర్మాణానికి ఆటంకాలు ఎదురుకావొచ్చు. అద్భుతంగా అభివృద్ధి చెందిన హైదరాబాద్ తెలంగాణ సొంతం. మనమూ అటువంటి రాజధానిని నిర్మించుకోవాలన్న కసి ఏపీ ప్రజల్లో ఏర్పడకుండా చేశారు.

ఏ ప్రభుత్వమైనా ప్రైవేటు పెట్టుబడులను ఆకర్షించేందుకు మౌలిక వసతులను మాత్రమే సమకూరుస్తుంది. భారతదేశంలో బెంగళూరు, హైదరాబాద్ మాత్రమే ఐటీకి కేరాఫ్‌గా అభివృద్ధి చెందాయంటే ఎస్.ఎం.కృష్ణ, చంద్రబాబు పోటీపడటం వల్లనే. హైదరాబాద్‌లో నిరుపయోగంగా ఉన్న ప్రభుత్వ భూములను దిగ్గజ ఐటీ కంపెనీలకు కేటాయించడం ద్వారా చంద్రబాబు ఆయా కంపెనీలను ఆకర్షించారు. రాజధాని నిర్మాణానికి యాభై వేల ఎకరాలు అవసరమా? అని ఏపీకి చెందిన కొంతమంది అపర మేధావులు ఇప్పటికీ కూనిరాగాలు తీస్తున్నారు. ఇలాంటి వాళ్లు హైదరాబాద్ అభివృద్ధి ఎలా జరిగిందో తెలుసుకోవాలి. ప్రైవేటు సంస్థలకు కేటాయించడానికి అవసరమైన భూమి ప్రభుత్వం వద్ద ఉన్నప్పుడే ఏ కంపెనీ అయినా ముందుకు రావడానికి ఆసక్తి చూపుతుంది.

హైదరాబాద్ నుంచి అందుతున్న ఫలాలతోనే తెలంగాణలోని మిగతా ప్రాంతాలను అభివృద్ధి చేయడం నిజం కాదా? అమరావతిని మాత్రమే అభివృద్ధి చేస్తే రాష్ట్రంలోని మిగతా ప్రాంతాల పరిస్థితి ఏమిటని నసుగుతున్న వారు ఈ విషయం తెలుసుకోవాలి. హైదరాబాద్‌లో ఎవరి కులం ఏమిటో ఎవరికీ తెలియదు. ఎందుకంటే మన పక్కింటి వాడు వేరే రాష్ట్రానికి చెందినవాడై ఉంటాడు. అభివృద్ధి వల్లే అక్కడ కులాలు, మతాలకు చోటు లేకుండా పోయింది.

అన్ని వర్గాల వారూ నివసించడానికి అనువుగా అమరావతి నిర్మాణానికి ప్రణాళికలు రూపొందించాలి. లేని పక్షంలో ఇప్పుడు హైదరాబాద్‌లో అల్పాదాయ వర్గాల వారికి ఎదురవుతున్న ఇబ్బందులే అమరావతిలోనూ ఎదురవుతాయి. అమరావతితో పాటు రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలలో కూడా అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టాలి. లేని పక్షంలో ప్రాంతీయ విద్వేషాలు సృష్టించడానికి కొంత మంది సిద్ధంగా ఉన్నారు.

4



8

అందగత్తెలు వచ్చేస్తున్నారు!

శంషాబాద్ ఎయిర్‌పోర్టులో మిస్ కెనడా మోరిసన్‌కు సంప్రదాయ స్వాగతం

నేడు, రేపు 120 దేశాల పోటీదార్ల రాక

మిస్‌వరల్డ్ వేదికగా మెడికల్ టూరిజంపై ప్రచారం.. 16న 'ఏఐజీ'లో కార్యక్రమం

మిస్ కెనడా ఎమా డీనా క్యాథరిన్ మోరిసన్‌కు కళాకారిణుల స్వాగతం

భూభారతిలో.. ఫీజు మినహాయింపు

ఉన్నట్లా? లేనట్లా?

3

సీసీఎల్‌ఏ నుంచి విడుదల కాని ఉత్తర్వులు

పైలట్ ప్రాజెక్టు మండలాల్లో గందరగోళం

రేపటి నుంచి మరో 28 మండలాల్లో అమలు

రేపు ఉత్తర్వులు వచ్చే అవకాశం!

పచ్చళ్లపైనా ట్రంప్ సుంకం!

భారత్ నుంచి తెప్పించుకునే ఆహారోత్పత్తులపై నిఘా

2

పన్ను కట్టకపోతే భారీ జరిమానాలు

సోషల్ మీడియా, యాప్‌ల ద్వారా అమెరికాలో పలువురు భారతీయుల చిరువ్యాపారాలు

ఇంతకాలం సుంకాలు లేకుండానే.. ఇకపై పన్నుపోటు

అమెరికాకు బంధువులు తీసుకొచ్చే వాటిపైనా ఆంక్షలు!

ఆందోళనలో భారతీయులు.. వాట్సాప్ గ్రూపుల్లో చర్చ





రూ. 300 కోట్ల భూమి..

హాంఫట్!

10

హైదరాబాద్ ఎమ్మెల్యే కాలనీలో ప్రభుత్వ స్థలాలు ఆక్రమించిన బడాబాబులు.. మూడు ఎకరాల్లో నిర్మాణాలు

పదేళ్లుగా పట్టించుకోని అధికారులు.. తాజాగా రంగంలోకి

కూల్చివేతలు చేపడుతూ సరిహద్దుల గుర్తింపు

బెదిరిస్తూ అడ్డుకుంటున్న బడాబాబుల అనుచరులు

ప్రభుత్వ స్థలాల కబ్జాకు అడ్డుకట్ట

బంజారాహిల్స్‌లో ప్రభుత్వ స్థలాన్ని అధికారులు సకాలంలో గుర్తించారు: మంత్రి పొన్నం ప్రభాకర్

10



నేడే నీట్

9

పాత పద్ధతిలోనే పరీక్ష.. రాష్ట్రం నుంచి 72,507 మంది

190 కేంద్రాల్లో.. రెండు షిఫ్టుల్లో పరీక్ష నిర్వహణ

26 మంది ఎంబీబీఎస్ విద్యార్థుల సస్పెన్షన్

14 మంది అడ్మిషన్ల రద్దు.. 215 మంది అడ్మిషన్ల నిలిపివేత.. నీట్‌కు హాజరు కాకుండా 51 మందిపై నిషేధం

2

నీట్-యూజీ 2024 పేపర్ లీకేజీపై ఎన్‌ఎంసీ చర్యలు

ఆలయంలో తొక్కిసలాట

ఆరుగురి మృతి, ఐదుగురికి తీవ్ర గాయాలు

ఉత్తర గోవాలోని శిర్గావ్‌లో జాతరలో అపశ్రుతి

2

నిప్పుల గుండంలో భక్తులు నడుస్తున్న వేళ ఘటన



అనుమతిస్తే పాక్‌లో మానవబాంబుగా పేలుతా



» మంత్రి జమీర్ అహ్మద్ వ్యాఖ్యలు

బెంగళూరు, మే 3(ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్ షా అనుమతిస్తే ఆత్మాహుతి బాంబుగా మారి పాకిస్థాన్‌లో ఉగ్రవాదులను పేల్చేస్తానని కర్ణాటక వక్ఫ్, వసతి శాఖల మంత్రి జమీర్ అహ్మద్ అన్నారు. మీడియా ఎదుట శుక్రవారం ఆయన చేసిన ఈ వ్యాఖ్యలు వైరల్ అయ్యాయి. 'మేము భారతీయులం. హిందూస్థానీలం. పాకిస్థాన్‌తో మాకు ఎలాంటి సంబంధాలూ లేవు. కేంద్ర ప్రభుత్వం అనుమతిస్తే నా ఒంటికి బాంబును కట్టుకుని యుద్ధం కోసం పాకిస్థాన్ వెళ్లేందుకు సిద్ధం' అని వ్యాఖ్యానించారు. ఇమ్రాన్ ఖాన్, పాకిస్థాన్ భారత్‌కు ఎప్పుడూ శత్రువులేనని జమీర్ అహ్మద్ పేర్కొన్నారు. పహల్గాంలో దాడి నీచమైనదంటూ తీవ్రంగా ఖండించారు. ఇలాంటి సమయంలో భారతీయులంతా సమైక్యంగా ఉండాలని పిలుపునిచ్చారు.

పాక్ సైన్యంపై విరుచుకుపడ్డ బలోచ్ 'డెత్ స్క్వాడ్'

క్వెట్టా, మే 3: పహల్గాం దుర్ఘటన అనంతరం భారత సరిహద్దులో సవాళ్లను ఎదుర్కొంటున్న పాకిస్థాన్‌కు బలోచిస్థాన్‌లో మరో దెబ్బ తగిలింది. బలోచ్ లిబరేషన్ ఆర్మీ (బీఎల్ఏ) ఏకంగా పాక్ సైన్యంపై విరుచుకుపడింది. బీఎల్ఏకు చెందిన 'డెత్ స్క్వాడ్' కలత్ జిల్లాలోని మంగోచెర్ నగరాన్ని తన ఆధీనంలోకి తెచ్చుకుంది. ప్రభుత్వ కార్యాలయాలు, భవనాలను కూడా తన కంట్రోల్‌లో ఉంచుకుంది. బలోచ్ తిరుగుబాటుదార్లు ఆర్మీ క్యాంపుపై దాడి చేసి, ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు. పాక్ తన సైన్యాన్ని భారత్ సరిహద్దుకు తరలిస్తున్న తరుణంలో బలూచ్‌లో ఎదురుదెబ్బ తగిలింది. గతనెల 26న జరిగిన దాడిలో 10 మంది పాక్ సైనికులు మరణించడం గమనార్హం.

కన్నడ పాట పాడాలన్న విద్యార్థిపై సోనూ అసహనం

» ఇలాంటి డిమాండ్లతోనే పహల్గాం దాడి జరిగిందని వ్యాఖ్య

బెంగళూరు, మే 3(ఆంధ్రజ్యోతి): కన్నడ పాట పాడమని ఓ అభిమాని కోరడంతో అసహనానికి గురైన గాయకుడు సోను నిగమ్, అతని డిమాండ్‌ను పహల్గాం దాడితో పోల్చాడు. దీంతో సోనునిగమ్‌పై కన్నడ సంఘాలు తీవ్రంగా మండిపడ్డాయి. బెంగళూరు నగరంలోని ఓ ఇంజనీరింగ్ కళాశాలలో వారం క్రితం నిర్వహించిన కార్యక్రమంలో సోనునిగమ్ బృందం పాల్గొంది. అన్నీ హిందీ పాటలే పాడుతుండటంతో కన్నడ పాటలు పాడాలని ఓ అభిమాని కోరారు. దీంతో ఆగ్రహించిన సోను నిగమ్, 'కన్నడ.. కన్నడ..! ఇలాంటి డిమాండ్లతోనే పహల్గాం దాడి జరిగింది' అని అసంతృప్తి వ్యక్తం చేశారు. సోను నిగమ్‌ను కన్నడ సినిమా రంగం వెంటనే బ్యాన్ చేయాలని కర్ణాటక రక్షణ వేదిక రాష్ట్ర అధ్యక్షుడు నారాయణగౌడ డిమాండ్ చేశారు.

బీఎస్ఎఫ్ అదుపులో పాకిస్థానీ రేంజర్

న్యూఢిల్లీ, మే 3: సరిహద్దుల వద్ద విధులు నిర్వహించే పాకిస్థాన్‌కు చెందిన ఓ రేంజర్‌ను బీఎస్ఎఫ్ అదుపులోకి తీసుకొంది. రాజస్థాన్‌లో అతడిని అదుపులోకి తీసుకున్నట్టు శనివారం అధికార వర్గాలు తెలిపాయి. గత బుధవారం పొరపాటున సరిహద్దు దాటిన బీఎస్ఎఫ్ కానిస్టేబుల్ పూర్ణం కుమార్ షాను పాకిస్థాన్ సైన్యం అదుపులోకి తీసుకొంది. అతడి సమాచారం ఏదీ ఇంకా వెల్లడి కాలేదు. ఎనిమిది రోజులుగా రెండు దేశాల మధ్య పలుమార్లు చర్చలు జరిగినా ఫలితం లేకపోయింది. దానికి ప్రతీకారంగానే పాక్ జవాన్‌ను బీఎస్ఎఫ్ అదుపులోకి తీసుకొంది. ఇరు దేశాల సైనికులు పొరపాటున సరిహద్దులు దాటడం సర్వసాధారణం. మిలటరీ అధికారులు చర్చలు జరిపి వారిని విడిచిపెడుతుంటారు. కానీ పహల్గాం దుర్ఘటన కారణంగా పాకిస్థాన్ జాప్యం చేస్తుండడంతో బీఎస్ఎఫ్ కూడా అదే రీతిలో వ్యవహరించింది.

కొలంబో ఎయిర్‌పోర్టులో హైటెన్షన్

న్యూఢిల్లీ, మే 3: పహల్గాం దాడి జరిపిన ఉగ్రవాదులు శ్రీలంక ఎయిర్‌లైన్స్‌కు చెందిన విమానంలో పారిపోతున్నారన్న సమాచారంతో కొలంబో ఎయిర్‌పోర్టులో హైటెన్షన్ వాతావరణం నెలకొంది. ఈ సమాచారం భారత్‌నుంచి రావడంతో శ్రీలంక ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. చెన్నై నుంచి కొలంబోకు బయలుదేరిన ఈ విమానంలో ఆరుగురు ఉగ్రవాదులు ప్రయాణిస్తున్నట్టు భారత నిఘావర్గాలు అనుమానించాయి. వెంటనే శ్రీలంకను అప్రమత్తం చేశాయి. దీంతో కొలంబోలోని బండారునాయకే అంతర్జాతీయ విమానాశ్రయంలో శనివారం మధ్యాహ్నం 11.59 నిమిషాలకు విమానం(యూఎల్122) ఆగిన వెంటనే అందులో తనిఖీలు జరిపారు. అయితే, విమానంలో ఉగ్రవాదుల జాడ కనిపించలేదు.

సింగపూర్‌లో మళ్లీ పీఏపీదే అధికారం

సింగపూర్, మే 3: సింగపూర్ ఎన్నికల్లో అధికార పీపుల్స్ యాక్షన్ పార్టీ(పీఏపీ) ఘన విజయం సాధించింది. ప్రధాని లారెన్స్ వాంగ్ నేతృత్వంలోని ఈ పార్టీ మొత్తం 97 పార్లమెంటు స్థానాలకు గాను రికార్డు స్థాయిలో 87చోట్ల గెలుపొందింది. శనివారమే ఎన్నికలు జరిగాయి. మొత్తం 26లక్షల మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. పీఏపీ పార్టీ సింగపూర్‌లోనే అతి ప్రాచీనమైన, అతిపెద్ద రాజకీయ పార్టీ. 1965 నుంచి సింగపూర్‌లో ఈ పార్టీనే అధికారంలో ఉండటం విశేషం. ట్రంప్ ట్రేడ్ వార్ నేపథ్యంలో ప్రధాని లారెన్స్ వాంగ్ తమ ప్రభుత్వానికి ప్రజామోదం కోసం ఎన్నికలకు వెళ్లారు.

వాణిజ్యం బంద్!

(మొదటి పేజీ తరువాయి)



ఎగుమతి చేసే అన్నిరకాల ఉత్పత్తులపై నిషేధం విధిస్తున్నాం. అనుమతి ఉన్నవైనా, ఎలాంటి అనుమతీ అవసరం లేని ఉత్పత్తులు అయినా ఈ నిషేధం వర్తిస్తుంది. తదుపరి ఉత్తర్వులు జారీ చేసేవరకు ఇది అమల్లో ఉంటుంది. ఈ నిషేధం నుంచి ఏదైనా మినహాయింపు కావాలంటే.. ప్రభుత్వం నుంచి ముందుగానే అనుమతులు తీసుకోవాలి.." అని డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్ (డీజీఎఫ్‌టీ) స్పష్టం చేసింది. జాతీయ భద్రత, ప్రజాప్రయోజనం నిమిత్తం ఈ చర్యలు తీసుకుంటున్నామని, తక్షణమే ఈ నిర్ణయాలు అమల్లోకి వస్తాయని ప్రకటించింది. భారత్ నుంచి వచ్చే దిగుమతులను నిషేధిస్తూ పాకిస్థాన్ ఇప్పటికే ప్రకటించగా.. తాజాగా భారత్ నిర్ణయంతో ఇరు దేశాల మధ్య వాణిజ్యం పూర్తిగా నిలిపోయినట్లైంది.

పరోక్ష దిగుమతులపైనా నిషేధంతో దెబ్బ..

వాస్తవానికి పుల్వామా దాడి తర్వాత పాక్‌తో వాణిజ్యాన్ని భారత్ బాగా తగ్గించుకుంది. చాలా ఉత్పత్తులపై 200% కస్టమ్స్ సుంకాలు కూడా విధించింది. అయినా పళ్లు, నూనెగింజలు, ఔషధ మొక్కలు, బాదం, జీడిపప్పు వంటి డ్రైఫ్రూట్స్, రాగి ఖనిజం, గాజు ఉత్పత్తులు వంటి కొన్నిరకాల ఉత్పత్తుల దిగుమతులు మాత్రం నేరుగా జరుగుతున్నాయి. 2022-23లో భారత్ నుంచి పాక్‌కు సుమారు రూ.5,300 కోట్ల విలువైన ఎగుమతులు జరగ్గా.. పాక్ నుంచి దిగుమతుల విలువ సుమారు రూ.170 కోట్లు. అదే 2024-25 ఆర్థిక సంవత్సరంలో జనవరి నాటికి పాక్‌కు ఎగుమతులు సుమారు రూ.3,700 కోట్లకు తగ్గిపోతే.. దిగుమతులు కేవలం రూ.4 కోట్లలోపే కావడం గమనార్హం. అయితే ఆంక్షలు, సుంకాల నుంచి తప్పించుకోవడానికి.. పాక్ నుంచి చాలా వరకు ఉత్పత్తులను దుబాయ్, సింగపూర్, శ్రీలంక, ఇండోనేషియా వంటి దేశాలకు తరలించి, ఆయా దేశాల ఉత్పత్తులుగా చూపుతూ భారత్‌కు పంపుతుంటారని వాణిజ్య వర్గాలు చెబుతున్నాయి. ఇలా పరోక్షంగా వచ్చే పాక్ ఉత్పత్తుల విలువ సుమారు రూ.5 వేల కోట్ల వరకు ఉంటుందని అంటున్నాయి. ఇప్పుడు పాక్ నుంచి ప్రత్యక్ష, పరోక్ష దిగుమతులపైనా నిషేధం విధిస్తున్నట్టు ప్రకటించడంతో.. పాకిస్థాన్‌లోని పలు రకాల పరిశ్రమలకు గట్టి దెబ్బపడుతుందని అంటున్నాయి. ప్రత్యక్షంగా, పరోక్షంగా కలిపి భారత్-పాకిస్థాన్‌ల మధ్య వాణిజ్యం విలువ రూ.84 వేల కోట్లకు పైనే ఉంటుందని వాణిజ్య వర్గాలు చెబుతున్నాయి. పాకిస్థాన్ నుంచి ప్రత్యక్ష, పరోక్ష మార్గాల్లో.. రాగి, రాగి ఉత్పత్తులు, పండ్లు, డ్రైఫ్రూట్స్, పత్తి, హిమాలయాల రాతి ఉప్పు, సల్ఫర్, గ్రానైట్, కొన్నిరకాల ముడి ఖనిజాలు, ప్లాస్టిక్ ఉత్పత్తులు, ఉన్ని, గాజు వస్తువులు, తోలు ఉత్పత్తులు భారత్‌కు దిగుమతి అవుతున్నాయి. ఇక భారత్ నుంచి ముఖ్యంగా మందులు, వ్యవసాయ ఉత్పత్తులు, కాఫీ, టీ, మసాలాలు, నూనెగింజలు పాక్‌కు ఎగుమతి అవుతాయి.

పాక్ మీదుగా ఆ విమానాలు బంద్!

భారత్, పాక్ ఉద్రిక్తతల నేపథ్యంలో.. యూరోపియన్ దేశాల విమానాలు పాకిస్థాన్ గగనతలం మీదుగా కాకుండా, చుట్టూ తిరిగి భారత్‌కు చేరుకుంటున్నాయి. ఇప్పటికే ఎయిర్ ఫ్రాన్స్, బ్రిటీష్ ఎయిర్‌వేస్, స్విస్ ఎయిర్‌వేస్ సంస్థలు తమ విమానాలను మళ్లించి నడుపుతుండగా.. తాజాగా లుఫ్తాన్సా (జర్మనీ), ఐటీఏ ఎయిర్‌వేస్ (ఇటలీ), లాట్ ఎయిర్‌వేస్ (పోలండ్) కూడా ఇదే నిర్ణయం తీసుకున్నాయి.

ప్రధాని మోదీతో ఒమర్ అబ్దుల్లా భేటీ

పహల్గాం ఘటన తర్వాత తొలిసారి సమావేశం

న్యూఢిల్లీ, మే 3: పహల్గాం ఉగ్రదాడి తర్వాత ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా తొలిసారి భేటీ అయ్యారు. ప్రధాని నివాసంలో 30 నిమిషాలకు పైగా జరిగిన ఈ సమావేశంలో ఉగ్రదాడితో పాటు అనంతర పరిస్థితులపై చర్చించారు. ఉగ్రదాడి ఘటన జమ్మూకశ్మీర్ ప్రజల మనస్సులను తీవ్రంగా కలచివేసిందని, హింసకు రాష్ట్ర ప్రజలు వ్యతిరేకమని ఒమర్ ప్రధానికి తెలిపారు.

లోకం తీరు

ప్రధానితో వేదికను పంచుకున్న శశి థరూర్



వాయుసేనలో మోగిన 'భేరి'

45 లాంచర్లు... 85 విధ్వంసక మిస్సైళ్లు

టెండర్లు పిలిచిన రక్షణ శాఖ

న్యూఢిల్లీ, మే 3: పహల్గాం ఉగ్ర దాడి అనంతర పరిణామాల్లో తమపై ఎప్పుడైనా భారత్ యుద్ధానికి దిగొచ్చునని దాయాది దేశం పాకిస్థాన్ భయపడుతోంది. దానికి తగినట్టే మనదేశ సైనిక నిర్ణయాలు యుద్ధ సన్నద్ధతను సూచిస్తున్నాయి. తాజాగా కొత్త తరం ఆయుధశక్తితో వాయు సేనను బలోపేతం చేసుకునేందుకు భారత్ సిద్ధమైంది. భుజంపై పెట్టుకుని ప్రయోగించడానికి వీలైన 45 లాంచర్లు, 85 మిస్సైళ్లు, 48 నైట్ విజన్ పరికరాల కొనుగోలుకు శనివారం టెండర్లు పిలిచింది. క్షణాల్లో శత్రు లక్ష్యాలను ఛేదించగలిగే విధ్వంసక శక్తి ఈ మిస్సైళ్లకు ఉంది. 'మేక్ ఇన్ ఇండియా'లో భాగంగా సాయుధశక్తిని బలోపేతం చేసుకునేందుకు ఈ నిర్ణయం తీసకున్నామని సైనికవర్గాలు చెబుతున్నాయి. అయితే, పాక్‌తో తథ్యం అని భావిస్తున్న యుద్ధానికి దీనిని సన్నాహంగా మిలిటరీ నిపుణులు అనుమానిస్తున్నారు. భూతలానికి అతి సమీపంనుంచి, స్వల్ప దూరం నుంచి దాడులు చేసే శత్రు యుద్ధ విమానాలు, హెలికాప్టర్లు, డ్రోన్లను ఈ కొత్త తరం వాయు రక్షణ వ్యవస్థ ((వీఎస్‌హెచ్‌వోఆర్‌ఏడీఎస్) కనురెప్పపాటులో నేలకూల్చగలదు. భూతలంపై పోరాడే సైన్యానికి రక్షణ కవచంగా ఉంటుంది. "గగనతలదాడుల నుంచి కాపాడే విధ్వంసక, రక్షణ వాయు వ్యవస్థ మనకు కావాలి. ఈ వ్యవస్థ ఇన్‌ఫ్రా రెడ్ హోమింగ్ (ఐఆర్) టెక్నాలజీ ఆధారంగా పనిచేస్తుంది. ఫైర్ అండ్ ఫర్గెట్ తరహా మిస్సైల్ వ్యవస్థ ఇది" అని టెండర్ నోటీసులో (ఆసక్తి వ్యక్తీకరణ) రక్షణ శాఖ తెలిపింది. ఈ మిస్సైళ్ల రేంజ్ ఆరువేల మీటర్లకు మించి ఉంటుంది.

సింధు జలాలు మళ్లించే ఏ నిర్మాణమైనా ధ్వంసం చేస్తాం!



» పాక్ రక్షణ మంత్రి ఆసిఫ్ రెచ్చగొట్టే వ్యాఖ్యలు

» 450 కి.మీ బాలిస్టిక్ క్షిపణిని పరీక్షించిన పాక్

న్యూఢిల్లీ, మే 3: సింధు నది నీటిని మళ్లించేందుకు భారత్ నిర్మించే ఏ ప్రాజెక్టునైనా కూల్చివేస్తామని పాకిస్థాన్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ హెచ్చరించారు. సింధు జలాల ఒప్పందం ప్రకారం తమ దేశానికి నది నీటిలో వాటా ఉందన్నారు. పాకిస్థాన్ నీటిని మళ్లించే ఏ ప్రయత్నాన్నైనా దురాక్రమణగా పరిగణిస్తామని పాక్ మంత్రి వ్యాఖ్యానించారు. సింధు నది పరివాహక ప్రాంతంలో భారత్ డ్యామ్‌లు నిర్మించదలిస్తే పాకిస్థాన్ ఏ విధంగా స్పందిస్తుందని ఓ ఇంటర్వ్యూలో అగిడిన ప్రశ్నకు ఆయన ఈ మేరకు బదులిచ్చారు. మరోవైపు ఇరుదేశాల మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో పాకిస్థాన్ శనివారం 450 కిలోమీటర్ల పరిధి కలిగిన ఉపరితలం-ఉపరితలం బాలిస్టిక్ క్షిపణిని పరీక్షించింది. 'ఎక్సర్‌సైజ్ ఇండస్' పేరుతో ఆ దేశం చేపట్టిన సైనిక విన్యాసాల్లో భాగంగా అబ్దాలి ఆయుధ వ్యవస్థగా పిలిచే ఈ క్షిపణి ప్రయోగం చేపట్టారు. 'బలగాల కార్యాచరణ సంసిద్ధతను నిర్ధారించే లక్ష్యం'తో ఈ పరీక్ష చేపట్టినట్లు పాక్ ఆర్మీ ఒక ప్రకటనలో పేర్కొంది.

పాకిస్థాన్ ఓ విఫల దేశం

భారత్‌ను ఎప్పటికీ ప్రశాంతంగా ఉండనివ్వదు



కిసాన్‌గంజ్, మే 3: పాకిస్థాన్ ఓ విఫల దేశమని, భారత్‌ను ఎప్పటికీ ప్రశాంతంగా ఉండనివ్వదని ఎంఐఎం అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ అన్నారు. పాకిస్థాన్‌పై కేంద్ర ప్రభుత్వం మరింత కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. బిహార్‌లోని కిసాన్‌గంజ్‌లో శనివారం జరిగిన బహిరంగ సభలో మాట్లాడిన అసదుద్దీన్ ఈ వ్యాఖ్యలు చేశారు. ముస్లిం వర్గాల్లో శాంతి నెలకొల్పలేని, పొరుగు దేశాలైన ఇరాన్, అఫ్ఘానిస్థాన్‌తో సత్సంబంధాలు నెరపలేని పాకిస్థాన్ ఓ విఫల దేశమని ఒవైసీ అన్నారు. పాకిస్థాన్ కంటే భారత్ ఎప్పటికీ బలమైన దేశమేనని పేర్కొన్నారు. భారత్‌లో నివసిస్తున్న ముస్లింలు 1947లోనే జిన్నాను తిరస్కరించారని స్పష్టం చేశారు.

నావికాదళం యుద్ధానికి సిద్ధం!

అరేబియా సముద్రంలో లైవ్ ఫైరింగ్ డ్రిల్



నౌకాదళం త్రిశూల వ్యూహం

సముద్రం ఉపరితలం(యుద్ధనౌక), సముద్రం లోపల(జలాంతర్గామి), సముద్ర జలాల పై నుంచి(హెలికాప్టర్) మూడు రకాలుగా దాడులకు సిద్ధమంటూ భారత నౌకాదళం శనివారం విడుదల చేసిన ఫొటో

న్యూఢిల్లీ, మే 3: పహల్గాం ఉగ్రదాడి అనంతర పరిణామాల నేపథ్యంలో... యుద్ధ సన్నద్ధతను పరిశీలించేందుకు భారత నావికాదళం అరేబియా సముద్రంలో విన్యాసాలు చేపట్టింది. సాధారణ డ్రిల్ తరహాలో కాకుండా.. యుద్ధంలో ఉన్నట్టుగానే లక్ష్యాలపై అసలైన ఆయుధాలను ప్రయోగించి, ప్రత్యక్షంగా (లైవ్ ఫైరింగ్ డ్రిల్) పరిశీలించనుంది. ఆయుధాల సామర్థ్యం, కచ్చితత్వాన్ని పరీక్షించడంతోపాటు దాడి సమయంలో వ్యవహరించాల్సిన తీరు, వ్యూహాల రూపకల్పనకు ఈ డ్రిల్ తోడ్పడుతుందని రక్షణశాఖ వర్గాలు చెబుతున్నాయి. శనివారమే ప్రారంభమైన ఈ లైవ్ డ్రిల్ బుధవారం (7వ తేదీ) వరకు కొనసాగనుంది. అరేబియా సముద్రంలో నేవీ విన్యాసాల నేపథ్యంలో.. కేంద్ర ప్రభుత్వం ఆ ప్రాంతం మీదుగా ప్రయాణించే వాణిజ్య నౌకలకు నావిగేషన్ హెచ్చరికలను జారీ చేసింది. మరోవైపు.. నావికాదళం ప్రధానాధికారి అడ్మిరల్ దినేశ్ కె.త్రిపాఠి శనివారం నేవీ లైవ్ డ్రిల్ ప్రారంభం కావడానికి ముందే ప్రధాని మోదీతో భేటీ అయ్యారు. సుమారు గంట పాటు జరిగిన ఈ సమావేశంలో నావికాదళం సన్నద్ధత, అరేబియా సముద్రంలో లైవ్ డ్రిల్‌కు సంబంధించిన అంశాలను ప్రధానికి వివరించినట్టు తెలిసింది.

గోవా ఆలయంలో తొక్కిసలాట

» ఆరుగురి మృతి, ఐదుగురి పరిస్థితి విషమం

పనాజీ, మే 3: ఉత్తర గోవాలోని శిర్గావ్‌లో ఉన్న శ్రీలైరాయ్ ఆలయంలో జాతర సందర్భంగా అపశ్రుతి చోటుచేసుకుంది. శనివారం తెల్లవారుజామున భక్తులు నిప్పుల గుండంలో నడిచే సమయంలో తొక్కిసిలాట చేసుకుంది. ఈ ఘటనలో ఇద్దరు మహిళలు సహా.. ఆరుగురు మృతిచెందారు. మరో 80 మంది గాయాలపాలయ్యారు. వీరిలో ఐదుగురి పరిస్థితి ఆందోళనకరంగా ఉందని గోవా ఆరోగ్య శాఖ మంత్రి విశ్వజీత్‌రాణె వెల్లడించారు. తీవ్ర గాయాలపాలైన వారిని గోవా వైద్య కళాశాల(జీఎంసీ)లో చేర్పించినట్లు డీజీపీ అలోక్ కుమార్ తెలిపారు. ఏటా మే నెలలో శ్రీలైరాయ్ దేవీ జాతర జరుగుతుంది. ఈ ఉత్సవాలకు గోవాతోపాటు.. మహారాష్ట్ర, కర్ణాటకకు చెందిన భక్తులు పెద్దసంఖ్యలో హాజరవుతారు. శుక్రవారం సాయంత్రం జాతర మొదలవ్వగా.. భక్తులు క్రమంగా శిర్గావ్ చేరుకోవడం ప్రారంభించారు. తెల్లవారుజామున 3గంటలకు జరిగే అగ్నిగుండం వేడుక సమయానికి ఆ ప్రాంతంలో 40వేల మంది వరకు భక్తులున్నట్లు పోలీసులు తెలిపారు. "అగ్నిగుండం సమీపంలో ఓ వైపు ఉన్న ఏటవాలుగా ప్రాంతంలో ఎక్కువ మంది నిలబడ్డారు. భక్తులు అగ్నిగుండంలో నడుస్తున్న సమయంలో.. అటువైపు రద్దీ పెరిగింది. ఈ క్రమంలో తొక్కిసలాట చోటుచేసుకుంది. ఈ ఘటనపై ప్రధాని మోదీ ఆరా తీశారు. గోవా సీఎం ప్రమోద్ సావంత్‌కు ఫోన్ చేశారు. సీఎం సావంత్ ఉదయమే ఘటనాస్థలికి చేరుకున్నారు. ఘటనపై సమగ్ర విచారణ జరపాలని ఆదేశించారు.

26 మంది ఎంబీబీఎస్ విద్యార్థుల సస్పెన్షన్

» 14 అడ్మిషన్లు రద్దు... 215 అడ్మిషన్ల నిలిపివేత

» నీట్ పేపర్ లీకేజీ వివాదంపై ఎన్ఎంసీ చర్యలు

న్యూఢిల్లీ, మే 3: దేశవ్యాప్తంగా తీవ్ర దుమారం రేపిన నీట్-యూజీ 2024 పేపర్ లీక్ వ్యవహారంలో నేషనల్ మెడికల్ కమిషన్(ఎన్ఎంసీ) చర్యలు తీసుకుంది. లీకేజీతో సంబంధం ఉన్నట్లు గుర్తించిన 26 మంది ఎంబీబీఎస్ విద్యార్థులను సస్పెండ్ చేయడంతో పాటు రాబోయే విద్యా సంవత్సరానికి 14 మంది అభ్యర్థుల అడ్మిషన్లు రద్దు చేయాలని ఆదేశించింది. విచారణ పెండింగ్‌లో ఉన్న 215 మంది అభ్యర్థుల అడ్మిషన్లను కూడా కమిషన్ నిలిపివేసింది. అలాగే నీట్-యూజీ పరీక్షకు హాజరు కాకుండా 42 మంది అభ్యర్థులపై మూడేళ్ల పాటు (2024, 2025, 2026), తొమ్మిది మందిపై రెండేళ్ల పాటు (2025, 2026) నిషేధం విధించింది. కేసు దర్యాప్తు చేస్తున్న సీబీఐ నివేదిక ఆధారంగా సంబంధిత వైద్య కళాశాలలు, సంస్థలకు ఆదేశాలు జారీ చేసింది. నీట్-యూజీ 2025 పరీక్షలు మే 4న జరగనున్న నేపథ్యంలో ఎన్ఎంసీ ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. ఇదిలా ఉండగా, నీట్-యూజీ 2025ను సజావుగా నిర్వహించేందుకు శనివారం అన్ని పరీక్ష కేంద్రాల్లోనూ విద్యాశాఖ అధికారులు మాక్ డ్రిల్ నిర్వహించారు. దేశవ్యాప్తంగా 500 నగరాల్లోని 5,453 కేంద్రాల్లో ఆదివారం ఈ పరీక్ష జరగనుంది. ఈ ఏడాది పరీక్షకు 22.7 లక్షల మందికి పైగా అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు.

ఇంట్లో వాడే వస్తువుల్లో హంతక కెమికల్!

న్యూఢిల్లీ, మే 3: మనం రోజూ వాడే వస్తువుల్లో ఉండే ఓ కెమికల్ ఏటా లక్షల మంది ప్రాణాలను హరిస్తోంది. మనకు తెలియకుండానే దాన్ని మన శరీరంలోకి పంపించి మన ప్రాణాలను మనమే తీసుకుంటున్నాం. డీ-2-ఎథిల్‌హెక్సైల్ థాలెట్ (డీఈహెచ్‌పీ) అనే ఈ కెమికల్‌ను ప్లాస్టిక్ నుంచి మేకప్ సామగ్రి వరకు చాలా వాటిలో వినియోగిస్తారు. బొమ్మలు, దుస్తులు, షాంపూలు, ఆహారాన్ని నిల్వ చేసే పాత్రలు ఇలా ప్రతిరోజూ వాడే వస్తువుల్లో ఈ కెమికల్ ఉంటుంది. ఇది మన హార్మోన్లకు హాని కలిగిస్తుంది. డీఈహెచ్‌పీ నేరుగా మరణానికి కారణం కాకపోయినా గుండెజబ్బులకు కారణమవుతున్నట్లు లాన్సెట్ పరిశోధకులు తాజాగా గుర్తించారు. 55 నుంచి 64 ఏళ్ల వయస్సు మధ్య చనిపోయిన సుమారు 1,03,587 మంది నమూనాలను పరిశీలించగా అత్యధిక మందిలో డీఈహెచ్‌పీ కెమికల్ స్థాయి ఎక్కువగా ఉన్నట్లు తేలిందని తెలిపారు. దీని వల్లనే వారికి గుండెజబ్బులు వచ్చి మరణించినట్లు గుర్తించారు. డీఈహెచ్‌పీ ప్రభావంతో భారత్‌లో ఏటా సుమారు 3,56,238 మంది మరణిస్తున్నారని తెలిపారు.

పచ్చళ్లపైనా ట్రంప్ సుంకం!

భారత్ నుంచి తెప్పించుకునే ఆహారోత్పత్తులపై నిఘా

» పన్ను కట్టకపోతే భారీ జరిమానాలు

» సోషల్ మీడియా, యాప్‌ల ద్వారా భారతీయుల చిరువ్యాపారాలు

» ఇండియా నుంచి తినుబండారాలు తెప్పించి విక్రయం..ఇకపై వాటిపై పన్ను



(డల్లాస్ నుంచి ఆంధ్రజ్యోతి ప్రతినిధి - కృష్ణమోహన్ దాసరి)

డబ్బు వసూలు చేసే ఏ చిన్న అవకాశాన్ని, మార్గాన్ని కూడా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వదిలి పెట్టటం లేదు. ఆఖరికి, భారత్ నుంచి పచ్చళ్ల వంటి వాటిని తెచ్చుకుంటే వాటి మీద కూడా సుంకాలు విధించటానికి సన్నద్ధమవుతున్నారు. ఇండియా నుంచి ఎవరైనా స్నేహితులో, బంధువులో అమెరికా వస్తుంటే ఫలానా వస్తువులు కొని తీసుకురావాల్సిందిగా అమెరికాలో ఉన్న భారతీయులు పురమాయిస్తుంటారు. వ్యక్తిగత స్థాయిలో ఈ విధంగా తెప్పించుకునే ఉత్పత్తుల మీద అమెరికా ప్రభుత్వానికి సుంకాలు చెల్లించడం వంటిదేమీ ఇప్పటి వరకూ లేదు. దశాబ్దాలుగా ఇలాగే నడుస్తోంది. కానీ, ట్రంప్ 2.0లో అన్నీ తారుమారవుతున్నాయి. ఇలాంటి చిన్న చిన్న వ్యవహారాలపై కూడా అమెరికా ప్రభుత్వం తాజాగా దృష్టి సారిస్తోంది. వ్యక్తుల ద్వారా, సోషల్ మీడియా హ్యాండిల్స్ ద్వారా తెప్పించుకునే ఉత్పత్తుల మీద ఇక మీదట నిఘా పెట్టనున్నారు. వీటి మీద కూడా సుంకం వసూలు చేసి ఖజానా నింపాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. సుంకం చెల్లించకపోతే, భారీ జరిమానాలు విధించి ఇలాంటి మార్గాలను పూర్తిగా కట్టడి చేయాలని అధికారులు భావిస్తున్నట్లు సమాచారం. భారత్‌లో మాదిరిగానే అమెరికాలో కూడా.. సోషల్ మీడియా హ్యాండిల్స్‌నే వ్యాపార వేదికలుగా మార్చుకుని అనేక మంది విక్రయాలు జరుపుతున్నారు. వీరిలో పలువురు తెలుగువాళ్లు, ఇతర రాష్ట్రాలకు చెందినవారున్నారు. ఇండియా నుంచి వివిధ ఉత్పత్తులను కొరియర్ ద్వారా తెప్పించుకొని.. సోషల్ మీడియాలో ఆర్డర్లు తీసుకొని కొనుగోలుదార్లకు కొరియర్ ద్వారా పంపిస్తున్నారు. వీరు సాధారణంగా పన్నులు చెల్లించడం అంటూ ఉండదు. ఇంకొందరు యాప్‌ల ద్వారా కూడా ఈ తరహా వ్యాపారాలు చేస్తున్నారు. భారత్ నుంచి ఏమైనా ఉత్పత్తులను, వస్తువులను తెప్పించుకోవాలనుకున్న వాళ్లు ఈ యాప్‌లలో రిజిస్టర్ చేసుకుంటారు. యాప్ నిర్వాహకులు ఇండియాలో వాటిని కొనుగోలు చేసి కొరియర్ ద్వారా తెప్పించి అందజేస్తారు. ఈ తరహా వ్యాపారంలో కూడా యూఎస్ ప్రభుత్వానికి పన్ను చెల్లించడం జరగదు. వీరందరి మీద ఇప్పుడు ట్రంప్ సర్కారు నజర్ పడింది. విక్రయించేవారితోపాటు కొనుగోలుదార్ల మీద కూడా సుంకాలు విధించాలని భావిస్తున్నారు. దీంట్లో భాగంగా, భారత్‌లోని రిటైలర్ల నుంచి అమెరికాలో ఉన్న వ్యక్తులు తెప్పించుకుంటున్న షిప్మెంట్లను అధికార వర్గాలు నిశితంగా గమనిస్తున్నాయి. ఈ మేరకు పలువురికి భారీ జరిమానాలు, న్యాయపరమైన చర్యలకు సంబంధించి నోటీసులు పంపుతున్నాయి. ఇదంతా చిరువ్యాపారాలు చేస్తున్న వారికి సంబంధించి కాగా, వ్యక్తిగత స్థాయిలో బంధుమిత్రులు అమెరికాకు వస్తుంటే వారి ద్వారా పచ్చళ్లు, తినుబండారాలు, దుస్తులు, బంగారు నగలు వంటివి తెప్పించుకుంటే ఏమిటి పరిస్థితి అన్నదీ ఇప్పుడు చర్చనీయాంశమైంది.

పన్ను మినహాయింపు హోదా తొలగిస్తా

హార్వర్డ్ యూనివర్సిటీకి ట్రంప్ తాజా హెచ్చరిక

వాషింగ్టన్, మే 3: అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హార్వర్డ్ వర్సిటీపై దాడిని తీవ్రతరం చేశారు. ఆ యూనివర్సిటీ పన్ను మినహాయింపు హోదాను తొలగిస్తానని తాజాగా హెచ్చరించారు. ఆ వర్సిటీకి ఇదే తగిన మూల్యం అంటూ శుక్రవారం ఆయన సోషల్ మీడియాలో ఒక పోస్టు పెట్టారు. ఇప్పటికే యూనివర్సిటీల వ్యవహారాల్లో ట్రంప్ జోక్యాన్ని ఈశాన్య అమెరికాలోని ఎనిమిది ప్రఖ్యాత యూనివర్సిటీలకు చెందిన 'ఐవీ లీగ్ స్కూల్' ఖండించింది. ఐవీ లీగ్ స్కూల్స్‌కు పన్ను రహిత స్థితిని మార్చేస్తానని ట్రంప్ ప్రకటించిన కొన్ని వారాల తర్వాత తాజా హెచ్చరిక వెలువడటం గమనార్హం. ట్రంప్ తాజా ప్రకటనపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. క్యాంపస్ విధానాల్లో సంస్కరణలు చేపట్టేందుకు హార్వర్డ్ యూనివర్సిటీ నిరాకరించడమే ట్రంప్ ఆగ్రహానికి కారణం. కాగా, పన్ను మినహాయింపు హోదా తొలగించడం సుదీర్ఘ ప్రక్రియ అని, ఇప్పట్లో సాధ్యం కాదని నిపుణులు చెబుతున్నారు. కోర్టుల్లో అవరోధాలను దాటుకొని వెళ్లే సరికి సంవత్సరాలు పడుతుందని అంటున్నారు.



పదిలో ఆరు సబ్జెక్టులూ ఫెయిల్

» కేక్ కట్ చేసి ధైర్యం నింపిన తల్లిదండ్రులు

బెంగళూరు, మే 3(ఆంధ్రజ్యోతి): పదో తరగతిలో తమ కుమారుడు అన్ని సబ్జెక్టులూ ఫెయిలైనా ఆ తల్లిదండ్రులు తేలిగ్గా తీసుకున్నారు. పైగా కేక్ కట్ చేసి వేడుక చేసి ధైర్యం చెప్పారు. బాగల్కోటె జిల్లా నవనగరకు చెందిన అభిషేక్ పదో తరగతి పరీక్షల్లో ఆరు సబ్జెక్టుల్లోనూ ఫెయిలయ్యాడు. అన్ని సబ్జెక్టులూ కలిపి 625కు 200 మార్కులు వచ్చాయి. దీంతో సహ విద్యార్థులు కొందరు అభిషేక్‌ను హేళన చేశారు. కుమారుడి పరిస్థితిని గమనించిన తల్లిదండ్రులు.. ఏమాత్రం ఆలోచించకుండా ఓ కేక్ తెప్పించి కట్ చేయించి వేడుక చేశారు. పదో తరగతి పరీక్షలు మరోసారి రాసుకోవచ్చని, ఫెయిలైనంత మాత్రాన ఆందోళన చెందాల్సిన అవసరం లేదని గట్టి ధైర్యం చెప్పారు.

రష్యా విక్టరీ డే అతిథులకు ఉక్రెయిన్ హెచ్చరిక

మాస్కో: రష్యాలో ఈనెల 9న జరగనున్న విక్టరీ-డే పరేడ్‌కు హాజరయ్యే విదేశీ ప్రముఖుల భద్రతకు హామీ ఇవ్వలేమని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ హెచ్చరించారు. విక్టరీ-డే సందర్భంగా రష్యా ప్రతిపాదించిన 3 రోజుల కాల్పుల విరమణను కూడా ఆయన తిరస్కరించారు. "రష్యన్ భూభాగంలో జరిగే దానికి మేం బాధ్యత వహించలేం. మీ భద్రతపై హామీ ఇవ్వలేం" అని విదేశీ నాయకులను ఉద్దేశించి జెలెన్‌స్కీ సంచలన వ్యాఖ్యలు చేశారు. రెండో ప్రపంచ యుద్ధంలో నాజీ జర్మనీపై విజయం సాధించిన రష్యా 80వ వార్షికోత్సవాన్ని జరుపుకుంటోంది. ఈ వేడుకలకు మోదీ, జిన్‌పింగ్ సహా 20కంటే ఎక్కువ మిత్ర దేశాల నాయకులను రష్యా ఆహ్వానించింది. అయితే, పహల్గాం ఘటన నేపథ్యంలో ఈ పరేడ్‌కు మోదీకి బదులుగా రక్షణశాఖ సహాయ మంత్రి సంజయ్ హాజరుకానున్నారు.

భూభారతిలో ఫీజు మినహాయింపు ఉన్నట్లా? లేనట్లా?

- సీసీఎల్ఏ నుంచి విడుదల కాని ఉత్తర్వులు
- పైలట్ ప్రాజెక్టు మండలాల్లో గందరగోళం
- రేపటి నుంచి మరో 28 మండలాల్లో అమలు
- సోమవారం ఉత్తర్వులు వచ్చే అవకాశం!

హైదరాబాద్, మే 3 (ఆంధ్రజ్యోతి): భూభారతి దరఖాస్తులకు ఫీజు మినహాయింపు ఉన్నట్లా? లేనట్లా? అనే గందరగోళం నెలకొంది. ప్రయోగాత్మకంగా ఈ ప్రాజెక్టును అమలు చేస్తున్న నాలుగు మండలాల్లో వచ్చిన దరఖాస్తులను జూన్ 2లోగా పరిష్కరించాల్సి ఉండగా.. ఫీజు విషయంలో ఎటూ తేలక.. పలు చోట్ల డాక్యుమెంట్లు అప్‌లోడ్ అవ్వడం లేదని రెవెన్యూ వర్గాలు చెబుతున్నాయి. గత నెల 17న రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఈ అంశంపై స్పష్టతనిచ్చారు. ఎలాంటి సేవా రుసుం లేకుండానే.. ఉచితంగా సమస్యలను పరిష్కరిస్తామని ప్రకటించారు. అయితే.. పైలట్ ప్రాజెక్టు మండలాల్లో కొన్నిచోట్ల ఫీజు చెల్లించకుండా దరఖాస్తుల అప్‌లోడ్‌కు వీలు కుదరడం లేదని రెవెన్యూ యంత్రాంగం చెప్పడం గమనార్హం..! ఫీజు మినహాయింపుపై అధికారికంగా ఉత్తర్వులు వచ్చాకే.. ఈ సమస్యకు పరిష్కారముంటుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

రేపటి నుంచి 28 మండలాల్లో..

రెండో దశలో భాగంగా ఈనెల 5వ తేదీ నుంచి 28 మండలాలను భూభారతి పరిధిలోకి తీసుకువస్తారు. ఆయా మండలాల్లో రెవెన్యూ సదస్సులను నిర్వహించి, దరఖాస్తులను స్వీకరిస్తారు. ముందు నుంచి ప్రభుత్వం సమస్యలను ఉచితంగానే పరిష్కరిస్తామని పేర్కొన్నా.. పైలట్ మండలాల మాదిరిగా ఇక్కడ కూడా దరఖాస్తులు అప్‌లోడ్ కాకపోతే మరింత గందరగోళం నెలకొనే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఫీజు మినహాయింపు జీవో రానందున.. దరఖాస్తులను ఉచితంగా అప్‌లోడ్ చేయడం కుదరడం లేదని పలువురు డేటా ఎంట్రీ ఆపరేటర్లు చెబుతున్నారు. పైలట్ ప్రాజెక్టు తొలిదశ నాలుగు మండలాల్లో వచ్చిన 11,630 దరఖాస్తుల్లో.. పట్టాదార్ పాస్‌పుస్తకాల కోసం 3,446, సాదాబైనామాకు పరిష్కారం కోసం 2,796 అర్జీలు వచ్చినట్లు వివరిస్తున్నారు. ఇప్పటికే ఈ తరహా సేవలకు ఫీజులు ఉండడంతో.. ఉచితంగా అప్‌లోడ్ చేయడం సాధ్యం కావడం లేదంటున్నారు.

ప్రస్తుతం సేవలకు ఫీజులు ఇలా..

- రిజిస్ట్రేషన్లకు నిర్ణీత స్టాంప్ డ్యూటీ చెల్లించాలి
- రిజిస్ట్రేషన్ స్లాట్ రీ-షెడ్యూల్‌కు మొదటి సారి ఉచితం. రెండో సారి రూ.500. మూడోసారి.. ఆపైన ఆర్నెల్లలోపు రీ-షెడ్యూల్‌కు రూ.1000
- మ్యుటేషన్ లేదా వారసత్వ సేవలకు ఎకరానికి రూ.2500, లేదా గుంటకు రూ.62.50 ఫీజు ఉంటుంది
- పట్టాదారు పాస్ పుస్తకానికి రూ.300
- హక్కుల నమోదు సవరణలు, అప్పీళ్ల కోసం రూ.1,000
- హక్కుల రికార్డు నకలు కోసం రూ.10

ఈ నేపథ్యంలో సీసీఎల్ఏ అధికారులు సోమవారం ఉత్తర్వులు ఇచ్చే అవకాశాలున్నాయి. ఆర్థికపరమైన అంశం కావడంతో ప్రభుత్వం నుంచి అనుమతి తీసుకోవడంలో కాస్త ఆలస్యం జరిగినట్లు.. ఉత్తర్వులు రాగానే భూభారతి పోర్టల్‌లో మార్పులు చేస్తారని తెలుస్తోంది.



వేల బస్తాల ధాన్యం తడిసిముద్ద

- ఆమనగల్లులో అకాల వర్షంతో భారీగా నష్టం
- కొట్టుకుపోయిన మార్కెట్ యార్డులోని ధాన్యం
- కొనుగోళ్లలో జాప్యంపై ఆగ్రహించిన రైతులు
- హైదరాబాద్-శ్రీశైలం హైవేపై రాస్తారోకో
- రాష్ట్రంలో పలుచోట్ల 45 డిగ్రీల ఉష్ణోగ్రత
- నేడు, రేపు వర్ష సూచన

ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్



ఆమనగల్లులో జాతీయ రహదారిపై రాస్తారోకో చేస్తున్న రైతులు

రంగారెడ్డి జిల్లా ఆమనగల్లులో శనివారం సాయంత్రం కురిసిన భారీ వర్షం రైతులకు అపార నష్టాన్ని మిగిల్చింది. మార్కెట్ యార్డ్‌లో ఆరబోసిన వేల బస్తాల ధాన్యం తడిసిపోయింది. గత నెల 18న ఆమనగల్లు మార్కెట్ యార్డ్‌లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేశారు. ఆమనగల్లు, తలకొండపల్లి మండలాల నుంచి రైతులు పెద్ద ఎత్తున ధాన్యాన్ని తీసుకొచ్చారు. శనివారం ఉదయం సుమారు 800 బస్తాల ధాన్యాన్ని తూకం వేసి మిల్లుకు తరలించడానికి మార్కెట్ ఆవరణలో ఉంచారు. అకాల వర్షంతో ఆరబోసిన, కుప్పలు వేసిన వరి ధాన్యం పూర్తిగా తడిసిపోయింది. కొనుగోళ్లలో జాప్యం వల్లే ధాన్యం తడిసి నష్టం వాటిల్లిందని ఆగ్రహించిన రైతులు హైవేపై రాస్తారోకో చేపట్టారు. దీంతో గంటపాటు వాహనాలు నిలిచిపోయాయి. రైతుల ఆందోళనకు బీఆర్ఎస్ నాయకులు మద్దతు తెలిపారు. సీఐ జానకిరామ్ రెడ్డి రైతులు, బీఆర్ఎస్ నాయకులకు నచ్చజెప్పి మార్కెట్ యార్డులోకి తీసుకువెళ్లారు. మార్కెట్ చైర్‌పర్సన్ యాట గీతా నర్సింహతో మాట్లాడి కొనుగోళ్లలో జాప్యం లేకుండా చూస్తామని హామీ ఇవ్వడంతో రైతులు శాంతించారు. కేశంపేట మండలంలో కూడా ఈదురు గాలులతో కూడిన వర్షం పడింది. కొత్తపేట-కోనాయపల్లి గ్రామాల ప్రధాన రహదారిపై చెట్లు విరిగిపడి రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. యాచారం, కడ్తాల మండలాల్లో శుక్రవారం రాత్రి కురిసిన వడగళ్ల వర్షంతో ధాన్యం నీటి పాలైంది. మామిడికాయలు నేలరాలాయి. మరోవైపు, రాష్ట్రంలో మండుతున్న ఎండలు ప్రజలను రారెత్తిస్తున్నాయి. శనివారం నిర్మల్ జిల్లాలో అత్యధికంగా దస్తురాబాద్‌లో నర్సాపూర్(జి)లో 45.2 డిగ్రీలు, భైంసా, దస్తురాబాద్, కుబీర్, కుంటాల, తానూర్‌లో 45 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. నిర్మల్ జిల్లాలో వడదెబ్బకు ఇద్దరు మృతిచెందారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఎండలు మండుతున్నాయి. ఇబ్రహీంపట్నం మండలం గోదూర్‌లో అత్యధికంగా 45 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. కాగా, రాష్ట్రంలో కొన్నిచోట్ల ఆది, సోమవారాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

ఊడిపడ్డ చర్లపల్లి రైల్వే స్టేషన్ పైకప్పు

- పగిలిన సోలార్ విద్యుత్ ఫలకాలు



ఊడిపడ్డ టెర్మినల్ ప్రధానద్వారం పైకప్పు భాగాలు

కుషాయిగూడ, మే 3 (ఆంధ్రజ్యోతి): కోట్లాది రూపాయలు వెచ్చించి నిర్మించిన చర్లపల్లి రైల్వే శాటిలైట్ టెర్మినల్ ప్రధాన భవనం డొల్లతనం బయటపడింది. శనివారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన వర్షానికి పైకప్పు భాగాలు, సోలార్ విద్యుత్ ఫలకాలు ఊడిపడ్డాయి. 3 నెలల క్రితం అట్టహాసంగా ప్రారంభించిన రైల్వే టెర్మినల్ 9వ నంబరు ప్లాట్‌ఫామ్‌ను అనుకొని ఉన్న ప్రవేశ ద్వారం రూఫింగ్ షీట్లు, రేకులు, ఈ ఫలకాలు పెద్ద శబ్దం చేస్తూ పడిపోయాయి. అదృష్టవశాత్తూ ఆ సమయంలో అక్కడ ప్రయాణికులు, సిబ్బంది లేకపోవడంతో ప్రాణ నష్టం తప్పింది. భవనం పైకప్పు భాగాలు 30 మీటర్ల ఎత్తు నుంచి పడడంతో సిబ్బంది కంగారుగా బయటకు పరుగులు తీశారు. ఈ ఘటనపై స్టేషన్ మేనేజర్ ఉన్నతాధికారులకు నివేదించినట్లు తెలిసింది. నిర్మాణంలో లోపాలే కారణమని తెలుస్తోంది.

10న టీజీఆర్జేసీ సెట్ పరీక్ష

హైదరాబాద్, మే 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని మొత్తం 35 గురుకుల జూనియర్ కాలేజీల్లో ప్రవేశాలకు ఉద్దేశించిన టీజీఆర్జేసీ సెట్ పరీక్ష ఈ నెల 10న జరగనుంది. ఇంటర్ ప్రథమ సంవత్సరం ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీల్లో ప్రవేశాలకు ఈ పరీక్ష జరుగుతుందని తెలంగాణ గురుకుల విద్యాలయాల సంస్థ కార్యదర్శి సీహెచ్ రమణకుమార్ శనివారం తెలిపారు. అభ్యర్థులు తమ హాల్ టికెట్లను అధికారిక వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు.

రిజర్వేషన్లపై 50% పరిమితిని ఎత్తేయాలి

- ఎంపీ మల్లు రవి
- కులగణనను తప్పుపట్టడం తగదు : జి.నిరంజన్

న్యూఢిల్లీ/హైదరాబాద్, మే 3 (ఆంధ్రజ్యోతి): విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్లపై 50 శాతం పరిమితిని ఎత్తేయాలని కాంగ్రెస్ ఎంపీ మల్లు రవి కేంద్రాన్ని డిమాండ్ చేశారు. ప్రైవేటు విద్యాసంస్థల్లో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనార్టీలకు రిజర్వేషన్లు అమలు చేసేలా ఆర్టికల్ 15 (5)ను తక్షణమే అమలు చేయాలన్నారు. శనివారం ఢిల్లీలోని తెలంగాణభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. తెలంగాణ నమూనాతో జాతీయ స్థాయిలో కులగణన చేపట్టాలని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) తీర్మానం చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కులగణనతో దేశవ్యాప్తంగా సీఎం రేవంత్‌రెడ్డి పేరు మార్మోగుతోందని చెప్పారు. రాష్ట్రంలో జరిగిన కులగణన సర్వేను తప్పుపట్టడమంటే ఇక్కడి ప్రజలను అవమానించడమేనని బీసీ కమిషన్ చైర్మన్ జి.నిరంజన్ అన్నారు. తెలంగాణలో సర్వే తర్వాత దేశవ్యాప్తంగా జనగణన, కులగణన చేస్తామని కేంద్రం ప్రకటించడం సంతోషకరమైనా బీసీలకు జరిగే మేలేంటో స్పష్టం చేయలేదని ఆక్షేపించారు.

నవ వధువు ఆత్మహత్య

చిన్నశంకరంపేట, మే 3 (ఆంధ్రజ్యోతి): పెళ్లయిన మూడునెలలకే ఓ నవ వధువు ఆత్మహత్య చేసుకుంది. మెదక్ జిల్లా చిన్నశంకరంపేట మండలం అగ్రహారానికి చెందిన వట్టెం మహేష్‌కు, వెల్దుర్తి మండలం శేరిలాకు చెందిన పూజ(24)తో ఈ ఏడాది ఫిబ్రవరిలోనే వివాహమైంది. శనివారం ఉదయం పూజ ఇంట్లో ఆత్మహత్య చేసుకుంది. దీంతో పూజను హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నారంటూ ఆమె తల్లిదండ్రులు, బంధువులు.. మహేష్ కుటుంబంపై దాడికి పాల్పడ్డారు. అడ్డుకోబోయిన పోలీసులు, వార్త సేకరణకు వచ్చిన విలేకరుల పైనా దాడికి పాల్పడ్డారు. పోలీసులు పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ



కొత్తపలుకు

▪ఆర్కే RK

ప్రధానమంత్రి శుక్రవారం నాడు ప్రారంభించిన పనులతోనే రాజధాని నిర్మాణం సంపూర్ణం కాదు. ప్రభుత్వ నిర్మాణాలతో పాటు ప్రైవేటు రంగంలో కూడా నిర్మాణాలు జరిగినప్పుడే రాజధానికి ఒక రూపు వస్తుంది. "అమరావతి పేరిట ఒక వర్గం ప్రజలకు మేలు చేసేందుకు లక్ష కోట్ల రూపాయలు ఖర్చు చేయడం అవసరమా? రాష్ట్ర ప్రజలందరికీ చెందిన సొమ్మును ఒకే చోట ఖర్చు చేయడం ఏమిటి?" అని ప్రజలలో విష ప్రచారం చేస్తున్న వారికి వాస్తవం తెలియక కాదు. అమరావతి నిర్మాణానికి ఖర్చు చేయబోయే డబ్బుకు రాష్ట్ర బడ్జెట్‌తో సంబంధం లేదు. రైతులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఇచ్చిన భూముల్లో ప్రభుత్వానికి తన వాటాగా వచ్చే భూమిని అభివృద్ధి చేసి విక్రయించడం ద్వారా రాజధాని నిర్మాణానికి నిధులు సమకూర్చుకుంటున్నారు. అందుకే ఇది సెల్ఫ్ ఫైనాన్స్ ప్రాజెక్టు అయింది.

అమరావతి.. కొందరిదా? అందరిదా?

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి నిర్మాణానికి గ్రహణాలన్నీ ఇప్పుడు తొలగిపోయాయి. నిర్దేశించుకున్న లక్ష్యం ప్రకారం మూడేళ్లలో రాజధాని నిర్మాణానికి నేను కూడా భుజం కలుపుతానని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రకటించారు. అమరావతి కేవలం రాజధాని కాదు– ఒక శక్తి అని, రాజధాని పూర్తయితే రాష్ట్ర జీడీపీ ఎక్కడికి వెళుతుందో ఊహించగలనని కూడా ప్రధాని చెప్పారు. ఇదే అమరావతికి, ఇదే ప్రధానమంత్రి సుమారు పదేళ్ల కిందట శంకుస్థాపన చేశారు. కాలూ చేయీ కూడదీసుకొని పనులు ప్రారంభించి, ఒకస్థాయికి చేర్చేసరికి రాష్ట్రంలో ప్రభుత్వం మారి జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చారు. మూడు రాజధానుల పల్లవి అందుకున్నారు. అప్పటి నుంచి అమరావతికి గ్రహణం పట్టింది. ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. అప్పటికే ఖర్చు చేసిన పది వేల కోట్ల రూపాయల ప్రజాధనం వృధా అయింది. అమరావతిని భ్రమరావతిగా, కమ్మరావతిగా అభివర్ణించారు. వైసీపీకి చెందిన కాలనాగులు రాజధానిపై విషం చిమ్మాయి. ఫలితంగా ఆంధ్రుల కలల రాజధాని శ్మశానంగా మారింది. రేపటి కోసం చంద్రబాబు కలలుగన్న అమరావతి ఉసురు తీయాలనుకున్నారు. అమరావతి తమది కాదన్న భావనను ఒక వర్గం ప్రజలలో నూరి పోశారు. ఇది గతం! అమరావతి చంద్రబాబుది కాదు. లోకేశ్‌ది కాదు. ఆ సామాజిక వర్గానిదీ కాదు. రేపటికోసం నిర్మితం కాబోతున్న నగరమది. రేపటి తరం ఆ ఫలితాలను అందుకుంటుంది.

శుభపరిణామాలు...

ఇప్పుడు చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. అమరావతి పనులు పునఃప్రారంభమయ్యాయి. మూడేళ్లలో పనులు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. రాజధాని పనులు వేగంగా, గడువులోపు పూర్తవడానికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని ప్రధాని మోదీ హామీ ఇచ్చారు. ఇదొక శుభపరిణామం. ఎందుకంటే, అటు కేంద్రంలో ఇటు రాష్ట్రంలో ఏర్పడిన ప్రభుత్వాలు 2029 వరకు అధికారంలో ఉంటాయి. నిర్దేశించుకున్న లక్ష్యం ప్రకారం పనులు జరిగితే ఆలోపే రాజధాని నిర్మాణం పూర్తవుతుంది. ఆ తర్వాత ఎవరు అధికారంలో ఉన్నప్పటికీ రాజధానిని కదిలించలేరు. అయితే, ఇల్లు అలకగానే పండుగ కాదన్నట్టుగా శుక్రవారం నాటి ప్రధాని హామీతో అంతా సవ్యంగా జరుగుతుందని భావించలేం. మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అమరావతిపై అంతులేని ద్వేషాన్ని పెంచుకున్నారు. రాజధాని కోసం భూములు ఇచ్చిన రైతుల ముఖాలు చూడ్డానికి కూడా అధికారంలో ఉన్నప్పుడు ఆయన ఇష్టపడలేదు. గత ఎన్నికల్లో వైసీపీ ఓడిపోయిందిగానీ, వైసీపీకి అనుబంధంగా మారిన పోలీసులు, అధికారులు, జర్నలిస్టులుగా చలామణి అవుతున్న వాళ్లు, మేధావుల ముసుగులో తిరగాడుతున్న వాళ్లు, పిల్ల సైకోలు ఇప్పటికీ చురుగ్గానే పనిచేస్తున్నారు. ఈ శక్తులు మారీచులుగా మారి అమరావతి నిర్మాణానికి అడుగడుగునా ఆటంకాలు సృష్టించవచ్చు. రాజధాని ప్రాంతంలో అరటి తోటలు తగుల బెట్టడం– కులం చిచ్చు పేరిట రాష్ట్రంలో రైళ్లను ధ్వంసం చేయడం వంటి సంఘటనలను మళ్లీ చూడాల్సి రావచ్చు. హై సెక్యూరిటీ ఉండే విమానాశ్రయాలలో కోడికత్తులను చూశాం. నట్టింట్లో గొడ్డలి వేటునూ చూశాం. ఇలాంటివి మళ్లీ జరగవన్న గ్యారంటీ ఏమిటి? కులాలపరంగా ఆంధ్రప్రదేశ్ అతి సున్నితమైన రాష్ట్రం. కులం కోసం కత్తులు దూసుకుంటారు. తెలంగాణలో మాదిరి ఈ రాష్ట్రం నాది– మాకు రాజధాని లేకపోతే ఎలా? అన్న భావన తక్కువ. ఈ కారణంగానే ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అమరావతి కొందరిదే అన్న భావనను ఒక వర్గం ప్రజల్లో బలంగా వ్యాపింపజేయడంలో జగన్‌రెడ్డి సక్సెస్ అయ్యారు. ఇప్పుడు ఆయన మళ్లీ ప్రతిపక్షంలో ఉన్నారు. శాసనసభలో సంఖ్యాపరంగా జగన్ బలహీనంగా ఉన్నప్పటికీ కుల, మత అభిమానంతోపాటు రాజశేఖరరెడ్డి కుమారుడన్న అభిమానం కలగలిపి మొత్తం మీద 40 శాతం ప్రజలు ఇప్పటికీ తనకు అండగా ఉన్నారు. ఈ నేపథ్యంలో చంద్రబాబు ప్రభుత్వం అమరావతి నిర్మాణం పూర్తయ్యే వరకు మరింత అప్రమత్తంగా వ్యవహరించాలి. ఎంత మంచి పంట వేసినా దానికి చీడపీడలు పట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. కలుపు మొక్కలను ఏరిపారేయాలి. అప్పుడే పంట చేతికి వస్తుంది. ప్రధాని ఊహించినట్టుగా రాష్ట్ర జీడీపీ అమాంతం పెరగాలంటే అమరావతి నిర్మాణం ఆటంకాలు లేకుండా సకాలంలో పూర్తి కావాలి. ఈ క్రమంలో రాహు కేతువులను అణచివేయాలి. మన చుట్టూ ఉన్న ఆర్థిక ఉగ్రవాదులు, సైకోలను కట్టడి చేయాలి. జగన్‌రెడ్డి సంప్రదాయ రాజకీయాలను నమ్ముకోరు. ఈ కారణంగా ఎవరూ ఊహించని మార్గాల నుంచి రాజధాని నిర్మాణానికి ఆటంకాలు ఎదురుకావొచ్చు.

నేటికీ లేని రాజధాని

రాష్ట్రం విడిపోయి పదకొండేళ్లు అవుతున్నా రాజధాని కూడా ఏర్పడనందుకు ఆంధ్రులు బాధపడాలి. అద్భుతంగా అభివృద్ధి చెందిన హైదరాబాద్ తెలంగాణ సొంతం. మనం కూడా అటువంటి రాజధానిని నిర్మించుకోవాలన్న కసి ఏపీ ప్రజల్లో ఏర్పడకుండా చేశారు. ప్రపంచంలో ఏ నగరం కూడా మూడు నాలుగేళ్లలో పూర్తి కాదు. అదొక నిరంతర ప్రక్రియ. హైదరాబాద్‌నే తీసుకుందాం! ప్రస్తుతం అభివృద్ధికి నమూనాగా ఉన్న సైబరాబాద్‌కు చంద్రబాబు పురుడుపోసినప్పుడు అక్కడ రాళ్లూ రప్పలు మాత్రమే ఉండేవి. ఆ తర్వాత ప్రైవేటు రంగం సహకారంతో అద్భుత నగరంగా అభివృద్ధి చెందింది. ప్రభుత్వం తరఫున చంద్రబాబు అప్పట్లో సహాయ సహకారాలు అందించారు. ఐటీ రంగాన్ని ఆకర్షించారు. అప్పట్లో గుజరాత్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తాను హైదరాబాద్‌లో చంద్రబాబు ఐటీ రంగాన్ని అభివృద్ధి చేస్తున్న తీరును జాగ్రత్తగా గమనించేవాడినని ప్రస్తుత ప్రధాని నరేంద్ర మోదీ స్వయంగా చెప్పారు. నాలుగు ప్రభుత్వ భవనాలను నిర్మించినంత మాత్రాన అభివృద్ధి జరిగిపోదు. ఏ ప్రభుత్వమైనా ప్రైవేటు పెట్టుబడులను ఆకర్షించేందుకు మౌలిక వసతులను మాత్రమే సమకూరుస్తుంది. భారతదేశంలో బెంగళూరు, హైదరాబాద్ మాత్రమే ఐటీకి కేరాఫ్‌గా అభివృద్ధి చెందాయంటే ఎస్.ఎం.కృష్ణ, చంద్రబాబు పోటీపడటం వల్లనే. అప్పట్లో కర్ణాటక, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రులుగా ఉన్న వీరిరువురూ ఐటీని అభివృద్ధి చేయడంలో పోటీపడ్డారు. అప్పటికే ఐటీలో బెంగళూరు ముందంజలో ఉంది. హైదరాబాద్ మత కలహాలకు కేరాఫ్‌గా ఉండేది. ఆ పరిస్థితులలో హైదరాబాద్‌లో నిరుపయోగంగా ఉన్న ప్రభుత్వ భూములను దిగ్గజ ఐటీ కంపెనీలకు కేటాయించడం ద్వారా చంద్రబాబు ఆయా కంపెనీలను ఆకర్షించారు.

కుహనాల కూని రాగాలు...

రాజధాని నిర్మాణం కోసం యాభై వేల ఎకరాలు అవసరమా? అని ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కొంతమంది అపర మేధావులు ఇప్పటికీ కూని రాగాలు తీస్తున్నారు. ఇలాంటి వాళ్లు హైదరాబాద్ అభివృద్ధి ఎలా జరిగిందో తెలుసుకోవాలి. ప్రైవేటు సంస్థలకు కేటాయించడానికి అవసరమైన భూమి ప్రభుత్వం వద్ద ఉన్నప్పుడే ఏ కంపెనీ అయినా ముందుకు రావడానికి ఆసక్తి చూపుతుంది. హైదరాబాద్‌లో ఇప్పటికీ ప్రభుత్వం వద్ద కొన్ని వేల ఎకరాల భూమి ఉంది. తెలంగాణలో పెట్టుబడులు పెట్టాలనుకొనే వారికి ఈ భూములను ఆకర్షణగా చూపుతున్నారు. అమరావతి మహానగరంగా అభివృద్ధి చెందాలంటే ప్రైవేటు రంగం కూడా కలసి రావాలి. ప్రధానమంత్రి శుక్రవారం నాడు ప్రారంభించిన పనులతోనే రాజధాని నిర్మాణం సంపూర్ణం కాదు. ప్రభుత్వ నిర్మాణాలతో పాటు ప్రైవేటు రంగంలో కూడా నిర్మాణాలు జరిగినప్పుడే రాజధానికి ఒక రూపు వస్తుంది. "అమరావతి పేరిట ఒక వర్గం ప్రజలకు మేలు చేసేందుకు లక్ష కోట్ల రూపాయలు ఖర్చు చేయడం అవసరమా? రాష్ట్ర ప్రజలందరికీ చెందిన సొమ్మును ఒకేచోట ఖర్చు చేయడం ఏమిటి?" అని ప్రజలలో విష ప్రచారం చేస్తున్న వారికి వాస్తవం తెలియక కాదు. అమరావతి నిర్మాణానికి ఖర్చు చేయబోయే డబ్బుకు రాష్ట్ర బడ్జెట్‌తో సంబంధం లేదు. రైతులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఇచ్చిన భూముల్లో ప్రభుత్వానికి తన వాటాగా వచ్చే భూమిని అభివృద్ధి చేసి విక్రయించడం ద్వారా రాజధాని నిర్మాణానికి నిధులు సమకూర్చుకుంటున్నారు. అందుకే ఇది సెల్ఫ్ ఫైనాన్స్ ప్రాజెక్టు అయింది. హైదరాబాద్‌లో, అంటే సైబరాబాద్‌లో మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడానికి తెలంగాణ ప్రభుత్వాలు కూడా తమ వద్ద ఉన్న భూములను విక్రయించడం ద్వారా నిధులు సమకూర్చుకోవడం వాస్తవం కాదా? ఇప్పుడు అభివృద్ధి చెందిన హైదరాబాద్ నుంచి అందుతున్న ఫలాలతోనే తెలంగాణలోని మిగతా ప్రాంతాలను అభివృద్ధి చేయడం నిజం కాదా? అమరావతిని మాత్రమే అభివృద్ధి చేస్తే రాష్ట్రంలోని మిగతా ప్రాంతాల పరిస్థితి ఏమిటని నసుగుతున్నవారు ఈ విషయం తెలుసుకోవాలి. తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర ఆర్థికంగా పరిపుష్టంగా ఉండటానికి కారణం ఏమిటి? చెన్నయ్, బెంగళూరు, ముంబై వంటి మహానగరాలు ఉండటం వల్లనే ఆయా రాష్ట్రాలకు ఇబ్బడి ముబ్బడిగా ఆదాయం వస్తోంది. తమిళనాడులో చెన్నయ్ మాత్రమే కాదు– మరెన్నో నగరాలు ఉన్నాయి. పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన కోయంబత్తూరు వంటి నగరాలు ఉన్నాయి. చిన్న రాష్ట్రమైన కర్ణాటకను బెంగళూరు ఆదుకుంటోంది. దేశ ఆర్థిక రాజధానిగా అలరారుతున్న ముంబైతోపాటు పుణె, నాగపూర్ వంటి నగరాలు మహారాష్ట్రలో ఉన్నాయి. నగరాలు అభివృద్ధి చెందిన రాష్ట్రాలలోనే ప్రగతిని చూస్తున్నాం. మహానగరాలు లేని ఎన్నో రాష్ట్రాలు ఉన్నాయి. అందుకే వాటి గురించి మనం మాట్లాడుకోం! మన యువత ఉపాధి కోసం హైదరాబాద్, బెంగళూరు, చెన్నయ్, ముంబై, ఢిల్లీ వంటి నగరాల వైపు మాత్రమే చూస్తున్నారు కదా! నగరాల నుంచి లభించే ఆదాయంతో గ్రామీణ ప్రాంతాలను అభివృద్ధి చేసుకోవచ్చు. ఈ దిశగా ప్రభుత్వాలు కృషి చేయాలి. లేని పక్షంలో గ్రామాల నుంచి నగరాలకు వలసలు పెరిగిపోయి సామాజిక పరమైన సమస్యలు ఉత్పన్నమవుతాయి.

> **'గొప్పగా ఆలోచించండి' అని దివంగత రాష్ట్రపతి అబ్దుల్ కలాం చెప్పిన మాటలను విశ్వసించే చంద్రబాబు అమరావతి విషయంలో కూడా గొప్పగా ఆలోచిస్తున్నారు. ఇందులో తప్పు పట్టేది ఏముంది? ఆయన తదనంతరం ముఖ్యమంత్రులుగా వచ్చే వాళ్లు ఇదే ఒరవడిలో ఆలోచిస్తే అమరావతి నిరంతరంగా అభివృద్ధి చెందుతూనే ఉంటుంది.**

'ఒక వర్గం'... ఒక వాదన!

అమరావతి ఒక వర్గం ప్రజలకు మాత్రమే పరిమితమన్న విమర్శల విషయానికి వద్దాం! హైదరాబాద్ ఒకప్పుడు ఎలా ఉండేదో గుర్తుచేసుకుందాం. అప్పుడు మూసీకి అవతల, ఇవతల అన్నట్టుగా ఉండేది. ఒకవైపు ముస్లింల సంఖ్య అధికంగా ఉండేది. మరోవైపు స్థానిక హిందువులు ఉండేవారు. రెండు వర్గాల మధ్య మత ఉద్రిక్తతలు తలెత్తేవి. నిజాం హయాంలో నిర్మితమైన కట్టడాలు మినహా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో చెప్పుకోదగిన నిర్మాణాలను ప్రభుత్వాలు చేపట్టలేదు. హైదరాబాద్ అభివృద్ధి చెందని కారణంగా రాష్ట్ర ఆదాయం 1983 వరకు పదివేల కోట్ల రూపాయలలోపు ఉండేది. ఈ నేపథ్యంలో ఎన్టీ రామారావు ముఖ్యమంత్రిగా ట్యాంక్ బండ్‌తోపాటు హైదరాబాద్‌లోని ప్రధాన రహదారులను విస్తరించారు. ఆయన ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే ఆంధ్ర ప్రాంతం నుంచి సామాన్య ప్రజలు కూడా హైదరాబాద్‌కు వలస వచ్చారు. ఆ తర్వాత ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన చంద్రబాబు ఐటీ రంగం అభివృద్ధిని ఒక ఉద్యమంలా చేపట్టారు. దీంతో ఇతర రాష్ట్రాలకు చెందిన ఐటీ రంగ నిపుణులు ఉపాధి కోసం హైదరాబాద్ బాట పట్టారు. ఆ తర్వాత రాజశేఖరరెడ్డి, కేసీఆర్ వంటి వారితో పాటు ప్రస్తుత రేవంత్‌రెడ్డి ప్రభుత్వాలు కూడా పెట్టుబడులను ప్రోత్సహించడంలో పోటీపడ్డాయి. ఫలితంగా దేశం నలుమూలల నుంచి ప్రజలు హైదరాబాద్‌కు వలస వచ్చి స్థిరపడ్డారు. దేశంలోని 28 రాష్ట్రాల ప్రజలూ ఇక్కడ కనిపిస్తారు. ఫలితంగా హిందూ–ముస్లింల మధ్య గొడవలు నిలిచిపోయాయి. ఇప్పుడు హైదరాబాద్‌లో తెలంగాణ వారు ఎంత మంది? ఇతర రాష్ట్రాల వారు ఎంత మంది? అంటే బయటి వాళ్లే ఎక్కువ అని చెప్ప వచ్చునేమో! దీంతో మత ఉద్రిక్తతలకు ఒకప్పుడు కేరాఫ్ అడ్రస్‌గా ఉండే హైదరాబాద్ ఉపాధి అవకాశాలకు చిరునామాగా మారింది. హైదరాబాద్ ఈ స్థితికి రావడానికి మూడు దశాబ్దాలకు పైగా సమయం పట్టింది. అమరావతిలో కూడా అభివృద్ధి జరిగితే భూములు ఇచ్చిన రైతులు మైనారిటీలు అవుతారు. ఇతర ప్రాంతాలకు చెందిన వారి సంఖ్యే అధికంగా ఉంటుంది. ఇప్పుడు జగన్ అండ్ కో ఏడుస్తున్నట్టుగా 'ఆ వర్గం' వారు ఎక్కడుంటారో కూడా తెలియదు. రేపటికోసం ఆలోచించే వాడే నిజమైన ప్రజానాయకుడు, రాజనీతిజ్ఞుడు అవుతాడు. సంకుచితంగా ఆలోచించేవాడు ఎప్పటికీ ప్రజా నాయకుడు కాలేడు. సైబరాబాద్‌కు పునాదులు వేసిన చంద్రబాబు ఇప్పుడు తెలంగాణలో బయటి వ్యక్తి! నిజాం నిర్మించిన భవనాలలో ఇప్పుడు వారి వారసులు నివసించడం లేదే? అమరావతి కూడా పూర్తిగా అభివృద్ధి చెందడానికి కొన్ని దశాబ్దాలు పడుతుంది. అప్పటిదాకా నేను జీవించి ఉంటానా? అని చంద్రబాబు ఆలోచిస్తే సమర్థించగలమా? 'గొప్పగా ఆలోచించండి' అని దివంగత అబ్దుల్ కలాం చెప్పిన మాటలను విశ్వసించే చంద్రబాబు అమరావతి విషయంలో కూడా గొప్పగా ఆలోచిస్తున్నారు. ఇందులో తప్పు పట్టేది ఏముంది? ఆయన తదనంతరం ముఖ్యమంత్రులుగా వచ్చేవాళ్లు ఇదే ఒరవడిలో ఆలోచిస్తే అమరావతి నిరంతరంగా అభివృద్ధి చెందుతూనే ఉంటుంది. చంద్రబాబు రేపటి కోసం ఆలోచిస్తుండగా, కొంత మంది ఇవాళ సంగతి ఏమిటి? అని ప్రశ్నిస్తున్నారు. హైదరాబాద్‌లో హైటెక్ సిటీ భవన నిర్మాణం చేపట్టినప్పుడు కూడా ఎన్నో విమర్శలు వచ్చాయి. హైదరాబాద్‌లో ఇప్పుడు కొంత మందైనా ఆయనను తలచుకుంటున్నారు. రాయలసీమలో పాలెగాళ్ల సంస్కృతి విషయానికి వద్దాం! ఒకప్పుడు అక్కడ ఫ్యాక్షన్ గొడవలకు ఎంతో మంది బలయ్యారు. అందుకు ప్రధాన కారణం పేదరికంతోపాటు ఉపాధి లేకపోవడం. కాల క్రమంలో రాయలసీమలో సాగునీటి వసతి మెరుగుపడుతూ వచ్చింది. దీంతో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగయ్యాయి. ప్రభుత్వాలతో ప్రమేయం లేకుండానే పాలెగాళ్ల సంస్కృతి చాలా వరకు మాయమైంది.



అందుబాటులో భూమి...

భూమి లభ్యత కారణంగా హైదరాబాద్‌లో వేలాది పరిశ్రమలు ఏర్పాటయ్యాయి. వందలు, వేల ఎకరాల్లో కేంద్ర ప్రభుత్వ సంస్థలు ఏర్పడ్డాయి. ఆంధ్రప్రదేశ్‌లో ఈ స్థాయిలో భూమి లభ్యత ఉండదు. అక్కడ ప్రైవేటు భూమి ఎక్కువ. భారీ పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన భూమిని ప్రభుత్వం కేటాయించలేదు. అలాంటప్పుడు రాజధానిలో ఉపాధి అవకాశాలు పెంచడం ఎలా? అన్న సందేహం కలుగుతుంది. ఈ కారణంగానే అమరావతిలో క్వాంటమ్ వ్యాలీ అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాంది పలికారు. వందల వేల ఎకరాలు కేటాయించలేని పరిస్థితి ఉన్నందున సర్వీసు రంగాన్ని ఆయన ఎంచుకున్నారు. అమరావతి వంటి మహానగరాలు అభివృద్ధి చెందినప్పుడే ఆంధ్రప్రదేశ్‌లో కులాల కుంపట్లు పోతాయి. హైదరాబాద్‌లో ఎవరి కులం ఏమిటో ఎవరికీ తెలియదు. ఎందుకంటే మన పక్కింటివాడు వేరే రాష్ట్రానికి చెందినవాడై ఉంటాడు. అభివృద్ధి కారణంగానే అక్కడ కులాలు, మతాలకు చోటు లేకుండా పోయింది. ఏపీలో ఒక్కో ప్రాంతాన్ని ఒక్కో రంగంలో అభివృద్ధి చేయవచ్చు. ఇప్పటికే అభివృద్ధి చెందిన విశాఖపట్టణాన్ని మరింతగా అభివృద్ధి చేస్తే అది కూడా మహానగరం అవుతుంది. రాయలసీమలో తిరుపతి ఉండనే ఉంది. మిగతా ప్రాంతాలలో సోలార్ ఎనర్జీని అభివృద్ధి చేస్తున్నారు. అమరావతితో పాటు రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడానికి తన సంపూర్ణ సహకారాలు ఉంటాయని ప్రధాని నరేంద్ర మోదీ హామీ ఇచ్చారు కనుక ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఇదొక మహదావకాశం. అమరావతి ప్రజా రాజధాని ఎలా అవుతుంది? అని విమర్శించే వారికి కూడా సమాధానం చెప్పేలా ఆయన రాజధానిని నిర్మించాలి. భూముల ధరలు ప్రజలకు అందుబాటులో లేని పరిస్థితి ఏర్పడితే అల్పాదాయ వర్గాల వారు ఇబ్బందిపడతారు. అన్ని వర్గాల వారూ నివసించడానికి అనువుగా రాజధాని నిర్మాణానికి ప్రణాళికలు రూపొందించాలి. లేని పక్షంలో ఇప్పుడు హైదరాబాద్‌లో అల్పాదాయ వర్గాల వారికి ఎదురవుతున్న ఇబ్బందులే అమరావతిలోనూ ఎదురవుతాయి. కేసీఆర్ హయాంలో రియల్ ఎస్టేట్ బూమ్ పేరిట హైదరాబాద్‌లో భూముల ధరలను ఆకాశాన్ని అంటేలా చేశారు. ధరలను కృత్రిమంగా పెంచారు. వేలాది ఎకరాల భూమి నిరుపయోగంగా ఉన్నప్పటికీ సొంత ఇంటి కలకు పేదవారు దూరమయ్యారు. అమరావతిలో భూముల ధరలకు ఇప్పటికే రెక్కలు వచ్చాయి. బహుశా ఈ కారణంగానే కాబోలు, మరికొంత భూమిని రాజధాని కోసం సమీకరించాలని ప్రభుత్వం భావిస్తోంది.

విశాల దృక్పథంతోనే...

చరిత్రలో ఎంతో మంది పాలకులను చూశాం. వారిలో కొందరినే గుర్తుపెట్టుకుంటాం. ఆంధ్రప్రదేశ్ విషయానికి వస్తే అక్కడి ప్రజల ఆలోచనలు కూడా కొన్ని సందర్భాలలో సంకుచితంగా ఉంటాయి. మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి వంటి వారు ఉండనే ఉంటారు. ప్రజల మెదళ్లను విషపూరితం చేయడానికి ఆయన ప్రయత్నిస్తూనే ఉంటారు. అమరావతి నిర్మాణం సజావుగా పూర్తయి చంద్రబాబుకు పేరొస్తే జగన్‌రెడ్డి జీర్ణించుకోలేరు. ఇప్పటికైనా రాజధాని ఏర్పడుతుందా? అని ఎంతో మంది ఆశగా ఎదురుచూస్తుండగా, రాజధాని ఎప్పటికీ ఏర్పడకూడదని కోరుకొనే వాళ్లలో జగన్ వంటి వాళ్లు ముందుంటారు. విపరీత మనస్తత్వం ఉన్న వాళ్లు ఇలాగే ఆలోచిస్తారు. ఈ కారణంగా గతంలో జరిగిన కుట్రలను దృష్టిలో పెట్టుకొని భవిష్యత్తులో అమలయ్యే అన్ని రకాల కుట్రలను పసిగడుతూ చంద్రబాబు ప్రభుత్వం జాగరూకతతో వ్యవహరించాలి. జగన్‌కు మద్దతుగా నిలుస్తున్న పిల్ల సైకోలు ప్రతి చిన్న విషయాన్ని రాద్ధాంతం చేయడానికి కాచుకొని ఉన్నాయి. అడుగుకొకరు చొప్పున మారీచులు, సుబాహులు ఉన్నారు. అందుచేత అమరావతి నిర్మాణానికి ఆటంకాలు తొలగిపోయాయని భావించడానికి లేదు. ఈ నేపథ్యంలో రేపటి తరంకోసం ఆలోచించే వారందరూ ప్రభుత్వానికి అండగా నిలబడి రాజధాని అనే మహాయజ్ఞం నిర్విఘ్నంగా పూర్తయ్యేలా చేయి చేయి కలిపి నడవాలి. అదే సమయంలో ప్రభుత్వం తన దృష్టినంతా అమరావతి నిర్మాణంపైనే పెట్టిందన్న అభిప్రాయం ఇతర ప్రాంతాల ప్రజల్లో వ్యాపించకుండా పాలకులు జాగ్రత్తలు తీసుకోవాలి. అభివృద్ధి ఫలాలు అందేలోపు.. ప్రజల్లో అసంతృప్తి బీజాలు ఏర్పడకుండా చూడాలి. ప్రభుత్వ పనితీరు పట్ల ప్రజల్లో ఫీల్ గుడ్ భావన కల్పించడం అవసరం. అయితే ప్రభుత్వ పరంగా చోటుచేసుకొంటున్న కొన్ని సంఘటనలు కూటమి ప్రభుత్వానికి మచ్చగా మిగులుతున్నాయి. తాజాగా విశాఖపట్నంలో సింహాచలం దేవస్థానం వద్ద నిర్మాణంలో ఉన్న గోడ కూలి ఏడుగురు దుర్మరణం పాలయ్యారు. ఇందుకు అధికారుల నిర్లక్ష్యమే కారణం. కనీస అంచనాలు, డిజైన్లు కూడా లేకుండా ఎవరో అధికారి చెప్పారని గోడ కట్టించడం ఏమిటి? తిరుమల తర్వాత అంతటి ప్రాశస్త్యం ఉన్న సింహాచలం దేవస్థానానికి పూర్తి స్థాయి ఈవో లేకపోవడం ఏమిటి? అధికార యంత్రాంగం కలుషితం అయింది. అధికారుల్లో అనేక మంది ఇప్పటికీ జగన్‌రెడ్డికి విధేయులుగానే ఉన్నారు. ఇలాంటి వారిని ఏరి పారేయకుండా కీలక స్థానాల్లో కొనసాగించడం వల్ల అనర్థాలే జరుగుతాయి. నోటి మాటగా చెప్పగానే గోడ కట్టించడం అంటే దేవదాయ శాఖలో బాధ్యతారాహిత్యం ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. గోడ నిర్మాణంలో దేవాదాయ శాఖ బాధ్యత ఎంతో, పర్యాటక శాఖ బాధ్యత ఎంతో తేలాల్సి ఉంది. ఏది ఏమైనా ఏడు నిండు ప్రాణాలు పోయాయి. ప్రభుత్వ విభాగాలలో జవాబుదారీతనం పెంపొందించడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టి పెట్టాలి. నిన్నగాక మొన్న తిరుపతిలో ఒక దురదృష్టకర సంఘటన జరిగింది. ప్రమాదాలకు కారణాలు ఏమైనప్పటికీ అధికార యంత్రాంగంలో భయం, భక్తి లేకపోవడమే ప్రధాన కారణం. వివిధ కారణాల వల్ల తెలుగునాట భక్తి రసం పొంగి పొరలుతోంది. భక్తిని మార్కెట్ చేస్తున్నారు. దీంతో ప్రతి చిన్న ప్రత్యేక సందర్భాలలో భక్తులు దేవాలయాలకు పోటెత్తుతున్నారు. ఒకప్పుడు హనుమాన్ జయంతిని పెద్దగా పట్టించుకునేవారు కారు. ఇప్పుడు ఆ రోజున కూడా రామాలయాలు కిటకిటలాడుతున్నాయి. ఇప్పుడు అమరావతిలో కూడా భారీ నిర్మాణాలు చేపట్టబోతున్నారు. అక్కడ ఎలాంటి దురదృష్టకర సంఘటనలు, ప్రమాదాలు జరగకుండా ప్రభుత్వం జాగ్రత్తలు తీసుకోవాలి. చేతులు కాలాక ఆకులు పట్టుకుంటే ఫలితం ఉండదు.

అలాగే... అమరావతితో పాటు రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలలో కూడా అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టాలి. లేని పక్షంలో ప్రాంతీయ విద్వేషాలు సృష్టించడానికి కొంత మంది సిద్ధంగా ఉన్నారు. అభివృద్ధి పనులు ఊపందుకుంటే ప్రభుత్వ ఆదాయం ఇబ్బడి ముబ్బడిగా పెరుగుతుంది. అమరావతిలో చేపట్టిన పనుల వల్ల జీఎస్టీ రూపంలో ప్రభుత్వానికి దాదాపు పదివేల కోట్ల రూపాయలు సమకూరుతాయి. ఈ డబ్బుతో సంక్షేమ ఫలాలను ప్రజలకు అందించవచ్చు. చంద్రబాబు చెప్పే మోడల్ ఇదే. అయితే, చంద్రబాబు రాజకీయంగా దెబ్బ తినకూడదంటే వచ్చే ఎన్నికల లోపు అభివృద్ధి ఫలాలు పేదలకు అందేలా ప్రణాళికలు రూపొందించుకోవాలి. లేనిపక్షంలో జగన్ వంటి వారికి ఆయుధాలు ఇచ్చినట్టే అవుతుంది. తస్మాత్ జాగ్రత్త!

> **గతంలో జరిగిన కుట్రలను దృష్టిలో పెట్టుకొని భవిష్యత్తులో అమలయ్యే అన్ని రకాల కుట్రలను పసిగడుతూ చంద్రబాబు ప్రభుత్వం జాగరూకతతో వ్యవహరించాలి. జగన్‌కు మద్దతుగా నిలుస్తున్న పిల్ల సైకోలు ప్రతి చిన్న విషయాన్ని రాద్ధాంతం చేయడానికి కాచుకొని ఉన్నాయి. అడుగుకొకరు చొప్పున మారీచులు, సుబాహులు ఉన్నారు. అందుచేత అమరావతి నిర్మాణానికి ఆటంకాలు తొలగిపోయాయని భావించడానికి లేదు. ఈ నేపథ్యంలో రేపటి తరంకోసం ఆలోచించే వారందరూ ప్రభుత్వానికి అండగా నిలబడి రాజధాని అనే మహా యజ్ఞం నిర్విఘ్నంగా పూర్తయ్యేలా చేయి చేయి కలిపి నడవాలి. అదే సమయంలో ప్రభుత్వం తన దృష్టినంతా అమరావతి నిర్మాణంపైనే పెట్టిందన్న అభిప్రాయం ఇతర ప్రాంతాల ప్రజల్లో వ్యాపించకుండా పాలకులు జాగ్రత్తలు తీసుకోవాలి. అభివృద్ధి ఫలాలు అందేలోపు.. ప్రజల్లో అసంతృప్తి బీజాలు ఏర్పడకుండా చూడాలి. ప్రభుత్వ పనితీరు పట్ల ప్రజల్లో ఫీల్ గుడ్ భావన కల్పించడం అవసరం.**

బజారోడు సెప్పిందే యేదం!

బజారులోని సరుకుల్లాగ మనుషులూ కల్తీ అయిపోనారు. కల్తీ యేదో నికార్సేదో పోల్చి పట్టలేము. కల్తీయే నికార్సుగా చలామణీ అయిపోతంది! బజారుని ఆక్రమించినోడు మనుషుల్నీ ఆక్రమించినాడు. కనబడనీ చెయ్యేదో ఆడిస్తన్న ఆట బొమ్మలమని అపుడెపుడో సినీకవి దేవుడిసేతిలో బొమ్మలన్న అర్థంల రాసినాడు గానీ ఆదిగా దేముడ్నీ బొమ్మని చేసి ఆడించుతండు కనబడకండా! పొద్దు దూరిన నుంచి పొద్దుపోయీదాకా ఆడు మనుషులెనకాల నిలబడి నడిపిత్తాడు. ఆడు చెప్పినట్టు నడడాన్ని వ్యసనం సేసినాడు. పక్కకి వొసలడానికి వొల్లకాదు. వొలలోని సేపల్లాగ ఆడి ఇలాకాల తిరగాల. పళ్లదోముకొని పాచి కడుక్కోడం నుండి రేతిరి కునుకుదీసీదాకా నువ్వేటి సెయ్యాలో, యే గుడ్డ కట్టాలో, యే నీళ్ల వోసుకోవాలో, యే నీళ్ల తాగాలో, యేటి తినాలో ఆఖరికి యేటి యేరగాలో ఆడే డైరెక్షన్ సేత్తాడు. మనుసులిపుడు బజారోడి చేతిల కీలు బొమ్మలు. బజారుని ఆక్రమించినోడు బజారోడి సరుకులునే కాదు ఆడి గుణాల్నీ మనుసులికి అంటగట్టినాడు. మాయామర్మం, బాబక్రం, ఉబ్బర సొత్తుకి ఉరకడం, అవుసిరిం లేకపోయినా అబద్ధమే ఆడడం, పొరుగుకి పనికొస్తాదంతే పొయ్యి ఆర్పీడం, ఊస్టమయినా ఎవుడికీ ఎరువివ్వకపోడం, నాకేటి అన్న ఆలోసిన తప్పా మనకేటి అని పొరపాట్న కూడా అనుకోకపోడం... బజారోడి గుణాలు. మనుసులిపుడు బజారోళ్లు! బృందాలుగుంతారు, సంగాలు గడతారు. మోర్నింగ్ వాకులూ, ఈవెనింగు ఈవెంట్లూ కలిసేసేస్తారు, గానీ ఎవుడికి ఆడు యమునాతీరే!

ప్రపంచమంతా ఒక బజారయినపుడు ఆరంభమయినాదీ బజారుగుణం. అంతకమునుపు మనుషులు కష్టాన్ని నమ్ముకునీవోళ్లు. కష్టాన్ని అమ్ముకునీవోళ్లు. నమ్ముకున్నదానికీ, అమ్ముకున్నదానికీ అన్నేయిం జరిగితే కన్నెర్రజేసీ వోళు. కర్రా, కత్తీ పట్టుకుని తిరగబడీవోళు. కష్టసుఖాలందరూ పంచుకునీవోళు. ఇరుగూ పొరుగూ; ఊరూ వాడా దండుగట్టీవోళు. ధర్మాధర్మాల్ని తేల్చీసీవోళు. తప్పుడు కూతల్నీ, సేతల్నీ, నడతల్నీ సెరిగీసీవోళు.. బజారు మనిసిని దూసించీవోళు. మనుసులు బజారోడు నడిపినట్ట నడిసీవోళు కాదు. కనబడని సెయ్యి కాదు మహాత్ములెలిగించిన బతుకు దివ్వలేవో దోవ సూపీవి. దోవ సూపే దివ్వల్ల యిపుడు చమురింకిపోనాది. పమిదలు పగిలిపోనాయి. అక్కడక్కడా దివిటీలేవో మండతన్నాయిగానీ సీకటి కమ్మిన లోకాన ఆ ఎల్తురు సాలటంలేదు. కొన్ని దివిటీలు ఆరిపోనాయి. ఆరిపోయిన దివిటీలొట్టుకొని కొందరు నడస్తన్నారు. సీకటి, సీకటి, సీకటి బజారయిపోనాది నోకం!

సీకటి కాదిది ఎల్తురంతాడు బజారోడు. ఆడి సేతిల నువ్వే కాదు నీ ఓటుతోటి గద్దెనెక్కిన పెద్దమనిసీ కీలుబొమ్మే. నీలాగే బజారోడు సెప్పినట్టగ గద్దెనెక్కినోడూ నడుసుకుంతాడు. పొద్దూరిన కాంచి పొద్దుపోయీ దాకా ఆడేటి సెయ్యాలో బజారోడు సెపతాడు. ఏ దేశిం యెళ్లాల? ఏ కంపెనీని దేశంలోకి రమ్మనాల? ఏ అడివిలు నరకాల? ఏ కొండలు దొలచాల? ఏ సముద్రాలు తోడీయాల? యే ఊరిల యే దివ్వెలెలగాల? ఏ నగరంల యే దివ్వలారిపోవాల... అన్నీ బజారోడు సెపతాడు. గద్దెనెక్కినోడు సేసిపెడతాడు.



> **మనుసులిపుడు బజారోడు అమ్మిందే కొంటన్నారు. ఆడు తినమన్నదే తింటన్నారు. ఆడు సదవమన్నదే సదువుతన్నారు. ఆడు యిచ్చినంత పుచ్చుకొని చెప్పిన నౌకరీనే సేస్తన్నారు. గద్దె మీదున్నోడే గజీతగాడంతన్నారు. గజీతగాడు పురాణాల్ని తిరగ రాస్తే కంఠోపాఠం పెడతన్నారు. చట్టాల్ని రద్దు చేస్తే చప్పట్లు కొడతన్నారు. ఆడు మొక్కమన్న దేముడికే మొక్కతన్నారు.**

రాజ్జెంగాన్ని బజారోడి ఇనప్పీరవాల తనకా యెట్టీసుకుంతాడు.

ఆడి కోసం ఊళ్లని ఖాళీ సెయ్యించుతాడు. భూముల్ని సెజ్జులు సేస్తాడు. రోడ్లని యెడల్పు సెయ్యించుతాడు. ఇమానాశ్రయాలు కడతాడు. గుడిసెల్ని ఖాళీ జేయించి సుందర నగరాల్ని సేస్తాడు. బజారోడు ఆడించినట్టల్లా ఆడతాడు. అలగేటలగ ఆడతన్నావు... బజారోడి పరిపాలన సేస్తన్నావేటని నువ్వడిగితే నిన్ను నక్సలయిటువంతాడు. నక్సలయిటులు అడివిలగదా వుంతారు, నీను అడివిల లేను, నగరాల వున్నానంతే – అపుడాడు నిన్ను అర్బన్ నక్సలయిటువంతాడు. ఆడిని సంపడానికి నువ్వూ, ఆ అడివిల వున్నోళ్లూ కలిసి కుట్ర సేసారని కుట్ర కేసెట్టి నిన్ను ఖైదులెడతాడు! దేశభక్తిని బజారోడి కాడ నేర్చుకోమంతాడు.

మనుసులిపుడు బజారోడు అమ్మిందే కొంటన్నారు. ఆడు తినమన్నదే తింటన్నారు. ఆడు సదవమన్నదే సదువుతన్నారు. ఆడు యిచ్చినంత పుచ్చుకొని చెప్పిన నౌకరీనే సేస్తన్నారు. గద్దె మీదున్నోడే గజీతగాడంతన్నారు. గజీతగాడు పురాణాల్ని తిరగ రాస్తే కంఠోపాఠం పెడతన్నారు. చట్టాల్ని రద్దు చేస్తే చప్పట్లు కొడతన్నారు. ఆడు మొక్కమన్న దేముడికే మొక్కతన్నారు.

ఆడు అలాగలాగ మనుసుల్ని మార్సీసి యిపుడు ఆడి బజారు భాషనే మాటాడమంతండు. నగరంల ఒకడే రగుడీసోడుండాల– ఆడు పోలీసోడవ్వాల అని రావిశాస్త్రి బావు రాసినాడు గానీ ఆడు పొలిటీసియనయినాడిపుడు. ఆడిని నిలిపినోడూ, గెలిపించినోడూ బజారోడు!

▪ అట్టాడ అప్పల్నాయుడు

సండే సెలబ్రిటీ







37 మంది హీరోలతో సినిమాలు తీసి అత్యధిక హిట్స్ ఇచ్చిన ఏకైక దర్శకుడు ఆయన ఒక్కరే. అలాగే 77 మంది హీరోయిన్లతో చిత్రాలు తీసిన ఘనత ఇండియాలో రాఘవేంద్రరావుకు మాత్రమే సొంతం.

ఇప్పుడు తీరికే లేదు



'పెళ్లిసందడి' చిత్రం మళ్లీ తీసిన తర్వాత ఏం చేయాలా అని నాకు తోచలేదు. ఇన్ని సంవత్సరాలు వర్క్ చేసిన తర్వాత న్యాయంగా అయితే రిటైర్ అవ్వాలి, కానీ నాకు పని లేకపోతే తోచదు. అప్పుడు బాగా ఆలోచించి యూ ట్యూబ్ ఛానల్ స్టార్ట్ చేశా. షార్ట్ ఫిల్మ్స్ తీసి అప్‌లోడ్ చేస్తున్నా. పిల్లలకు సంబంధించి రెండేసి నిముషాల షార్ట్ ఫిల్మ్స్ ఏ.ఐ.లో తీస్తున్నాం. దానికోసం తీరిక లేకుండా వర్క్ చేస్తున్నా. కీ బోర్డ్ నేర్చుకుంటున్నా. అలాగే 'కెఆర్ఆర్ క్లాస్‌రూమ్' పేరుతో సినిమాల గురించి ప్రాక్టికల్ నాలెడ్జ్‌ని ఔత్సాహికులకు ఉచితంగా చెబుతున్నా.

నేను రుణపడేది ఆయనకే!

తెలుగు సినిమాకు మాస్ హంగులు అద్ది, బాక్సాఫీసును షేక్ చేసిన దర్శకుడు... తెలుగు పాటను రంగులతో అభిషేకించి, సంగీతంతో సంబరాలు చేయించిన సంగీతాభిమాని. హిట్స్, రికార్డ్ బ్రేక్ కలెక్షన్లు, సిల్వర్ జూబ్లీలు, పొగడ్తలు... ఇలా అన్నీ కట్టకట్టుకువచ్చి మీదపడినా.. అన్నిటినీ చిరునవ్వుతో స్వీకరించడం తప్ప, స్టేజ్ మీద కానీ, మరెక్కడైనా కాని అహంకారంతో ఎప్పుడూ ఆయన మాట్లాడలేదు... 'గ్లామర్, గుట్టల గుట్టల పండ్లు, నాయికల నాభి తప్ప... అంతకంటే ఏం తియ్యగలడు' అనే వాళ్లకు 'అన్నమయ్య' అనే అద్భుతాన్ని అందించి తన ప్రతిభను పండించుకున్న ఆ దర్శకుడు... **కె. రాఘవేంద్రరావు**. యాభై ఏళ్ల కెరీర్‌ను విజయవంతంగా పూర్తి చేసుకున్న ఆ దర్శకేంద్రుడు తన సినీ పయనంలో ఎదురైన ఆసక్తికరమైన సంఘటనలను, విశేషాలను 'నవ్య'కు వివరించారిలా...



మీరందరూ యాభై ఏళ్లు అయిందని చెబుతుంటే ఆనందంగా ఉంది. నిజం చెప్పాలంటే 'పరిశ్రమలోకి వచ్చి ఇన్నేళ్లు అయింది, ఇన్ని సినిమాలు చేశాను' అని నేను ఎప్పుడూ లెక్క పెట్టుకోలేదు. నా పని నేను చేశాను. 'వెయ్యి కోట్ల రూపాయలు కావాలా, డైరెక్షన్ ఛాన్స్ కావాలా?' అని ఎవరైనా ఆఫర్ ఇస్తే... ఇప్పటికీ దర్శకత్వాన్నే కోరుకుంటా. డైరెక్షన్ అంటే నాకు అంత పిచ్చి. ఇన్నేళ్ల నా కెరీర్‌లో ఒకే ఒక వ్యక్తికి రుణపడి ఉంటాను. ఆయనే ఎన్టీఆర్. 'పాండవ వనవాసం' చిత్రంతో పరిశ్రమలోకి ప్రవేశించి, రామారావుగారి మీద తొలి క్లాప్ ఇచ్చాను. అలాగే ఆయన నటించిన 'అడవిరాముడు' సినిమా నుంచే అగ్ర దర్శకుడిగా ఎదిగాను. ఆ రోజు రామారావుగారి మీద క్లాప్ ఇచ్చిన తర్వాత ప్రేక్షకులు ఇన్నేళ్లుగా నా సినిమాలు చూస్తూ ఇన్ని క్లాప్స్ కొడతారని ఊహించలేదు. సినిమా పాటకు ప్రేక్షకులు పట్టాభిషేకం చేసిన సినిమా 'అడవిరాముడు'. రామారావుగారు నడిచి వస్తుంటే ఆ రోజుల్లో జనం పూలు జల్లేవారు, హారతులు ఇచ్చేవారు. 'ఆయన నడిచి వస్తేనే ఇలా చేస్తున్నారు, ఏనుగు ఎక్కిస్తే ఇంకెంత ఆనందిస్తారో?' అని అడవిరాముడు తీశాను. ఆ సినిమాలోని 'ఆరేసుకోబోయి పారేసుకున్నాను' పాట చూసి జనం డబ్బులు విసరడం మొదలుపెట్టారు. అప్పటినుంచి మా కాంబినేషన్‌కు క్రేజ్ మొదలైంది. అలాగే నిర్మాతలు లేకపోతే నేను లేను. ఈ యాభై ఏళ్ల జర్నీ ఇంత విజయవంతంగా సాగడానికి నా నిర్మాతలే కారణం. నాతో పని చేసిన నటీనటులు, సాంకేతిక నిపుణులకు, పంపిణీదారులకు, థియేటర్ యజమానులకు, నన్ను ఆదరించిన ప్రేక్షకులకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు.

• హీరో కావాలని అనుకోలేదు

నాకు సినిమాలు అంటే చాలా చాలా ఇష్టం. పుస్తకాలు కొనుక్కోమని ఇంట్లో డబ్బులు ఇస్తే అవి కొనకుండా సినిమాలకు వెళ్లి, స్నేహితుల పుస్తకాలు చదివిన రోజులు ఉన్నాయి. దాదాపు ప్రతి రోజూ సినిమా చూసిన సందర్భాలు ఉన్నాయి. నాకు మొదటి నుంచీ నటన మీద ఆసక్తి లేదు. దర్శకుడినవ్వాలనేదే నా కోరిక. నటుడినో, హీరోనో కావాలని ఎప్పుడూ అనుకోలేదు.

• లక్ష రూపాయలతో తొలి సినిమా అనుకున్నా

ఎన్టీఆర్, కృష్ణ తొలిసారిగా కలసి నటించిన 'స్త్రీ జన్మ' చిత్రానికి నాన్నగారు దర్శకుడు. నేను అసిస్టెంట్ డైరెక్టర్‌ని. సెట్‌లో నా ఇన్‌వాల్వ్‌మెంట్, పనితీరు గమనించిన ఆ చిత్ర నిర్మాత రామానాయుడు గారు "రాఘవేంద్రరావ్.. నీ ఫస్ట్ పిక్చర్ నాకే చెయ్యాలి" అనేవారు. "ఇప్పుడు కాదు.. తర్వాత చూద్దాంలే" అన్నారు నాన్నగారు. ఆ తర్వాత నా ఫ్రెండ్స్ ఏవీఎం సీజర్, అడుసుమిల్లి కుమార్, గోపాలకృష్ణ కలసి నా దర్శకత్వంలో సినిమా తీద్దామని వచ్చారు. "ఎవరూ చేయని విధంగా సినిమా తీద్దాం. పల్లెటూరికి వెళ్దాం. లక్ష రూపాయల బడ్జెట్‌లో తీద్దాం" అన్నాను. "లేదు లేదు భారీ బడ్జెట్‌లో తీద్దాం" అన్నారు వాళ్లు. 'బాబు' సినిమాకు మా నాన్న కథ ఇచ్చారు. శోభన్‌బాబు హీరో. ముగ్గురు హీరోయిన్లు. చాలా భారీగా తీశాం. నాకు తొలి అవకాశం ఇచ్చిన ఆ ముగ్గురు మిత్రులకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు. సినిమాకు మంచి ఓపెనింగ్స్ వచ్చాయి. అయితే మా సినిమా విడుదలైన కొన్ని రోజులకు విశ్వనాథ్‌గారి 'జీవనజ్యోతి' రిలీజ్ అయింది. ఆ చిత్రం చూడగానే నా సినిమా భవిష్యత్ అర్థమై పోయింది. ఊహించినట్లుగానే 'జీవనజ్యోతి' వచ్చాక మా సినిమా వసూళ్లు తగ్గాయి.

28 రోజుల్లో 'జ్యోతి'



ఒక పెద్ద సినిమా తీసిన వెంటనే ఓ చిన్న చిత్రం తీయడం చాలా మంచిది. ఆ పద్ధతిని చాలా రోజులు కొనసాగించా. ప్రేక్షకులు అంచనాలు పెంచుకునే అవకాశం ఇవ్వకూడదు. ఎందుకంటే 'ఏం తీస్తాడు, ఎలా తీస్తాడు...' అని వారంతా ఆసక్తిగా ఎదురు చూస్తుంటారు. అందుకే రెండో సినిమా 'జ్యోతి'ని ప్రయోగాత్మకంగా 28 రోజుల్లో తీశాను. మురళీమోహన్, జయసుధ జంటగా నటించారు. ఆ సినిమా మంచి విజయం సాధించింది. మురళీమోహన్‌తో చేసిన 'కల్పన' చిత్రం విడుదల అయిన వారం రోజులకు 'అడవిరాముడు' వచ్చింది. ఈ రెండు సినిమాలూ హిట్ అయ్యాయి. అలాగే 'సింహబలుడు' చిత్రం భారీ బడ్జెట్‌తో తయారైతే, ఆ సమయంలోనే 'పదహారేళ్ల వయసు' చిత్రం లోబడ్జెట్‌తో వచ్చింది.

• మూడు తరాల హీరోలతో...

నేను నిర్మాతల దర్శకుణ్ణి. ఎక్కువ రోజులు షూటింగ్ చేసి నిర్మాతను ఇబ్బంది పెట్టలేదు. అందుకే ఒక్కో నిర్మాతకు చాలా సినిమాలు చేసే అవకాశం కలిగింది. నా అదృష్టం ఏమిటంటే.. నా దర్శకత్వంలో నటించడానికి ఏ హీరోకానీ, నటుడు కానీ 'నో' అనలేదు. మూడు తరాల హీరోలతో పని చేశాను. అందరికీ గుర్తుండిపోయే హిట్స్ ఇచ్చే అవకాశం దక్కడం నా అదృష్టం.

• ఆ టెన్షన్ ఉండేది

రామారావుగారు ఒక సినిమా కోసం దాదాపు 40 రోజుల పాటు ఔట్‌డోర్‌లో ఉండడం అన్నది 'అడవిరాముడు'తోనే మొదలు. అంతవరకూ ఆయనకు ఔట్‌డోర్ అంటే మద్రాసు గిండీ ఫారెస్టే. అటువంటి వ్యక్తి ఈ చిత్రకథ నచ్చి అన్ని రోజులు ఔట్‌డోర్‌లో ఉండిపోయారు. మధ్యలో ఒకటి రెండు సార్లు 'దానవీరశూర కర్ణ' చిత్రం రీరికార్డింగ్ కోసం మద్రాసు వెళ్లి వచ్చారేమో! 'ఈ సినిమా ఆడకపోతే నా కెరీర్ ఏమవుతుందా?' అనే టెన్షన్ 'అడవిరాముడు' చేస్తున్నప్పుడు నాకు ఉండేది. చిన్న సినిమాలు చేసుకోవచ్చు కానీ రామారావుగారు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పట్టుదలతో పని చేశాను. రామారావుగారు షూటింగ్ ముగించుకుని వెళ్లిపోతూ "నా కెరీర్‌లో ఇది మధుర జ్ఞాపకం' అని మెచ్చుకోవడం మరిచిపోలేని సంఘటన. ఫెయిల్యూర్స్ వచ్చినప్పుడు కూడా నా హీరోలు ఎన్టీఆర్, కృష్ణ, శోభన్‌బాబు, చిరంజీవి, బాలకృష్ణ, వెంకటేశ్... ఎవరూ నిరుత్సాహపరిచేలా మాట్లాడలేదు. నాకు ఎంతో సపోర్ట్ ఇచ్చారు. అది వారి గొప్పతనం. ముఖ్యంగా రామారావుగారు. ఆయనకు 'సింహబలుడు', 'తిరుగులేని మనిషి' అని రెండు ఫ్లాప్స్ ఇచ్చాను. ఆయన వద్దు అనుకుంటే నాకు మరో అవకాశం వచ్చేది కాదు.. కానీ ఆయన గొప్పతనం ఏమిటంటే.. "ఇట్సాల్ రైట్ బ్రదర్.. ఏం తీయకూడదో నేర్చుకున్నాం. ఈ సారి మంచి కథతో ప్లాన్ చేయండి..' అన్నారు., ఆయన ఆఖరి చిత్రం 'మేజర్ చంద్రకాంత్' చేసే అవకాశం నాకు దక్కడం నా అదృష్టం. అందుకే ఏ ఫంక్షన్‌కు వెళ్లినా "రామారావుగారి వల్లే నేను ఈ స్థాయిలో ఉన్నాను" అని చెబుతుంటాను.

ముగ్గురు హీరోలతో 'త్రివేణి సంగమం'



నా నూరవ సినిమాను మొదట చాలా విభిన్నంగా ప్లాన్ చేశాను. చిరంజీవి, నాగార్జున, వెంకటేశ్‌లతో ఆ సినిమా చేయాలని అనుకొని వారిని అడిగాను. ముగ్గురూ ఒప్పుకొన్నారు. 'త్రివేణి సంగమం' అని టైటిల్ అనుకున్నా. ఈ సినిమాను అరవింద్, అశ్వనీదత్‌లతో కలసి తీయాలిన ప్లాన్ చేశా. అయితే పాటల విషయంలో అభిమానుల మధ్య అభిప్రాయ బేధాలు వస్తాయేమో అనే అనుమానం వచ్చి ఆ ప్రాజెక్ట్ ఆపేశాం. అప్పుడు ఓ కొత్త హీరోతో చిన్న సినిమా తీద్దామని అల్లు అర్జున్‌ను పరిచయం చేస్తూ 'గంగోత్రి' తీశాం.

• సోషల్ మీడియాను కంట్రోల్ చెయ్యాలి

సోషల్ మీడియాను కంట్రోల్ చేసే పరిస్థితి రావాలి. ముఖ్యంగా కొన్ని యూ ట్యూబ్ ఛానల్స్ పెట్టే హెడ్డింగ్స్ ఇబ్బందికరంగా ఉంటున్నాయి. వాటిని అదుపు చేయాలి. ఈ విషయంలో నేను కూడా ఓసారి ఇబ్బంది ఎదుర్కొన్నా. అయితే వాటిని నేను పట్టించుకోను కనుక రియాక్ట్ కాలేదు. కానీ రాను రాను విచ్చలవిడితనం పెరిగిపోతోంది.

• పాటలో మొత్తం రామాయణం

నా కెరీర్‌లో అన్ని రకాల చిత్రాలూ చేశాను. 'అన్నమయ్య', 'శ్రీరామదాసు', 'పాండురంగడు', 'మంజునాథ' 'శిరిడి', 'నమో వేంకటేశ' లాంటి సినిమాలు చేశాను. ఇప్పుడు ఓ పాటలో మొత్తం రామాయణాన్ని చూపించాలని నా కోరిక . దానికి సంబంధించిన టెస్ట్ షూట్ కూడా చేశా. అలాగే 'వల్లీ కల్యాణం' కూడా సినిమాగా తీయాలనే ఆలోచన ఉంది.

మరచిపోలేని మూడు సంఘటనలు



యాభై ఏళ్ల కెరీర్‌లో మరచిపోలేని మధుర సంఘటనలు మూడు ఉన్నాయి. 'అడవిరాముడు' చిత్రంతోనే పాటలు వచ్చినప్పుడు తెరపైకి డబ్బులు విసరడం అనే ట్రెండ్ మొదలైంది. అలాగే 'జగదేకవీరుడు-అతిలోకసుందరి' చిత్రం పెద్ద తుపాన్ వచ్చిన సమయంలో విడుదల అయింది. చాలా థియేటర్లలో షోలు పడని పరిస్థితి. కానీ ఒక థియేటర్‌లో మాత్రం వర్షపు నీటిని మోటార్లు పెట్టి బయటకు తోడేస్తుంటే, జనం కుర్చీలో కాళ్లు పెట్టుకుని ఆ సినిమా చూశారు. 'అన్నమయ్య' చిత్రంలో 'మోకాళ్ల పర్వతాన్ని చెప్పులు వేసుకుని ఎక్కకూడదు' అని భానుప్రియ నాగార్జునకు చెప్పే సీన్ వచ్చినప్పుడు థియేటర్‌లో ప్రేక్షకులు కూడా చెప్పులు విడిచిపెట్టి సినిమా చూశారు.

• వినాయకరావు

ఈ వారమే విడుదల

ఈ ఆదివారం నుంచి వచ్చే శనివారంలోగా ఓటీటీలో విడుదలవుతున్న సినిమాలు, వెబ్‌సిరీస్‌లు...

ఓటీటీ వేదిక	సినిమా/సిరీస్	విడుదల తేదీ
నెట్‌ఫ్లిక్స్	THE DIPLOMAT	
ది డిప్లొమాట్	హిందీ చిత్రం	మే 09
గుడ్ బ్యాడ్ అగ్లీ	తమిళ చిత్రం	మే 08
ది రాయల్స్	హిందీ సిరీస్	మే 09
అమెజాన్ ప్రైమ్	Royals	
గ్రామ్ చికిత్సాలయ్	హిందీ చిత్రం	మే 09
జియో హాట్‌స్టార్		
స్టార్‌వార్స్	యానిమేషన్ సిరీస్	మే 04

వినోదాత్మక చికిత్స



ఓ మారుమూల పల్లెలో ప్రభుత్వ ఆస్పత్రి నేపథ్యంలో తెరకెక్కిన హిందీ సిరీస్ 'గ్రామ్ చికిత్సాలయ్'. అక్కడి వసతుల లేమి, వైద్యుల నిర్లక్ష్యంతో అమాయక గ్రామీణులు ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయిస్తూ వారి చేతుల్లో దోపిడీకి గురవుతుంటారు. ఈ పరిస్థితుల్లో బదిలీపై ఆ గ్రామానికి వచ్చిన ప్రతిభావంతుడైన యువ వైద్యుడు ప్రభాత్ ఆ పరిస్థితులను మార్చాలని కంకణం కట్టుకుంటాడు. ఆ నేపథ్యంలో అతనికి ఎదురైన సవాళ్లు ఏమిటి, ప్రజలు అతనికి సహకరించారా అనేది వినోదాత్మకంగా ఈ సిరీస్‌లో ఆవిష్కరించారు. అమోల్ పరాశర్ వినయ్ పాఠక్, ఆకాంక్ష రంజన్ కీలకపాత్రలు పోషించారు. రాహుల్ పాండే దర్శకుడు.

బియ్యం నీళ్లు చేసే అద్భుతం..!

ప్రస్తుతం ప్రతి ఒక్కరూ... శిరోజాలు రాలడం, అవి నిర్జీవంగా మారడం, వాటి చివర్లు చిట్లడం, చుండ్రు లాంటి సమస్యలు ఎదుర్కొంటున్నారు. వీటిని నివారించేందుకు బియ్యం నీళ్లు అద్భుతంగా పనిచేస్తాయని నిపుణులు చెబుతున్నారు.

ఇలా తయారు చేసుకోవాలి...

- ఒక గిన్నెలో ఒక కప్పు బియ్యాన్ని తీసుకుని శుభ్రంగా కడగాలి. వెంటనే రెండు కప్పుల నీళ్ల పోసి అరగంటసేపు నానబెట్టాలి. తరవాత ఈ నీటిని మరో గిన్నెలోకి వడకట్టాలి.
- బియ్యాన్ని నీటిలో రెండు రోజులు నానబెడితే ఆ నీటిని 'ఫెర్మెంటెడ్ వాటర్' అంటారు. ఈ నీళ్ల మాడుకు, శిరోజాలకు అదనపు ప్రయోజనాలను అందిస్తాయి. ఫెర్మెంటెడ్ వాటర్‌ను ఫ్రిజ్‌లో వారంపాటు నిల్వ చేసుకోవచ్చు.



- బియ్యం నీటిలో లావెండర్ లేదా రోజ్‌మేరీ ఆయిల్ చుక్కలు వేసుకుంటే ఫలితం బాగుంటుంది.
- బియ్యం నీళ్లలో బి, ఇ విటమిన్లతోపాటు మెగ్నీషియం, పొటాషియం లాంటి మినరల్స్, యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి.

ఇలా వాడాలి...

- ముందుగా శిరోజాలను కుంకుళ్లు లేదా గాఢత తక్కువగా ఉన్న షాంపూతో శుభ్రం చేసుకోవాలి. తలను కొద్దిగా ఆరనివ్వాలి. తరవాత బియ్యం నీటిని చేత్తో తీసుకుంటూ కురులకు, మాడుకు పట్టించాలి. బియ్యం నీటిని ఒక స్ప్రే బాటిల్‌లో పోసి తలంతా చిలకరించుకోవచ్చు. అయిదు నిమిషాల తరవాత తలను వేళ్లతో సున్నితంగా మర్దన చేయాలి. పావుగంటసేపు ఆరనిచ్చి మంచినీళ్లతో తలను శుభ్రం చేసుకోవాలి. ఇలా వారానికి రెండుసార్లు చేస్తూ ఉంటే శిరోజాలు ఒత్తుగా పెరుగుతాయి.

విమానం ఎక్కేముందు...

విమానం ఎక్కేముందు కొన్ని రకాల ఆహార పదార్థాలు తినకపోవడమే మంచిదనీ లేదంటే ప్రయాణంలో అనారోగ్య సమస్యలు తప్పవనీ నిపుణులు చెబుతున్నారు.

- సాధారణంగా అల్పాహారం కింద బ్రోకలీ, క్యాబేజీ తురుము, వెనిగర్ వేసి తయారు చేసిన సలాడ్స్ తీసుకుంటూ ఉంటారు. వీటివల్ల గ్యాస్ చేరి కడుపు ఉబ్బరిస్తుంది. ఉదయం వేళ విమాన ప్రయాణం చేయాల్సి ఉంటే వీటిని తినకపోవడమే మంచిది.
- విమానం ఎక్కడానికి ఒక రోజు ముందు నుంచి బీన్స్, పప్పు దినుసులు తినకూడదు. ఇవి జీర్ణం కావడానికి ఎక్కువ సమయం పడుతుంది. కాబట్టి విమానం ఎక్కగానే కడుపులో సమస్యలు ఏర్పడవచ్చు.
- నూనె పదార్థాలు, వేపుళ్లు, చిప్స్ వీధుల్లో అమ్మే పదార్థాలు తినకూడదు. వీటివల్ల కడుపులో వికారం, వాంతులు, తలనొప్పి లాంటి ఆరోగ్య సమస్యలు రావచ్చు.
- విమానం ఎక్కడానికి గంట ముందు నుంచి కార్బొనేటెడ్ డ్రింక్స్, ఆల్కహాల్ తీసుకోకూడదు. వీటివల్ల కడుపులో తిప్పడం, తల తిరగడం, తేన్పులు, కడుపు ఉబ్బరించడం లాంటివి ఏర్పడవచ్చు. సరిగా నిద్ర పట్టక అలసటగా అనిపిస్తుంది.
- కొంతమందికి చూయింగ్ గమ్ నమలడం, క్యాండీస్ తినడం అలవాటుగా ఉంటుంది. వీటివల్ల కూడా సమస్యలు ఏర్పడవచ్చు.
- విమానం ఎక్కేముందు కారంగా ఉన్నవి, మసాలాలు చేర్చిన ఆహార పదార్థాలు తినకూడదు. వీటి వల్ల గుండెలో మంటగా అనిపిస్తుంది.



నూట తొంభై ఐదు దేశాలు... పది లక్షలమంది మహిళలు... వారి జీవన స్థితిగతులు... 'మిలియన్ అమేజింగ్ ఉమెన్' పేరుతో మహత్తర ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టారు... విశాఖకు చెందిన భరద్వాజ్ దయాల. వివిధ దేశాల్లో విభిన్న రంగాల్లో రాణిస్తున్న మహిళల జీవితాలను ప్రతిబింబిస్తూ ఒక డాక్యుమెంటరీ రూపొందిస్తున్నారు. ఏడాదిన్నరలో బైక్‌పై ఐదు ఖండాలు, 16 దేశాలు చుట్టివచ్చిన ఆయన... 'నవ్య'తో ఆ విశేషాలు పంచుకున్నారు.

అద్భుతమైన మహిళల కోసం

"సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం. భారీ జీతం. కానీ జీవితమంటే సంపాదన మాత్రమే కాదని కొన్నేళ్ల ఉద్యోగ జీవితం తరువాత అనిపించింది. దానికితోడు కొత్తగా ఏదైనా చేయాలన్న తపన నన్ను కుదురుగా కూర్చోనివ్వలేదు. దాంతో 2006లో బైక్‌పై ప్రపంచ యాత్రకు శ్రీకారం చుట్టాను.

ఐదు ఖండాల్లోని 16 దేశాల మీదుగా 48 వేల కిలో మీటర్లు ప్రయాణించాను. ఏడాదిన్నరపాటు సాగింది ఈ యాత్ర. బైక్‌పై ప్రపంచ యాత్ర పూర్తి చేసిన తొలి భారతీయుడిగా గుర్తింపు పొందాను. ఆ యాత్ర విశాఖలో ప్రారంభమై... ఇరాన్, టర్కీ, సిరియా, జోర్డాన్ మీదుగా ఆఫ్రికా, ఈజిప్ట్, యూరప్‌లోని గ్రీస్ వరకూ సాగింది. ఆ తరువాత ఫ్రాన్స్ మీదుగా యూకే అట్లాంటిక్ సముద్రం దాటి కెనడా, అమెరికా చేరుకున్నా. పసిఫిక్ మహా సముద్రం దాటి న్యూజిలాండ్, ఆస్ట్రేలియా, ఇండోనేషియా, బంగ్లాదేశ్ మీదుగా భారత్‌కు వచ్చాక మళ్లీ ఉద్యోగ జీవితంలో నిమగ్నమయ్యాను. ఈ క్రమంలోనే మా అమ్మ కుసుమ దయాల్ ఐదుగురి సంతానాన్ని పెంచి పోషించేందుకు చేసిన త్యాగం, పడిన కష్టాలు గుర్తుకువచ్చాయి. అమ్మ లాంటి ఎంతోమంది మాతృమూర్తుల గురించి ప్రపంచానికి తెలియజేయాలన్న ఉద్దేశంతో 'మిలియన్ అమేజింగ్ ఉమెన్' డాక్యుమెంటేషన్‌కు శ్రీకారం చుట్టాను.



దేశదేశాల్లోని మహిళల జీవితాలతో...

195 దేశాల్లోని విభిన్న రాష్ట్రాలు, జాతులు, కులాలు, మతాలు, వర్గాలకు చెందిన పది లక్షల మంది మహిళల జీవితాలను ఆవిష్కరించడమే 'మిలియన్ అమేజింగ్ ఉమెన్' డాక్యుమెంటరీ ప్రధాన ఉద్దేశం. ఉన్నత స్థాయి నుంచి కూలి పనులు చేసుకునే మహిళల వరకు అందరి జీవితాలకు సంబంధించిన కీలక ఘట్టాలు అందులో ఉంటాయి. ఇప్పటివరకూ ఇలా ఇన్ని దేశాల మహిళల ఫొటోగ్రఫీలతో కూడిన డాక్యుమెంటు ఎవరూ చేయలేదు. అందుకే నేను ఈ మహత్తర కార్యం చేపట్టాలని అనుకున్నాను.

మహిళా దినోత్సవంనాడు...

'మిలియన్ అమేజింగ్ ఉమెన్స్' డాక్యుమెంటేషన్ పూర్తికావడానికి పది నుంచి పన్నెండేళ్ల సమయం పడుతుందని అంచనా. గత నెల, అంటే మార్చి 8న మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని గుజరాత్‌లోని బరోడా నుంచి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించాను. ఇందులో తొలి పోర్ట్రైట్ ఫొటో బరోడా రాజమాత సుభాంగిని రాజేది. బ్రిటిష్ రాణి కంటే అతిపెద్ద కోటలో ఉండే ఆమెకు సంబంధించిన ఫొటోను తీయడం ద్వారా డాక్యుమెంటేషన్ ప్రారంభమైంది. ఇప్పటివరకూ 400 మందికిపైగా మహిళల ఫొటోలు, వివరాలు సేకరించాను. ప్రస్తుతం అల్లూరి సీతారామరాజు జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాలకు చెందిన మహిళలపై డాక్యుమెంటేషన్ సాగుతోంది. ప్రస్తుతం ఉత్తర భారత్‌లోని పలు రాష్ట్రాల మహిళలను కెమెరాలో బంధించే పనిలో ఉన్నాను. ఇప్పటివరకు సంప్రతించినవారిలో రోజు కూలీలు, గిరిజన మహిళలు, సామాజిక కార్యకర్తలు, కార్మికులు ఉన్నారు. అన్నీ కలిపి 'మిలియన్ అమేజింగ్ ఉమెన్' వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేస్తాను. కొన్ని వీడియోలు కూడా చిత్రీకరిస్తున్నాను. ప్రతి మహిళ వెనుక ఒక విజయ గాథ ఉంటుంది. దాన్ని ఈ ప్రపంచానికి చెప్పడమే నా ఉద్దేశం. పది లక్షలమంది మహిళలకు సంబంధించిన డాక్యుమెంటేషన్ అంటే సాధారణ విషయం కాదు. ఎన్నో వ్యయ ప్రయాసలు పడాలి. అందుకు సిద్ధమయ్యే ఈ అద్భుత ప్రాజెక్ట్‌ను చేపట్టాను."

- బూటు శ్రీనివాసరావు, విశాఖపట్నం

సంపాదించింది అంతా...

ఉద్యోగానికి రాజీనామా చేసి ఈ ప్రాజెక్ట్ ప్రారంభించాను. దీని కోసం ఇప్పటివరకూ నేను సంపాదించింది అంతా ఖర్చు చేస్తున్నాను. దీనిలో భాగంగా నా కారును ప్రత్యేకంగా డిజైన్ చేయించుకున్నాను.



'లోర్వెన్ ఏఐ' స్టూడియోను నెక్ట్స్ లెవెల్‌కు తీసుకెళ్లాలి

దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

"మారుతున్న కాలానికి అనుగుణంగా సరికొత్త సాంకేతికతను సినీ పరిశ్రమకు పరిచయం చేయాలనే దృఢ సంకల్పంతో దిల్‌రాజు 'లోర్వెన్ ఏఐ' స్టూడియోను లాంచ్ చేయడం అభినందనీయం. దీనిని నెక్ట్స్ లెవెల్‌కు తీసుకెళ్లాలని కోరుకుంటున్నాను" అని అన్నారు తెలంగాణ ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు. నిర్మాత దిల్‌రాజు లాంచ్ చేసిన 'లోర్వెన్ ఏఐ' స్టూడియోను ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ 'ఈ టెక్నాలజీని మూవీతో బ్లెండ్ చేయడమనేది వినోద రంగంలో సరికొత్త అడుగు. హాలీవుడ్‌కి దీటుగా హైదరాబాద్ ఎదుగుతోంది. కొత్త సాంకేతిక వల్ల ఉద్యోగావకాశాలు పుష్కలంగా లభ్యమవుతాయి" అని అన్నారు. "సినిమాల్లో ఈ సాంకేతికతని ఉపయోగించడం ద్వారా ముఖ్యంగా మూడు సౌలభ్యాలు ఉన్నాయి. మొదటిది విజయావకాశాల్ని పెంచుకోవచ్చు. రెండోది, ప్రీ ప్రొడక్షన్, పోస్ట్ ప్రొడక్షన్‌లో సమయాన్ని ఆదా చేసుకోవచ్చు. మూడోది, దీని వల్ల దర్శకులకు సమయం, నిర్మాతలకి డబ్బు మిగులుతుంది. త్వరలోనే అందరికీ అందుబాటులోకి వచ్చేలా అభివృద్ధి చేస్తున్నాం" అని నిర్మాత దిల్‌రాజు చెప్పారు. "దిల్‌రాజు ప్రతీ విషయంలో ముందంజలో ఉంటారు. ఇప్పుడు అదే క్రమంలో పరిశ్రమలోకి ఏఐను ప్రవేశపెట్టడంలో ముందడుగు వేశారు" అని నిర్మాత అల్లు అరవింద్ తెలిపారు. "ఈ కంపెనీ పెద్ద సక్సెస్ కావాలని కోరుకుంటున్నాను" అని దర్శకుడు రాఘవేంద్రరావు అన్నారు. "ఈ సాంకేతికత గురించి దిల్‌రాజు ఇచ్చిన ప్రజంటేషన్ చూశాను. అదిరిపోయింది" అని దర్శకుడు సుకుమార్ పేర్కొన్నారు. "ఈ ప్రాజెక్ట్‌లో దిల్‌రాజు ప్యాషన్ కనిపిస్తోంది. ఈ సాంకేతికతను ఉపయోగించడానికి ఆతృతగా ఎదురుచూస్తున్నాను" అని దర్శకుడు నాగ్ అశ్విన్ చెప్పారు. "ఇది సినీ పరిశ్రమకు ఎంతో ఉపయోగపడుతుంది" అని మరో దర్శకుడు అనిల్ రావిపూడి అన్నారు. "ఈ కంపెనీ పెద్ద విజయవంతం కావాలని కోరుకుంటున్నాను" అని దర్శకుడు బాబీ తెలిపారు. ఈ కార్యక్రమంలో నిర్మాతల మండలి అధ్యక్షుడు కే.ఎల్.దామోదర ప్రసాద్, నిర్మాతలు టీజీ విశ్వప్రసాద్, సాహు గారపాటి, దర్శకులు వి.వి. వినాయక్, మోహన్‌కృష్ణ ఇంద్రగంటి, వంశీ పైడిపల్లి తదితరులు పాల్గొన్నారు.

అంచనాలకు మించిన ఆదరణ

శైలేష్ కొలను



"హిట్ 3' చిత్రానికి మా అంచనాలకు మించి ప్రేక్షకాదరణ దక్కుతోంది. మేం ఊహించిన దానికి భిన్నంగా మహిళా ప్రేక్షకులకు అర్జున్‌సర్కార్ పాత్ర అమితంగా నచ్చడం ఆశ్చర్యపరిచింది. బహుశా నాని పాత్ర చిత్రణ విభిన్నంగా ఉండడం అందుకు కారణం కావొచ్చు' అని దర్శకుడు శైలేష్ కొలను అన్నారు. ఆయన దర్శకత్వంలో నాని కథానాయకుడిగా నటించిన 'హిట్ 3' చిత్రం ఇటీవలే విడుదలై ప్రేక్షకాదరణతో కొనసాగుతోంది. ఈ సందర్భంగా శైలేష్ కొలను మీడియాతో మాట్లాడారు. 'అర్జున్ సర్కార్ పాత్ర మీద నానికీ, నాకూ మొదట్నుంచి గట్టి నమ్మకం ఉంది. దానికి తగ్గట్లే ప్రేక్షకుల స్పందన అద్భుతంగా ఉంది. మాస్ ఛాయలున్న పాత్ర కావడంతో పాటు ఆయన వినోదం పండించిన తీరు ప్రేక్షకులను మెప్పిస్తోంది. 'హిట్ 3' లో ఒక నేషనల్ లెవల్ క్రైమ్‌ను చూపించాం. ప్రతి సన్నివేశంలో ప్రేక్షకులు విజిల్ కొట్టాలనే ఉద్దేశంతో కథ రాసుకున్నాను. ఆ లక్ష్యం నెరవేరిందనే అనుకుంటున్నాను. మిక్కీ జే. మేయర్ నేపథ్య సంగీతం, సముద్రఖని, రావు రమేశ్, శ్రీనిధి శెట్టి నటన సినిమా విజయానికి కీలకంగా నిలిచాయి. ఈ సినిమాకు నాని నిర్మాత కావడం నాకు కలిసొచ్చింది. అనుకున్న విధంగా తెరకెక్కించే స్వేచ్ఛనిచ్చారు. నా తదుపరి చిత్రం రొమాంటిక్ కామెడీ జానర్‌లో చేయాలనుకుంటున్నాను' అని శైలేష్ చెప్పారు.

మెప్పించే ప్రేమకథా చిత్రం



'మల్లేశం, 8ఏ.ఎం. మెట్రో' లాంటి విభిన్న చిత్రాలను రూపొందించిన దర్శకుడు రాజ్ ఆర్. ఆయన దర్శకత్వంలో వస్తోన్న తాజా చిత్రం '23'. నిజ జీవితం ఆధారంగా తెరకెక్కిన చిత్రాలతో తన ప్రతిభను నిరూపించుకున్న రాజ్ ఆర్ మంచి కథతో ఈ చిత్రాన్ని రూపొందించారు. వెంకట్ సిద్దారెడ్డి సహ నిర్మాతగా స్టూడియో 99 పతాకంపై నిర్మించారు. తేజ, తన్మయి జంటగా నటించగా, ఝాన్సీ, తాగుబోతు రమేశ్, ప్రణీత్ కీలకపాత్రలు పోషించారు. చిత్రబృందం శనివారం విడుదల తేదీని ప్రకటించింది. ఈ నెల 16న '23' చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నట్లు వెల్లడించింది. ప్రతి ఒక్కరి హృదయాన్ని కదిలించే సున్నితమైన ప్రేమకథా చిత్రం ఇదని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి మార్క్ కే రాబిన్ సంగీతం అందిస్తున్నారు. సినిమాటోగ్రఫీ: సన్నీ కూరపాటి.

అంతకు మించిన ఆనందం మరొకటి లేదు

ఇవానా

"లవ్‌టుడే' సినిమాలో నా పాత్ర పేరు బుజ్జి కన్నా. ప్రేక్షకులకు ఆ పాత్ర బాగా నచ్చింది. తెలుగు ప్రేక్షకులు ఇప్పటికీ నన్ను 'బుజ్జి కన్నా' అంటూ పిలుస్తున్నారు. ఒక నటికి తన పాత్ర పేరుతో గుర్తింపు దక్కడం కంటే ఆనందం మరొకటి ఉండదు' అని హీరోయిన్ ఇవానా అన్నారు. శ్రీవిష్ణు కథానాయకుడిగా కార్తీక్‌రాజు దర్శకత్వంలో తెరకెక్కిన 'సింగిల్' చిత్రంలో ఆమె కథానాయికగా నటించారు. అల్లు అరవింద్ సమర్పణలో విద్యా కొప్పినీడి, భాను ప్రతాప్, రియాజ్ చౌదరి నిర్మించిన ఈ చిత్రం ఈనెల 9న విడుదలవుతోంది. ఈ సందర్భంగా ఇవానా సినిమా విశేషాలను మీడియాతో పంచుకున్నారు. "సింగిల్' కథానాయికగా నాకు తొలి తెలుగు చిత్రం. గీతా ఆర్ట్స్ లాంటి పేరున్న సంస్థలో అవకాశం రావడాన్ని శుభారంభంగా భావిస్తున్నాను. ఇదొక వినోదాత్మక చిత్రం. కుటుంబంతో కలసి థియేటర్‌లో ఎంజాయ్ చేసేలా ఉంటుంది. ఈ సినిమాలో హరిణి అనే డాన్సర్‌గా కనిపిస్తాను. సరదాగా ఉండే యువతిగా, కుటుంబం కోసం ఏం చేయడానికైనా వెనుకాడని ధైర్యవంతురాలిగా భిన్న భావోద్వేగాలను ఆవిష్కరించేలా నా పాత్ర ఉంటుంది. వెన్నెల కిశోర్, కేతిక శర్మతో పనిచేయడం సరదాగా అనిపించింది. శ్రీవిష్ణు గారు ఫోకస్ అంతా పని పైనే ఉంటుంది. తెలుగు నేర్చుకోవడంలో ఆయన నాకు సాయం చేశారు. భవిష్యత్తులో నిజ జీవితానికి దగ్గరగా ఉండే పాత్రలు మరిన్ని చేయాలనేది నా కోరిక అని ఇవానా చెప్పారు.





18 ఏళ్ల తర్వాత మళ్లీ

పద్దెనిమిది ఏళ్ల తర్వాత అక్షయ్ కుమార్, సైఫ్ అలీఖాన్ కలసి బాలీవుడ్ స్ర్కీన్‌పై మెరవబోతున్నారు. 2016లో మోహన్‌లాల్ కథానాయకుడిగా ప్రియదర్శన్ తెరక్కెంచిన మలయాళ చిత్రం 'ఒప్పం'. ఇప్పుడు ఇదే చిత్రాన్ని అక్షయ్, సైఫ్ ప్రధాన పాత్రలుగా ప్రియదర్శన్ హిందీలో రిమేక్ చేస్తున్నారు. ఈ కథ గురించి చెప్పగానే అక్షయ్ కుమార్ వెంటనే ఒకే చేశారట. అటు సైఫ్ అలీఖాన్ కూడా ప్రియదర్శన్ మూవీలో అవకాశం రావడం పట్ల ఆనందం వ్యక్తం చేస్తున్నారు. థ్రిల్లర్ కథాంశాంతో తెరకెక్కనున్న ఈ చిత్రంలో సైఫ్ గుడ్డివాని పాత్రలో కనిపించనున్నారు. ఆగస్టులో ఈ ప్రాజెక్టు పట్టాలెక్కనుందని సైఫ్ బాలీవుడ్ మీడియాతో చెప్పారు. కాగా, గతంలో అక్షయ్ కుమార్ హీరోగా ప్రియదర్శన్ తెరకెక్కించిన హెరాఫెరి, హంగామా, గరమ్ మసాలా, భూల్ భులయ్యా చిత్రాలు బ్లాక్‌బస్టర్ హిట్ కొట్టాయి. ప్రస్తుతం వీరిద్దరి కాంబోలో 'భూత్ బంగ్లా' అనే హారర్ కామెడీ చిత్రం విడుదలకు సిద్ధమవుతోంది. ఈ క్రమంలోనే అక్షయ్ కుమార్- ప్రియదర్శన్ కాంబినేషన్‌లో మరో ప్రాజెక్టు ఖరారు కావడం విశేషం.

చిత్రజ్యోతి
★ SINCE 1965 ★

ప్రభాస్‌తో మరోసారి?



ప్రభాస్ హీరోగా నటించిన 'కల్కి 2898 ఏడీ' చిత్రంలో బాలీవుడ్ భామ దీపికా పదుకోన్ ఓ కీలక పాత్ర పోషించిన సంగతి తెలిసిందే. ఇప్పుడు ఆమె మరోసారి ప్రభాస్ చిత్రంలో నటించడానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని బాలీవుడ్ సమాచారం. దర్శకుడు సందీప్‌రెడ్డి వంగా రూపొందించే 'స్పిరిట్' చిత్రంలో ప్రభాస్ హీరోయిన్‌గా దీపిక నటించనున్నారు. నిజానికి 'స్పిరిట్' చిత్రం గత ఏడాదే ప్రారంభం కావాలి. ఆ సమయంలో హీరోయిన్ పాత్ర కోసం దీపికను సందీప్ సంప్రదించారు. కానీ అప్పుడు ఆమె గర్భవతి కావడంతో ఆ చిత్రంలో నటించలేనని చెప్పేశారు. ఇప్పుడు 'స్పిరిట్' షూటింగ్ షెడ్యూల్ డిలే కావడంతో సందీప్ మరోసారి దీపికను సంప్రదించారనీ, ఆ సినిమా కథ, అందులో హీరోయిన్ పాత్ర నచ్చి నటించడానికి వెంటనే అంగీకరించారనీ బీటౌన్ టాక్. ఇటీవలే షారుక్ ఖాన్ 'కింగ్' చిత్రంలో నటించడానికి దీపిక అంగీకరించారు. తాజాగా 'స్పిరిట్' చిత్రం కూడా ఒప్పుకోవడంతో ఈ ఏడాది చివరి వరకూ ఆమె డేట్స్ ఖాళీ లేనట్లే. ప్రస్తుతం వినిపిస్తున్న వార్తల ప్రకారం 'స్పిరిట్' చిత్రం ఈ ఏడాది అక్టోబర్‌లో ప్రారంభించి. 2027 ఫస్ట్ హాఫ్‌లో విడుదల చేయాలని నిర్మాత భూషణ్‌కుమార్ ప్లాన్. ఈ చిత్రం షూటింగ్ ఎప్పుడు ప్రారంభమయ్యేదీ అధికారికంగా ప్రకటించాల్సి ఉంది. అలాగే హీరోయిన్‌గా దీపికను హీరోయిన్‌గా ఎంపిక చేసిన విషయాన్ని కూడా.

ఎవరినీ బాధపెట్టడం నా ఉద్దేశం కాదు

- విజయ్ దేవరకొండ




ఇటీవల నిర్వహించిన 'రెట్రో' చిత్రం ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో విజయ్ దేవరకొండ చేసిన వ్యాఖ్యలపై దుమారం రేగిన విషయం తెలిసిందే. దీనిపై స్పందించిన విజయ్ ఎవరినీ బాధ పెట్టడం తన ఉద్దేశం కాదని వివరణ ఇచ్చారు. 'నా మాటలు కొందరిని బాధపెట్టాయనే విషయం నా దృష్టికి వచ్చింది. ట్రైబ్ అని నేను వాడిన పదం వెనుక ఉద్దేశం భూమ్మీద తొలినాళ్లలో మనమంతా తెగలుగా, జాతులుగా ఉన్నామని చెప్పడమే. కానీ ఎవరినీ బాధపెట్టడం నా ఉద్దేశం కాదు. షెడ్యూల్డ్ ట్రైబ్స్ అంటే నాకు ఎంతో గౌరవం, ప్రేమ. మన సమాజంలో ఐక్యత ఉండాలి. ఒక్కటిగా మనమంతా ముందుకు వెళ్లాలనే చెప్పాను. దేశమంతా ఒక్కటిగా నిలబడాలని మాట్లాడాను. నా మాటలతో ఎవరైనా మనస్థాపం చెంది ఉంటే చింతిస్తున్నాను' అని పేర్కొన్నారు.

జన్మజన్మల బంధం



సమంత నిర్మాతగా మారి ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్ బ్యానర్‌పై రూపొందించిన తొలి చిత్రం 'శుభం'. 'సినిమా బండి' ఫేమ్ ప్రవీణ్ కండ్రీగుల తెరకెక్కించిన ఈ చిత్రంలో హర్షిత్ రెడ్డి, గవిరెడ్డి శ్రీనివాస్, చరణ్ పెరి, షాలినీ కొండెపూడి ప్రధాన పాత్రలు పోషించారు. సమంత ఓ ప్రత్యేక పాత్రలో నటించారు. తాజాగా ఈ సినిమా నుంచి ఫస్ట్ సింగిల్‌గా ఓ ప్రమోషనల్ సాంగ్‌ను విడుదల చేశారు మేకర్స్. 'జన్మజన్మల బంధం' అంటూ సాగే ఈ పాటలో ప్రధాన తారాగణంతో పాటు సమంత కూడా తళుక్కున మెరిశారు. మే 9న చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది.

ప్రపంచంలోనే అతిపెద్ద స్ర్కీన్



మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్‌తో అభిషేక్ అగర్వాల్, విక్రమ్ రెడ్డి

నాగపూర్‌లో ప్రపంచంలోనే అతిపెద్ద స్ర్కీన్‌తో సినిమా థియేటర్‌ను నిర్మించనున్నారు. 'వేవ్స్' సమ్మిట్‌లో పాల్గొన్న తెలుగు నిర్మాతలు అభిషేక్ అగర్వాల్, విక్రమ్ రెడ్డి ఈ ప్రాజెక్టును ప్రకటించారు. ఈ సందర్భంగా అభిషేక్ అగర్వాల్ మాట్లాడుతూ 'వరల్డ్ బిగ్గెస్ట్ సినిమా స్ర్కీన్ నిర్మించే అవకాశం మాకు దక్కడం గర్వంగా ఉంది. భారత వినోద రంగాన్ని ప్రపంచ స్థాయికి తీసుకెళ్లాలనేది ప్రధాని మోదీ లక్ష్యం. ఆ దిశగా మా ప్రయత్నం మొదలైంది' అని అన్నారు. 'సినిమాను మరింత గొప్పగా తీర్చిదిద్దడమే మా యూవీ క్రియేషన్స్ లక్ష్యం. గొప్ప సినిమాలు తీయడం కాదు. అద్భుతమైన థియేటర్లు నిర్మించడమే మా ధ్యేయం' అని మరో నిర్మాత విక్రమ్ రెడ్డి పేర్కొన్నారు.

నేటి మ్యాచ్‌లు

కోల్‌కతా x రాజస్థాన్ — మ.3.30 నుంచి — వేదిక: కోల్‌కతా

పంజాబ్ x లఖ్‌నవూ — రా.7.30 నుంచి — వేదిక: ధర్మశాల

నిషిక పతక మోత



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): జాతీయ సీనియర్ ఆర్టిస్టిక్ జిమ్నాస్టిక్ చాంపియన్‌షి‌ప్‌లో హైదరాబాద్ యువ జిమ్నాస్ట్ నిషిక అగర్వాల్ ఒకే రోజు మూడు పతకాలు కైవసం చేసుకొని సంచలనం సృష్టించింది. శనివారం పుణెలోని శివఛత్రపతి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జరిగిన ఈ పోటీల్లో తొలుత నిషిక వాల్టింగ్ టేబుల్ విభాగంలో (12.883) స్వర్ణం సాధించింది. ఫ్లోర్ ఎక్సర్‌సైజ్‌లో నిషిక 11.433 స్కోరుతో రెండో స్వర్ణం సొంతం చేసుకుంది. బ్యాలెన్సింగ్ బీమ్ విభాగంలో నిషిక 10.967 స్కోరుతో రజతంతో మెరిసింది. శుక్రవారం జరిగిన ఆల్‌రౌండ్ విభాగంలో నిషిక స్వర్ణం సాధించడం తెలిసిందే. మొత్తంగా ఈ పోటీల్లో నిషికకు ఇది నాలుగో పతకం.

మళ్లీ ఓడిన భారత్

హాకీ అమ్మాయిలకు నాలుగో ఓటమి

పెర్త్: ఆస్ట్రేలియా టూర్‌లో భారత మహిళల హాకీ జట్టు వరుసగా నాలుగో ఓటమిని చవిచూసింది. శనివారం జరిగిన నాలుగో మ్యాచ్‌లో భారత్ 2-3తో ఆస్ట్రేలియా చేతిలో ఓడింది. నవ్‌నీత్ కౌర్ (35వ నిమిషం), లాల్‌రిమ్సియామి (59వ) చెరో గోల్ చేయగా.. ఆస్ట్రేలియా తరఫున గ్రేస్ స్టీవార్ట్ (2వ), జేడ్ స్మిత్ (36వ), గ్రెటా హేస్ (42వ) గోల్స్ సాధించారు. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా ఆఖరి పోరు ఆదివారం జరగనుంది. ఆసీస్-ఎతో జరిగిన రెండు మ్యాచ్‌ల్లో చిత్తయిన భారత్.. గత గురువారం సీనియర్ టీమ్ చేతిలో 0-2తో ఓడింది.

ఫైనల్ బెర్త్ లక్ష్యంగా..

ఉదయం 10.గం నుంచి



కెప్టెన్ హర్మన్

నేడు శ్రీలంకతో భారత్ పోరు

మహిళల ముక్కోణపు వన్డే సిరీస్

కొలంబో: మహిళల ముక్కోణపు వన్డే సిరీస్‌లో భారత జట్టు దూసుకెళ్తోంది. ఇప్పటికే శ్రీలంక, దక్షిణాఫ్రికాపై వరుస విజయాలతో పట్టికలో టాప్‌లో ఉంది. తాజాగా ఆదివారం ఆతిథ్య శ్రీలంకతో మరో మ్యాచ్‌కు సిద్ధమవుతోంది. అన్ని విభాగాల్లోనూ రాణిస్తోన్న భారత జట్టు ఈ మ్యాచ్‌లోనూ నెగ్గి హ్యాట్రిక్ విజయంతో పాటు ఫైనల్లోనూ చోటు దక్కించుకోవాలనుకుంటోంది. అలాగే సంచలన ఓపెనర్ ప్రతీక రావల్.. సచిన్ రికార్డును బ్రేక్ చేసేందుకు ఎదురుచూస్తోంది. ప్రస్తుతం తను వరుసగా ఐదు హాఫ్ సెంచరీలతో సచిన్, ద్రవిడ్ సరసన ఉంది. మహిళల క్రికెట్‌లో ఈ రికార్డు మిథాలీ రాజ్ (7) పేరిట కొనసాగుతోంది. స్పిన్నర్లు స్నేహ్ రాణా, శ్రీ చరణి మరోసారి కీలకం కానున్నారు. అటు దక్షిణాఫ్రికాతో గెలిచిన శ్రీలంక జట్టు భారత్‌పై ప్రతీకారం తీర్చుకోవాలనుకుంటోంది. కెప్టెన్ చమరి పేలవ ఫామ్ ఆందోళన కలిగిస్తోంది. అయితే మిడిలార్డర్‌లో హర్షిత-కవిష జోడీ దీటుగా నిలబడితే భారత్‌కు ఇబ్బందే.

డ్రగ్స్ కేసులో పట్టుబడిన రబాడ!

అందుకే ఐపీఎల్‌కు దూరం



న్యూఢిల్లీ: డ్రగ్స్ వాడినట్టు తేలడంతో దక్షిణాఫ్రికా పేసర్ కగిసో రబాడ సుమారు నెలరోజులపాటు ఐపీఎల్‌కు దూరమయ్యాడు. గుజరాత్ తరఫున రెండు మ్యాచ్‌లు ఆడిన రబాడ.. గత నెల మూడున హఠాత్తుగా స్వదేశం వెళ్లిపోయాడు. అయితే, వ్యక్తిగత కారణాలతో రబాడ లీగ్‌ను వీడినట్టు గుజరాత్ ఫ్రాంచైజీ తెలిపింది. కానీ, రిక్రియేషనల్ డ్రగ్స్ (మాదక ద్రవ్యాలు లాంటివి) వాడినట్టు పరీక్షల్లో తేలడంతో అతడిపై తాత్కాలికంగా వేటుపడింది. ఈ విషయాన్ని రబాడ స్వయంగా ఓ ప్రకటనలో తెలిపాడు. సౌతాఫ్రికా టీ20 లీగ్ సమయంలో అతడు డోపింగ్ నిబంధనలను అతిక్రమించినట్టు సమాచారం. సామర్థ్యాన్ని పెంచే డ్రగ్ కాకపోవడంతో.. గతంలో కొన్ని కేసుల్లో విధించిన శిక్షల ప్రకారం అతడిపై విధించిన సస్పెన్షన్ ముగిసినట్టు తెలుస్తోంది. ప్రస్తుతం రబాడ ఐపీఎల్‌కు తిరిగి వచ్చాడు. మంగళవారం ముంబైతో జరిగే మ్యాచ్‌లో అతడు బరిలోకి దిగే అవకాశం ఉంది.


ఉమామహేష్‌కు రజతం



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): జాతీయ షూటింగ్ చాంపియన్‌షిప్‌లో విజయవాడ షూటర్ మద్దినేని ఉమామహేష్ రజతం దక్కించుకున్నాడు. శనివారం న్యూఢిల్లీలో జరిగిన ఈ పోటీల్లో 10 మీటర్ల రైఫిల్ జూనియర్ విభాగంలో మహేష్ 251 స్కోరుతో ద్వితీయ స్థానంలో నిలిచాడు. కేవలం 0.1 పాయింట్ తేడాతో త్రుటిలో స్వర్ణ పతకాన్ని మహేష్ కోల్పోయాడు. పార్థ్ రాకేష్ (మహారాష్ట్ర) 251.01 స్కోరుతో స్వర్ణం, ప్రణవ్ (కర్ణాటక) 229.5 స్కోరుతో కాంస్యం గెలిచారు. ఈ పోటీల్లో ఆంధ్రకు ఇది రెండో పతకం. తొలి రోజు పోటీల్లో ముఖేష్ స్వర్ణం సాధించడం తెలిసిందే. కాగా కిరణ్ అంకుష్ జాదవ్ 10మీ. ఎయిర్ రైఫిల్‌లో స్వర్ణం సొంతం చేసుకున్నాడు. వివేక్ శర్మ (250.1) రజతం, విశాల్ సింగ్ (230.1) కాంస్యం అందుకున్నారు.

చెన్నై పోరాడినా..

- ఆఖరి బంతికి ఆర్‌సీబీ విజయం
- విరాట్, బెథెల్, షెఫర్డ్ హాఫ్‌సెంచరీలు
- ఆయుష్ మాత్రే సెంచరీ మిస్



షెఫర్డ్ (14 బంతుల్లో 4 ఫోర్లు, 6 సిక్సర్లతో 53 నాటౌట్)

1 టీ20ల్లో ఒకే వేదికపై ఎక్కువ సిక్సర్లు (154) బాదిన బ్యాటర్‌గా విరాట్. అలాగే సీఎస్‌కేపై ఎక్కువ హాఫ్ సెంచరీలు (10) సాధించిన బ్యాటర్‌గానూ నిలిచాడు.

చివరి రెండు ఓవర్లలో అత్యధిక పరుగులు (54) సాధించిన జట్టుగా ఆర్‌సీబీ

2 ఐపీఎల్‌లో రెండో ఫాస్టెస్ట్ (14 బంతుల్లో) ఫిఫ్టీ సాధించిన షెఫర్డ్. కమిన్స్, రాహుల్‌తో సమంగా నిలిచాడు. జైస్వాల్ (13) టాప్‌లో ఉన్నాడు.

3 ఐపీఎల్‌లో ఫిఫ్టీ సాధించిన మూడో యంగెస్ట్ (17 ఏళ్లు) బ్యాటర్‌గా ఆయుష్

బెంగళూరు: ఐపీఎల్‌లో అత్యధిక అభిమానగణం కలిగిన చెన్నై సూపర్ కింగ్స్-రాయల్ చాలెంజర్స్ బెంగళూరు మధ్య మ్యాచ్ ఉర్రూతలూగించింది. ముఖ్యంగా ప్లేఆఫ్స్ నుంచి నిష్క్రమించాక చెన్నై అదిరే ఆటతో ఆకట్టుకున్నా.. ఆఖరి బంతికి ఓడాల్సి వచ్చింది. పేసర్ యష్ దయాళ్ ఈ ఓవర్‌ను కట్టుదిట్టంగా వేయడంతో ఆర్‌సీబీ కేవలం 2 పరుగుల తేడాతో గట్టెక్కింది. అలాగే 16 పాయింట్లతో తిరిగి టాప్‌లోకి చేరి ప్లేఆఫ్స్ బెర్త్ దాదాపు ఖాయం చేసుకుంది. శనివారం జరిగిన ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్‌కు దిగిన బెంగళూరు 20 ఓవర్లలో 5 వికెట్లకు 213 పరుగులు చేసింది. విరాట్ (33 బంతుల్లో 5 ఫోర్లు, 5 సిక్సర్లతో 62), బెథెల్ (33 బంతుల్లో 8 ఫోర్లు, 2 సిక్సర్లతో 55), షెఫర్డ్ (14 బంతుల్లో 4 ఫోర్లు, 6 సిక్సర్లతో 53 నాటౌట్) చెలరేగారు. పథిరనకు మూడు వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఛేదనలో చెన్నై 20 ఓవర్లలో 5 వికెట్లకు 211 పరుగులు చేసి ఓడింది. ఆయుష్ మాత్రే (48 బంతుల్లో 9 ఫోర్లు, 5 సిక్సర్లతో 94), జడేజా (45 బంతుల్లో 8 ఫోర్లు, 2 సిక్సర్లతో 77 నాటౌట్) ఆకట్టుకున్నారు. ఎన్‌గిడికి మూడు వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా షెఫర్డ్ నిలిచాడు.

ఆయుష్ అదిరేలా..: భారీ ఛేదనలో చెన్నై ఇన్నింగ్స్ సజావుగానే ఆరంభమైంది. ఓపెనర్ ఆయుష్ మాత్రే అద్భుత ఆటతీరుతో కదం తొక్కాడు. అతడికి జడేజా మధ్య ఓవర్లలో సహకారం అందించాడు. ఇద్దరూ మూడో వికెట్‌కు 114 పరుగులందించారు. అటు ఆర్‌సీబీ ఫీల్డర్లు నాలుగు క్యాచ్‌లను వదిలేసినా.. చివరి ఓవర్‌లో చెన్నైకి నిరాశ తప్పలేదు. మరో ఓపెనర్ రషీద్ (14) విఫలమైనా.. మాత్రే మాత్రం జోరును ఆపలేదు. భువీ వేసిన ఇన్నింగ్స్ నాలుగో ఓవర్‌లో 4,4,4,6,4,4తో 26 పరుగులు సాధించాడు. అయితే వరుస ఓవర్లలో రషీద్, కర్రాన్ (5) వికెట్లను కోల్పోవడంతో పవర్‌ప్లేలో 58/2 స్కోరుతో నిలిచింది. ఆ తర్వాత కూడా లయ దెబ్బతినకుండా మాత్రే-జడేజా ఆర్‌సీబీ బౌలర్లపై ఎదురుదాడికి దిగారు. 25 బంతుల్లో తొలి హాఫ్ సెంచరీ సాధించిన మాత్రే పదో ఓవర్‌లో 6,6,4తో స్కోరును వంద దాటించాడు. 16వ ఓవర్‌లో మాత్రే, జడేజా క్యాచ్‌లను వదిలేశారు. అయితే మాత్రే 94 పరుగుల వద్ద సిక్సర్‌కు వెళ్లి క్రునాల్ క్యాచ్‌తో వెనుదిరగ్గా, బ్రెవిస్ (0) ఎల్బీ అయ్యాడు. అయితే రీప్లేలో బంతి లెగ్ స్టంప్‌ను మిస్ అవుతున్నట్టు తేలింది. ఈ ఇద్దరినీ ఎన్‌గిడి అవుట్ చేశాడు. ఇక ఆరు బంతుల్లో 15 పరుగులు కావాల్సిన వేళ హైడ్రామా నెలకొంది. పేసర్ యష్ మూడో బంతికి ధోనీ (12)ని అవుట్ చేయగా దూబే (8 నాటౌట్) సిక్సర్‌తో ఉత్కంఠ పెరిగింది. ఆఖరి బంతికి ఫోర్ రావాల్సి ఉండగా ఒక్క పరుగే తీసిన చెన్నై ఓడక తప్పలేదు.

ఓపెనర్ల జోరు: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన బెంగళూరుకు ఓపెనర్లు విరాట్, బెథెల్ అదిరే ఆరంభాన్ని అందించారు. ఇద్దరూ మైదానం నలువైపులా బౌండరీలు బాదేయడంతో స్కోరు దూసుకెళ్లింది. అయితే వీరున్నంత సేపే జోరు కనిపించగా.. ఆ తర్వాత చెన్నై బౌలర్ల కట్టడితో నెమ్మదించింది. కానీ స్వల్ప స్కోరుకు పరిమితం కావాల్సిన ఆర్‌సీబీని చివర్లో షెఫర్డ్ ఆదుకున్నాడు. తొలి ఓవర్‌లోనే బెథెల్ హ్యాట్రిక్ ఫోర్లతో దాటిని కనబర్చగా.. పేసర్ ఖలీల్ ఓవర్‌లో రెండు సిక్సర్లు బాదాడు. అయితే నాలుగో ఓవర్‌లో బెథెల్ క్యాచ్‌ను జడేజా, పథిరన సమయన్వయ లోపంతో వదిలేశారు. అటు విరాట్ ఆరో ఓవర్‌లో 6,4తో పవర్‌ప్లేలో జట్టు 71 పరుగులతో నిలిచింది. ప్రమాదకరంగా మారిన ఈ జోడీకి పేసర్ పథిరన షాకిచ్చాడు. పదో ఓవర్‌లో బ్రెవిస్ డైవింగ్ క్యాచ్‌తో బెథెల్ వెనుదిరిగాడు. తర్వాతి ఓవర్‌లో విరాట్ 6,4,4తో 29 బంతుల్లో వరుసగా నాలుగో హాఫ్ సెంచరీని అందుకున్నాడు. కానీ ఆ వెంటనే కర్రాన్‌కు చిక్కాడు. అయితే దేవ్‌దత్ (17), రజత్ (11), జితేశ్ (7) ఆకట్టుకోలేదు.

ఆ రెండు ఓవర్లలో..: 18 ఓవర్లలో ఆర్‌సీబీ స్కోరు కేవలం 159/5. ఈ దశలో 180 కూడా కష్టమే అనిపించింది. కానీ ఆట 18వ ఓవర్లో క్రీజులోకి వచ్చిన రొమారియో షెఫర్డ్ విధ్వంసం సృష్టించాడు. ఖలీల్ వేసిన ఇన్నింగ్స్ 19వ ఓవర్‌లో ఆకాశమే హద్దుగా చెలరేగిన అతడు 6,6,4,6,6నోబ్, 4తో ఏకంగా 33 పరుగులు రాబట్టాడు. ఇక ఆఖరి ఓవర్‌లో 4,4,6,6తో 21 రన్స్ రాగా స్కోరు కూడా 200 దాటేసింది. మరోవైపు 14 బంతుల్లోనే షెఫర్డ్ హాఫ్ సెంచరీ కూడా పూర్తయ్యింది.

స్కోరుబోర్డు

బెంగళూరు: బెథెల్ (సి) బ్రేవిస్ (బి) పథిరన 55; విరాట్ (సి) ఖలీల్ (బి) కర్రాన్ 62; పడిక్కళ్ (సి) జడేజా (బి) పథిరన 17; రజత్ (సి) కర్రాన్ (బి) పథిరన 11; జితేశ్ (సి) బ్రెవిస్ (బి) నూర్ అహ్మద్ 7; డేవిడ్ (నాటౌట్) 2; షెఫర్డ్ (నాటౌట్) 53; **ఎక్స్‌ట్రాలు: 6; మొత్తం: 20 ఓవర్లలో 213/5. వికెట్ల పతనం:** 1-97, 2-121, 3-144, 4-154, 5-157; **బౌలింగ్:** ఖలీల్ 3-0-65-0; అన్షుల్ 3-0-25-0; నూర్ అహ్మద్ 4-0-26-1; జడేజా 3-0-26-0; కర్రాన్ 3-0-34-1; పథిరన 4-0-36-3.

చెన్నై: ఆయుష్ మాత్రే (సి) క్రునాల్ (బి) ఎన్‌గిడి 94, రషీద్ (సి) షెఫర్డ్ (బి) క్రునాల్ 14, కర్రాన్ (సి) జితేష్ (బి) ఎన్‌గిడి 5, జడేజా (నాటౌట్) 77, బ్రెవిస్ (ఎల్బీ) ఎన్‌గిడి 0, ధోనీ (ఎల్బీ) యశ్ 12, దూబే (నాటౌట్) 8, **ఎక్స్‌ట్రాలు 1, మొత్తం: 20 ఓవర్లలో 211/5, వికెట్లపతనం:** 1-51, 2-58, 3-172, 4-172, 5-201; **బౌలింగ్:** క్రునాల్ 3-0-24-1, భువనేశ్వర్ 4-0-55-0, యశ్ దయాల్ 4-0-41-1, ఎన్‌గిడి 4-0-30-3, సుయాశ్ 4-0-43-0, షెఫర్డ్ 1-0-18-0.

బంగ్లాతో సిరీస్ రద్దు?

ఆసియాకప్ కూడా..

న్యూఢిల్లీ: పహల్గాంలో ఉగ్రదాడి కారణంగా భారత జట్టు క్రికెట్ షెడ్యూల్‌పై తీవ్ర ప్రభావమే పడనుంది. ఇప్పటికే పాకిస్థాన్‌తో క్రికెట్ మ్యాచ్‌లను పూర్తిగా బాయ్‌కాట్ చేయాలన్న డిమాండ్లు వినిపిస్తున్నాయి. తాజాగా భారత జట్టు బంగ్లాదేశ్ పర్యటన కూడా సందేహంగా మారింది. ఆగస్టులో మూడు వన్డేలు, మూడు టీ20ల కోసం టీమిండియా అక్కడికి వెళ్లాల్సి ఉంది. కానీ బంగ్లా రిటైర్డ్ ఆర్మీ అధికారి ఫజ్లూర్ రహమాన్ చేసిన వ్యాఖ్యలు ఈ సిరీస్‌ను సంశయంలో పడేశాయి. ఒకవేళ పాక్‌పై భారత్ దాడి చేస్తే వారి ఈశాన్య రాష్ట్రాలను బంగ్లా ఆక్రమించుకోవాలంటూ అతడు ప్రగల్భాలు పలికాడు. దీంతో ప్రస్తుత స్థితిలో ఈ సిరీస్ జరిగే అవకాశాలు తక్కువేనంటూ బీసీసీఐ వర్గాలు పేర్కొంటున్నాయి. మరోవైపు ఈ ఏడాది తటస్థ వేదికపై జరగాల్సిన ఆసియాకప్‌పైనా అనిశ్చితి కొనసాగుతోంది. 8 దేశాలు తలపడనుండగా.. గ్రూప్ ఎలోనే భారత్-పాక్ జట్లు ఉండడం గమనార్హం.

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.రరే
బెంగళూరు	11	8	3	0	16	0.482
ముంబై	11	7	4	0	14	1.274
గుజరాత్	10	7	3	0	14	0.867
పంజాబ్	10	6	3	1	13	0.199
ఢిల్లీ	10	6	4	0	12	0.362
లఖ్‌నవూ	10	5	5	0	10	-0.325
కోల్‌కతా	10	4	5	1	9	0.271
రాజస్థాన్	11	3	8	0	6	-0.780
హైదరాబాద్	10	3	7	0	6	-1.192
చెన్నై	11	2	9	0	4	-1.117

గమనిక: ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; ఫ.తే: ఫలితం తేలనివి; పా: పాయింట్లు; నె.రరే: నెట్ రన్‌రేట్

వ్యక్తిగత రుణాన్ని తిరస్కరించారా!

అయితే ఈ గండం నుంచి గట్టెక్కడం ఎలా?

కొన్ని ఆర్థిక అవసరాలు ఆకస్మికంగా వస్తుంటాయి. వాటిని భరించేందుకు చేతిలో సరిపడా డబ్బులు ఉండకపోవచ్చు. అప్పుడు ఎవరికైనా ముందు గుర్తుకు వచ్చేది వ్యక్తిగత రుణాలే. అయితే ఒక్కోసారి ఈ రుణ దరఖాస్తులను బ్యాంకులు తిరస్కరిస్తుంటాయి. అప్పుడు మనముందున్న మార్గాలు ఏమిటో తెలుసుకుందాం..

ఇవాళ అందరి జీవితాలు ముఖ్యంగా మధ్యతరగతి బతుకులు అప్పులతోనే తెల్లారిపోతున్నాయి. ఈ సమస్య నుంచి బయట పడేందుకు చాలా మంది వ్యక్తిగత రుణాలను ఆశ్రయిస్తుంటారు. అయితే ఒక్కోసారి బ్యాంకులు ఈ అప్లికేషన్లను తిరస్కరిస్తుంటాయి. అందుకు ఈ కింది విషయాలు ప్రధాన కారణంగా చెప్పుకోవచ్చు.

సిబిల్ స్కోరు

ఏ రుణం కావాలన్నా బ్యాంకులు ఆయా వ్యక్తుల సిబిల్ స్కోరు చూస్తాయి. ఈ స్కోరు కనీసం 750 పాయింట్ల కంటే ఎక్కువ ఉండటం మంచిది. అంతకంటే తక్కువగా ఉంటే రుణం ఇవ్వడానికి బ్యాంకులు ఆలోచిస్తాయి.

అధిక అప్పులు

మీ ఆదాయంలో ఎక్కువ భాగం ఇప్పటికే ఉన్న అప్పుల చెల్లింపులకు పోతుంటే.. బ్యాంకులు వ్యక్తిగత రుణాలు ఇచ్చేందుకు ముఖం చాటేస్తాయి.

నిలకడలేని ఆదాయం, ఉద్యోగాలు

ఉద్యోగాల్లో కుదురుగా ఉండి.. స్థిరమైన ఆదాయాలు ఉన్న వారికే వ్యక్తిగత రుణాలు ఇచ్చేందుకు బ్యాంకులు ఇష్టపడతాయి.

అనేక అప్లికేషన్లు

స్వల్పకాలంలో రుణాల కోసం మీరు అనేక అప్లికేషన్లు పెట్టినా సమస్యే. బ్యాంకులు అలాంటి వ్యక్తులను అప్పుల అప్పారావులుగా పరిగణించి రుణాలు ఇచ్చేందుకు పెద్దగా ఇష్టపడవు.



పూర్తి వివరాలు లేకపోవడం

రుణ దరఖాస్తుతో పాటు బ్యాంకు అడిగిన ఐడీ ప్రూఫ్, శాలరీ స్లిప్పులు లేదా బ్యాంకు స్టేట్‌మెంట్లు ఇవ్వాలి. లేకపోతే బ్యాంకు మీ పర్సనల్ లోన్ అప్లికేషన్‌ను పక్కన పెడుతుంది.

క్రెడిట్ స్కోరు పెంచుకోవడం

క్రెడిట్ స్కోరు బాగోక బ్యాంకు మీ వ్యక్తిగత రుణ దరఖాస్తును తిరస్కరిస్తే ఈ కింది చర్యల ద్వారా స్కోరు పెంచుకోవచ్చు.

- ఈఎంఐలు, క్రెడిట్ కార్డు బిల్లులు సమయానికి చెల్లించడం
- మీకు ఉన్న పరపతిలో 30 శాతానికి మించి ఉపయోగించుకోకపోవడం
- తరచుగా రుణాల కోసం దరఖాస్తు చేయకపోవడం
- ఉన్న రుణాలు చెల్లించడం ద్వారా పరపతి స్కోరు పెంచుకోవడం
- క్రెడిట్ స్కోరు రిపోర్టులో తప్పులు ఉంటే వెంటనే సరి చేయించుకోవడం.

పూచీకత్తు రుణం

పరపతి స్కోరు సరిగా లేనప్పుడు ఏదైనా ఆస్తిని పూచీగా చూపి వ్యక్తిగత రుణాలు తీసుకోవడం మంచిది. ఈ పూచీతో బ్యాంకులు రుణ దరఖాస్తును త్వరగా ఆమోదించడమే గాక తక్కువ వడ్డీకే రుణాలు ఇస్తాయి.

అర్హత పెంచుకోవడం

రుణ దరఖాస్తుకు ముందే సిబిల్ స్కోరును మెరుగుపరుచుకోవటం, స్థిరమైన ఆదాయం, పాత రుణాలు సమయానికి సరిగా చెల్లించిన చరిత్ర కలిగి ఉండేలా చూసుకోవాలి. ఇంకా ఈ కింది అంశాలు కూడా రుణ దరఖాస్తు ఆమోదానికి ఉపకరిస్తాయి.

- మీ అర్హతకు మించిన వ్యక్తిగత రుణానికి అప్లయ్ చేయకూడదు
- రుణ దరఖాస్తు చేసే నాటికి కనీసం ఆరు నెలల నుంచి ఒకే ఉద్యోగంలో ఉండాలి. స్వయం ఉపాధి అయితే స్థిరమైన ఆదాయం ఉందని బ్యాంకుకు నిరూపించాలి
- పై అంశాలను తూచా తప్పకుండా పాటిస్తే మీ వ్యక్తిగత రుణ దరఖాస్తును బ్యాంకులు ఆమోదించడంతో పాటు తక్కువ వడ్డీకే రుణాలు ఇచ్చే అవకాశాలు మెరుగవుతాయి.

తిరిగి దరఖాస్తు చేయడం

పరపతి స్కోరు, ఆదాయం పెరిగే వరకు ఆగి.. మళ్లీ దరఖాస్తు చేయడం మరో మార్గం. దీనివల్ల బ్యాంకు మీ రుణ దరఖాస్తుని తాజాగా పరిశీలించి రుణం మంజూరు చేసే అవకాశాలు ఎక్కువ.

తిరస్కరణ తర్వాత ఏమి చేయాలి?

మీ రుణ అప్లికేషన్‌ను బ్యాంకు తిరస్కరించగానే గాభరాపడి పోవాల్సిన పని లేదు. ఈ కింది చర్యల ద్వారా ఈ సమస్యను అధిగమించవచ్చు.

- సమస్యను అర్థం చేసుకోవడం
- ఏ కారణం చేత మీ రుణ దరఖాస్తు తిరస్కరణకు గురైందో బ్యాంకును అడిగి తెలుసుకోవాలి
- ఇంకో రుణం కోసం దరఖాస్తు చేయడం
- ఇంతకు ముందు దరఖాస్తు చేసిన దాని కంటే తక్కువ రుణం కోసం మరో దరఖాస్తు చేయడం
- కో అప్లికెంట్ లేదా హామీదారుని చేర్చడం
- మీకంటే మంచి పరపతి స్కోరు ఉన్న వ్యక్తిని సహ దరఖాస్తుదారునిగా లేదా హామీదారుగా చేర్చుకోవడం
- ఎన్‌బీఎఫ్‌సీలు, ఫిన్‌టెక్‌లను ఆశ్రయించడం
- బ్యాంకులతో పోలిస్తే ఎన్‌బీఎఫ్‌సీలు, ఫిన్‌టెక్ కంపెనీలు పరపతి స్కోరు తక్కువగా ఉన్నా వ్యక్తిగత రుణాలు ఇస్తాయి. కాకపోతే ఇందుకు వడ్డీ కొద్దిగా ఎక్కువగా ఉంటుంది.

యాక్సిస్ ఫైనాన్స్ 'దిశ' గృహ రుణాలు

ఎన్‌బీఎఫ్‌సీ సంస్థ యాక్సిస్ ఫైనాన్స్.. ఆర్థికంగా వెనుకబడిన వర్గాలు (ఈడబ్ల్యుఎస్), అల్పాదాయ వర్గాల (ఎల్‌ఐజీ) గృహ రుణాల కోసం 'దిశ హోమ్ లోన్స్' పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టింది. ప్రవాస భారతీయులతో పాటు ఉద్యోగులు, స్వయం ఉపాధి రంగంలో ఉన్న వారు కూడా ఈ గృహ రుణాలు తీసుకోవచ్చు. నిర్మాణం పూర్తయిన, నిర్మాణంలో ఉన్న ఇళ్లతో పాటు రీసేల్‌కు వచ్చిన ఇళ్లు, ఫ్లాట్ల కొనుగోళ్లకూ ఈ పథకం కింద యాక్సిస్ ఫైనాన్స్ గృహ రుణాలు అందజేస్తుంది. ఇంకా స్థలం ఉండి ఇల్లు కట్టుకోవాలనుకునే వ్యక్తులు, ఇప్పటికే ఉన్న ఇళ్ల నవీకరణ, విస్తరణ కోసం కూడా రుణాలు ఇస్తుంది.

'ఆటో' రుణాల్లోకి రెన్యూబై

బీమా అగ్రిగేటర్ రెన్యూబై ఆటో రుణాల విభాగంలోకి అడుగుపెట్టింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.1500 కోట్ల రుణాలందించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇందుకు అనుగుణంగా డిజిటల్ ఇన్సూరెన్స్ విభాగాన్ని అప్‌గ్రేడ్ చేసింది. ఆటో రుణాల మంజూరు కోసం 18 బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలతో రెన్యూబై భాగస్వామ్యాలు కుదుర్చుకుంది.

ఎస్‌బీఐ లాభం రూ.18,642 కోట్లు

- మార్చి త్రైమాసికంలో 10% క్షీణత
- ఒక్కో షేరుకు రూ.15.90 డివిడెండ్

న్యూఢిల్లీ: మార్చితో ముగిసిన 2024-25 ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికం (క్యూ4)లో ఎస్‌బీఐ స్టాండ్‌ఎలోన్ నికర లాభం రూ.18,642 కోట్లకు పరిమితమైంది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఇదే కాలానికి ఆర్జించిన రూ.20,698 కోట్ల లాభంతో పోలిస్తే 10 శాతం తగ్గింది. మొండి బాకీలు, ఇతర అవసరాల కోసం కేటాయింపులు గణనీయంగా పెరగడంతో పాటు నికర వడ్డీ మార్జిన్ తగ్గడం ఇందుకు ప్రధాన కారణం. బ్యాంకు మొత్తం ఆదాయం మాత్రం రూ.1,28,412 కోట్ల నుంచి రూ.1,43,876 కోట్లకు పెరిగింది. అందులో వడ్డీ ఆదాయం రూ.1,11,043 కోట్ల నుంచి రూ.1,19,666 కోట్లకు ఎగబాకింది. క్యూ4లో నికర వడ్డీ ఆదాయం (ఎన్ఐఐ) వార్షిక ప్రాతిపదికన 2.7 శాతం వృద్ధితో రూ.42,774.55 కోట్లకు చేరగా.. నికర వడ్డీ మార్జిన్ (ఎన్ఐఎం) మాత్రం 0.32 శాతం తగ్గి 3.15 శాతానికి పరిమితమైంది. గత 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను బ్యాంకు తన వాటాదారులకు ఒక్కో షేరుకు రూ.15.90 డివిడెండ్ ప్రకటించింది. గడిచిన 12 ఏళ్లలో ఎస్‌బీఐ చెల్లించబోయే అత్యధిక డివిడెండ్ ఇదే. మరిన్ని ముఖ్యాంశాలు..

- క్యూ4లో ఎస్‌బీఐ ఏకీకృత నికర లాభం వార్షిక ప్రాతిపదికన 8 శాతం తగ్గి రూ.19,600 కోట్లుగా నమోదైంది. మొత్తం ఆదాయం రూ.1,79,562 కోట్లకు పెరిగింది.
- 2024-25 ఆర్థిక సంవత్సరానికి బ్యాంకు స్టాండ్‌ఎలోన్ లాభం రూ.70,901 కోట్లు, మొత్తం రాబడి రూ.5,24,172 కోట్లుగా నమోదైంది. ఇదే కాలానికి ఏకీకృత లాభం రూ.79,017 కోట్లు, మొత్తం రాబడి రూ.6,63,343 కోట్లుగా ఉంది.
- బ్యాంక్ ఆస్తుల నాణ్యత మరింత మెరుగుపడింది. ఈ మార్చి 31 నాటికి ఎస్‌బీఐ మొండి బకాయిలు (స్థూల ఎన్‌పీఏ) 1.82 శాతానికి తగ్గాయి. నికర ఎన్‌పీఏలు 0.47 శాతానికి జారుకున్నాయి.
- ఈ ఆర్థిక సంవత్సరం (2025-26)లో క్యూఐపీ లేదా ఫాలో ఆన్ పబ్లిక్ ఆఫర్ (ఎఫ్‌పీఓ) లేదా ఇతర మార్గాల్లో రూ.25,000 కోట్ల వరకు సమీకరించేందుకు ఎస్‌బీఐ బోర్డు ఆమోదం తెలిపింది.

బిజినెస్ ప్లస్

వాణిజ్య యుద్ధంతో రుణ వృద్ధిపై ప్రభావం

- ఎస్‌బీఐ చైర్మన్ చల్లా శ్రీనివాసులు శెట్టి



ముందు ఆర్‌బీఐ రెపో రేటును మరింత తగ్గించే అవకాశాలున్నాయి. దాంతో రుణాలపై వడ్డీ రేట్లు కూడా మరింత తగ్గుముఖం పట్టనున్నాయని, ఇది బ్యాంకు మార్జిన్లపై ఒత్తిడి పెంచనుందని ఎస్‌బీఐ చైర్మన్ చల్లా శ్రీనివాసులు శెట్టి అన్నారు. ఈ ఏడాదిలో ఆర్‌బీఐ రెపో రేటును మరో 0.50 శాతం తగ్గించవచ్చని భావిస్తున్నామన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం (2025-26)లో 12-13 శాతం రుణ వృద్ధి సాధించాలని ఎస్‌బీఐ లక్ష్యంగా పెట్టుకుంది. ట్రంప్ సుంకాలతో మొదలైన వాణిజ్య యుద్ధంతో అంతర్జాతీయంగా ఆర్థిక అనిశ్చితి పెరిగింది. దీంతో కంపెనీల పెట్టుబడులు మందగించవచ్చని, ఇది రుణ వృద్ధి పైనా ప్రభావం చూపే అవకాశం ఉందని శెట్టి అన్నారు. ప్రస్తుతం ఎస్‌బీఐ కార్పొరేట్ లోన్ బుక్ రూ.3.4 లక్షల కోట్లుగా ఉంది.

ఈసారి 18,000 నియామకాలు

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఎస్‌బీఐ దశాబ్ద గరిష్ఠ స్థాయిలో 18,000 నియామకాలు చేపట్టనుందని శ్రీనివాసులు శెట్టి తెలిపారు. అందులో 13,400 మంది క్లర్కులు, 3,000 మంది ప్రొబేషనరీ ఆఫీసర్లు, 1,600 మంది ప్రత్యేక నైపుణ్యాలు కలిగిన అధికారులను నియమించుకోనున్నట్లు శెట్టి చెప్పారు.

కోటక్ బ్యాంక్ లాభం 14% డౌన్

న్యూఢిల్లీ: మార్చితో ముగిసిన చివరి త్రైమాసికంలో కోటక్ మహీంద్రా బ్యాంక్ స్టాండ్‌ఎలోన్ నికర లాభం వార్షిక ప్రాతిపదికన 14 శాతం తగ్గి రూ.3,552 కోట్లకు జారుకుంది. బ్యాంక్ మొత్తం ఆదాయం మాత్రం రూ.16,712 కోట్లకు పెరిగింది. బ్యాంక్ నికర వడ్డీ ఆదాయం 5 శాతం పెరుగుదలతో రూ.7,284 కోట్లకు చేరగా.. నికర వడ్డీ మార్జిన్ 4.96 శాతానికి తగ్గింది. స్థూల ఎన్‌పీఏలు 1.39 శాతం నుంచి 1.42 శాతానికి పెరగగా, నికర ఎన్‌పీఏలు 0.34 శాతం నుంచి 0.31 శాతానికి తగ్గాయి. 2024-25 ఆర్థిక సంవత్సరానికి బ్యాంక్ రూ.16,450 కోట్ల స్టాండ్‌ఎలోన్ నికర లాభాన్ని నమోదు చేసింది. కాగా రూ.5 ముఖ విలువ కలిగిన ప్రతి షేరుకు రూ.2.5 డివిడెండ్‌ను బ్యాంక్ డైరెక్టర్ల బోర్డు సిఫారసు చేసింది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



4వ తేదీ			
హైదరాబాద్	455	విజయవాడ	480
వరంగల్	457	గోదావరి	460
చిత్తూరు	533	విశాఖపట్నం	465
		డజను గుడ్లు రూ. 60	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	140	విజయవాడ	142
వరంగల్	140	గుంటూరు	140
కరీంనగర్	140	ఒంగోలు	140
మహబూబ్‌నగర్	140	చిత్తూరు	107
కర్నూలు	140	నెల్లూరు	112
విశాఖపట్నం	141	అనంతపురం	112
గోదావరి	142		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	95,500 ▼	87,550 ▼	1,09,000 ▲
విజయవాడ	96,500 ▼	90,500 ▼	96,000 ▼
విశాఖపట్నం	95,510 ▼	87,550 ▼	1,09,000 ▲
రాజమండ్రి	95,510 ▼	87,550 ▼	96,200 ▼
ప్రొద్దుటూరు	96,000 ▲	88,320 ▲	96,200 ▼
ముంబై	93,954 ▼	86,062 ▼	94,125 ▲

పార్లమెంటులో బీసీ బిల్లు పెట్టాలి

» ప్రధాని మోదీకి ఎంపీ ఆర్. కృష్ణయ్య వినతి పత్రం

రాంనగర్, మే 3 (ఆంధ్రజ్యోతి) : పార్లమెంటులో బీసీ బిల్లు పెట్టి చట్ట సభలలో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కోరుతూ ప్రధాని నరేంద్ర మోదీకి రాజ్యసభ సభ్యులు ఆర్. కృష్ణయ్య వినతి పత్రం అందజేశారు. జనగణనలో కులగణన చేయడానికి కేంద్రం నిర్ణయం తీసుకున్నందుకు జాతీయ బీసీ సంక్షేమ సంఘం తరఫున ప్రధానికి కృతజ్ఞతలు తెలియజేసినట్లు తెలిపారు. విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో ఆయన శనివారం మాట్లాడుతూ.. ఏపీ పర్యటనకు వచ్చిన ప్రధానిని తాను కలిసి బీసీల డిమాండ్లపై వినతి పత్రం అందజేసినట్లు తెలిపారు. దేశ వ్యాప్తంగా 56 శాతం బీసీ జనాభా ఉందని వీరందరికి రాజ్యాంగ పరంగా విద్య, ఉద్యోగ, ఆర్థిక రంగాల్లో తగిన వాటాను ఇచ్చేలా కృషి చేయాలని కోరినట్లు తెలిపారు. బీసీలందరూ చట్టసభల్లోకి రావాలంటే 50 శాతం బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలని కోరినట్లు చెప్పారు. తమ డిమాండ్ల పట్ల ప్రధాని మోదీ సానుకూలంగా స్పందించినట్లు ఆర్. కృష్ణయ్య పేర్కొన్నారు. 40 ఏళ్లుగా తాను చేస్తున్న బీసీ పోరాటాన్ని ఆయన మెచ్చుకున్నట్లు చెప్పారు.

కుల గణన ఎప్పుడు పూర్తి చేస్తారు?: డి.రాజా

న్యూఢిల్లీ, మే 3 (ఆంధ్రజ్యోతి): కుల గణన ఎప్పటిలోగా పూర్తి చేస్తారో కేంద్రం స్పష్టం చేయాలని సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి. రాజా డిమాండ్ చేశారు. విధాన పరమైన నిర్ణయాలు ఎప్పుడు తీసుకుంటారనే దానిపై సమాధానం చెప్పాలన్నారు. కుల గణనను నాలుగేళ్లుగా పెండింగ్‌లో పెట్టారని గుర్తు చేశారు. ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు రామకృష్ణతో కలిసి ఆయన మీడియాతో శనివారం మాట్లాడారు. కుల గణన చేయాలని తాము ఎప్పటి నుంచో డిమాండ్ చేస్తున్నామని తెలిపారు. తెలంగాణలోనూ కుల గణనకు మద్దతు తెలిపామని, అన్నివిధాలా సహకరించామని స్పష్టం చేశారు. రిజర్వేషన్ ఫలాలు అర్హులందరికీ అందాలంటే జన గణనలో కుల గణన అవసరమని అన్నారు. రిజర్వేషన్లకు 50 శాతం పరిమితిని కేంద్రం తొలగించాలని చెప్పారు.

ఉపాధి పని దినాలు తగ్గించడం సరికాదు

» రైతు బీమాను నిర్వీర్యం చేయడం దుర్మార్గం: హరీశ్

హైదరాబాద్, మే 3 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం కోసం గత ఏడాదిలో 12.22 కోట్ల పనిదినాలు మంజూరు చేయగా ఈసారి కేవలం 6.5 కోట్లకే పరిమితం చేయడం సరికాదని మాజీ మంత్రి హరీశ్ రావు అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేస్తున్నాయని శనివారం ఎక్స్ వేదికగా ఆరోపించారు. కేంద్రం వెంటనే పనిదినాలు పెంచాలని, రాష్ట్ర ప్రభుత్వం నాలుగు నెలల పెండింగ్ వేతనాలు చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. సీఎం రేవంత్ రెడ్డి 42 సార్లు ఢిల్లీకి చక్కర్లు కొట్టినా, కాంగ్రెస్, బీజేపీకి చెరో 8 మంది ఎంపీలు ఉన్నా రాష్ట్రానికి ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. ఏ కారణం చేతనైనా రైతు మరణిస్తే.. ఆ కుటుంబం రోడ్డున పడకుండా కాపాడుకోవాలనే ఉద్దేశ్యంతో కేసీఆర్ ప్రారంభించిన రైతు బీమా పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం నిర్వీర్యం చేయడం దుర్మార్గమని మండిపడ్డారు. ఫిబ్రవరిలో కట్టాల్సిన రూ.775 కోట్ల ప్రీమియం చెల్లించకపోవడం వల్ల రైతు కుటుంబాలకు శాపంగా మారిందన్నారు.

ప్రమాద బాధిత కుటుంబానికి కేటీఆర్ అండ

» మలేషియాలో ఉన్న తండ్రి తిరుగు ప్రయాణానికి సాయం

హైదరాబాద్, మే 3 (ఆంధ్రజ్యోతి): నిర్మల్ జిల్లాకు చెందిన విద్యార్థినులైన అక్కాచెల్లెళ్లు బాణావత్ మంజుల, అశ్వినీ శుక్రవారం ఆర్మూర్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో చనిపోయిన ఘటనపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. ఆ కుటుంబానికి అండగా ఉంటానని ఆయన శనివారం ప్రకటనలో తెలిపారు. ఉపాధి కోసం వెళ్లి మలేషియాలో ఉంటున్న ఆ పిల్లల తండ్రి బాణావత్‌రెడ్డిని రాష్ట్రానికి తీసుకురావడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని తన కార్యాలయ అధికారులను ఆయన ఆదేశించారు. మలేషియాలోని భారత దౌత్యాధికారులతో సమన్వయం చేసి, ప్రయాణ అనుమతులు, టికెట్లు సహా అన్ని ఏర్పాట్లను వేగంగా పూర్తి చేయాలని సూచించారు. కాగా, సీసీఐ పత్తి కొనుగోళ్లలో అక్రమాలపై సిటింగ్ జడ్జితో విచారణ జరిపించాలని బీఆర్ఎస్ నేతలు పెద్ది సుదర్శన్ రెడ్డి, ఎర్రోళ్ల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. కాగా, దేశవ్యాప్తంగా కుల గణనను శాస్త్రీయ ప్రమాణాలతో నిర్వహిస్తే సామాజిక న్యాయానికి విజయంగా నిలుస్తుందని బీసీ కమిషన్ మాజీ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు పేర్కొన్నారు. ఈ మేరకు ప్రధాని మోదీకి లేఖ రాసినట్లు ఆయన ఒక ప్రకటనలో తెలిపారు.

కేంద్రం మావోయిస్టులతో చర్చలు జరపాలి

» శాంతి చర్చల కమిటీ చైర్మన్ జస్టిస్ చంద్రకుమార్

జమ్మికుంట, మే 3 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం మావోయిస్టులతో చర్చలు జరపాలని శాంతిచర్చల కమిటీ చైర్మన్, హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్ అన్నారు. శనివారం జమ్మికుంట పట్టణంలో మావోయిస్టులతో శాంతిచర్చలను కోరుతూ మానవహక్కుల వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్.తిరుపతయ్య అధ్యక్షతన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం వెంటనే కాల్పుల విరమణ ప్రకటించి మావోయిస్టులతో శాంతిచర్చలు జరపాలని కోరారు. గిరిజన ప్రాంతాల్లో ఆదివాసులకు రాజ్యాంగం ప్రత్యేక హక్కులు కల్పించిందని, ఈ మేరకు వారు స్వయంపాలన అధికారం కలిగి ఉంటారని చెప్పారు. గిరిజన ప్రాంతాల్లో ఆదివాసుల నిర్ణయానికి వ్యతిరేకంగా పనులు చేపట్టే అధికారం ప్రభుత్వాలకు లేదని పేర్కొన్నారు. మావోయిస్టులు తుపాకులు వినియోగించబోమని, చర్చల ద్వారా శాంతి ఏర్పడటానికి కట్టుబడి ఉన్నామని ప్రకటించారన్నారు.


మీడియాతో మాట్లాడుతున్న జేపీ మోర్గన్ కంపెనీ ఉపాధ్యక్షుడు మారియో డేవిడ్

కేఎల్‌హెచ్‌లో విద్యార్థులకు ప్లేస్‌మెంట్స్

» 75 లక్షల వార్షిక వేతనంతో ఉద్యోగాలు

» ఘనంగా ప్లేస్‌మెంట్ సక్సెస్ మీట్

మొయినాబాద్ రూరల్, మే 3 (ఆంధ్రజ్యోతి): మారుతున్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని విద్యార్థులు సంపూర్ణంగా అవగాహన చేసుకుంటే అత్యుత్తమ ఉద్యోగాలతో పాటు ఎటువంటి ఆందోళన లేకుండా కేరీర్‌ను పూర్తి చేసుకోవచ్చునని జేపీ మోర్గన్ కంపెనీ ఉపాధ్యక్షుడు మారియో డేవిడ్ పేర్కొన్నారు. కేఎల్‌హెచ్ యూనివర్సిటీలో శనివారం రాత్రి ప్లేస్‌మెంట్స్ సక్సెస్ మీట్ ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో వివిధ కార్పొరేట్ కంపెనీలకు చెందిన ప్రతినిధుల చేతుల మీదుగా విద్యార్థులు మెడల్స్ ప్రశంసా పత్రాలను అందుకున్నారు. అనంతరం విలేకరుల సమావేశంలో మారియో డేవిడ్ మాట్లాడుతూ.. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధిలో కొన్ని సవాళ్లు కూడా ఉన్నాయని, వాటిపై నిరంతరం పరిశోధనలు జరుగుతున్నాయని చెప్పారు. ఈ ఏడాది జర్మనీ, జపాన్, సింగపూర్, దుబాయ్ వంటి దేశాల్లో విద్యార్థులు అంతర్జాతీయ ప్లేస్‌మెంట్స్ దక్కించుకున్నారని తెలిపారు. మూడో ఏడాదిలోనే జాతీయ, అంతర్జాతీయ కార్పొరేట్ కంపెనీల్లో ఇంటర్న్‌షిప్ చేస్తున్నారని తెలిపారు. ఈ ఏడాది 500లకు పైగా కంపెనీలు క్యాంపస్‌కు వచ్చి విద్యార్థులను ఇంటర్వ్యూలు చేశాయని పేర్కొన్నారు. సృజనాత్మక నైపుణ్యం ఉన్న యువతకు కచ్చితంగా ప్రాధాన్యం ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. అనంతరం కార్పొరేట్ కంపెనీల ప్రతినిధులు మాట్లాడుతూ.. ప్రణాళిక ప్రకారం చదువును కొనసాగించే విద్యార్థులకు ఎప్పుడూ ప్రాధాన్యం ఉంటుందని చెప్పారు. యూనివర్సిటీ ఉపకులపతి డాక్టర్ సారథివర్మ మాట్లాడుతూ.. ఈ ఏడాది రూ.75 లక్షల రూపాయల వార్షిక ప్యాకేజీతో తమ విద్యార్థులు ప్లేస్‌మెంట్ సాధించడం గర్వకారణమని హర్షం వ్యక్తం చేశారు. రూ.20 లక్షల నుంచి రూ. 50 లక్షల వరకు వార్షిక ప్యాకేజీతో సూపర్ డ్రీమ్, డ్రీమ్ కంపెనీల్లో తమ విద్యార్థులు ప్లేస్‌మెంట్ సాధించారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ డాక్టర్ ఆకెళ్ల రామకృష్ణ, అధ్యాపక బృందంతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

పసిడి లావాదేవీలకు 'ఆల్ ఇన్ వన్ గోల్డ్ ఏటీఎం'

త్వరలోనే అందుబాటులోకి తేనున్న గోల్డ్ సిక్కా సంస్థ

బేగంపేట, మే 3 (ఆంధ్రజ్యోతి): బంగారు నాణేలను విక్రయించే ఏటీఎంను ఇప్పటికే అందుబాటులోకి తెచ్చిన గోల్డ్ సిక్కా సంస్థ.. మరిన్ని సదుపాయాలతో అధునాతన ఏటీఎంను ప్రవేశపెట్టేందుకు సిద్ధమవుతోంది. బంగారం లావాదేవీలకు సంబంధించి అనేక సేవలను అందించే 'గోల్డ్ మెల్టింగ్ ఏటీఎం'ను త్వరలోనే హైదరాబాద్‌లోని బేగంపేటలో ప్రారంభించనున్నట్లు గోల్డ్ సిక్కా లిమిటెడ్ ఎండీ, సీఈవో తరూజ్ తెలిపారు. శనివారం బేగంపేటలోని సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో 'గోల్డ్ మెల్టింగ్ ఏటీఎం' పని చేసే వివరాలతో కూడిన పోస్టర్‌ను గోల్డ్ సిక్కా ప్రతినిధులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తరూజ్ మాట్లాడారు. ఈ ఏటీఎం ద్వారా బంగారాన్ని కొనడం, అమ్మడం, మార్చడం, లీజుకు ఇవ్వడం, డిజిటైజ్ చేయడం, నగదుగా మార్చుకోవడం, బంగారు ఆభరణాలను కొనుగోలు చేయడం వంటి సేవలను పొందవచ్చని తెలిపారు. బంగారు రుణాలు మినహా అన్ని సేవలను ఇది అందిస్తుందని చెప్పారు. 2022లో బేగంపేటలో తాము ప్రారంభించిన 'గోల్డ్ రియల్ టైమ్ ఏటీఎం' ఎంతో ఆదరణ పొందిందని పేర్కొన్నారు. దాని కంటే మెరుగైన ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో 'గోల్డ్ మెల్టింగ్ ఏటీఎం' పని చేస్తుందని వివరించారు. వినియోగదారులు బంగారం అమ్మేటప్పుడు ఏటీఎంలో డిపాజిట్ చేసిన వెంటనే ఆధార్, ఐడీ కార్డును వెరిఫై చేస్తుందని చెప్పారు. బంగారం స్వచ్ఛతను పరీక్షించి, దాని విలువను స్క్రీన్‌పై చూపిస్తుందని చెప్పారు. ఆ విలువ వినియోగదారులకు అంగీకారమైతే.. ఆ మొత్తాన్ని వారి బ్యాంక్ ఖాతాలో జమ చేస్తుందని తెలిపారు. పాత బంగారాన్ని ఇచ్చి కొత్త బంగారాన్ని తీసుకునే సదుపాయం కూడా ఉందన్నారు. ఒక ఏటీఎం ఖర్చు రూ.40 లక్షలు అని, దేశ వ్యాప్తంగా 100 ఏటీఎంలు ఏర్పాటు చేయడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు.



ఏటీఎం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న గోల్డ్ సిక్కా ఎండీ, సీఈవో తరూజ్, సంస్థ ప్రతినిధులు

అందగత్తెలు వచ్చేస్తున్నారు!

శంషాబాద్‌లో మిస్ కెనడా మోరిసన్‌కు సంప్రదాయ స్వాగతం పలికిన అధికారులు

» నేడు, రేపు.. మరింత మంది రాక

» మిస్‌వరల్డ్ వేదికగా మెడికల్ టూరిజంపై ప్రచారం

» 16న ఏఐజీ ఆస్పత్రిలో కార్యక్రమం

» సీఎం రేవంత్ ఆదేశాలమేరకు ఏర్పాట్లు

హైదరాబాద్, మే 3 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించ తలపెట్టిన మిస్ వరల్డ్-2025 పోటీల్లో పాల్గొనేందుకు వివిధ దేశాల సుందరీమణులు హైదరాబాద్‌కు చేరుకుంటున్నారు. కెనడా నుంచి శనివారం సాయంత్రం శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరుకున్న మిస్ కెనడా క్యాథరన్ మోరిసన్‌కు రాష్ట్ర పర్యాటక శాఖ అధికారులు ఘనస్వాగతం పలికారు. యువతులు సంప్రదాయ నృత్యాలు చేస్తుండగా.. తెలంగాణ సంప్రదాయం ప్రకారం హారతి పట్టి, నుదుటన బొట్టు పెట్టి, మెడలో పూలమాల వేసి ఆమెను ఆహ్వానించారు. అనంతరం ఆమెను ఆతిథ్యం ఇచ్చే హోటల్‌కు తీసుకువెళ్లారు. ఇప్పటికే మిస్‌వరల్డ్ సంస్థ సీఈవో, చైర్‌పర్సన్ మిస్ జూలియా ఎవెలిన్ మోర్లీ, మిస్‌వరల్డ్ ప్రతినిధి మిస్ కెర్రి హైదరాబాద్ చేరుకోగా.. ఆది, సోమవారాల్లో 120 దేశాల నుంచి పోటీదారులు, ప్రతినిధులు రానున్నారు.

గ్లోబల్ మెడికల్ హబ్‌గా తెలంగాణ

ప్రపంచ స్థాయి సదుపాయాలు, సాంకేతికత, నిపుణులైన వైద్యులు, ఉన్నత ప్రమాణాలతో వైద్య చికిత్సలను అందిస్తూ గుర్తింపు పొందిన తెలంగాణను మెడికల్ టూరిజం హబ్‌గా ప్రపంచానికి పరిచయం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. సీఎం రేవంత్‌రెడ్డి మార్గదర్శకాల మేరకు త్వరలో జరగనున్న మిస్ వరల్డ్ పోటీల వేదికగా ఈ విషయాన్ని చాటిచెప్పేందుకు అధికారులు ప్రత్యేక కార్యాచరణ రూపొందించారు. ఈ నెల 10వ తేదీ నుంచి 31వ తేదీ వరకు హైదరాబాద్ వేదికగా మిస్ వరల్డ్-2025 పోటీలు జరగనున్న విషయం తెలిసిందే. ఇందులో 120 దేశాల ప్రతినిధులు పాల్గొనడమే కాకుండా 150పైగా దేశాల్లో ఈ కార్యక్రమం ప్రత్యక్ష ప్రసారం కానుంది. ఈ వేదిక ద్వారా మెడికల్ టూరిజంపై ప్రచారం చేయడం ద్వారా ప్రపంచ వ్యాప్తంగా హెల్త్ టూరిస్టులను ఆకర్షించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ మేరకు 16వ తేదీన తెలంగాణ మెడికల్ టూరిజంపై పరిచయ కార్యక్రమాలు నిర్వహించేందుకు అధికార యంత్రాంగా ఏర్పాట్లు చేస్తోంది. తక్కువ ఖర్చుతో అందిస్తున్న వైద్యసేవలు, మెడికల్ టూరిజంలో తెలంగాణ సాధిస్తున్న ప్రగతిని తెలియజేసేలా హైదరాబాద్‌లోని ఏఐజీ ఆస్పత్రిలో మెడికల్ టూరిజం ఈవెంట్‌ను నిర్వహించేందుకు కసరత్తు జరుగుతోంది.


శంషాబాద్ విమానాశ్రయంలో కెనడా నుంచి వచ్చిన క్యాథరన్ మోరిసన్‌కు బొట్టుపెట్టి స్వాగతం పలుకుతున్న దృశ్యం

సీఎస్ సమీక్ష

మిస్‌వరల్డ్ 2025 పోటీదారులు, ప్రతినిధులకు శంషాబాద్ విమానాశ్రయంతోపాటు హోటళ్ల వద్ద కట్టుదిట్టమైన భద్రత కల్పించాలని, ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని సీఎస్ కె.రామకృష్ణారావు అధికారులను ఆదేశించారు. మిస్ వరల్డ్ ఏర్పాట్లపై ఉన్నతాధికారులతో శనివారం ఆయన టెలికాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. మిస్‌వరల్డ్ పోటీల్లో పాల్గొనే పోటీదారులు, అతిథులు, ప్రతినిధుల కోసం సమగ్ర సమాచార బుక్‌లెట్‌లను సిద్ధం చేయాలని పర్యాటక శాఖ అధికారులను ఆదేశించారు. వారు సందర్శించే ప్రదేశాలను యుద్ధ ప్రాతిపదికన సుందరీకరించాలని ఆదేశించారు.

హెరిటేజ్ వాక్ ఏర్పాట్లను పరిశీలించిన సీపీ

చార్మినార్: మదీనా, పత్తర్‌గట్టి, గుల్జర్ హౌస్, చార్మినార్, లాడ్ బజార్ గాజుల మార్కెట్ నుంచి చౌమొహల్లా ప్యాలెస్ వరకు మిస్ వరల్డ్ పోటీదారులు ఈనెల 13న హెరిటేజ్ వాక్ నిర్వహించనున్న నేపథ్యంలో పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ ఏర్పాట్లను పరిశీలించారు. చౌమొహల్లా ప్యాలెస్‌లో వివిధ విభాగాల అధికారులతో సమీక్ష నిర్వహించారు. చార్మినార్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సరిత మాట్లాడుతూ మదీనా నుంచి చార్మినార్ వరకు గాజుల షాపులను అందంగా తీర్చిదిద్దాలని వ్యాపారులకు సూచించామని, ఆయా మార్గాల్లో రోడ్లు, వీధి దీపాలు ఆధునికీకరిస్తున్నామని, ఎక్కడా చెత్త కనబడకుండా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

ఎప్‌సెట్ అభ్యర్థులకు 'సర్వర్' కష్టాలు!

» పరీక్ష కేంద్రాల్లో మొరాయిస్తున్న సర్వర్లు

» సమయాన్ని సర్దుబాటు చేశామన్న అధికారులు

» రెండో రోజు 93.83 శాతం హాజరు

హైదరాబాద్ సిటీ, మే 3 (ఆంధ్రజ్యోతి): టీజీఎప్‌సెట్ పరీక్షలకు సర్వర్ సమస్యలు ఎదురవుతున్నాయి. హైదరాబాద్‌లోని పలు పరీక్ష కేంద్రాల్లో సర్వర్లు మొరాయించడంతో అభ్యర్థులు ఇబ్బందిపడ్డారు. దీంతో పరీక్ష కేంద్రాల్లోకి వెళ్లిన విద్యార్థులు షెడ్యూల్ సమయంకన్నా 45నిమిషాల నుంచి గంట వరకు ఆలస్యంగా బయటకు వస్తున్నారు. శనివారం ఇంజనీరింగ్ పరీక్షకు బాచుపల్లిలోని బీవీఆర్ఐటీ ఇంజనీరింగ్ కాలేజీలో సర్వర్ సమస్యలు తలెత్తాయి. రెండో సెషన్‌లో పరీక్ష రాసిన విద్యార్థులు సాయంత్రం 6గంటలకు బయటకురావాల్సి ఉండగా.. 6.45వరకు రాకపోవడంతో తల్లిదండ్రులు కాస్త ఆందోళనకు గురయ్యారు. కొన్ని కళాశాలల్లో పాత కంప్యూటర్లనే వినియోగిస్తుండటం సమస్యలు తలెత్తిఉండవచ్చని ఐటీ నిపుణులు చెబుతున్నారు. మరోవైపు మెయిన్ సర్వర్‌కు కనెక్టయ్యే కళాశాలల్లోని లోకల్ సర్వర్లను సిబ్బంది మెయింటెనెన్స్ చేయకపోవడమూ కారణం కావచ్చంటున్నారు. ఈ విషయమై ఎప్‌సెట్ అధికారులు స్పందిస్తూ.. సర్వర్ సమస్య తలెత్తితే కంప్యూటర్లను రీబూట్ చేయడానికి 20-45 నిమిషాలు పడుతుందని, అప్పుడు అభ్యర్థులు నష్టపోయిన సమయాన్ని సర్దుబాటు చేసినట్టు చెప్పారు. ఇక శనివారం (రెండోరోజు) జరిగిన ఎప్‌సెట్ ఇంజనీరింగ్ పరీక్షకు రాష్ట్రవ్యాప్తంగా 73,777 మంది రిజిస్ట్రేషన్ చేసుకోగా 69,227 మంది (93.83శాతం)అభ్యర్థులు హాజరయ్యారు. రెండోరోజు లెక్కల ప్రశ్నలు కఠినంగా, సుదీర్ఘంగా ఉండటంతో ఎక్కువగా ఆన్సర్ చేయలేకపోయినట్టు అభ్యర్థులు తెలిపారు. ఫిజిక్స్ ప్రశ్నలు మోస్తరు కఠినంగా, కెమిస్ట్రీ ప్రశ్నలు సులువుగా ఉన్నట్టు పేర్కొన్నారు.

ఆర్టీసీ జేఏసీ నేతలను చర్చలకు పిలిచే చాన్స్

» సర్కారు సమాలోచనలు

హైదరాబాద్, మే 3(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ జేఏసీ ఇచ్చిన సమ్మె పిలుపును విరమింపజేసేందుకు ప్రభుత్వం సమాలోచనలు చేస్తోంది. అందులో భాగంగా ఇప్పటికే మంత్రి పొన్నం ప్రభాకర్ ఆర్టీసీ ఉన్నతాధికారులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. జేఏసీ ఇచ్చిన సమ్మె నోటీసులోని 21 అంశాల్లో తక్షణం పరిష్కరించేందుకు ఆస్కారం ఉన్నవి, బడ్జెట్‌తో ముడిపడిన వాటి గురించి వేర్వేరుగా పూర్తిస్థాయిలో చర్చించారు. అధికారులు ఇచ్చిన వివరాల ఆధారంగా మంత్రి పొన్నం సీఎం రేవంత్ రెడ్డితో సమావేశమై ఆయన ఆదేశాల మేరకు తదుపరి చర్యలు చేపట్టనున్నట్లు సమాచారం. సీఎంతో భేటీ అనంతరం ఒకటి, రెండు రోజుల్లో ఆర్టీసీ జేఏసీ నాయకులతో మంత్రి పొన్నం సమావేశమై చర్చించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ నెల 7 నుంచి సమ్మె చేపడతామని ప్రకటించిన జేఏసీ.. ప్రభుత్వం చర్చలకు పిలిచి సమస్యల పరిష్కార మార్గాలు చూపితే సమ్మె ఆలోచనను విరమించుకుంటామని ఇప్పటికే తెలిపింది. ప్రపంచ అందాల పోటీలు జరిగే సమయంలో సమ్మెలు, ఆందోళనలు అంతర్జాతీయ మీడియా దృష్టిని ఆకర్షించే అవకాశం ఉంటుందన్న విషయాన్ని పరిగణనలోకి తీసుకున్న ప్రభుత్వం సమ్మెను విరమింపజేయడానికి ప్రయత్నిస్తోంది. మరోవైపు, సమ్మెకు ముందు బలప్రదర్శనలో భాగంగా సోమవారం జేఏసీ 'కార్మిక కవాతు' చేపట్టింది. అన్ని జిల్లాల నుంచి ఉద్యోగులు పాల్గొనాలని పిలుపునిచ్చింది.

57 డిమాండ్లు పరిష్కరించండి

» సీఎస్‌కు టీజీవో విజ్ఞప్తి

హైదరాబాద్, మే 3 (ఆంధ్రజ్యోతి): దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న 57ప్రభుత్వోద్యోగుల డిమాండ్లు పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే రామకృష్ణారావుకు తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం (టీజీఓ) విజ్ఞప్తి చేసింది. సంఘం అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో టీజీఓ ప్రతినిధులు శనివారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి వినతిపత్రం సమర్పించారు. సీఎస్‌గా నియమితులైనందుకు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. తమ డిమాండ్లపై 16 నెలలుగా సీఎం, డిప్యూటీ సీఎంలను కలిసి విజ్ఞప్తి చేసినా ఒక్క అడుగూ ముందుకు పడలేదని ఆందోళన వ్యక్తం చేశారు. పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏలు విడుదల చేసి, రూ.10వేలకోట్ల విలువైన బిల్లులు క్లియర్ చేయాలని కోరారు. ఈ నెలలోనే సాధారణ బదిలీలు చేపట్టడం తోపాటు సమయానుకూలంగా శాఖాపరమైన పదోన్నతుల కమిటీలను ఏర్పాటుచేసి పదోన్నతులు కల్పించాలని అభ్యర్థించారు. సీపీఎస్‌ని రద్దు చేసి, దాని స్థానే పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలన్నారు. రెండో పీఆర్సీ నివేదిక పరిశీలించి.. ఉద్యోగులకు 51శాతం ఫిట్‌మెంట్‌తోపాటు అందరికీ హెల్త్ కార్డులు ఇవ్వాలని, 317 జీవోను సమీక్షించి సూపర్ న్యూమరీ పోస్టులను సృష్టించాలని కోరారు. సీఎస్ రామకృష్ణారావును కలిసిన వారిలో సంఘం ప్రధాన కార్యదర్శి ఎ.సత్యనారాయణ, సహ అధ్యక్షుడు బి.శ్యామ్, కోశాధికారి ఎం.ఉపేందర్‌రెడ్డి ఉన్నారు.

జగన్ ఆదేశించారు.. మేం పాటించాం!

పార్టీకి బాగా ఫండ్ రావాలన్నారు.. అందుకనుగుణంగా లిక్కర్ పాలసీ

» సాయిరెడ్డి, మిథున్ రెడ్డి, శ్రీధర్ రెడ్డి కలిసి చర్చలు జరిపాం

» సిట్ కస్టడీలో రాజ్ కసిరెడ్డి వెల్లడి

» మద్యం స్కామ్‌లో నేడూ సిట్ విచారణ

అమరావతి, మే 3(ఆంధ్రజ్యోతి): 'పార్టీకి బాగా ఫండ్ వచ్చేలా లిక్కర్ పాలసీ రూపొందించాలని జగన్ రెడ్డి ఆదేశించారు. విజయసాయి రెడ్డి ఇల్లు, స్టార్ హోటళ్లు, మా ఆఫీసులో పలుమార్లు సమావేశమై అందుకు అనుగుణంగా పాలసీ రూపొందించాం. సాయిరెడ్డి, మిథున్ రెడ్డి, శ్రీధర్ రెడ్డి తదితరులం కలిసి చర్చలు జరిపాం. కమీషన్ల పర్సెంటేజీపైనా చర్చించి డిస్టిలరీలకు చెప్పేశాం. ముడుపులు ఇచ్చిన వారి లిక్కర్ ఆర్డర్ బాధ్యతలు మాజీ ఎండీ వాసుదేవ రెడ్డి (ఏ2), బేవరేజెస్ కార్పొరేషన్ ఓఎస్డీ సత్యప్రసాద్ (ఏ3)చూసుకున్నారు. ముడుపులు ఎవరికి చేరాయో నాకు తెలీదు' అని ఏపీ మద్యం కుంభకోణంలో ప్రధాన నిందితుడు కసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి(రాజ్ కసిరెడ్డి) సిట్ విచారణలో వెల్లడించినట్లు తెలిసింది. శనివారం ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) కస్టడీలో అధికారులు సుమారు 90కి పైగా ప్రశ్నలు సంధించారు. 'లిక్కర్ స్కామ్ గురించి నాకెలా తెలుస్తుంది? నేను ఐటీ అడ్వైజర్‌గా ఉన్నాను. నాకు సంబంధం లేని వాటి గురించి మీరు అడిగితే నేను చెప్పలేను' అంటూ తొలుత బుకాయించిన రాజ్ కసిరెడ్డి.. కొన్ని ఆధారాలు ముందు పెట్టి సిట్ అధికారుల ప్రశ్నించడంతో నీళ్లు నమిలి అసలు గుట్టు విప్పాడు. 'వైసీపీ విజయం సాధించిన తర్వాత జగన్ రెడ్డి పిలిచి లిక్కర్ పాలసీ తయారు చేయాలి.. అందులో మన పార్టీకి బాగా ఫండ్ రావాలి.. సాయన్న, మిథున్‌తో మాట్లాడు అని చెప్పారు. అప్పట్లో వైసీపీలో కీలకంగా ఉన్న ఆ ఇద్దరు నేతలకు ఈ విషయం చెప్పా. అప్పటికే వారికి జగన్ రెడ్డి ఆదేశాలున్నాయి. హైదరాబాద్‌లో 2019 అక్టోబరు 13న సాయిరెడ్డి ఇంట్లో ఫస్ట్ మీటింగ్ జరిపాం. డిస్టిలరీల యజమానుల్ని ఒక హోటల్‌కు పిలిచి 12 శాతం ఇస్తేనే ఏపీలో మీ ప్రొడక్ట్‌ను అనుమతిస్తామని చెప్పాం. కొందరు సరే అన్నారు. మరికొందరు ఆలోచిస్తామని వెళ్లిపోయారు. స్పందన లేని మద్యం కంపెనీల సరుకు ఆర్డర్ ఆపేయాలని వాసుదేవరెడ్డి, సత్యప్రసాద్‌కు ఆ తర్వాతి భేటీలో చెప్పాం. కొన్ని డిస్టిలరీలను బలవంతంగా లాక్కునే బాధ్యత విజయసాయి రెడ్డి, మిథున్‌రెడ్డి తీసుకున్నారు. సజ్జల శ్రీధర్ రెడ్డి భాగస్వామి అయ్యాడు' అని వివరించినట్లు తెలిసింది.

ఎదురెదురుగా కూర్చోబెట్టి...

ముడుపుల డబ్బులు ఎవరు వసూలు చేశారో? ఎక్కడికి చేరాయో తనకు తెలియదని రాజ్ కసిరెడ్డి తొలుత బుకాయించాడు. పలువురు నిందితుల స్టేట్‌మెంట్లతో పాటు ఫోన్ డేటా, వసూళ్లకు ఏర్పాటు చేసుకున్న నెట్‌వర్క్, లిక్కర్ వ్యాపారులు చెప్పిన వివరాలను సిట్ అధికారులు ముందుంచారు. 'నన్ను ఇబ్బంది పెట్టొద్దు.. ఎవరు ఇచ్చారో, ఎవరికి చేరాయో నాకు తెలీదు' అంటూ కసిరెడ్డి బిక్క మొహం వేసినట్లు సమాచారం. అదే సమయంలో మరో నిందితుడు రాజ్ కసిరెడ్డి ముఖ్య అనుచరుడు బూనేటి చాణక్య (ఏ6)ను ఎదురుగా కూర్చోబెట్టి అధికారులు ప్రశ్నించారు. ఇద్దరి నుంచి పొంతన లేని సమాధానాలు వచ్చాయి. విజయసాయి రెడ్డి, అనిల్ రెడ్డి, జగన్ ఓఎస్డీకి డబ్బులు అందజేశారా అని ప్రశ్నించగా, ఇద్దరూ వేర్వేరు సమాధానం ఇచ్చినట్లు తెలిసింది. అప్పటికే సమయం పూర్తికావడంతో వారిని విజయవాడ జైలుకు తరలించారు.

నేడూ విచారణ

ఆదివారం నాడు రాజ్ కసిరెడ్డి, చాణక్యను వేర్వేరుగా, ఇద్దరిని కలిపి విచారించి మరింత కీలక సమాచారాన్ని సేకరించేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. మూడో రోజు కస్టడీలో రాజ్ కసిరెడ్డిని ఏమి అడగాలి? అతడి ముఖ్య అనుచరుడు చాణక్యను ఏం విచారించాలి? అనే దానిపై సీఐడీ ఉన్నతాధికారులు సిట్ బృందానికి కీలక సూచనలు చేసినట్లు తెలిసింది.



శాంతిర్యాలీలో పాల్గొన్న వివిధ పార్టీలు, శాంతి సంఘాల నేతలు

హత్యాకాండను ఆపండి

» కేంద్రం మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలి

» పూర్వ విప్లవ విద్యార్థుల వేదిక

రాంనగర్, మే 3 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం మావోయిస్టులతో చర్చలు జరపాలని, కర్రెగుట్టల నుంచి సాయిధ బలగాలను ఉపసంహరించుకోవాలని, ఆదివాసీలపై హత్యా కాండను ఆపాలని పూర్వ విప్లవ విద్యార్థుల వేదిక ప్రతినిధులు డిమాండ్ చేశారు. బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం నుంచి ఆర్టీసీ క్రాస్‌రోడ్ మీదుగా ఇందిరాపార్కు వరకు శనివారం శాంతిర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో ప్రముఖ కవి నందిని సిధారెడ్డి, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, వీక్షణం వేణుగోపాల్, పౌరహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గడ్డం లక్ష్మణ్, అరుణోదయ విమలక్క, మాజీ ఎమ్మెల్యే క్రాంతి, మాజీ ఎమ్మెల్సీ దేవి ప్రసాద్, ప్రజా సంఘాల నేతలతో పాటు ఉద్యమకారులు, మేధావులు పెద్ద సంఖ్యలో పాల్గొని మాట్లాడారు. ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే కాల్పుల విరమణ ప్రకటించాలని, ప్రభుత్వం మావోయిస్టులతో చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. కర్రెగుట్టల నుంచి పారా మిలిటరీ బలగాలను ఉపసంహరించుకోవాలని కోరారు.

ఏపీ భవన్‌లో 'కబ్జా దుకాణం'

» అతడి బాగోతం తెలియక తెలంగాణ ఎంపీ వత్తాసు

» కొత్తగా కారులో షాపు..అక్కడే పార్కింగ్

న్యూఢిల్లీ, మే 3 (ఆంధ్రజ్యోతి): ఓ వ్యక్తి ఢిల్లీలోని ఏపీ భవన్‌లో అక్రమంగా దుకాణం నిర్వహిస్తున్నాడు! అదీ 20 ఏళ్లుగా! దుకాణం ముసుగులో అతడు అక్రమ వ్యవహారాలకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు రావడంతో రెండు నెలల క్రితమే ఏపీ భవన్ రెసిడెంట్ కమిషనర్ లవ్ అగర్వాల్ ఆ దుకాణాన్ని ఖాళీ చేయించగా.. పెద్ద ఎత్తున పైరవీలు చేయించాడు. షాప్‌ను తిరిగి తనకు అప్పగించాలంటూ ఏపీకి చెందిన కేంద్రమంత్రి, ఏపీ మంత్రి వద్ద తెలిసిన వ్యక్తుల ద్వారా ఒత్తిడి తెచ్చేందుకు యత్నించాడు. అసలు విషయం తెలుసుకున్న సదరు నేతలు జోక్యం చేసుకోవడానికి నిరాకరించారు. అయితే భవన్‌లో ఎప్పుడూ సందడి చేసే తెలంగాణకు చెందిన సీనియర్ ఎంపీకి కొంతమంది తప్పుడు సమాచారం ఇవ్వడంతో ఆయన సదరు కబ్జాదారుడికి మద్దతు పలికారు. అయితే ఆ కమిషనర్ ఒత్తిడికి తలొగ్గక పోగా షాపునే కూల్చివేయించారు. అయినప్పటికీ సదరు కబ్జాదారుడు అక్కడికి ఓ కారు తెచ్చి.. అందులోనే కొత్త దుకాణాన్ని తెరిచాడు. పగలంతా దుకాణం నిర్వహిస్తూ రాత్రిళ్లు భవన్‌లోనే ఆ వాహనాన్ని పార్కింగ్ చేస్తుండడం గమనార్హం.

యాసంగి సన్నాలకూ రూ.500 బోనస్

- అకాల వర్షాలకు తడిచిన ధాన్యాన్నీ కొంటాం
- రెండేళ్లలో దేవాదుల ప్రాజెక్టు పూర్తి చేస్తాం
- ఆరు లక్షల ఎకరాలకు సాగునీరిస్తాం: ఉత్తమ్



వరంగల్, మే 3 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): యాసంగిలో పండిన సన్న రకం ధాన్యానికి కూడా క్వింటాలుకు రూ.500 బోనస్ ఇస్తామని, వానాకాలం తరహాలోనే ప్రోత్సాహాన్ని కొనసాగిస్తామని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. శనివారం హనుమకొండ జిల్లా దేవన్నపేటలో దేవాదుల పంప్‌హౌస్ వద్ద మోటర్లను, ధర్మసాగర్ వద్ద దేవాదుల టన్నెల్ పనులు, వరంగల్ భద్రాకాళి చెరువు మట్టి పూడికతీత పనులను ఆయన పరిశీలించారు. అనంతరం హనుమకొండ కలెక్టరేట్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులు, పౌరసరఫరాలశాఖ పనితీరుపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ.. దేశంలో ఏ రాష్ట్రంలో పండని విధంగా తెలంగాణలో 2024-25లో ఖరీఫ్‌లో 153 లక్షల మెట్రిక్ టన్నులు, యాసంగిలో 125 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం పండిందని చెప్పారు. ఒక ఏడాదిలో ఇంతగా ధాన్యం దిగుబడి రావటం రికార్డు అని పేర్కొన్నారు. ఏటా సుమారు రూ.16వేల కోట్లతో కొనుగోలు కేంద్రాల ద్వారా రైతులు పండించి ధాన్యాన్ని సేకరిస్తున్నామన్నారు. రాష్ట్రంలో అకాల వర్షాలతో తడిసిన ధాన్యాన్నీ కొనుగోలు చేస్తామని పేర్కొన్నారు. రేషన్ షాపుల ద్వారా పేదలకు సన్న బియ్యం అందిస్తున్నామని చెప్పారు. అర్హులైన పేదలందరికీ కొత్త రేషన్‌కార్డులు ఇస్తున్నామని తెలిపారు. గత పదేళ్లలో రేషన్‌కార్డుల్లో తొలిగింపులు చేశారని కానీ, కొత్తగా కార్డులిచ్చింది లేదన్నారు. రెండేళ్లలో దేవాదుల ప్రాజెక్టును పూర్తి చేస్తామని తెలిపారు. ప్రస్తుతం 2.50లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందని, మిగిలిపోయిన భూసేకరణతో పాటు ఇతర పనులన్నీ పూర్తి చేసి ఆరు లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తామని చెప్పారు. గత ప్రభుత్వం సమ్మక్క బ్యారేజీకి ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నుంచి ఎన్‌వోసీ తీసుకోలేదని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వంతో చర్చలు జరుపుతున్నామని, త్వరలోనే అక్కడి నుంచి ఎన్‌వోసీ వస్తుందని తెలిపారు.ప్రతి ఏటా రూ.23 కోట్లు ఖర్చు చేస్తూ, కొత్తగా ఐదారు లక్షల ఎకరాలకు సాగునీరు అందించేలా ప్రణాళికతో ముందుకు పోతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీతక్క, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఆయాశాఖల అధికారులు పాల్గొన్నారు.

మహిళా కార్మికులకు ప్రత్యేక బొగ్గు గనులు

- ఓపెన్ కాస్టు, భూగర్భ గనిని కేటాయించాలి:సీఎండీ

హైదరాబాద్, కొత్తగూడెం, మే 3 (ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థలో మహిళా కార్మికుల సంఖ్య పెరగడంతో వీరి కోసం ప్రత్యేకంగా ఒక ఓపెన్ కాస్టు, మరో భూగర్భ గనిని కేటాయించడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆ సంస్థ సీఎండీ ఎన్. బలరామ్ అధికారులను ఆదేశించారు. తొలి దశ లో ఆయా గ నుల్లో మహిళా కార్మికులతో ఒక షిఫ్టు అంతా నడిపించాలని, ఆ తర్వాత పూర్తిగా వారి నిర్వహణలోనే ఒక ఓపెన్ కాస్టు, ఒక భూగర్భ గనిని నడిపించాలని నిర్దేశించారు. శనివారం బొగ్గు ఉత్పత్తి, రవాణ, నాణ్యతపై ఆయన సింగరేణి భవన్‌లో అధికారులతో సమీక్షించారు. బొగ్గు ఉత్పత్తిలో నాణ్యతను పెంచాలని సూచించారు. ఒడిశాలో కొత్తగా ప్రారంభించిన నైనీ బొగ్గు బ్లాకులో పని చేసేందుకు సూపర్‌వైజర్ సిబ్బందిని ఎంపిక చేసి, నెల రోజుల్లోగా అక్కడికి పంపించాలని ఆదేశించారు.

రంగనాయకసాగర్‌లో మునిగి ఇద్దరి మృతి

- బాలికను కాపాడబోయి మునిగిన బాలుడు



అర్బాజ్ అలీ మృతదేహాన్ని రిజర్వాయర్ నుంచి బయటకు తీసుకొస్తున్న గజ ఈతగాళ్లు

చిన్నకోడూరు, మే 3 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలంలోని రంగనాయకసాగర్ జలాశయాన్ని చూడడానికి కుటుంబ సభ్యులతో వచ్చిన ఇద్దరు బాలలు ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతిచెందారు. మరో ఇద్దరిని కుటుంబ సభ్యులు కాపాడారు. వరంగల్‌లోని ఎల్బీనగర్‌కు చెందిన సయ్యద్ ఏజాజ్ అలీ, అతని భార్య ఆస్మానుప్రత్, పెద్ద కుమారుడు అయాజ్ అలీ, చిన్న కుమారుడు అర్బాజ్ అలీ, కూతురు ఆయెషా జాయా, అల్లుడు ముబష్షిర్, కోడలు నేహ సుల్తాన్, అదే కాలనీకి చెందిన ఎండీ అస్మా, ఆమె ఇద్దరు కూతుళ్లు మెహేరాజ్, మహేన్‌తో కలిసి ఓ వాహనంలో శనివారం ఉదయం రంగనాయక సాగర్ రిజర్వాయర్‌కు వచ్చారు. మధ్యాహ్నం సమయంలో రిజర్వాయర్ బోటింగ్ మెట్ల సమీపంలో పిల్లలు నీటిలోకి దిగి ఆడుతున్నారు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు ఒక్కసారిగా మెహేరాజ్ (13) నీటిలో మునిగింది. ఆమెను కాపాడేందుకు వెళ్లిన అర్బాజ్ అలీ (15) కూడా నీటిలో మునిగి పోయాడు. అతడి సోదరుడు అయాజ్ అలీని, సోదరి ఆయేషా జాయాను కుటుంబ సభ్యులు బయటకు లాగడంతో వారు ప్రాణాలతో బయట పడ్డారు. సమాచారం అందుకున్న చిన్నకోడూరు ఎస్‌ఐ బాలకృష్ణ సిబ్బందితో అక్కడికి చేరుకున్నారు. గజ ఈతగాళ్ల సాయంతో గల్లంతైన వారి కోసం గాలింపు చర్యలు చేపట్టి మెహేరాజ్, అర్బాజ్ అలీ మృతదేహాలను వెలికితీశారు.

'ఎర్లీబర్డ్' పథకంతో రూ.400 కోట్ల ఆదాయం

హైదరాబాద్, మే 3 (ఆంధ్రజ్యోతి): మునిపాలిటీల్లో అమలు చేసిన ఎర్లీ బర్డ్ పథకం (ఆస్తి పన్నులో 5శాతం రాయితీ) కింద ఈసారి రూ.400.36 కోట్ల ఆదాయం సమకూరినట్టు పురపాలక శాఖ కమిషనర్, సంచాలకులు టీకే శ్రీదేవి శనివారం తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి రూ.2,264.84 కోట్ల ఆస్తి పన్ను వసూలు చేయాల్సి ఉండగా.. ఈ పథకం ద్వారా రూ.400.36 కోట్లు వచ్చిందని, ఇది 17.68 శాతానికి సమానమని పేర్కొన్నారు. గత ఏడాది రూ.317 కోట్లు వచ్చినట్టు తెలిపారు. కాగా ఆస్తి పన్ను వసూళ్ల లక్ష్యంలో జమ్మికుంట మునిసిపాలిటి 54.78శాతం, హుజూరాబాద్ 51.85శాతం సాధించాయి.

టీచర్లు నూతన లక్ష్యాలతో పని చేయాలి

- ప్రతి విద్యార్థి ప్రగతి సాధించేలా చూడాలి
- విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణా

హైదరాబాద్, మే 3 (ఆంధ్రజ్యోతి): కొత్త విద్యా సంవత్సరంలో ఉపాధ్యాయులు నూతన లక్ష్యాలతో పనిచేయాలని, ప్రతి విద్యార్థి విద్యలో ప్రగతి సాధించేలా చూడాలని రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణా కోరారు. బోధించే ప్రతి అంశం విద్యార్థులందరికీ అర్థమయ్యేలా ఉండాలని కోరారు. రాష్ట్రస్థాయి విద్యాశాఖాధికారులు, జిల్లాల విద్యాశాఖాధికారులకు మూడు రోజుల శిక్షణ శనివారం హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల కేంద్రంలో ప్రారంభమైంది. ఈ సందర్భంగా యోగితా రాణా మాట్లాడుతూ.. ఉపాధ్యాయ శిక్షణా కార్యక్రమాలు రాష్ట్రవ్యాప్తంగా చేపట్టాలని జిల్లా విద్యాశాఖాధికారులకు సూచించారు. ఈ సమావేశానికి ప్రముఖ సామాజిక ఉద్యమకారిణి, పద్మశ్రీ పురస్కార గ్రహీత సునీత కృష్ణన్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సోషల్ మీడియా ప్రభావం విద్యార్థులపై ఎక్కువగా ఉంటోందని, విద్యార్థులు వారికి తెలియకుండానే సైబర్ నేరాలు, లైంగిక వే ధింపులకు గురవుతున్నారన్నారు. బాలికలపై లైంగిక దాడులకు సంబంధించిన విషయాలు, ఐటీ చట్టం గురించి ప్రతి ఉపాధ్యాయులు బోధించాలని కోరారు. సమావేశంలో పాఠశాల విద్య సంచాలకుడు ఈవీ నరసింహారెడ్డి, జిల్లాల విద్యాశాఖాధికారులు పాల్గొన్నారు.

టీజీఐసెట్ దరఖాస్తు గడువు పొడిగింపు

హైదరాబాద్, మే 3 (ఆంధ్రజ్యోతి): ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశాలకు ఉద్దేశించిన టీజీఐసెట్ దరఖాస్తు గడువును పొడిగించారు. ఎలాంటి అదనపు రుసుములేకుండా అభ్యర్థులు ఈ నెల 10 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని కన్వీనర్ అలువాల రవి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇప్పటివరకు మొత్తం 51,857 మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్ రాయితీ గడువు నెల పొడిగింపు

- ఆ మేరకు పురపాలక శాఖ ఉత్తర్వులు
- ఇప్పటి వరకు వచ్చిన ఆదాయం రూ.1,900 కోట్లు

హైదరాబాద్, మే 3 (ఆంధ్రజ్యోతి): ఎల్‌ఆర్‌ఎస్ (లేఅవుట్ క్రమబద్ధీకరణ పథకం) ఫీజుపై ఇస్తున్న 25 శాతం రాయితీని మరో నెల రోజుల పాటు పొడిగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు పురపాలక శాఖ కార్యదర్శి టి.కె.శ్రీదేవి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. మార్చి నుంచి అమల్లో ఉన్న రాయితీ పథకాన్ని ఇప్పటికే ప్రభుత్వం రెండు సార్లు పొడిగించింది. సుమారు 20 లక్షల మంది ఫీజు చెల్లించాల్సిన దరఖాస్తుదారులు ఉండడం, వారిలో ఇప్పటి వరకు 6 లక్షల మంది మాత్రమే ఫీజు చెల్లించేందుకు ముందుకు రావడంతో పురపాలక శాఖ అధికారులు గడువు పెంచాలని మరోసారి ప్రభుత్వానికి ప్రతిపాదించారు. దీంతో శనివారంతో ముగిసిన గడువును నెలాఖరు వరకు పొడిగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు చెల్లించిన వారిలో 40 శాతం మందికి అధికారులు ప్రొసీడింగ్స్ ఇచ్చారు. ఇప్పటివరకు ప్రభుత్వానికి సుమారు రూ.1900 కోట్ల ఆదాయం వచ్చింది.

రోజంతా ఢిల్లీలోనే సీఎం రేవంత్‌రెడ్డి

- కొందరు కాంగ్రెస్ నేతలతో లంచ్
- చివరి నిమిషంలో రద్దయిన కేంద్రమంత్రుల అపాయింట్‌మెంట్లు!
- రాత్రికి తిరిగి హైదరాబాద్‌కు..



న్యూఢిల్లీ, మే 3 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయిలో కులగణన, పహల్గాం ఘటనలపై చర్చించేందుకు కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) సమావేశానికి శుక్రవారం ఢిల్లీకి చేరిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రెండో రోజంతా హస్తినలోనే గడిపారు. శుక్రవారం రాత్రికే హైదరాబాద్ చేరుకుంటారని సీఎం సన్నిహిత వర్గాలు చెప్పినప్పటికీ, ఆయన మాత్రం ఢిల్లీలోనే ఉన్నారు. శనివారం తెలంగాణ కాంగ్రెస్ ఎంపీల ఫోరం కన్వీనర్ మల్లు రవితో సుమారు గంటకుపైగా సీఎం మాట్లాడారు. ఆ తర్వాత సుమారు 2.30 సమయంలో ఢిల్లీలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో మధ్యాహ్నం భోజనం చేశారు. సీఎంకు అత్యంత సన్నిహితుడిగా పేరున్న ఓ ఎంపీ, ఎప్పుడూ సీఎం వెంటే ఉండే మరో కాంగ్రెస్ నేత.. మరికొందరు కూడా సీఎంతో ఈ లంచ్‌లో పాల్గొన్నారు. ఆ తర్వాత కొద్దిసేపటికే ఢిల్లీలోని ఆయన అధికారిక నివాసానికి చేరుకున్నారు. అనంతరం రాత్రి ఢిల్లీ నుంచి సీఎం హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణమయ్యారు. అయితే, తెలంగాణకు రావాల్సిన నిధులు, అభివృద్ధి పనులకు సంబంధించి కొందరు కేంద్ర మంత్రులను కలిసేందుకు సీఎం ప్రయత్నించారని, కానీ చివరినిమిషంలో వారి అపాయింట్‌మెంట్లు రద్దయ్యాయని సమాచారం. అందుకే శనివారం రాత్రి వరకు సీఎం ఢిల్లీలోనే ఉన్నట్టు తెలిసింది. ఈ విషయాన్ని కాంగ్రెస్ ఎంపీ ఒకరు ధ్రువీకరించారు.

ఫ్యూచర్ సిటీలో.. ఈ-సిటీ

(మొదటిపేజీ తరువాయి)



రేవంత్‌రెడ్డి జపాన్, అమెరికా, దక్షిణ కొరియాల్లో పర్యటించిన నేపథ్యంలో.. మరిన్ని ఎలక్ట్రానిక్స్ కంపెనీలు రాష్ట్రానికి రానున్నాయి. అందుకు అనుగుణంగా ప్రభుత్వం మరిన్ని ఈఎంసీలను అభివృద్ధి చేయనుంది. ఈ-సిటీపై రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. భారీ ఉద్యోగాలకు అవకాశాలున్న ఎలక్ట్రానిక్స్ రంగాన్ని మరింత ప్రోత్సాహించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు "వేర్వేరు ప్రాంతాల్లో మరిన్ని ఈఎంసీలను ఏర్పాటు చేస్తాం. ఈ రంగంలో పెట్టుబడులకు ముందుకువచ్చే ఎలక్ట్రానిక్స్ కంపెనీలకు ప్రత్యేక రాయితీలు, ప్రోత్సాహకాలను అందజేస్తాం" అని వివరించారు.

టెలికాం కంపెనీతో 2,500 కొలువులు

రూ.300 కోట్లు పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చిన తైవాన్‌లోని సిరా నెట్‌వర్క్స్, తెలంగాణకు చెందిన టెలికాం కంపెనీ ఎల్‌సీజీసీ రిజల్యూట్ గ్రూప్ ప్రతినిధులతో మంత్రి శనివారం సచివాలయంలో సమావేశమయ్యారు. ఈ రెండు కంపెనీల సంయుక్త ప్రాజెక్టుకు ప్రభుత్వం 10 ఎకరాలను కేటాయించనుంది. ఎలక్ట్రానిక్స్ పరిశ్రమల ఏర్పాటును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ఈ సందర్భంగా మంత్రి ఆయా కంపెనీల ప్రతినిధులకు వివరించారు. ఈ తరహా పరిశ్రమల ఏర్పాటులో పారిశ్రామికవేత్తలకు ఇబ్బందులు కలగకుండా సంబంధిత అధికారులతో ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేస్తామని వివరించారు. ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాలు, పట్టణాల్లో పరిశ్రమలను ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చే పారిశ్రామికవేత్తలకు ప్రత్యేక ప్రోత్సాహకాలిస్తామన్నారు. ప్రభుత్వం తరఫున ఆయా కంపెనీలకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పిస్తామని భరోసా ఇచ్చారు. ఈ రెండు కంపెనీలు 10 ఎకరాల్లో సంయుక్తంగా ఏర్పాటు చేయనున్న పరిశ్రమ ద్వారా 2,500 మంది యువతకు ఉద్యోగాలు వస్తాయని శ్రీధర్‌బాబు చెప్పారు. ఇక్కడ 5జీ నెట్ వర్క్స్, మల్టీ లేయర్ నెట్‌వర్కింగ్ సొల్యూషన్స్, సర్వర్లు తదితర టెలికాం ఉత్పత్తులను తయారు చేస్తారన్నారు. ఈ పెట్టుబడితో భారత్-తైవాన్ మధ్య సత్సంబంధాలు మరింత బలోపేతం అవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. సమావేశంలో టీజీఐఐసీ సీఈవో మధుసూదన్, టీ-ఫైబర్ ఎండీ వేణు ప్రసాద్, సిరా నెట్‌వర్క్ ప్రతినిధులు చుయాన్, జాయ్ భట్టాచార్య, డొగీయాస్, ఎల్‌సీజీసీ రిజల్యూట్ గ్రూప్ ప్రతినిధులు రణ్వీందర్ సింగ్, గీతాంజలి సభర్వాల్ పాల్గొన్నారు.

త్వరలో యంగ్ ఇండియా స్పోర్ట్స్ వర్సిటీ

రాష్ట్రంలో క్రీడాభివృద్ధికి కొత్త ఊపిరినిచ్చేలా 'యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ'ని త్వరలో స్థాపించనున్నట్లు మంత్రి శ్రీధర్‌బాబు పునరుద్ఘాటించారు. శనివారం తనను కలిసిన బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రతినిధులతో మంత్రి మాట్లాడుతూ.. క్రీడల పరంగా ప్రతిభను గుర్తించి అభివృద్ధి చేయడానికి ప్రత్యేకంగా క్రీడా అకాడమీలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. గ్రామీణ యువతకు శిక్షణ, అవకాశాలు అందించడమే తన ప్రధాన లక్ష్యమన్నారు. ఇటీవల తెలంగాణ బ్యాడ్మింటన్ అసోసియేషన్‌కు సలహాదారుడిగా నియమితులైన కొసరాజు లక్ష్మణ్‌కు, మీడియా కో-ఆర్డినేటర్‌గా నియమితుడైన వెంకట రమణారెడ్డికి మంత్రి నియామక పత్రాలను అందజేశారు. తెలంగాణ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడిగా శ్రీధర్‌బాబు బాధ్యతలను నిర్వర్తిస్తున్న విషయం తెలిసిందే. సమావేశంలో బ్యాడ్మింటన్ సంఘం ప్రొటోకాల్ సమన్వయకర్త యూవీఎస్ బాబు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు అర్హులకు చేరాలి

సీఎస్‌కు మంత్రి శ్రీధర్‌బాబు సూచన

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలను స్వీకరించిన రామకృష్ణారావు శనివారం సచివాలయంలో మంత్రి శ్రీధర్‌బాబును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీఎస్‌కు శుభాకాంక్షలు తెలిపిన మంత్రి.. ప్రభుత్వ ప్రాథమ్యాలకు అనుగుణంగా పనిచేసేలా అధికార యంత్రాంగాన్ని ముందుకు నడిపించాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న హామీలు, సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలో అర్హులందరికీ చేరేలా చూడాలన్నారు.

దేశం గర్వించేలా యంగ్ ఇండియా పాఠశాలలు

- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



బోనకల్, మే 3(ఆంధ్రజ్యోతి): దేశం గర్వించే స్థాయిలో రాష్ట్ర ప్రభుత్వం యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలను ఏర్పాటు చేస్తోందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. ఖమ్మం జిల్లా బోనకల్ మండలం లక్ష్మీపురం రెవెన్యూ పరిధిలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల భవనానికి ఆయన భూమిపూజ చేశారు. రాష్ట్రంలో 105 యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలల ఏర్పాటు కోసం ప్రభుత్వం రూ.21వేల కోట్ల నిధులను మంజూరు చేసిందని చెప్పారు. అన్ని రాష్ట్రాలకు ఇంటిగ్రేటెడ్ పాఠశాలలు ఆదర్శంగా నిలుస్తాయని తెలిపారు.



ఏఈలకు నియామక పత్రాలు అందజేస్తున్న మంత్రి పొంగులేటి

కేవలం తెలంగాణలోనే పేదోడి ఇంటికి 5 లక్షలు

- మూడేళ్లలో 20 లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం
- 350 మంది హౌసింగ్ ఏఈలకు నియామక పత్రాలు
- 21 మంది సబ్ రిజిస్ట్రార్లకు పదోన్నతి పత్రాల పంపిణీ

హైదరాబాద్/ రంగారెడ్డి అర్బన్, మే 3 (ఆంధ్రజ్యోతి): పేదోడి ఆత్మగౌరవాన్ని కాపాడేందుకు చేపట్టిన ఇందిరమ్మ ఇంటి పథకం అమలులో అవినీతికి తావు లేకుండా నిజాయితీగా, నిబద్ధతతో భాగస్వాములు కావాలని గృహ నిర్మాణశాఖ అసిస్టెంట్ ఇంజనీర్ల (ఏఈ)కు రెవెన్యూ, గృహ నిర్మాణశాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హితవు చెప్పారు. గృహ నిర్మాణశాఖలో ఔట్ సోర్సింగ్ విభాగంలో ఎంపికై శిక్షణ పూర్తి చేసుకున్న 350 మంది ఏఈలకు శనివారం రంగారెడ్డి జిల్లా హెచ్‌సీసీలోని నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (న్యాక్)లో ఆయన నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ పేదవాడి ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణేనని పేర్కొన్నారు. వచ్చే మూడేళ్లలో 20 లక్షల ఇళ్లు నిర్మిస్తామన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.22 వేల కోట్ల అంచనా వ్యయంతో 4.50 లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తి చేస్తామని పేర్కొన్నారు. అసిస్టెంట్ ఇంజనీర్లుగా విధుల్లో చేరగానే క్షేత్రస్థాయిలో అర్హులను ఇందిరమ్మ ఇళ్లకు లబ్ధిదారులుగా ఎంపికపై దృష్టి సారించాలని సూచించారు. ఏఈలుగా ఎంపికైన వారిలో 45 శాతం మంది మహిళలే ఉండటం సంతోషకరమైన విషయమని పొంగులేటి అన్నారు. కాగా, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ల శాఖలో 10 మంది గ్రేడ్-2 సబ్ రిజిస్ట్రార్లుగా, 11 మంది సీనియర్ సహాయకులకు గ్రేడ్-2 సబ్ రిజిస్ట్రార్‌లుగా పదోన్నతి పొందిన వారికి ప్రమోషన్ సర్టిఫికెట్లను మంత్రి అందజేశారు.

లబ్ధిదారుల ఇళ్ల వద్దకే కల్యాణలక్ష్మి చెక్కులు: తుమ్మల



ఖమ్మం, మే 3 (ఆంధ్రజ్యోతి): కల్యాణలక్ష్మి, షాదీముబారక్, సీఎంఆర్‌ఎఫ్ లబ్ధిదారులు ఇకపై ప్రజాప్రతినిధుల క్యాంపు కార్యాలయాలు, ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరంలేదని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. అధికారులు నేరుగా లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లి ఆయా పథకాల చెక్కులు అందిస్తారని తెలిపారు. ఖమ్మం నగరంలోని తన క్యాంపు కార్యాలయంలో శనివారం ఆయన రూ.కోటి 63 లక్షల విలువైన కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కులను, రూ.9.30 లక్షల విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్పొరేషన్ అధికారులు, కాంగ్రెస్ నాయకులు లబ్ధిదారుల ఇళ్లకు వెళితే ఆయా ప్రాంతాల్లోని సమస్యలు తెలుస్తాయని పేర్కొన్నారు.

నేడే నీట్

హైదరాబాద్, మే 3 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా వైద్య విద్య కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే జాతీయ అర్హత పరీక్ష (నీట్) ఆదివారం జరగనుంది. రెండు షిఫ్టుల్లో.. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు మొదటి షిఫ్ట్, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 వరకు రెండో షిఫ్టులో పరీక్ష నిర్వహిస్తారు. ఈ ఏడాది తెలంగాణ నుంచి 72,507 మంది విద్యార్థులు నీట్‌కు హాజరుకాబోతున్నారు. రాష్ట్రంలో 190 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఒక్క హైదరాబాద్‌లోనే 62 పరీక్షా కేంద్రాలుండగా.. 26 వేల మంది ఇక్కడే పరీక్ష రాయనున్నారు. గత ఏడాది ఉత్తరాది రాష్ట్రాల్లో నీట్ ప్రశ్నపత్రాలు లీకైన నేపథ్యంలో.. కేంద్ర ప్రభుత్వం ఈసారి ప్రభుత్వ కేంద్రాల్లో మాత్రమే పరీక్ష నిర్వహిస్తోంది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా.. పరీక్షా కేంద్రాల వద్ద మూడంచెల భద్రతా ఏర్పాట్లు చేశారు.

పాత పద్ధతిలోనే పరీక్ష

కోవిడ్‌కు ముందు నీట్‌లో.. ఒక్కో సబ్జెక్టు నుంచి 45 ప్రశ్నల చొప్పున నాలుగు సబ్జెక్టుల (ఫిజిక్స్ కెమిస్ట్రీ బోటనీ, జువాలజీ) నుంచి మొత్తం 180 ప్రశ్నలు ఇచ్చేవారు. అన్నింటికీ జవాబివ్వాలి. కోవిడ్ తర్వాత మార్పులు చేశారు. ఒక్కో సబ్జెక్టు నుంచి 50 ప్రశ్నలు ఇస్తున్నారు. ఇందులో సెక్షన్-ఏ కింద ఉండే 35 ప్రశ్నల్లో అన్నింటికీ జవాబు రాయాలి. సెక్షన్-బీలోని 15 ప్రశ్నల్లో ఏవైనా పదింటికి జవాబు ఇవ్వాలి. అంటే మొత్తంగా 200 ప్రశ్నల్లో.. 180 ప్రశ్నలకు జవాబులు రాయాలి. కానీ ఈ ఏడాది నుంచి తిరిగి పాత విధానాన్ని అమలు చేస్తున్నారు. మొత్తం 180 ప్రశ్నలు ఇస్తే.. అన్నింటికీ జవాబులు రాయాల్సి ఉంటుంది.

ఆ 40% కోటాలో రైతు కూలీల పిల్లలకు 15%

- ఈ ఏడాది నుంచి వ్యవసాయ విద్య ప్రవేశాల్లో అమలు
- వ్యవసాయ వర్సిటీవీసీ ప్రొఫెసర్ జానయ్య

ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో వ్యవసాయ విద్య ప్రవేశాల్లో రైతుల పిల్లలకున్న 40 శాతం ప్రత్యేక కోటాలో ఈ ఏడాది నుంచి రైతు కూలీల పిల్లలకు 15 శాతం సీట్లను ఇవ్వనున్నట్టు వర్సిటీ ఉపకులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య చెప్పారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర రైతాంగానికి సాగు సంబంధిత అంశాలపై అవగాహన కల్పించే ఉద్దేశంతో ఈనెల 5 నుంచి జూన్ 13 వరకు "రైతు ముంగిట శాస్త్రవేత్తలు" కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, ఇందులో రైతులు, రైతు కూలీలు, ఉపాధ్యాయులు, అభ్యుదయ రైతులు, విద్యార్థులు పెద్దఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు.

కుల గణన కాదు.. కులాల సర్వే చేశారు

- తూతూ మంత్రంగా కాంగ్రెస్ కార్యక్రమం
- రాజ్యాంగబద్ధంగా కుల, జనగణనచేస్తాం
- దేశంలో మౌలిక వసతులకు రూ.లక్షల కోట్లు: కిషన్‌రెడ్డి



హైదరాబాద్, మే 3 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం కులగణన చేయలేదని, కులాల సర్వే మాత్రమే చేసింద ని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి విమర్శించారు. ఆ సర్వే కూడా తూతూమంత్రంగా ముగించిందని, బీసీలకు అన్యాయం చేసేలా ముస్లింలను బీసీ జాబితాలో చేర్చిందని మండిపడ్డారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో శనివారం కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. కులగణనను రాజ్యాంగం ప్రకారం, చట్ట ప్రకారం చేయాలని అన్నారు. తమ ప్రభుత్వం రాజ్యాంగబద్ధంగా దేశంలో జనాభా లెక్కలతో పాటు కులగణన చేపట్టనుందని తెలిపారు. ప్రతి వ్యక్తి దగ్గరికి, ప్రతి ఇంటికి వెళ్లి పారదర్శకంగా కార్యక్రమాన్ని నిర్వహిస్తామని వెల్లడించారు. దేశవ్యాప్తంగా మౌలిక వసతుల అభివృద్ధికి ప్రధాని మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని కిషన్‌రెడ్డి తెలిపారు. దేశ అభివృద్ధిని వేగవంతం చేయడంలో రోడ్లు, రైలు మార్గాలు, విమానాశ్రయాలు, ఓడరేవులు, టెలీ కమ్యూనికేషన్ రంగాల అభివృద్ధి కీలకమని పేర్కొన్నారు. దేశంలోని 90 శాతం జిల్లాల్లో మౌలిక వసతుల కల్పనకు కేంద్రం రూ.లక్షల కోట్లను ఖర్చు చేస్తోందని వివరించారు. వాజ్‌పేయి హయాంలో ప్రారంభమైన స్వర్ణ చతుర్భుజి ప్రాజెక్టుల ప్రేరణతో మోదీ ప్రభుత్వం అనేక రాష్ట్ర రాజధానులను, జిల్లా కేంద్రాలను జాతీయ రహదారులతో అనుసంధానం చేస్తోందన్నారు. అప్పట్లో స్వర్ణ చతుర్భుజి ప్రాజెక్టుల విధానాన్ని కొన్ని పార్టీలు హేళన చేశాయని తెలిపారు. తెలంగాణలో 2014లో 2,500 కి.మీ. పొడవైన జాతీయ రహదారులు ఉండగా, ప్రస్తుతం 5,200 కి.మీ.కు పెరిగాయని వెల్లడించారు. పదేళ్లలో రూ.1,25,485 కోట్లను జాతీయ రహదారుల అభివృద్ధికి కేంద్రం ఖర్చు చేసిందని తెలిపారు. గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ వే ప్రాజెక్టుల కింద తెలంగాణలో 4,500 కోట్లతో 136 కి.మీ. మేర పనులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ సోమవారం రాష్ట్రంలోని పలు ప్రాజెక్టులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేస్తారని తెలిపారు. ఇందులో రూ.4,590 కోట్లతో 138 కి.మీ. మేర చేపట్టిన ప్రాజెక్టులకు ప్రారంభోత్సవాలు, రూ.826 కోట్ల విలువైన కొత్త ప్రాజెక్టులకు భూమి పూజ కార్యక్రమాలు ఉంటాయని కిషన్‌రెడ్డి వివరించారు.

వచ్చే ఏడాది 19500 మెగావాట్ల గరిష్ఠ డిమాండ్

- తదనుగుణంగా నెట్‌వర్క్ బలోపేతం చేయాలి
- ఇంధనశాఖ ముఖ్యకార్యదర్శి సందీప్ సుల్తానియా

హైదరాబాద్, మే 3 (ఆంధ్రజ్యోతి): రానున్న ఐదేళ్లలో పెరగనున్న డిమాండ్‌కు తగ్గట్టు విద్యుత్తు సరఫరా చేసేందుకు గాను విద్యుత్తు సరఫరా, పంపిణీ వ్యవస్థల సామర్థ్యం పెంచి బలోపేతం చేయాలని ఇంధన శాఖ ముఖ్యకార్యదర్శి, జెన్‌కో సీఎండీ సందీప్‌కుమార్ సుల్తానియా అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో గరిష్ఠ విద్యుత్తు డిమాండ్ అంచనాలకు మించి పెరుగుతోందన్నారు. 2025లో 16,877 మెగావాట్ల గరిష్ఠ డిమాండ్ ఏర్పడనుందని కేంద్ర విద్యుత్తు సంస్థ (సీఈఏ) అంచనా వేయగా, వాస్తవ గరిష్ఠ డిమాండ్ 17,162 మెగావాట్లకు చేరిందని వెల్లడించారు. వచ్చే ఏడాది 18,138 మెగావాట్ల గరిష్ఠ డిమాండ్ ఉండనుందని సీఈఏ అంచనా వేయగా, వాస్తవ డిమాండ్ 19,000-19,500 మెగావాట్ల వరకు చేరుకోవచ్చునని అంచనా వేశామన్నారు. ఈ మేరకు విద్యుత్తు సరఫరా చేసేందుకు గాను విద్యుత్తు సరఫరా, పంపిణీ వ్యవస్థలను బలోపేతం చేయాలని ఆదేశించారు.

6వేల ఈవీ చార్జింగ్ కేంద్రాల ఏర్పాటు

రాష్ట్రంలో ఎలక్ట్రిక్ వాహనాల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో 2030 నాటికి 6వేల ఎలక్ట్రిక్ వెహికల్ పబ్లిక్ చార్జింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు సందీప్‌కుమార్ సుల్తానియా తెలిపారు. చార్జింగ్ పాయింట్ల ఆపరేటర్లతో శనివారం విద్యుత్తుసౌధలో సమావేశమయ్యారు. పెరుగుతున్న ఎలక్ట్రిక్ వాహనాల అవసరాలను దృష్టిలో పెట్టుకుని, త్వరితగతిన వాటిని ఏర్పాటు చేయాలని కోరారు. వీటి ఏర్పాటు విషయంలో ఆపరేటర్లకు సహకరించడానికి విద్యుత్తు పంపిణీ సంస్థ(డిస్కమ్), తెలంగాణ పునరుద్ధరణీయ ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ(రెడ్కో)లు చర్యలు తీసుకున్నాయని పేర్కొన్నారు.

దేవాదాయ భూముల రక్షణకు టాస్క్‌ఫోర్స్!

- అర్చక, ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై దృష్టి
- త్వరలో మంత్రి నేతృత్వంలో ఉన్నతస్థాయి భేటీ
- ఆ తర్వాత కీలక అధికారులను మార్చే అవకాశం
- దేవాదాయ శాఖ ప్రక్షాళన దిశగా అడుగులు

హైదరాబాద్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): వేల ఎకరాల దేవాదాయ భూములను పరిరక్షించి, ఆలయాల మనుగడకు ఆదాయ మార్గంగా మార్చుకునేందుకు రాష్ట్ర స్థాయిలో ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. కబ్జాకు గురైన ఆలయాల భూముల్ని స్వాధీనం చేసుకునేందుకు వెళ్లినప్పుడు రాజకీయ నేతలు, స్థానిక అధికారులు, ప్రజల నుంచి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అధికారులతో ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేస్తే అన్యాక్రాంతమైన భూముల్ని తిరిగి స్వాధీనం చేసుకోవడం సులభతరం అవుతుందని అధికారులు భావిస్తున్నారు. దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ నేతృత్వంలో త్వరలో ఉన్నత స్థాయి భేటీ జరగనుంది. ఇందులోనే టాస్క్‌ఫోర్స్ ఏర్పాటుపై చర్చించి, తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. అలాగే, అర్చక, ఉద్యోగుల సమస్యలతోపాటు ఆలయాల్లో బంగారు, వెండి ఆభరణాల పరిరక్షణ తదితర అంశాలపై చర్చించనున్నారు. కొందరు అధికారులు దేవాదాయ శాఖ ప్రధాన కార్యాలయంలోనే తిష్ట వేసిన వైనంపై సొంత శాఖలోనే విమర్శలున్నాయి. ఈ విషయంపై ఇప్పటికే ఒక అంచనాకు వచ్చిన ఉన్నతాధికారులు.. మంత్రితో భేటీ తర్వాత మార్పులు, చేర్పులు చేపట్టే అవకాశం ఉంది. కాగా, దేవాదాయ శాఖ డైరెక్టర్‌ను తరచూ మారుస్తుండడం ఆ శాఖ పనితీరుపై ప్రభావం చూపుతోందన్న వాదన ఉంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత దేవాదాయ శాఖ డైరెక్టర్‌గా ఉన్న అనీల్ కుమార్‌ను తప్పించి హన్మంతరావుకు బాధ్యతలు అప్పగించింది. కొద్ది నెలల్లోనే మరో డైరెక్టర్‌ను నియమించింది. తర్వాత శ్రీధర్‌కు బాధ్యతలు అప్పగించింది. ఇటీవల శ్రీధర్‌ను తప్పించి వెంకట్‌రావును నియమించింది. ఇలా ఏడాదిలోనే నలుగురు మారి.. ప్రస్తుతం ఐదో అధికారి కొనసాగుతుండడంతో ఎవరికీ శాఖపై పూర్తిస్థాయిలో పట్టురాని పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో మంత్రి నేతృత్వంలో ఉన్నత స్థాయి భేటీ జరగనుండడం ప్రాధాన్యత సంతరించుకుంది.



రాజ్‌భవన్‌లో జరిగిన కార్యక్రమంలో ప్లేట్ల తయారీ యంత్రాల వాహనాలను ప్రారంభిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ

ఆదివాసీ యువతకు గవర్నర్ ఆపన్న హస్తం

» మరింత చేయూత అందించాలన్న జిష్ణుదేవ్‌వర్మ

హైదరాబాద్, మే3 (ఆంధ్రజ్యోతి): నల్లమల ప్రాంతాల్లోని ఆదివాసీ యువతకు శిక్షణ ఇప్పించి పరోక్ష ఉపాధి కల్పిస్తున్న ప్రాజెక్టులో గవర్నర్ కార్యాలయం భాగస్వామ్యం కావడం ఆనందంగా ఉందని గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ చెప్పారు. తనకున్న ప్రత్యేక అధికారాలతో యువతకు అటవీ ఆకులతో ప్లేట్ల తయారీలో శిక్షణ ఇప్పించామని తెలిపారు. ఈ సందర్భంగా రాజ్‌భవన్‌లో జరిగిన కార్యక్రమంలో గవర్నర్ 32 మంది ఆదివాసీ యువతీ, యువకులతో సమావేశమై వారి అనుభవాలను అడిగి తెలుసుకున్నారు. ఆదివాసీలకు ఆర్థిక పరిపుష్టి కలగాలంటే మరింత చేయూత అందాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా ఆదివాసీలకు ఇచ్చిన ప్లేట్ల తయారీ యంత్రాల వాహనాలను గవర్నర్ జెండా ఊపి ప్రారంభించారు.

చుక్క నీరు రాని 9 బోర్లు !

» అప్పులు తీర్చలేక యువరైతు ఆత్మహత్య



పెంటయ్య(ఫైల్)

దోమకొండ, మే 3 (ఆంధ్రజ్యోతి): పంటల సాగు కోసం పొలంలో ఒకటి కాదు.. రెండు కాదు.. ఏకంగా 9 బోర్లు వేసినా.. చుక్క నీరు పడక పంట ఎండిపోవడంతో మనస్థాపానికి గురైన ఓ యువరైతు.. చివరకు అప్పుల బాధతో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కామారెడ్డి జిల్లా దోమకొండకు చెందిన రైతు పంతులుగారి పెంటయ్య(27) తనకున్న రెండెకరాల వ్యవసాయ భూమిలో పంట పండించేందుకు నీరు లేకపోవడంతో బోరు వేయాలని అనుకున్నాడు. ఇందులో భాగంగా లక్షల రూపాయలు అప్పులు తెచ్చి గత 15 నెలల వ్యవధిలో ఏకంగా 9 బోర్లు వేశాడు. అయినా బోర్ల నుంచి చుక్క నీరు కూడా పడలేదు. కొన్నేళ్ల క్రితం వేసిన బోరు నుంచే కొద్దిపాటి నీరు వస్తుండడం.. వాటితో పంట పండించేందుకు అనువుగా లేకపోవడం.. మరోవైపు రూ. 8.50 లక్షల వరకు అప్పులు కావడం.. అప్పులిచ్చిన వారి నుంచి ఒత్తిడి పెరగడంతో పెంటయ్య శనివారం తెల్లవారుజామున ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు.

హెచ్‌ఎం మృతిపై హైకోర్టు సుమోటో విచారణ

» పదవీ విరమణ ప్రయోజనాలు ఇవ్వకపోవడంపై ప్రభుత్వానికి నోటీసులు

హైదరాబాద్, మే 3 (ఆంధ్రజ్యోతి): పదవీ విరమణ ప్రయోజనాల కోసం ఎదురుచూస్తూ మనోవేదనతో ఓ ప్రధానోపాధ్యాయుడు మృతి చెందిన ఉదంతంపై హైకోర్టు స్పందించింది. దీనిపై పత్రికల్లో వచ్చిన కథనాలను సుమోటోగా విచారణకు స్వీకరించింది. ఎందుకు చెల్లించలేదో వివరణ ఇవ్వాలంటూ ఆర్థికశాఖ, పాఠశాల విద్యాశాఖ కమిషనర్, అకౌంటెంట్ జనరల్ తదితరులకు నోటీసులు జారీచేసింది. ఖమ్మం జిల్లా ఎంకూరు మండల జిల్లా పరిషత్ బాలికల హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడిగా పదవీ విరమణ చేసిన కూరపాటి పాండురంగయ్య 2024 జూలై నుంచి ప్రభుత్వం నుంచి రావాల్సిన ప్రయోజనాల కోసం ఎదురుచూస్తున్నారు. మనోవేదనతో, అనారోగ్యానికి గురై చికిత్స పొందుతూ మృతిచెందారు. దీనిపై పత్రికల్లో వచ్చిన కథనాలను తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్‌పాల్, జస్టిస్ రేణుకల ధర్మాసనం... పిటిషన్‌గా స్వీకరించింది. తదుపరి విచారణను జూన్ నెలకు వాయిదా వేసింది.

అనుమతుల్లేని భవనాలను సీజ్ చేయండి

» అధికారులకు సర్క్యులర్ పంపండి: హైకోర్టు

హైదరాబాద్, మే 3 (ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండా, ప్రణాళికకు విరుద్ధంగా చేపట్టిన భవనాలను, అంతస్తులకు షోకాజ్ నోటీసులు జారీ చేసి సీజ్ చేయాలని హైకోర్టు ఆదేశించింది. ఈ విషయాన్ని తెలుపుతూ డిప్యూటీ కమిషనర్లు, టౌన్‌ప్లానింగ్ అధికారులకు సర్క్యులర్ జారీ చేయాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్‌కు సూచించింది. షేక్‌పేట్ ఓయూ కాలనీలో అనుమతి లేకుండా జీ+4, పెంట్‌హౌజ్ నిర్మిస్తున్నారని.. దీనిపై ఫిర్యాదుచేసినా పట్టించుకోడం లేదని పేర్కొంటూ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. దీనిపై విచారణ చేపట్టిన జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి ధర్మాసనం.. జీహెచ్‌ఎంసీ అధికారులు అక్రమ నిర్మాణాలపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేసింది. అందువల్లనే హైకోర్టులో ఎక్కువ సంఖ్యలో పిటిషన్‌లు దాఖలవుతున్నాయని పేర్కొంది.

బియ్యం అమ్ముకుంటే రేషన్ కార్డు రద్దు

» రెవెన్యూ, పౌరసరఫరాల శాఖ అధికారుల హెచ్చరికలు

హైదరాబాద్, మే 3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేసే సన్నబియ్యాన్ని అమ్ముకుంటే చర్యలు తప్పవని రెవెన్యూ, పౌరసరఫరాల శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. ఇలా అమ్ముకున్నవారి రేషన్ కార్డులు రద్దుచేస్తామని ఇప్పటికే ప్రకటించిన అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకుంటున్నారు. మంచిర్యాల జిల్లా తాండూరు మండంలోని అచలాపూర్ గ్రామంలో శనివారం అధికారులు 11 రేషన్ కార్డులు రద్దుచేశారు. వీరు రూ.16 చొప్పున 1.91 క్వింటాళ్ల బియ్యాన్ని అమ్ముకున్నారని అధికారులు తెలిపారు. రేషన్ బియ్యం అమ్మినవారితోపాటు కొన్నవారిపైనా కేసులు నమోదుచేస్తామని రెవెన్యూ అధికారులు హెచ్చరించారు.

300 కోట్ల భూమి.. భూంఫట్!

హైదరాబాద్ ఎమ్మెల్యే కాలనీలో ప్రభుత్వ స్థలాలను ఆక్రమించిన బడాబాబులు

» పదేళ్లుగా కన్నెత్తి చూడని రెవెన్యూ శాఖ

» తాజాగా రంగంలోకి దిగిన అధికారులు

బంజారాహిల్స్, మే 3 (ఆంధ్రజ్యోతి): అది బంజారాహిల్స్‌లోని ఎమ్మెల్యే కాలనీ.. మాజీ సీఎంలు, మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, రియల్టర్లు, పారిశ్రామికవేత్తలు నివాసం ఉంటున్న అత్యంత ఖరీదైన ప్రాంతం. ఇలాంటి ప్రాంతంలో రూ.300 కోట్ల విలువైన మూడెకరాల ప్రభుత్వ స్థలం ఆక్రమణలకు గురైంది. కొందరు బడాబాబులు తమ ఇళ్లకు ఆనుకొని ఉన్న స్థలాన్ని కబ్జా చేసి లాన్‌లు, స్విమ్మింగ్‌పూల్స్, చిన్నపాటి పార్కులు వంటివి ఏర్పాటు చేసుకుంటే.. మరికొందరు నేరుగా పక్కా భవనాలు నిర్మించుకున్నారు. పదేళ్లకు పైగా ఈ ఆక్రమణలు కొనసాగుతున్నా.. రెవెన్యూ యంత్రాంగం ఇటువైపు కన్నెత్తి చూడలేదు. ఎట్టకేలకు ఈ కబ్జాలను గుర్తించిన షేక్‌పేట రెవెన్యూ అధికారులు.. స్థలాలను స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నిస్తుంటే.. కబ్జాలకు పాల్పడినవారు రెవెన్యూ సిబ్బంది బెదిరించడం, నిర్బంధించడం వంటి చర్యలకు పాల్పడుతున్నారు.

హౌసింగ్ సొసైటీల మధ్య ప్రభుత్వ స్థలం..

బంజారాహిల్స్ రోడ్ నంబరు 12లో వందల ఎకరాల ప్రభుత్వ భూములు ఉండేవి. గత ప్రభుత్వాలు కొన్ని హౌసింగ్ సొసైటీలకు అక్కడ భూములు కేటాయించాయి. ఈ క్రమంలోనే ఎమ్మెల్యేలు, అసెంబ్లీలో పనిచేసే అధికారులు, సిబ్బంది కోసం వెంకటేశ్వర హౌసింగ్ సొసైటీకి వంద ఎకరాల భూమి ఇచ్చింది. ఒక్కొక్కరికి 300-400 చదరపు గజాల స్థలం కేటాయించింది. అందులో కొందరు నివాసం ఉండగా.. చాలామంది క్రమంగా అమ్మేసుకున్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులు, రిటైర్డ్ అధికారులు, పారిశ్రామికవేత్తలు ఆ ప్లాట్లను కొనుగోలు చేసి భవనాలు నిర్మించుకున్నారు. అయితే ఎమ్మెల్యే కాలనీ, ఏసీబీ కార్యాలయంలో మధ్య సర్వే నంబర్ 102/1 సుమారు 12 ఎకరాల ఖాళీ స్థలం ఉంది. దాని విలువ సుమారు రూ.1,200 కోట్ల వరకు ఉంటుందని అంచనా. అది తమదంటే తమదంటూ సొసైటీలు కోర్టుల్లో పిటిషన్లు వేశాయి. పలు క్రిమినల్ కేసులు కూడా నమోదయ్యాయి. ఇటీవల ప్రభుత్వ స్థలాల పరిరక్షణలో భాగంగా షేక్‌పేట రెవెన్యూ అధికారులు పాత రికార్డులను పరిశీలిస్తుండగా.. హకీంపేట గ్రామం టీఎస్-193 వార్డు పరిధిలోని ఈ 12 ఎకరాల స్థలం ప్రభుత్వానిదేనని తేలింది. దీనితో రంగంలోకి దిగిన అధికారులు గత పదిహేను రోజులుగా ఆ ప్రభుత్వ స్థలం చుట్టూ సరిహద్దుగా బ్లూషీట్‌ల (నీలి రంగు ఫైబర్ రేకులు)ను ఏర్పాటు చేస్తున్నారు. ఏసీబీ క్వార్టర్స్, రోడ్ నంబరు 12 ప్రధాన రోడ్డు వైపు పనులు పూర్తయ్యాయి. ఎమ్మెల్యే కాలనీ వైపు పనులు చేపట్టాల్సి ఉంది. కానీ అటువైపు మూడు ఎకరాల స్థలం ఆక్రమణకు గురైనట్టు అధికారులు గుర్తించి, రక్షణ చర్యలు చేపట్టారు.



బ్లూ షీట్స్ ఏర్పాటు చేసి ప్రభుత్వ స్థలాన్ని కాపాడుతున్న రెవెన్యూ సిబ్బంది

పరిశీలించిన కొద్దీ అక్రమాలే..

ఎమ్మెల్యే కాలనీలో నివాసం ఉంటున్న 37 ప్లాట్ల యజమానులు మొదట తమ స్థలంలో నిర్మాణాలు చేసుకున్నారు. తర్వాత ఇంటి వెనకాల ఉన్న ప్రభుత్వ స్థలాన్ని ఒక్కొక్కరూ 300చదరపు గజాల నుంచి 500 చదరపు గజాల వరకు ఆక్రమించి, ప్రహరీ నిర్మించుకున్నారు. లోపల ల్యాన్‌లు, స్విమ్మింగ్ పూల్‌లు ఏర్పాటు చేసుకున్నారు. రెండు ప్లాట్ల యజమానులు పనివారి కోసం పక్కా ఇళ్లు నిర్మించారు. ఓ ప్రైవేటు ఉద్యోగి ఏకంగా మూడంతస్తుల భవనాన్ని నిర్మించారు. అంతేకాదు తన ఇంటి వెనుక మరో మూడు వందల గజాల స్థలంలో లాన్ ఏర్పాటు చేసుకున్నారు. ఒక రియల్టర్ స్విమ్మింగ్ పూల్, చిన్నపాటి పార్కును ఏర్పాటు చేసుకున్నారు. ఓ విశ్రాంత చీఫ్ ఇంజనీర్ లాన్ ఏర్పాటు చేసుకున్నారు. ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేసినవారిలో 8 మంది జీవో 59 కింద క్రమబద్ధీకరణ కోసం గతంలోనే దరఖాస్తు చేసుకున్నారు. కానీ క్రమబద్ధీకరణ కాలేదు. మరికొందరు వెంకటేశ్వర సొసైటీకి చెందినవారే తమకు ఆ స్థలాన్ని అమ్మినట్టుగా కాగితాలు సృష్టించారు.

కోర్టు ఆదేశాలున్నా కూల్చివేతలు చేపట్టారు

కోర్టు ఆదేశాలున్నా రెవెన్యూ అధికారులు కూల్చివేతలు చేపట్టారు. మాకు 300 గజాల స్థలం ప్రభుత్వం కేటాయించింది. మరో 489 గజాల స్థలాన్ని క్రమబద్ధీకరించింది. ఇంటి వెనకాల ఉన్న మరో 300 గజాల స్థలాన్ని క్రమబద్ధీకరించాలని దరఖాస్తు చేసుకున్నాం. ఇంకా ప్రభుత్వ నిర్ణయం వెలువడలేదు. ఈ విషయంపై కోర్టుకు వెళ్లగా ఎవరూ కలుగ చేసుకోవద్దని ఆదేశాలిచ్చింది. కానీ అధికారులు పట్టించుకోకుండా.. మా ఇంటిని అనుకొని బ్లూ షీట్స్ ఏర్పాటు చేశారు.

- కరీముల్లా, విశ్రాంత ఈఎన్‌సీ

37 మంది ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించారు

ఎమ్మెల్యే కాలనీకి చెందిన 37 మంది మూడెకరాల ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించినట్టు మా సర్వేలో తేలింది. ఆ స్థలాన్ని రక్షించేందుకు ప్రహరీ ఏర్పాటు చేస్తున్నాం. కొందరు క్రమబద్ధీకరణ కోసం దరఖాస్తు చేసుకున్నారు. మరికొంత మందికి అక్రమ మార్గంలో రిజిస్ట్రేషన్ జరిగినట్టు తెలుస్తోంది. అక్రమాల తొలగింపు విషయంలో మాకు ఎటువంటి కోర్టు ఆదేశాలు అందలేదు. మా విధులకు ఎవరైనా ఆటంకం కలిగిస్తే సహించేది లేదు.

- వై.అనితారెడ్డి, షేక్‌పేట తహసీల్దార్

ప్రభుత్వ సిబ్బందిని బెదిరిస్తుండడంతో..

ఆక్రమణలకు గురైన ప్రభుత్వ స్థలంలోని నిర్మాణాలను షేక్‌పేట తహసీల్దార్ అనితారెడ్డి ఆధ్వర్యంలో కూల్చేసి, ప్రభుత్వ స్థలం చుట్టూ సరిహద్దు ఏర్పాటు చేసే ప్రక్రియ కొనసాగుతోంది. గురువారం అలా ఓ భవనం వద్దకు వెళ్లగా.. అక్కడి ప్రైవేటు సిబ్బంది కూల్చివేతలు చేపట్టకుండా అడ్డుకున్నారు. రెవెన్యూ సిబ్బందిని నిర్బంధించి ఫోన్లు లాక్కున్నారు. ఎలాగోలా అధికారులు, సిబ్బంది బయటపడి పోలీసులకు ఫిర్యాదు చేశారు. శుక్రవారం పోలీసు బందోబస్తు మధ్య కూల్చివేతలు కొనసాగించారు. ప్రభుత్వ స్థలంలోని బహుళ అంతస్తుల నిర్మాణాన్ని సీజ్ చేశారు.



ఎమ్మెల్యే కాలనీలో ప్రభుత్వ స్థలాన్ని పరిశీలిస్తున్న మంత్రి పొన్నం, కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

ప్రభుత్వ స్థలాల కబ్జాకు అడ్డుకట్ట..

ప్రజావసరాల కోసం అభివృద్ధికి ప్రణాళిక

బంజారాహిల్స్‌లో ప్రభుత్వ స్థలాన్నిఅధికారులు సకాలంలో గుర్తించారు: మంత్రి పొన్నం

బంజారాహిల్స్, మే 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రభుత్వ స్థలాల కబ్జాకు అడ్డుకట్ట వేసి.. ఆ స్థలాలను ప్రజలకు ఉపయోగపడేలా అభివృద్ధి చేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి చర్యలు చేపట్టారని హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ చెప్పారు. బంజారాహిల్స్ రోడ్ నంబర్ 12లో షేక్‌పేట రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్న 12 ఎకరాల భూమిని జీహెచ్‌ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మి, కలెక్టర్ అనుదీప్ దురిశెట్టితో కలిసి మంత్రి పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. బంజారాహిల్స్ సర్వే నంబర్ 102/1లో ఉన్న 12 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్నారని చెప్పారు. స్థల స్వాధీనంలో కొన్నిచోట్ల అవాంతరాలు వచ్చినప్పటికీ అధికారులు చాకచక్యంగా అధిగమించారని తెలిపారు. వివాదంలో ఉన్నది ప్రభుత్వ స్థలమని గుర్తించడంతోపాటు సకాలంలో స్పందించి ప్రహరీ ఏర్పాటు చేశారంటూ అధికారులను అభినందించారు. కార్యక్రమంలో షేక్‌పేట తహసీల్దార్ అనితారెడ్డి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రపంచ మహాసభలకు తెలుగు ప్రజలు తరలిరావాలి

» 3వ ప్రపంచ తెలుగు మహాసభల ప్రచార పత్రిక ఆవిష్కరణలో

కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని

గుంటూరు(తూర్పు), మే 3(ఆంధ్రజ్యోతి): మూడో ప్రపంచ తెలుగు మహాసభలకు తెలుగు ప్రజలు పెద్దఎత్తున తరలి రావాలని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. ప్రపంచ తెలుగు మహా సభల ప్రచార పత్రికను ఆయన ఏపీలోని గుంటూరు, భారతీయ విద్యాభవన్‌లో శనివారం ఆవిష్కరించి ప్రసంగించారు. ఆంధ్ర సారస్వత పరిషత్తు ఆంధ్ర మేవ జయతే నినాదంతో నిర్వహిస్తున్న తెలుగు పండుగను ప్రతిష్ఠాత్మకంగా గుంటూరులో జరపడం అందరికీ గర్వకారణమన్నారు. తాను ప్రజల్లోకి చొచ్చుకెళ్లేందుకు వారి హృదయాల్లో స్థానం పొందేందుకు తెలుగు భాష చక్కటి మాధ్యమంగా పనిచేసిందని తెలిపారు. గుంటూరు మేయర్ కోవెలమూడి రవీంద్ర మాట్లాడుతూ తెలుగు మహాసభల్లో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని కోరారు. ఆంధ్ర సారస్వత పరిషత్ అధ్యక్షుడు గజల్ శ్రీనివాస్ మాట్లాడుతూ 2026 జనవరి 3,4,5 తేదీల్లో జరిగే ప్రపంచ తెలుగు మహాసభలకు గుంటూరు వేదిక కావడం సంతోషంగా ఉందన్నారు. ఆదివారం నుంచి పలు జిల్లాల్లో తెలుగు మహాసభల విశిష్టత తెలుపుతూ ప్రచారం నిర్వహిస్తామన్నారు.

ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్.. మావోయిస్టు మృతి

చర్ల, మే 3 (ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్‌లోని గరియాబంద్ జిల్లా శోభా అడవుల్లో మావోయిస్టులు ఉన్నట్లు సమాచారం రావడంతో పోలీసులు కూబింగ్ నిర్వహించారు. ఈ క్రమంలో శనివారం ఉదయం జరిగిన ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు ఒకరు మృతి చెందినట్లు పోలీసులు ప్రకటించారు. అతని వద్ద నుంచి ఎస్‌ఎల్‌ఆర్ తుపాకీ, ఇతర వస్తువులు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. అతడిని ఐతు అలియాస్ యోగేశ్‌గా గుర్తించామని, అతడు మావోయిస్టు పార్టీలో గరియాబంద్ డీవీసీఎం సభ్యుడిగా పనిచేస్తున్నాడని పేర్కొన్నారు. ఈ ఎన్‌కౌంటర్‌లో చాలా మంది మావోయిస్టులు తప్పించుకున్నారని, వారికోసం కూంబింగ్ కొనసాగిస్తున్నామని ఎస్పీ పేర్కొన్నారు. అలాగే దంతెవాడ జిల్లాలో శనివారం ఐదుగురు మావోయిస్టులు లొంగిపోయారు. వారంతా కొంత కాలంగా మావోయిస్టు పార్టీలో పనిచేస్తూ పలు విధ్వంసకర ఘటనల్లో పాల్గొన్నారని పోలీసులు తెలిపారు. అలాగే ఛత్తీస్‌గఢ్, తెలంగాణ సరిహద్దులోని కర్రె గుట్టల్లో కూబింగ్ కొనసాగుతూనే ఉంది.

ప్రథమ భాషగా తెలుగును బోధించాలి

» తెలుగు మాధ్యమ విద్యార్థులకు పోటీ పరీక్షల్లో బోనస్ మార్కులు ఇవ్వాలి

» ప్రాచ్య కళాశాలలను ఏర్పాటు చేయాలి

» తెలంగాణ తెలుగు భాషాభిమానుల డిమాండ్

హైదరాబాద్ సిటీ, మే 3(ఆంధ్రజ్యోతి): తెలంగాణలో ఒకటో తరగతి నుంచి వృత్తి విద్యా కోర్సులతో సహా ఉన్నత విద్య వరకు తెలుగును ప్రథమ భాషగా బోధించాలని వక్తలు డిమాండ్ చేశారు. తెలుగు మాధ్యమ విద్యార్థులకు పోటీ పరీక్షల్లో బోనస్ మార్కుల విధానం తిరిగి ప్రవేశపెట్టాలని కోరారు. సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయానికి అనుబంధంగా పది ఉమ్మడి జిల్లాల్లో ప్రాచ్య కళాశాలలు ఏర్పాటు చేయాలని సూచించారు. పౌర సమాజం నుంచి నిరసనలు వ్యక్తమైన నేపథ్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ద్వితీయ భాషగా సంస్కృతం ప్రవేశపెట్టాలన్న నిర్ణయాన్ని ఇంటర్మీడియట్ బోర్డు వెనక్కి తీసుకున్నట్లు ప్రకటించిందే కానీ ఉత్తర్వుల రూపంలో కళాశాలలకు పంపలేదని ఆక్షేపించారు. 'తెలుగు రాష్ట్రంలో తెలుగు భాషకు అవమానం ఎందుకు? ద్వితీయ భాషగానూ తెలుగును తొలగిస్తారా? ఏం జరుగుతోంది? ఏం జరగాలి' అంటూ తెలంగాణ, తెలుగు భాషాభిమానులు శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సమాలోచన సభ నిర్వహించారు. ముఖ్య వక్తగా పాల్గొన్న సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ ఆత్మాభిమానం కలిగిన ఏ సమాజమైనా మాతృభాషను చంపుకోదని అన్నారు. ఇంటర్‌లో విద్యార్థులకు అక్కరకు రాని సంస్కృతానికి బదులు తెలుగుకే ఎక్కువ మార్కులు వేయొచ్చు కదా అని సూచించారు. సంస్కృతాన్ని ఇంగ్లిషు, తెలుగులో రాయడమేంటని ప్రశ్నించారు. తెలంగాణ సాహిత్య అకాడమీ తొలి అధ్యక్షుడు నందిని సిధారెడ్డి మాట్లాడుతూ కొంతమంది తెలుగేతర ప్రభుత్వ ఉన్నతాధికారుల చర్యల వల్ల మాతృభాషకు తీవ్ర నష్టం కలుగుతోందని అన్నారు. వారే దుర్మార్గ జీవోలతో తెలుగును తుడిచిపెట్టే ప్రయత్నాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. తెలుగు వద్దు అని ర్యాలీలు, నిరసనలు చేయిస్తున్న స్థానికేతరులు వారి స్వస్థలాలకు వెళ్లిపోవాలన్నారు. చినజీయర్ జోక్యంవల్లే ఇంటర్ వరకు తప్పనిసరి తెలుగు అమలు నిర్ణయాన్ని గత సీఎం కేసీఆర్ వెనక్కితీసుకున్నారని చెప్పారు. మాతృభాష మార్కుల కోసమా, మానవ సంబంధాల కోసమా? అని ఆయన ప్రశ్నించారు. సీనియర్ ఎడిటర్ కె. శ్రీనివాస్ మాట్లాడుతూ ఆధునిక అవసరాల రీత్యా తెలుగుకు చాలామంచి భవిష్యత్తు ఉందని చెప్పారు. అందుకు తగినట్టు భాషాభివృద్ధి కోసం ప్రభుత్వం కృషి చేయాలని సూచించారు. ఇంటర్ వరకు వ్యవహారిక తెలుగు బోధనను తప్పనిసరి చేయాలని కోరారు. ఎమ్మెల్సీ గోరటి వెంకన్న మాట్లాడుతూ మన మాతృభాషపై ఇంగ్లిషు, హిందీ, సంస్కృత భాషల ఆధిపత్యాన్ని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. వలసవాద వ్యతిరేక పోరాటం లోతుగా సాగకపోవడం వల్ల భాష, సంస్కృతుల పరిరక్షణలో మనం ఇంకా సామ్రాజ్యవాద దృక్పథంతోనే ఆలోచిస్తున్నామని సామాజిక వేత్త ఆచార్య హరగోపాల్ ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణ సారస్వత పరిషత్ విశ్రాంత అధ్యాపకుడు మోత్కూరి నరహరి సభాధ్యక్షత జరిగిన కార్యక్రమంలో హెచ్‌సీయూ తెలుగుశాఖ అధ్యక్షుడు ఆచార్య పిల్లలమర్రి రాములు, మీడియా అకాడమీ మాజీ చైర్మన్ అల్లం నారాయణ, ఎమెస్కో చంద్రశేఖరరెడ్డి, కవి యాకూబ్, పాలమూరు అధ్యయన వేదిక రాఘవాచారితో పాటు అధ్యాపకులు, ఉపాధ్యాయులు, కవులు, రచయితలు పెద్దసంఖ్యలో పాల్గొని తెలుగును కాపాడుకుందామని పిలుపునిచ్చారు. పాత ప్రాచ్య కళాశాలలను పునరుద్ధరించాలని, తెలుగు పండిత శిక్షణ కళాశాలలను ఏర్పాటు చేయాలని తదితర తీర్మానాలను ఆమోదించారు.

పురుడుకు వస్తే ప్రాణం పోయింది

» తాండూరు ఎంసీహెచ్‌లో గర్భిణి మృతి

» కడుపులోనే 8 నెలల శిశువు కన్నుమూత

» వైద్యుల నిర్లక్ష్యమంటున్న కుటుంబసభ్యులు



సుమిత్రాబాయి (ఫైల్)


తాండూరు, మే 3 (ఆంధ్రజ్యోతి): పురుడు కోసం ఆస్పత్రికి వచ్చిన ఓ గర్భిణి ప్రాణాలను కోల్పోయింది. తల్లితో పాటు కడుపులోనున్న 8 నెలల శిశువు కూడా కన్నుమూసింది. వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే గర్భిణితో పాటు బిడ్డ చనిపోయిందని కుటుంబసభ్యులు ఆరోపిస్తున్నారు. ఈ సంఘటన వికారాబాద్ జిల్లా తాండూరు మాతా శిశు(ఎంసీహెచ్) ఆస్పత్రిలో జరిగింది. పెద్దేముల్ మండలం పాషాపూర్ తండాకు చెందిన సుమిత్రాబాయికి శనివారం పురిటి నొప్పులు రావడంతో తాండూరు ఆస్పత్రికి తీసుకొచ్చారు. ఉదయం 6 గంటలకు తీసుకొస్తే 7:30 గంటలకు వైద్యులు ప్రసవానికి తీసుకెళ్లారు. ఏమైందో తెలియదు కాసేపటికే సుమిత్రాబాయి మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఆమెకు రక్తం తక్కువగా ఉందని ఊపిరి తీసుకోవడంలో ఇబ్బందులు రావడంతోనే మృతి చెందిందని, అప్పటికే సీపీఆర్ చేస్తూ వైద్యం అందించామని వైద్యులు తెలిపారు. ఆమెతో పాటు కడుపులో ఉన్న 8 నెలల శిశువు కూడా మృతి చెందినట్లు వెల్లడించారు. విషయం తెలిసిన ఆమె భర్త జయసింగ్, కుటుంబ సభ్యులు వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే సుమిత్రాబాయి మృతి చెందిందని ఆరోపించారు. కాగా, వైద్యం అందించడంలో నిర్లక్ష్యం చేయలేదని ఆస్పత్రి వైద్య సిబ్బంది పేర్కొంటున్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.

ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY
హనుమకొండ
HANUMAKONDA
ఆదివారం 4 మే 2025
1



చలో.. చలో.. చూసొద్దాం..

ఉమ్మడి జిల్లాలో దర్శనీయ స్థలాలెన్నో..

- దేని విశిష్టత దానిదే.. ఎన్ని సార్లైనా చూడాలనిపించే సోయగాలు
- ఎటు వెళ్లినా 100- 150కిలోమీటర్ల దూరమే
- నిత్యం అందుబాటులో ఆర్టీసీ బస్సు సర్వీసులు
- సొంత వాహనమైతే వెళ్లొచ్చు.. మరింత హుషారుగా..

3

చారిత్రక వైభవానికి సజీవ సాక్ష్యాలుగా కొలువైన అపురూప శిల్పకళాశోభిత ఆలయాలు.. అనేక ప్రాచీన కట్టడాలు.. కాకతీయుల వైభవాన్ని చాటే కోటలు, కళా తోరణాలు.. ప్రకృతి అందాలను రెట్టింపు చేసే అందమైన సరస్సులు, అటవీ, కొండ ప్రాంతాల నుంచి జాలు వారే జలపాతాలు.. ఒక్కటేమిటీ.. పర్యాటకుల మదిని దోచే అందాలు ఉమ్మడి జిల్లాలో ఎన్నో.. ఎన్నో. వీటిలో దేని విశిష్టత దానిదే. ఎన్ని సార్లు అయినా చూడాలనిపించేలా ఆకర్షించే దర్శనీయ స్థలాలు కొలువై ఉన్నాయి. ప్రస్తుతం విద్యాసంవత్సరం ముగిసి వేసవి సెలవులు వచ్చిన వేళ పర్యాటకుల తాకిడి పెరుగుతోంది. కానీ ప్రస్తుతం ఉన్న వేడి వాతావరణంలో ఎక్కువ దూరం వెళ్లే కంటే.. దగ్గరి ప్రాంతాల్లోని పర్యాటక ప్రాంతాలకు తీసుకెళ్లేందుకు ఆసక్తి చూపుతుంటారు. పేద, మధ్య తరగతి వారైతే ఖర్చును బేరీజు వేసుకుంటారు. ఈ క్రమంలో 'చలో చలో చూసొద్దాం రండి..' అంటూ ఉమ్మడి వరంగల్‌తో పాటు చుట్టుపక్కల జిల్లాల నుంచి కుటుంబాలు ఈ ప్రాంతాలను సందర్శించేందుకు తరలొస్తుంటాయి. ఈ నేపథ్యంలో వరంగల్, హనుమకొండల నుంచి ఎటు వెళ్లినా 100 నుంచి 150కి.మీ. దూరంలో ఉండే పలు పర్యాటక ప్రాంతాలు, అక్కడి విశిష్టతలు, సౌకర్యాల గురించి 'ఆంధ్రజ్యోతి' ఆదివారం ప్రత్యేక కథనం.

– హనుమకొండ, ఆంధ్రజ్యోతి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

కాంగ్రెస్‌కు వెన్నుదన్ను కార్యకర్తలే..

- పనిచేసే వారికి తప్పక గుర్తింపు
- నియోజకవర్గ 'సంస్థాగత' సమావేశంలో పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

హనుమకొండ సిటీ, మే 3 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీకి వెన్నుదన్ను కార్యకర్తలే.. కష్టించి పనిచేసే వారికి తప్పక గుర్తింపు వస్తుందని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. శనివారం హనుమకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సంస్థాగత, నిర్మాణ సన్నాహక సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ సంస్థాగత కమిటీలను ఏర్పాటు చేసే కార్యక్రమం ప్రారంభమైందన్నారు.ముందుగా జిల్లాస్థాయి పార్టీ సమావేశం నిర్వహించామని, అన్ని నియోజకవర్గాల్లో సమావేశాలు పూర్తి చేస్తామని, కార్యకర్తలు నిరాశపడొద్దని చెప్పారు. పార్టీ కోసం పనిచేసిన వారికి తగిన గుర్తింపు ఇస్తామని, డివిజన్ స్థాయి, బూత్ స్థాయి నాయకులే పార్టీకి పునాది అని అన్నారు. ఎంపీ కడియం కావ్య మాట్లాడుతూ.. ప్రజల అవసరాలు తీర్చడంలో కాంగ్రెస్ పార్టీ ముందుంటుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమాన్ని రెండు కళ్ల మాదిరిగా నడిపిస్తూ ఉందన్నారు. హనుమకొండ జిల్లా పార్టీ సంస్థాగత ఇన్‌చార్జ్‌లు కె.వినయ్‌రెడ్డి, మక్సూద్ అహ్మద్ మాట్లాడుతూ.. డివిజన్ స్థాయి, బూత్ స్థాయి కేడర్‌ను మరింత బలోపేతం చేస్తూ స్థానిక సంస్థలు, మున్సిపల్ ఎన్నికల్లో సత్తా చాటాలన్నారు., కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, దీంతో పార్టీకి మరింత ఆదరణ పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గ్రంథాలయ చైర్మన్ చైర్మన్ ఎం.డి.రియాజ్, టీపీసీ ప్రధాన కార్యదర్శి కూచన రవళి, టీపీసీసీ సభ్యులు బత్తిని శ్రీనివాసరావు, బొద్దిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్‌ఖాన్, మున్సిపల్ కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు, అనుబంధ సంఘాల అధ్యక్షులు, డివిజన్ అధ్యక్షులు, మాజీ కార్పొరేటర్‌లు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.



హనుమకొండ కలెక్టరేట్‌లో జరిగిన సమీక్షలో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్, చిత్రంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు కలెక్టర్లు

రెండేళ్లలో దేవాదుల పూర్తి

ఆరు లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తాం

- కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో వరి సాగు పెరిగింది
- సన్న బియ్యం పంపిణీతో 84శాతం పేదలు కడుపునిండుతోంది..
- రేషన్ కార్డుల పంపిణీ నిరంతర ప్రక్రియ
- నీటి పారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి
- హనుమకొండ కలెక్టరేట్‌లో సమీక్ష సమావేశం
- పాల్గొన్న మంత్రులు పొంగులేటి, సీతక్క, ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు

3



భద్రకాళి చెరువు పూడికతీత పనులను పరిశీలిస్తున్న మంత్రులు



దేవన్నపేట వద్ద దేవాదుల పంప్‌హౌస్‌ను పరిశీలిస్తున్న మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు

సుందరీమణుల పర్యటనను విజయవంతం చేయాలి

- అధికారులకు కలెక్టర్ ప్రావీణ్య ఆదేశం
- వేయిస్తంభాల ఆలయంలో ఏర్పాట్ల పరిశీలన



ఆలయాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

హనుమకొండ కల్చరల్, మే 3 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ సుందరీమణుల ఓరుగల్లు పర్యటనను విజయవంతం చేసేందుకు అందరూ సహకరించాలని హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య కోరారు. ఆలయ విశిష్టతను తెలియచెప్పే గైడ్లను ఏర్పాటు చేయాలని, ఆలయం చుట్టూరా పూలకుండీలతో శోభాయమానంగా అలంకరించాలని, ప్రపంచ సుందరీమణులకు రెడ్ కార్పెట్ స్వాగతం ఉండేలా చూడాలని కలెక్టర్ సూచించారు. ఈనెల 14వ తేదీన ప్రపంచ సుందరీమణులు 30మందితో కూడిన ఒక బృందం చారిత్రక వేయిస్తంభాల ఆలయాన్ని సందర్శించనున్న నేపథ్యంలో చేపట్టాల్సిన ఏర్పాట్లను ఆమె టూరిజం శాఖ, దేవాదాయ శాఖ అధికారులతో కలిసి పరిశీలించారు. 30 దేశాల నుంచి వచ్చే ప్రతినిధుల కోసం జాతీయ స్థాయి మీడియా వెంట ఉంటున్న నేపథ్యంలో పగడ్బందీ ఏర్పాట్లు ఉండాలన్నారు. ఘన స్వాగతంలో పాటు ఒక సాంస్కృతిక నృత్యం, రుద్రేశ్వరుడి సందర్శన, గ్రూప్ ఫొటో లాంటి కార్యక్రమాలు ఉంటాయన్నారు. 45 నివిషాల పాటు ఆలయంలో వారి కార్యక్రమా లు ఉంటున్న నేపథ్యంలో చేపట్టాల్సిన ఏర్పాట్ల ను ఆమె సంబంధిత అధికారులతో సమీక్షించా రు. ఈ సందర్భంగా కలెక్టర్ రుద్రేశ్వరుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధా న అర్చకుడు గంగు ఉపేంద్రశర్మ, మణి కంఠ శర్మ కలెక్టర్‌కు స్వామివారి శేషవస్త్రాలను బహూకరించారు. కలెక్టర్ వెంట టూరిజం అధికారి శివాజీ, కేంద్ర పురావస్తుశాఖ అధికారి నవీన్, సూర్యకిరణ, ఏసీపీలు, పలువురు పోలీసు అధికారులు, రెవెన్యూ అధికారులు, ఆలయ ఈవో అనిల్ తదితరులు ఉన్నారు.

నేటి 'నీట్'కు పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు

- బంగారు ఆభరణాలతో సెంటర్‌లోకి రావొద్దు
- బెల్టులు, బూట్లు, సాక్సులు, ఫుల్‌హ్యాండ్ చొక్కాలు ధరించొద్దు
- వరంగల్ సీపీ సన్‌ప్రీత్ సింగ్



మాట్లాడుతున్న సీపీ సన్‌ప్రీత్ సింగ్

వరంగల్ క్రైం, మే 3 (ఆంధ్రజ్యోతి): నీట్ ప్రవేశ పరీక్షకు పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు చేసినట్లు వరంగల్ సీపీ సన్‌ప్రీత్ సింగ్ చెప్పారు. నీట్ ప్రవేశ్ పరీక్ష సజావుగా నిర్వహించేందుకు పోలీస్ అధికారులతో సీపీ శనివారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. పరీక్షా కేంద్రాల్లోకి బంగారు, వెండి ఆభరణాలతో వచ్చే విద్యార్థులను ఎట్టిపరిస్థితుల్లో అనుమతించేది లేదన్నారు. అభ్యర్థులను ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1.30లోపు అనుమతించాలని సూచించారు. పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ఠమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని, పరీక్ష కేంద్రాల పరిసరాల్లో 163 బీఎన్‌ఎస్ (144 సెక్షన్) అమలులో ఉంటుందని గుర్తుచేశారు. 100 మీటర్ల లోపల ఉన్న జిరాక్స్ సెంటర్లు మూసివేయించాలని, అభ్యర్థులు, ఇన్విజిలేటర్స్ ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకురావొద్దని సూచించారు. ప్రతీ పరీక్ష కేంద్రంలో సీసీ కెమెరాల పర్యవేక్షణ ఉంటుందని, ప్రతీ అభ్యర్థిని క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతనే పరీక్ష కేంద్రంలోకి అనుమతించాలన్నారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు గుర్తింపుకార్డు, రెండు పాస్‌ఫొటోలు, ఒక పోస్ట్‌కార్డుసైజ్ ఫొటో తప్పనిసరిగా వెంట తెచ్చుకోవాలన్నారు. అలాగే షూస్, సాక్స్, బెల్టులు, ఫుల్‌హ్యాండ్ షర్ట్స్ ధరించిన వారిని పరీక్షాకేంద్రంలోకి అనుమతించబడదన్నారు. పారదర్శకంగా ఉండే వాటర్‌బాటిల్‌ను మాత్రమే లోపలికి అనుమతించబడుతునన్నారు. ఈ సమావేశంలో ఈస్ట్‌జోన్ డీసీపీ అంకిత్‌కుమార్, అదనపు డీసీపీలు రవి, సురేశ్‌కుమార్, ఐటీకోర్, కమ్యూనికేషన్ విభాగం అధికారులు పాల్గొన్నారు.

సూర్యప్రభ వాహనంపై ఊరేగిన అమ్మవారు

వరంగల్ కల్చరల్, మే 3 (ఆంధ్రజ్యోతి): చారిత్రక భద్రకాళి అమ్మవారి దేవాలయంలో అత్యంత వైభవంగా జరుగుతున్న కల్యాణ బ్రహ్మోత్సవాలు శనివారం నాటికి ఐదో రోజుకు చేరుకున్నాయి. ఉదయం 4 గంటలకు సుప్రభాత సేవతో నిత్యపూజలు నిర్వహించిన అనంతరం అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పించారు. సూర్యప్రభ వాహనంపై ఉత్సవ మూర్తిని ఊరేగించారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. శనివారం సగర (ఉప్పర) సంక్షేమ సంఘం వారు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి సేవారాధనలు నిర్వహించిన అనంతరం భక్తులకు అన్నప్రసాదం అందించారు. కార్యక్రమంలో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

అమ్మవారి సన్నిధిలో మంత్రులు, ఎమ్మెల్యేలు..

వరంగల్ ఉమ్మడి జిల్లాలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనడానికి విచ్చేసిన రాష్ట్ర మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, కేఆర్.నాగరాజు, యశస్వినిరెడ్డి, కడియం శ్రీహరి, శ్రీరాంచందర్‌నాయక్, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డి, కలెక్టర్లు అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రధానార్చకుడు భద్రకాళి శేషు, ఈవో శేషు భారతి వారికి పూర్ణకుంభ స్వాగతం పలికి అమ్మవారి తీర్థ ప్రసాదాలు, శేష వస్త్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు భద్రకాళి చెరువు పూడిక తీత పనులు, మాడవీధుల నిర్మాణ పనులను పర్యవేక్షించారు.

ఐదో రోజుకు చేరిన కల్యాణ బ్రహ్మోత్సవాలు



అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న మంత్రులు


సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ డైరెక్టర్ మధుసూదన్

విద్యుత్ ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

ఎన్పీడీసీఎల్ ఆపరేషర్ విభాగం ఇన్‌చార్జ్ డైరెక్టర్ మధుసూదన్

రాంనగర్, మే 3 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ ప్రమాదాలకు గురికాకుండా విధుల్లో ఉన్న విద్యుత్ ఉద్యోగులు భద్రతా సూత్రాలు పాటించాలని ఎన్పీడీసీఎల్ ఆపరేషన్ విభాగం ఇన్‌చార్జ్ డైరెక్టర్ మధుసూదన్ సూచించారు. విద్యుత్ భద్రతా వారోత్సవాల్లో భాగంగా శనివారం విద్యుత్‌నగర్‌లోని పవర్ డిప్లొమా ఇంజనీర్స్ అసోసియేషన్ భవన్‌లో హనుమకొండ డివిజన్ ఉద్యోగులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మధుసూదన్ మాట్లాడుతూ.. జాగ్రత్తలు పాటించని ఉద్యోగులతో వారి కుటుంబసభ్యులు చాలా ఇబ్బందులకు గురవుతున్నారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ సర్కిల్ ఎస్ఈ మధుసూదన్‌రావు, డీఈ టెక్నికల్ అండ్ సేఫ్టీ ఆఫీసర్ విజేందర్‌రెడ్డి, హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి, ఏడీఈలు మల్లిఖార్జున్, సుబ్రమణ్యేశ్వర్‌రావు, రాజు, ఏఈలు, ఓఅండ్ఎం సిబ్బంది పాల్గొన్నారు.

రేపటి నుంచి 'రైతు ముగింట్లో శాస్త్రవేత్తలు'



వరంగల్ వ్యవసాయం, మే 3(ఆంధ్రజ్యోతి): మెరుగైన సాగు పద్ధతులపై అవగాహన కల్పించేందుకు వ్యవసాయ శాస్త్రవేత్తలు నడుంకట్టారు. మే 5 నుంచి జూన్ 13 వరకు ఆచార్య జయశంకర్ తెలంగాణ విశ్వ విద్యాలయం ఆధ్వర్యంలో 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' అనే కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా భారీ ఎత్తున నిర్వహించడానికి ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ఇందుకోసం భాగంగా ఉమ్మడి వరంగల్, ఖమ్మం, మెదక్ జిల్లాలకు 50కి పైగా శాస్త్రవేత్తల బృందాలను ఇప్పటికే ఖరారు చేశారు. ప్రతీ బృందంలో విశ్వవిద్యాలయం నుంచి ఇద్దరు వ్యవసాయ శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు, వ్యవసాయ కళాశాల విద్యార్థులు, అభ్యుదయ రైతులు ఉంటారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని కృషి విజ్ఞాన కేంద్రాలు, ఏరువాక కేంద్రాలు, వ్యవసాయ పరిశోధన సంస్థలు, వ్యవసాయ కళాశాలలు, వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలలోని శాస్త్రవేత్తలతో పాటు వ్యవసాయ అనుబంధ రంగాల ప్రభుత్వ అధికారులు, అభ్యుదయ రైతులు పాల్గొంటారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని మధ్య తెలంగాణ మండలం, సహ సంచాలకుడు ఆర్.ఉమారెడ్డి మాట్లాడుతూ.. ఈ కార్యక్రమం ద్వారా రైతులకు సూచనలు, సలహాలు ఇస్తామన్నారు. అంతేగాకుండా శాస్త్రవేత్తలు, వ్యవసాయ కళాశాల విద్యార్థులు రైతుల సమస్యలను స్వయంగా తెలుసుకుని వాటి పరిష్కారానికి పరిశోధనలు చేస్తారని అన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఫైనాన్స్ రికవరీ ఏజెంట్ల జులుం

- డబ్బులు ఆలస్యం చేస్తే మాటు వేసి దాడులు
- బల్దియా కార్యాలయం వద్ద ఒకరిపై ఏజెంట్ల దాడి
- పంచాయితీలు, సెటిల్‌మెంట్లకు అడ్డాగా బల్దియా ఆఫీసు


బల్దియా ఆవరణలో వ్యక్తిని అడ్డుకుంటున్న ఫైనాన్స్ ఏజెంట్లు (సర్కిల్‌లో..)

వరంగల్ కార్పొరేషన్, మే 3 (ఆంధ్రజ్యోతి): వరంగల్ నగరంలో కొన్ని ఫైనాన్స్, చిట్‌ఫండ్ సంస్థల యజమానుల ప్రోత్సాహంతో అందులో పని చేసే రికవరీ ఏజెంట్లు, అసిస్టెంట్లు రెచ్చిపోతున్నారు. పోలీసులు సైతం తమను ఏమీ చేయలేరని హల్‌చల్ చేస్తున్నారు. కొన్ని ఫైనాన్స్ కంపెనీలో లోన్ తీసుకున్న వారు చెల్లించడంతో కొంత జాప్యం చేస్తే భౌతికదాడులకు దిగుతున్నారు. చిట్టీ డబ్బులు ఒక్క నెల ఆలస్యం చేస్తే చిట్టీసభ్యులతో పాటు ష్యూరిటీ పడిన వ్యక్తులను సైతం టార్గెట్‌చేసి ఫోన్‌చేసి మరీ దుర్భాషలాడుతున్నారు. ఇటీవల ఓ చిట్‌ఫండ్ నుంచి లోన్ తీసుకున్న వ్యక్తితోపాటు అతడికి ష్యూరిటీ పడిన ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడికి ఫోన్ చేసి నానా దుర్భాషలాడడంతో విషయం కాస్తా.. పోలీసుస్టేషన్ వరకు చేరింది. ఇంకా హనుమకొండకు చెందిన ఓ చిట్‌ఫండ్ రికవరీ అసిస్టెంట్.. ఆర్టీసీ ఉద్యోగితో ఫోన్‌లో బూతుపురాణం ఎత్తడంతో ఆత్మహత్యాయత్నం చేసుకున్నారు. ఇలా ప్రతీరోజు ఎక్కడో ఒక చోట ఫైనాన్స్, చిట్‌ఫండ్ సంస్థల రికవరీ అసిస్టెంట్లు ఆగడాలు, భౌతికదాడులకు పాల్పడుతున్నా పోలీసులు చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నట్టు తెలుస్తోంది.

తాజాగా శనివారం బల్దియా కార్యాలయం ఆవరణలో ఓ ఫైనాన్స్ కంపెనీ ఏజెంట్లు నానా హంగామా చేశారు. ఓ వ్యక్తిని అందరూ చూస్తుండగానే అడ్డగించి అతడి వద్ద ఉన్న సెల్‌ఫోన్, డబ్బులు బలవంతంగా లాక్కొని దాడికి పాల్పడడంతో అక్కడి వారు నివారించారు. వివరాల్లోకి వెళితే.. భూపాలపల్లి జిల్లాకు చెందిన శ్రీనివాస్ అనే వ్యక్తి నగరంలోని ఓ ఫైనాన్స్ కంపెనీలో చిట్టీలు వేసి ముందస్తుగా లోన్ ఎత్తుకున్నాడు. జమానతుగా ఇద్దరు ప్రభుత్వ ఉద్యోగులతో సంతకాలు చేయించాడు. ఈ క్రమంలో శ్రీనివాస్ అనారోగ్యం కారణంగా రెండు మాసాలుగా డబ్బులు చెల్లించలేక పోయాడు. దీంతో రంగంలోకి దిగిన సదరు సంస్థ ఏజెంట్లు.. శ్రీనివాస్‌కు ఫోన్ చేసినా స్పందించకపోవడంతో అతడి కోసం ఆరాదీశారు. అతడికి తెలిసిన వ్యక్తిని ఎరగా వేసి ఫోన్ చేయించి శనివారం బల్దియా ప్రధాన కార్యాలయానికి పిలిపించారు. అప్పటికే అక్కడ మాటు వేసి ఉన్న ఫైనాన్స్ కంపెనీ రికవరీ ఏజెంట్లు ఒక్కసారిగా శ్రీనివాస్‌పై పడ్డారు. దాడి చేసి అతడి వద్ద ఉన్న సెల్‌ఫోన్, నగదును లాక్కున్నారు. అక్కడ ఉన్న వారు నివారించే ప్రయత్నం చేసినా వెనక్కి తగ్గలేదు. దీంతో అక్కడి వారు 100 డయల్‌కు ఫోన్‌చేసి సమాచారం అందించారు. మట్టెవాడ పోలీసులు వచ్చి బాధితుడితో పాటు దాడిచేసిన ఏజెంట్లను స్టేషన్‌కు తరలించారు. విచారించి కేసు నమోదు చేయకుండా వదిలివేసినట్టు మట్టెవాడ పోలీసులు వెల్లడించారు. దీనిపై సీఐ తుమ్మ గోపిరెడ్డిని వివరణ కోరగా.. ఇద్దరిని స్టేషన్‌కు తీసుకుని వచ్చి విచారించగా తన ఆరోగ్యం కుదుటపడిన తర్వాత డబ్బులు చెల్లిస్తానని చెప్పి పిటిషన్ ఇవ్వకుండా వెళ్లిపోయినట్టు తెలిపారు.

పంచాయతీలు, సెటిల్మెంట్లకు అడ్డాగా బల్దియా

గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయం అక్రమార్కులకు అడ్డాగా మారింది. ఉదయాన్నే కొందరు చిట్‌ఫండ్ ఉద్యోగులు ఇక్కడి నుంచే ఆపరేట్ చేస్తున్నట్టు తెలుస్తోంది. ఇంకా బల్దియా ఆవరణలోని చెట్ల కింద బయటి వ్యక్తులు అడ్డాలు ఏర్పాటు చేసుకుని సెటిల్మెంట్లు చేస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది. అంతేకాకుండా ఆఫీస్ సమయంలో కుటుంబ పంచాయితీలు, ఆన్‌లైన్ గేమ్‌లు, ఆటోలు, కార్లలో మందుబాబులు మద్యం సేవించడం, సట్టా బుక్కర్లు, గంజాయి స్మోకర్లు ఇక్కడ అడ్డాలు వేస్తూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్టు విశ్వసనీయ సమాచారం. అంతే కాకుండా ఇటీవల బల్దియా ఆవరణలో బైక్ దొంగలతో పాటు గ్రిల్స్, ఇనుప వస్తువులు, సిమెంటు బస్తాలు దొంగిలించి పట్టుబడినా పోలీసులు చూసీచూడనట్టు వ్యవహరించినట్టు తెలిసింది. ఆదివారం కుటుంబ, విడాకుల పంచాయితీలకు బల్దియా కార్యాలయం అడ్డాగా మారిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. నిత్యం నిఘా విభాగం పోలీసులు ఇక్కడే తిరుగుతున్నా నిద్రమత్తు నటిస్తున్నట్టు తెలుస్తోంది. బల్దియా కార్యాలయంలో పోలీసు నిఘా పెంచి అక్రమార్కులకు అడ్డుకట్ట వేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

కర్రెగుట్టల్లో కొనసాగుతున్న పోలీసుల కూంబింగ్

వెంకటాపురం, మే 3 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ - ఛత్తీస్‌గడ్ సరిహద్దుల్లోని కర్రెగుట్టల్లో 12 రోజులుగా కూంబింగ్ ఆపరేషన్ కొనసాగుతోంది. కర్రెగుట్టల్లో మావోయిస్టు అగ్రనేతలతోపాటు సుమారు 1000 మంది మావోయిస్టులు ఉన్నారనే నిఘా వర్గాల సమాచారంతో కేంద్ర బలగాలు గుట్టలను చుట్టుముట్టాయి. గుట్టల చుట్టూ మావోయిస్టులు అమర్చిన మందుపాతరలను తొలగించుకుంటూ బలగాలు ముందుకు సాగుతున్నాయి. కాగా, 12వరోజు శనివారం కూంబింగ్ ఆపరేషన్‌లో పాల్గొన్న ఇద్దరు జవాన్లు వడదెబ్బకు గురికావడంతో వారిని వెంకటాపురం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రథమ చికిత్స అందించిన అనంతరం ములుగు ఏరియా వైద్యశాలకు తరలించినట్లు సమాచారం.

అవకతవకలు జరగకుండా వ్యవహరిస్తున్నాం..

ఎన్పీడీసీఎల్ హెచ్‌ఆర్‌డీ సీఈ మధుసూదన్

రాంనగర్, మే 3 (ఆంధ్రజ్యోతి): ఏఈ, ఏఏఈ నుంచి ఏడీఈ పదోన్నతుల విషయంలో ఎలాంటి అవకతవకలకు చోటు లేకుండా ఎన్పీడీసీఎల్ యజమాన్యం వ్యవహరిస్తున్నదని టీజీ ఎన్పీడీసీఎల్ హెచ్‌ఆర్‌డీ సీఈ టి.మధుసూదన్ ఒక ప్రకటనలో తెలిపారు. డిపార్ట్‌మెంటల్ పరీక్ష ఉత్తీర్ణత కాస్-3, కింది కేడర్‌కు మాత్రమే వర్తిస్తుందని, క్లాస్-2, ఆపై క్యాడర్‌కు ఉత్తీర్ణత మినహాయింపు వర్తించదన్నారు. వికలాంగుల విషయంలో సైతం నిష్పాక్షపాతం వ్యవహరిస్తున్నామన్నారు. కంపెనీ నియమ నిబంధనలకు లోబడి అన్ని కేడర్‌లకు ఆర్‌ఓఆర్ అమలుపరుస్తామన్నారు. ఖాళీలను అర్హులతోనే నింపుతున్నామని, లేకుంటే క్యారీఫార్వర్డ్ చేస్తున్నామన్నారు.

'బురిడీ డీలర్'పై పోలీసుల విచారణ

ఆంధ్రజ్యోతి కథనంతో చర్య

వర్ధన్నపేట రూరల్, మే 3 (ఆంధ్రజ్యోతి): 'పథకాల పేరిట డీలర్ బురిడీ' అంటూ శనివారం ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనం జిల్లాలో తీవ్ర చర్చకు దారి తీసింది. శనివారం మండలంలోని నల్లబెల్లి గ్రామానికి చెందిన డీలర్‌ను ఠాణాకు పిలిపించి విచారణ చేసినట్లు వర్ధన్నపేట సీఐ శ్రీనివాసరావు తెలిపారు. అయితే సదరు డీలర్ తాను డబ్బులు వసూలు చేయలేదని, అమాయకుడినంటూ సమాధానం చెప్పినట్లు సమాచారం. పోలీసులు సాక్షాధారాలు చూపడంతో మరోసారి ఇలాంటి పనులు చేయనంటూ ప్రాధేయపడి, తీసుకున్న డబ్బులు తిరిగి ఇచ్చేస్తానని, మరోసారి వసూళ్లకు పాల్పడనని పోలీసులకు లిఖిత పూర్వకంగా రాసిచ్చినట్లు సీఐ వివరించారు. డీలర్ బాధితులు ఎవరైనా ఉంటే వచ్చి ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేస్తామని సీఐ పేర్కొన్నారు. కథనంపై సుమోటోగా కేసును పెట్టలేమన్నారు.

ఎర్లీబర్డ్ స్కీమ్‌ను సద్వినియోగం చేసుకోండి


సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ గుండు సుధారాణి

కాన్ఫరెన్స్ హాల్‌లో అధికారులతో మేయర్ సుధారాణి సమావేశం

వరంగల్ కార్పొరేషన్, మే 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఎర్లీబర్డ్ స్కీమ్‌ను ఈ నెల 7వ తేదీ వరకు పొడిగించిందని, ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మేయర్ గుండు సుధారాణి అధికారులకు ఆదేశించారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పురోగతి, 5 శాతం పన్ను రాయితీ (ఎర్లీబర్డ్ స్కీమ్) వసూళ్ల హీట్ వేవ్‌పై మేయర్ కాన్ఫరెన్స్ హాల్‌లో శనివారం బల్దియా కమిషనర్, అధికారులతో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. ఆస్తి పన్ను ముందస్తుగా చెల్లిస్తే 5శాతం ఫీజులో రెబిట్ వర్తిస్తుందని ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఇప్పటివరకు బల్దియాకు రెబిట్ ఫీజుతో రూ.25కోట్లు వసూలు అయ్యాయని అన్నారు. ఇంకా మూడురోజులు మాత్రమే రెబిట్ ఫీజు చెల్లింపులు ఉంటాయని, ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఎల్ఆర్ఎస్ 25శాతం రెబిట్ చెల్లింపులు శనివారంతో ముగిసిందని, నేటినుంచి పూర్తి ఫీజు చెల్లించవలసి ఉంటుందని అన్నారు. ఇప్పటి వరకు 35,500 ప్లాట్ల క్రమబద్ధీకరణకు రూ.170కోట్ల ఫీజు చెల్లించారని అన్నారు. ఫీజులు చెల్లించిన వారికి త్వరగా ప్రొసీడింగ్ కాపీలు జారీ చేయాలని ఆదేశించారు. రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి హైదరాబాద్‌లో హీట్‌వేవ్‌పై తీసుకోవాల్సిన యాక్షన్‌ప్లాన్‌ను విడుదల చేసిన మాదిరిగా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఎండల నుంచి ప్రజలకు ప్రసార, ప్రచార మాధ్యమాల ద్వారా అవగాహన కల్పించాలని అన్నారు. అదే విధంగా శిథిలావస్థలో ఉన్న ఇండ్లను ముందస్తుగా గుర్తించి రెడ్ నోటీసులు ఇచ్చి వర్షాకాలం రాక ముందే కూల్చి వేయాలన్నారు. బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే మాట్లాడుతూ.. ఇండ్లు, అపార్ట్‌మెంట్లు, షాపులు, కమర్షియల్ కాంప్లెక్స్‌ల పన్నులను ముందస్తుగా చెల్లించేందుకు బల్దియా అధికారులు ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ జోనా, డిప్యూటీ కమిషనర్లు ప్రసన్నరాణి, రాజేందర్, డీఎఫ్‌వో శంకర్‌లింగం, టౌన్‌ప్లానింగ్, రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

చెస్‌తో మేధో సంపత్తి

వరంగల్ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి


విజేతలకు బహుమతులను ప్రదానం చేస్తున్న వరంగల్ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, నిర్వాహకులు

వరంగల్ స్పోర్ట్స్, మే 3(ఆంధ్రజ్యోతి): చెస్ క్రీడల్లో పాల్గొనడం ద్వారా మేధో సంపత్తి పెంపొందుతుందని చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి అన్నారు. వరంగల్ జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వరంగల్‌లోని చాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో నిర్వహించిన ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి అండర్-9 బాలబాలికల చెస్ ఎంపిక పోటీలు శనివారం ముగిశాయి. ఈ ముగింపు వేడుకలకు రవీందర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ముందుగా విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల, తల్లిదండ్రులు వారి పిల్లలను క్రీడ ల్లో పాల్గొనే విధంగా ప్రోత్సహించాలని సూచించారు. క్రీడల్లో అత్యుత్తమ ప్రతిభ చాటి రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించిన క్రీడాకారులను ఎల్లవేళలా అదుకుంటామని హామీ ఇచ్చారు. విశిష్ట అతిథి సీనియర్ సివిల్ జడ్జి క్షేమాదేశ్ పాండే మాట్లాడుతూ.. నేటి ఓటమి రేపటి గెలుపునకు నాంది అని తెలిపారు. క్రీడల్లో క్రమశిక్షణ, పట్టుదలతో సాధన చేయడం ద్వారా అనుకున్న లక్ష్యాన్ని అందిపుచ్చుకోవచ్చన్నారు. క్రీడా పోటీల నిర్వహణ కార్యదర్శి కన్నా మాట్లాడుతూ.. ఉమ్మడి వరంగల్ జిల్లా అండర్- 9 బాలబాలికల విభాగంలో ఒక్కరోజు పాటు నిర్వహించిన చెస్ ఎంపిక పోటీల్లో 35 మంది బాలబాలికలు పాల్గొన్నారన్నారు. ఇక్కడ జిల్లా స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులు జూన్ మొదటి వారంలో హైదరాబాద్‌లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి చెస్‌పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో చాంబర్ ఆఫ్ కామర్స్ సభ్యులు, ఆర్బిటర్ ప్రేమ్‌సాగర్ తదితరులు పాల్గొన్నారు.

14 నుంచి కేయూ డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు

ప్రైవేట్ కళాశాలలు ఫీజులు చెల్లించకుంటే దోస్త్‌లో అడ్మిషన్లకు కత్తెర

'ఆంధ్రజ్యోతి' కథనంపై స్పందన షెడ్యూల్ విడుదల

కేయూ క్యాంపస్, ఏప్రిల్ 3, (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ బీఏ, బీకామ్, బీఎస్సీతో పాటు ఇతర కోర్సుల సెమిస్టర్ పరీక్షల తాజా షెడ్యూల్‌ను కేయూ ఉన్నతాధికారులు శనివారం విడుదల చేశారు. ఈ మేరకు శనివారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన 'డిగ్రీ విద్యార్థులకు పరీక్ష' అనే కథనంపై వర్సిటీ అధికారులు స్పందించారు. వెంటనే శనివారం కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసకర్ కట్ల రాజేందర్, అదనపు పరీక్షల నియంత్రణాధికారులు డాక్టర్ ఎం.తిరుమలదేవి, డాక్టర్ వెంకయ్యలతో సమావేశమయ్యారు. కేయూ పరిధిలోని ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లో డిగ్రీ కోర్సుల్లో ఉన్న సుమారు 1.70లక్షల మంది విద్యార్థుల ఉజ్వల భవిష్యత్ దృష్ట్యా వెంటనే పరీక్షల నిర్వహించాలని నిర్ణయించారు. ప్రైవేట్ కళాశాలలకు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను రాష్ట్రప్రభుత్వం పరిధిలో ఉందని, దీనిపై తామేం చేయలేమని భావించారు. వెంటనే డిగ్రీ బీఏ, బీకామ్, బీఎస్సీతో పాటు ఇతర కోర్సులు 2, 4 6వ సెమిస్టర్ రెగ్యులర్ సెమిస్టర్ పరీక్షలతోపాటు 1, 3, 5వ సెమిస్టర్ బ్యాక్‌లాగ్ విద్యార్థులకు పరీక్షల షెడ్యూల్‌ను విడుదల చేశారు.

మే 14 నుంచి డిగ్రీ పరీక్షలు

కేయూ పరిధిలో మే 14 నుంచి డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు నిర్వహిస్తామని కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ కట్ల రాజేందర్ తాజా షెడ్యూల్‌ను ప్రకటించారు. ప్రైవేట్ విద్యా సంస్థలు విద్యార్థుల నుంచి వసూలు చేసిన డిగ్రీ సెమిస్టర్ కోర్సుల ఫీజులను విద్యార్థులతో నామినల్ రూల్స్‌తోపాటు వెంటనే పరీక్షల నియంత్రణాధికారి కార్యాలయంలో అందచేయాలని సూచించారు.

మొండికేస్తే కఠిన చర్యలే..

వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాల పరిధిలో ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలన్నీ వెంటనే విద్యార్థుల ఫీజులు చెల్లించకపోతే విద్యార్థుల భవిష్యత్ దృష్ట్యా వర్సిటీ అధికారులు కఠిన నిర్ణయాలకు దిగనున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలకు ఫీజులు, పరీక్షలపై సూచనలు చేసినట్లు తెలిసింది. ఇప్పటికీ ఫీజులు చెల్లించకపోతే శనివారం విడుదలైన దోస్త్‌పోర్టల్‌లో వర్సిటీ పరిధిలోని ఫీజు చెల్లించని కళాశాలలకు అడ్మిషన్లు నిరాకరించాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. కాగా, మే 6వ తేదీ వరకు ప్రైవేట్ కళాశాలలకు ఫీజులు చెల్లించుకుని, పరీక్షల నిర్వహణకు ముందుకురావాలని ఆఖరు అవకాశం కల్పిస్తూ వర్సిటీ ఉన్నతాధికారులు తాజా ఉత్వర్వులు విడుదల చేశారు.


మంత్రులను సన్మానిస్తున్న కుడా చైర్మన్

మంత్రులకు కుడా చైర్మన్ సత్కారం

వరంగల్ కార్పొరేషన్, మే 3 (ఆంధ్రజ్యోతి): దేవన్నపేట పంప్‌హౌస్ మూడోదశ పనులను పరిశీలించడానికి నగరానికి వచ్చిన మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, సీతక్కలను కుడా చైర్మన్ ఇనగాల వెంట్రామ్‌రెడ్డి శనివారం హనుమకొండలోని తన గృహానికి మర్యాదపూర్వకంగా ఆహ్వానించి శాలువాలో సత్కరించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, నాగరాజు, రామచంద్రునాయక్, మురళీనాయక్‌లతో పాటు కిసాన్‌సెల్ అధ్యక్షుడు వెంకట్‌నర్సింహరెడ్డి, కుడా పీవో అజీత్‌రెడ్డిలతో పాటు కుడా సిబ్బంది పాల్గొన్నారు.

బల్దియా ఇన్‌చార్జ్ ఎస్ఈగా శ్రీనివాస్ నియామకం

వరంగల్ కార్పొరేషన్, మే 3 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ ఇంజనీరింగ్ విభాగం ఇన్‌చార్జ్ ఎస్ఈగా ఎస్.శ్రీనివాస్‌ను నియమిస్తూ బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే శనివారం ఆదేశాలు వెల్లడించారు. ఇంతకుముందు ఎస్ఈగా పనిచేసిన ప్రవీణ్‌చంద్ర ఏప్రిల్ 30న ఉద్యోగ విరమణ పొందడంతో ఆయన స్థానంలో వరంగల్ ఈఈగా పని చేస్తున్న శ్రీనివాస్ నియామకమయ్యారు. ఈ గ్రేటర్ పరిధిలోని సివిల్ వర్క్స్, నీటి సరఫరా, స్మార్ట్ సిటీ పనులు పర్యవేక్షిస్తారని కమిషనర్ వెల్లడించారు. కాగా గ్రేటర్ పరిధిలో పని చేస్తున్న జి.మాధవిని బల్దియా ఎలక్ట్రికల్ విభాగానికి బదిలీ చేస్తూ అదనపు బాధ్యతలు చూసుకోవాలని కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు.

చలో.. చలో.. చూసొద్దాం



ఐనవోలు మల్లికార్జునస్వామి ఆలయం

హనుమకొండ, మే 3 (ఆంధ్రజ్యోతి): పాఠశాలలు, కళాశాలలకు వేసవి సెలవులు ఇచ్చేశారు. ఇంట్లో అంతా సందడే సందడి. పిల్లలతో కలిసి సెలవుల్లో ఎంజాయ్ చేయాలనుకుంటారు పెద్దలు. వారిని తీసుకుని ఊళ్లకు వెళ్లడం లేదంటే ఏవైనా పర్యాటక ప్రాంతాలకు వెళ్లాలనుకోవడం సహజం. అయితే ప్రస్తుతం ఉన్న వేడి వాతావరణంలో మరింత దూరం వెళ్లే కంటే మన ఉమ్మడి జిల్లాలోనే.. దగ్గరి ప్రాంతాల్లోని పర్యాటక ప్రాంతాలకు తీసుకెళ్లేందుకు ఆసక్తి చూపుతుంటారు. పేద, మధ్య తరగతి కుటుంబాల వారు తక్కువ ఖర్చుతో ఎక్కువ పర్యాటక ప్రాంతాలను చూడాలనుకుంటారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఇలాంటి టూరిస్ట్ స్పాట్లకు కొదవేలేదు. ఉమ్మడిజిల్లావాసులు గతంలో ఆయా ప్రాంతాలను చూసినా.. మళ్లీ మళ్లీ చూసేందుకు ఇష్టపడుతుంటారు. ఎందుకంటే ఈ ప్రకృతి రమణీయ ప్రాంతాల తనివితీరని సోయగం అలా కట్టి పడేస్తుంది. వరంగల్, హనుమకొండల నుంచి ఎటు వెళ్లినా 100 నుంచి 150కి.మీ దూరంలోనే ఉన్నాయి. రెండు, మూడు రోజుల్లో దాదాపు అన్నీ చూసి రావచ్చు. అపురూపమైన శిల్పశోభిత దేవాలయాలు, ప్రకృతి రమణీయమైన ప్రదేశాలు, అందమైన సరస్సులు, ప్రాచీన కట్టడాలు, పురాతన ఆలయాలు గత చారిత్రక వైభవానికి సజీవ సాక్ష్యాలుగా కొలువుదీరాయి. ఇంకేం చలోచలో చూసొద్దాం రండి.. అంటూ ఉమ్మడి జిల్లాలోని పర్యాటక ప్రాంతాలపై ప్రత్యేక కథనం.

మేడారం సమ్మక్క సారలమ్మ..

ఆసియాలో కెల్లా అతిపెద్ద గిరిజన జాతర జరిగే సమ్మక్క సారలమ్మలు కొలువుదీరిన మేడారం కూడా సెలవుల్లో దర్శించదగిన పుణ్యక్షేత్రం. ములుగు జిల్లా కేంద్రానికి 45 కి.మీ దూరంలో తాడ్వాయి మండల కేంద్రానికి 16 కిమీ దూరంలో మారుమూల అభయారణ్యం మధ్యలో ఉన్న సమ్మక్క సారలమ్మ గద్దెలను దర్శించుకోవడం వల్ల అనిర్వచనీయమైన ఆనందం కలుగుతుంది. ప్రతీ రెండేళ్లకు ఒకసారి జాతర జరుగుతుంది. కోటి మందికి పైగా భక్తులు వస్తారు. పర్యాటకుల సౌకర్యార్థం మేడారంలో గద్దెలకు సమీపంలోనే పర్యాటక శాఖ హరిత హోటల్‌ను నిర్మించింది. ఇక్కడ రాత్రి బస చేయడానికి వసతులున్నాయి. బస్సు సౌకర్యం కూడా ఉంది.

హనుమకొండ పట్టణం నడిబొడ్డున ఉన్న వేయిస్తంభాల గుడి..

రుద్రేశ్వరుడి వేయిస్తంభాల గుడి కాకతీయుల నాటి అద్భుత నిర్మాణం. క్రీ.శ.1163లో కాకతి రుద్రదేవుడు దీనిని నిర్మించాడు. వెయ్యి స్తంభాలగుడి త్రికూటాలయం. ఇందులోని శివలింగం ఎత్తైన పానవట్టంపై ప్రతిష్ఠితమై భక్తులను విశేషంగా ఆకట్టుకుంటుంది. ఆలయం మధ్యలో రంగమండపం, దాని చుట్టూ అద్భుత శిల్పరీతులతో స్తంభాలు, ఎంతో కనువిందు చేస్తాయి. ఆలయానికి ముందున్న నందీశ్వరుడి విగ్రహం అందంగా, హుందాగా జీవం ఉట్టిపడేలా ఉంటుంది. గోడలకు బదులు స్తంభాలతోనే నిర్మితమైనందు వల్లనే ఈ ఆలయాన్ని వేయిస్తంభాలగుడిగా పిలుస్తున్నారు.

పద్మాక్షి దేవాలయం..

హనుమకొండలోని మరో దర్శనీయ స్థలం పద్మాక్షి దేవాలయం. కాకతీయుల ఆరాధ్య దేవత పద్మాక్షి. ఎత్తైన కొండపై నిర్మించిన దేవాలయం కాకతీయ రాజుల మూల పురుషుడు మాధవ వర్మ క్రీ.శ.4వ శతాబ్దిలో దీనిని నిర్మించాడు. చుట్టూ ఎత్తైన కొండలు, ప్రకృతి అందాలతో అలరారే పరిసరాల మధ్య నెలవైన ఈ గుడి దర్శనంతో మనసుకు ఎంతో ప్రశాంతత చేకూరుతుంది. ఈ గుడికి దగ్గరలోనే మహిమాన్వితమైన ప్రాచీన సిద్ధేశ్వరాలయం ఉంది. సమీపంలోనే జైన తీర్థంకులు కొలువుదీరిన అగ్గలయ్య గుట్ట ఉంది. ఇటీవలే దీనిని పర్యాటక ప్రాంతంగా తీర్చి దిద్దారు.

భద్రకాళి దేవాలయం

ఓరుగల్లు ప్రజలకు ఇలవేల్పుగా విరాజిల్లుతున్న భద్రకాళి దేవాలయం కూడా ఓ సుప్రసిద్ధ దర్శనీయ స్థలం. క్రీ.శ 10వ శతాబ్దంలో ఎర్ర భూపాలుడు దీనిని నిర్మించాడు. భద్రకాళి దేవికి భద్రేశ్వరీ అనే పేరు కూడా ఉంది. నిత్య ధూప, దీప నైవేద్యాలతో ఎంతో వైభవోపేతంగా వెలుగొందుతున్న ఈ ఆలయం దేశంలోని ప్రసిద్ధ దేవాలయల్లో ఒకటి. శక్తి పీఠంగా ప్రసిద్ధి చెందింది. ఓ వైపు చెరువు, మరో వైపు ఎత్తైన కొండలు, ఆహ్లాదకరమైన వాతావరణం మధ్య కొలువుదీరిన ఈ ఆలయం గొప్ప దర్శనీయ స్థలంగా వెలుగొందుతోంది.

బొగత జలపాతం..

ములుగు జిల్లా కేంద్రానికి 65 కి.మీ దూరంలో వాజేడు మండలంలో దట్టమైన అడవి మధ్య పచ్చదనాన్ని అల్లుకొని నీటి హొయలతో హొరెత్తించే బొగత జలపాతం కూడా ఒక మంచి పర్యాటక ప్రాంతం. అయితే వేసవి లోకన్నా వర్షాకాలంలోనే దీని అందాలను సంపూర్ణంగా వీక్షించగలం. బొగత జలపాతం సహజ సిద్ధమైన అందాలను దృష్టిలో ఉంచుకొని ఇక్కడ అప్పుడప్పుడు సినిమా షూటింగ్‌లు, షార్ట్ ఫిల్మ్‌ల చిత్రీకరణ జరుగుతూ ఉంటుంది. పర్యాటకుల బస కోసం పర్యాటకాభివృద్ధి సంస్థ ఇక్కడ హరిత హోటల్‌ను నిర్మించింది.



మేడారంలోని సమ్మక్క-సారలమ్మ గద్దెలు

క్రీ.శ 11వ శతాబ్దంలో ఈ ప్రాంతాన్ని పాలించిన త్రిభువనమల్లుని కాలంలో ఈ ప్రాంతాన్ని అయ్యనవోలు అని పిలిచేవారని అందుకే దీనికి అయినవోలు, ఐనవోలు అని పేరొచ్చినట్లు ఇక్కడి శాసనాన్ని బట్టి తెలుస్తోంది. కాకతీయుల సామంతుడైన అయ్యన మంత్రి ఇక్కడ మల్లికార్జున స్వామి ఆలయాన్ని కట్టించాడు. ఇక్కడ ఉండడానికి బస, వసతి సౌకర్యాలున్నాయి. జాతరకు వచ్చిన వారు ఒకటీ రెండు రోజులు ఉండిపోతారు.

లక్నవరం సరస్సు..

ములుగు జిల్లా కేంద్రానికి 22 కి.మీ దూరంలో గోవిందరావుపేట మండలంలోని చల్వాయికి సుమారు 7 కిమీ (బుస్సాపూర్) దూరంలో మారుమూల అడవిలో ప్రకృతి అందాలకు నెలవుగా ఉన్న లక్నవరం సరస్సు కూడా చూడదగ్గ ప్రాంతం. దీనిపై అత్యంత సుందరంగా నిర్మించిన వేలాడే వంతెన పర్యాటకులను ఎంతగానో ఆకట్టుకుంటుంది. పర్యాటక శాఖ చొరవతో లక్నవరం ఒక ప్రముఖ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందింది. ఇక్కడి ఐలాండ్‌లలో నీటిమధ్యలో ఉండే కాటేజీల్లో బస చేయడం మధురానుభూతినిస్తుంది. పర్యాటకుల కోసం సరస్సులో బోటింగ్ సౌకర్యం కూడా కల్పించారు. ఇక్కడ ఒకరోజు బస చేయడానికి వీలుగా హరిత హోటల్ కూడా ఉంది.



లక్నవరంలోని వేలాడే వంతెన

- దేని విశిష్టత దానిదే..
- ఎటు వెళ్లిన 100- 150 కిలోమీటర్ల దూరమే..
- అందుబాటులో ఆర్టీసీ బస్సులు
- సొంత వాహనమైతే వెళ్లొచ్చు హాయిగా.. హుషారుగా..

సండే స్పెషల్ SUNDAY SPECIAL

హేమాచల క్షేత్రం..

దర్శించుకోదగ్గ మరో ఆధ్యాత్మిక క్షేత్రం మల్లూరు (హేమాచల) లక్ష్మీనర్సింహస్వామి దేవాలయం. ములుగు జిల్లా మంగపేట మండల కేంద్రానికి ఒక కిలోమీటర్ దూరంలోని మల్లూరులో ఈ ఆలయం ఉంది. హేమాచల కొండపైన ఈ లక్ష్మీనర్సింహుడు ఉగ్రరూపంలో ఉన్న అర్చామూర్తి. ఈ ఆలయాన్ని ఐదు దశాబ్దాల క్రితం దీపకర్ణి అనే రాజు నిర్మించాడు. త్రేతాయుగం నుంచి ప్రాచీన పుణ్యక్షేత్రంగా ఇది భాసిల్లుతోంది. ఈ ఆలయాన్ని ఆనుకొని కైరన్లనే ప్రాచీన సమాధులున్నాయి. ఈ ఆలయాన్ని సందర్శించేందుకు వచ్చే భక్తులు బస చేయడానికి వీలుగా దగ్గరలోనే హరిత హోటల్ ఉంది.

పాండవుల గుట్ట..

జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రానికి సుమారు 30 కి.మీ దూరంలో పరకాల-భూపాలపల్లి రోడ్డులో రేగొండ మండలం తిరుమలగిరి శివారులో పాండవుల గుట్టలు, బుగులు వేంకటేశ్వరస్వామి క్షేత్రం ఉంది. ప్రకృతి అందాల మధ్య ఉన్న ఈ రెండింటిని సందర్శిస్తే అనిర్వచనీ యమైన భావన, భక్తిభావమూ కలుగుతాయి. పాండవులు దుర్యోధనుడి కంట పడకుండా ఈ గుట్టల్లో కొంత కాలం అజ్ఞాతవాసం చేసినందు వల్ల దీనికి పాండవుల గుట్టగా పేరొచ్చిందనేది ప్రతీతి. క్రీ.పూ 8వేల సంవత్సరాల కాలం నాటి అపురూప రేఖా చిత్రాలు ఈ గుట్టల్లో ఉన్నాయి. ఈ గుట్టల శ్రేణిలోనే బుగులు వేంకటేశ్వరస్వామి ఆలయం ఉంది.

ఐనవోలు మల్లికార్జునుడి క్షేత్రం..

హనుమకొండ జిల్లా కేంద్రం నుంచి సుమారు 15 కి.మీ దూరంలో ఉన్న ఐనవోలు మల్లికార్జునస్వామి దేవాలయానికి వెళ్లేందుకు బస్సు సౌకర్యం ఉంది. ఈ దేవాలయాన్ని కాకతీయు కాలంలో నిర్మించారు. సంక్రాంతి నుంచి ఉగాది వరకు అత్యంత వైభవోపేతంగా మహాజాతర జరుగుతుంది.

అబ్బురపరిచే రామప్ప

ప్రపంచ వారసత్వ సంపదగా యునెస్కో గుర్తించిన రామప్ప ప్రఖ్యాత పర్యాటక ప్రాంతంగా వెలుగొందుతోంది. ములుగు జిల్లా కేంద్రానికి 15 కి.మీ దూరంలో వెంకటాపురం మండలం పాలంపేట గ్రామంలో ఉన్న ఈ ఆలయం కాకతీయుల అపురూప శిల్ప కళావైభవానికి ప్రతీక. ఆలయం ఎదురుగా ఉన్న నంది జగత్ప్రసిద్ధమైంది. జీవం ఉట్టిపడేలా చెక్కిన ఈ విగ్రహం సందర్శకులను కట్టిపడేస్తుంది. రామప్ప ఆలయాన్ని ఆనుకొని సరస్సు ఉంది. సహజసిద్ధమైన ప్రకృతి సోయగాల మధ్య ప్రశాంతమైన వాతావరణంలో నెలవైన ఆలయాన్ని దర్శించడం మరువరాని మధురమైన అనుభూతి. కాకతీయుల కాలం నాటి రామప్ప సకల దేవుళ్ల సాక్షాత్కారం. శివకేశం సమారాధన, భూలోక కైలాసంగా ఏకకూట ఆలయంగా నిర్మించారు. ఆలయంపై చెక్కిన నల్లరాతి నాట్యకత్తెల విగ్రహాలు చూపు తిప్పుకోనివ్వవంటే అతిశయోక్తి కాదు. ఇక ఇక్కడ బస చేసేందుకు పర్యాటక శాఖవారి హరిత హోటల్ ఉంది.

ఇంకా ఎన్నెన్నో..

మహబూబాబాద్‌లోని కురవి వీరభద్రస్వామి ఆలయం, అనంతారంలోని వేంకటేశ్వరాలయం, కందగిరిలోని లక్ష్మీనర్సింహస్వామి ఆలయం, నర్సింహుల పేటలోని ఇంద్రకీలాద్రి వేంకటేశ్వర స్వామి ఆలయం, జనగామ జిల్లాలోని చిలుపూరుగుట్ట వేంకటేశ్వరస్వామి ఆలయం, ఖిలాషపూర్‌లోని సర్వాయి పాపన్న కోట, పాలకుర్తిలోని లక్ష్మీనర్సింహస్వామి ఆలయం, జఫర్‌గడ్ ఖిలా, బచ్చన్నపేట మండలం కొడవటూరులోని సిద్ధేశ్వరాలయం తదితర దర్శనీయ ప్రాంతాలు కూడా ఉమ్మడి జిల్లాలో ఉన్నాయి.

ఈ పర్యాటక ప్రాంతాలను సందర్శించేందుకు వచ్చే సందర్శకుల కోసం పర్యాటకాభివృద్ధి సంస్థ హరిత హోటళ్లను నిర్మించింది. ములుగు గట్టమ్మ వద్ద దామెరవాయిలో ప్రాచీన సమాధుల వద్ద, మల్లూరు

ఉమ్మడి జిల్లాలోని మరో ప్రఖ్యాత పర్యాటక ప్రాంతం ఓరుగల్లు కోట. ఓరుగల్లు కోట..

12,546 అడుగుల వైశాల్యంతో చుట్టూ ఎత్తైన ఏడు ప్రాకారాలతో 77 బురుజులతో కాకతీయ రాజు రుద్రదేవుడి కాలంలో నిర్మితమైంది. 800 ఏళ్లు అవుతున్నా కోట ఇప్పటికీ చెక్కుచెదరకుండా ఉంది. ఈ కోటలోని నాలుగు కీర్తితోరణాలు కాకతీయ రాజుల ప్రాభవానికి నిలువెత్తు ప్రతీకలుగా దర్శనమిస్తాయి. కోటలో అద్భుతమైన శిల్ప సంపద కనిపిస్తుంది. కోటలోని స్వయంభూ దేవాలయం కాకతీయుల కాలంలో నిర్మించిందే. పర్యాటకుల సందర్శనార్థం కోట మధ్య కాలంలో ప్రతిరోజూ కాకతీయుల చరిత్రను తెలియజెప్పే సౌండ్, లైట్ షోను ప్రదర్శిస్తున్నారు. కోటలోని గుండు చెరువులో బోటింగ్ సౌకర్యం ఉంది.

రెండేళ్లలో దేవాదుల పూర్తి

- ఆరు లక్షల ఎకరాలకు సాగు నీరందిస్తాం
- రేషన్ కార్డుల పంపిణీ నిరంతర ప్రక్రియ
- సాగునీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి
- హనుమకొండ కలెక్టరేట్‌లో సమీక్ష సమావేశం
- పాల్గొన్న మంత్రులు పొంగులేటి, సీతక్క, ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు

హనుమకొండ కలెక్టరేట్, మే 3 (ఆంధ్రజ్యోతి): దేవాదుల ప్రాజెక్టుకు అవసరమయ్యే నిధులను కేటాయించి రెండేళ్లలో పూర్తి చేస్తామని, దాని ద్వారా ఆరు లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తామని రాష్ట్ర నీటి పారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. హనుమకొండ కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో శనివారం ఆయన ఉమ్మడి వరంగల్ జిల్లా సాగు నీటిపారుదల, పౌరసరఫరాల శాఖలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ శాఖల మంత్రి, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క, ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. దేవాదుల ప్రాజెక్టును పూర్తి చేయాలనే దృఢ సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం ఉందన్నారు. ఇప్పటికే రెండున్నర లక్షల ఆయకట్టుకు సాగునీరు అందిస్తున్నామని, దేవాదుల పూర్తి చేసి ఆరు లక్షల ఎకరాలకు అందించేలా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. సమ్మక్క - సారక్క బ్యారేజీకి 40శాతానికి పైగా గోదావరి నది జలాలను కేటాయించేలా కేంద్ర ప్రభుత్వంతోపాటు ఛత్తీస్‌గఢ్ సీఎంతో చర్చించామన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత వానాకాలం, యాసంగిలో దేశంలోనే రికార్డు స్థాయిలో వరి పండించామని, రాష్ట్రంలో 2.80మెట్రిక్ టన్నుల ధాన్యం పండిందన్నారు. వానాకాలంలో సన్నరకం వరికి క్వింటాకు రూ.500 బోనస్ అందించామని, దాంతో రైతులు ఉత్సాహం చూపించి విజయవంతమయ్యారన్నారు. యాసంగిలోనూ ఆ బోనస్ కొనసాగుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వమే ప్రతీగింజను కొంటుందని, సర్కారు ఇస్తున్న సన్నబియ్యంతో 84శాతం పేదలు కడుపునిండా అన్నం తింటున్నారని, ఆ ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే చెందిందన్నారు. త్వరలోనే అర్హులైన ప్రతీ ఒక్కరికి రేషన్ కార్డులు ఇవ్వబోతున్నామని, రాష్ట్రంలో రేషన్‌కార్డుల పంపిణీ నిరంతర ప్రక్రియగా జరుగుతుందన్నారు. ఎఫ్‌సీఐకి ధాన్యం అమ్మే రాష్ట్రాలలో రాష్ట్రం ముందు వరుసలో ఉందన్నారు. గత ప్రభుత్వంతో నీటిపారుదల శాఖ పూర్తిగా విఫలమైందని, తాము అధికారంలోకి వచ్చాక పూర్తి దృష్టి పెట్టి అభివృద్ధి చేస్తున్నామన్నారు. గత ప్రభుత్వ పెద్దలమాదిరిగా అప్పులు తెచ్చి జేబులు నింపుకోవడం లేదని, శ్రద్ధతో పనులు చేస్తున్నామన్నారు.



దేవన్నపేటలో అధికారులు, ఎమ్మెల్యేలతో సమీక్ష నిర్వహిస్తున్న మంత్రులు ఉత్తమ్, పొంగులేటి

వేగంగా భద్రకాళి చెరువు పూడికతీత పనులు : పొంగులేటి

భద్రకాళి చెరువు పునరుద్ధరణ పనులు వేగంగా జరుగుతున్నాయని, త్వరలో భద్రకాళి చెరువుకు మహర్దశ వస్తుందని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. ఇప్పటికే 50శాతం పనులు పూర్తయ్యాయని, జిల్లా అధికారులు ఈ విషయంలో విజయవంతమయ్యారన్నారు. వానాకాలం ప్రారంభానికి ముందే పనులు 100శాతం పూర్తి చేయాలన్నారు. అసంపూర్తిగా ఉన్న ప్రాజెక్టులను, ఆగిన పనులను త్వరలోనే పూర్తిచేసి భూములకు నీరు అందించడానికి కృషి చేస్తున్నామన్నారు. వర్షాకాలంలో ఏ విధంగా ధాన్యం పండించారో అదేవిధంగా వేసవికాలంలో కూడా ధాన్యం పంటలను పండించారని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు రైతులు పండించిన సన్నధాన్యానికి రూ.500 బోనస్ ఇస్తున్నామన్నారు.



భద్రకాళి చెరువు వద్ద పనులను పరిశీలిస్తున్న మంత్రులు

ఎమ్మెల్యే మురళీనాయక్ తమ నియోజకవర్గాల్లో సాగునీటికి సంబంధించిన సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. సకాలంలో నీరు అందక పంటలు ఎండిపోతున్నాయని, నీరదించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఉమ్మడి జిల్లాలోని సాగునీటిపారుదలశాఖకు సంబంధించి ఎమ్మెల్యేలు సూచించిన అంశాలపై ఈఎన్‌సీ అనిల్‌కుమార్ స్పందిస్తూ వెంటనే ఆ సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ సమీక్షా సమావేశంలో ఇరిగేషన్ శాఖ చైర్మన్ రాహుల్ చౌహాన్, కమిషనర్ ప్రశాంత్‌జీవన్‌పాటిల్ వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, మేయర్ గుండు సుధారాణి, రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డి, హనుమకొండ, వరంగల్, మహబూబాబాద్, ములుగు, జనగామ, భూపాలపల్లి కలెక్టర్లు పి.ప్రావీణ్య, సత్యశారద, అద్వైత్‌కుమార్, దివాకర్ టీఎస్, షేక్ రిజ్వాన్‌భాషా, రాహుల్ శర్మ, అదనపు కలెక్టర్లు, సాగునీటి పారుదల శాఖల అధికారులు పాల్గొన్నారు.

పల్లా రాజేశ్వర్‌రెడ్డితో వాగ్వాదం

దేవన్నపేట పంప్‌హౌస్ వద్ద అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న సమయంలో మంత్రులు ఉత్తమ్, పొంగులేటి ఫొటోలు, వీడియోలు తీయొద్దంటూ అక్కడున్నవారికి సూచించారు. కానీ జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి వ్యక్తిగత సహాయకుడు సెల్‌ఫోన్‌లో ఫొటోలు తీస్తుండటంతో అక్కడున్న అధికారులు, ఎమ్మెల్యేలు వద్దని వారించారు. దాంతో సమీక్ష ముగిసిన తర్వాత ఫొటోలు తీసిన విషయంపై ఎమ్మెల్యేలు కేఆర్‌నాగరాజు, నాయిని రాజేందర్‌రెడ్డి ప్రస్తావిస్తూ.. పల్లా రాజేశ్వర్‌రెడ్డిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంలో వారి మధ్య వాగ్వాదం జరగ్గా.. మంత్రుల జోక్యంతో సర్దుమణిగింది. సమావేశానికి ముందు పల్లారాజేశ్వర్‌రెడ్డి మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని సత్కరించి స్వాగతం పలికారు. ఈ క్రమంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి.. పల్లా రాజేశ్వర్‌రెడ్డిని ఎబాగున్నావా అన్నా.. అంటూ నవ్వుతూ పలకరించగా.. ఆ సమయంలో కొద్ది సేపు వారి మధ్య సరదా సంభాషణ జరిగింది.



పల్లా, నాయిని మధ్య వాగ్వాదం

ములుగు జిల్లాలో చెక్‌డ్యామ్‌లు నిర్మించాలి

ములుగు జిల్లాలో గిరిజన గ్రామాలు అధికంగా ఉన్నాయని, ఆయా గ్రామాల పరిధిలో వాగులు ఉండటంతో వర్షాకాలంలో ఆ వాగులు నిండి ఇండ్లలోకి వచ్చి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఉన్న నేపథ్యంలో వెంటనే ఆయా ప్రాంతాల్లో చెక్‌డ్యామ్‌లు నిర్మించాలని మంత్రి సీతక్క కోరారు. అలాగే జిల్లాలో సాగునీటి కాలువల నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. గోదావరికి ఆనుకుని రెండు మండలాలు ఉన్నాయని, వర్షాకాలంలో ఈ మండలాల్లోని పలు గ్రామాలు నీటిలో మునిగి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో వెంటనే ఇక్కడ అభివృద్ధిపనులు చేయాలన్నారు. ఇంకా ఈ సమావేశంలో స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే రామచంద్రునాయక్, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, మహబూబాబాద్

దేవాదుల పంప్‌హౌస్ పరిశీలన

పెండింగ్ పనులపై మంత్రుల ఆరా

హనుమకొండ టౌన్ (ఆంధ్రజ్యోతి): హనుమకొండ దేవన్నపేటలోని దేవాదుల పంప్‌హౌస్‌ను రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, రెవెన్యూ, గృహనిర్మాణశాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి శనివారం పరిశీలించారు. శనివారం హైదరాబాద్ నుంచి ప్రత్యేక హెలిక్యాప్టర్‌లో మధ్యాహ్నం 2.30 గంటలకు దేవన్నపేటకు చేరుకున్న వారికి ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, నాయిని రాజేందర్‌రెడ్డి, కేఆర్ నాగరాజు, యశస్వినిరెడ్డి, హనుమకొండ కలెక్టర్ పి.ప్రావీణ్య, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే స్వాగతం పలికారు. అనంతరం మంత్రులు పంప్‌హౌస్‌ను పరిశీలించి పెండింగ్ పనులపై ఆరా తీశారు. వచ్చే వానాకాలం లోపు ఆ పనులను పూర్తి చేయాలని నీటి పారుదల శాఖ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రులు నీటిపారుదల శాఖ ఉన్నతస్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వం రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న అన్ని ప్రాజెక్టులపై సమీక్షలు నిర్వహించి అవసరమైన నిధులు కేటాయించి పనులను పూర్తి చేసేలా కార్యాచరణ రూపొందిస్తోందని, దేవాదులను కూడా త్వరలోనే పూర్తిచేస్తామన్నారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ దేవాదుల ప్రాజెక్టును పూర్తి స్థాయిలో అందుబాటులోకి తీసుకురావడం కోసం చేపట్టాల్సిన పనులను మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దేవాదుల ప్యాకేజీ 6 పనులను వేగంగా పూర్తిచేయాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో నీటి పారుదల శాఖ స్పెషల్ సెక్రటరీ ప్రశాంత్ జీవన్‌పాటిల్, మేయర్ గుండు సుధారాణి, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డి, అధికారులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



సర్పాల సయ్యాట..

భీమునిపాదం జలపాతం.. మహబూబాబాద్ జిల్లా గూడురు మండలంలోని ప్రకృతి రమణీయ ప్రాంతమిది. ఇక్కడి పచ్చని అందాల నడుమ రాళ్లగుట్టలపై నుంచి జాలువారే జలపాతం గురించి అందరికీ తెలిసిందే. వానాకాలంలో ఉవ్వెత్తు నుంచి జాలువారే ఆ నీటి జల్లుల అందాలను తిలకించేందుకు పర్యావరణ ప్రేమికులు ఆసక్తి చూపుతుంటారు. ప్రస్తుతం ఎండాకాలం కావడంతో కాస్త బోసిపోయి కనిపిస్తున్న భీమునిజలపాతం ప్రాంతంలో శనివారం సర్పాలు సయ్యాట ఆడుతూ కనిపించాయి.

ఫొటోలు : 'ఆంధ్రజ్యోతి' స్టాఫ్ ఫొటోగ్రాఫర్, హనుమకొండ



సెలవుల వేళ.. సందడి ఇలా..

వేసవి సెలవులు వచ్చాయి. ఇంకేం చిన్నారుల సంతోషానికి అవధులు లేవు. వారి ఆటలకు అంతే లేదు. ఎవరికి తోచిన రీతిలో.. ఎవరికి వచ్చిన.. నచ్చిన ఆటలు ఆడుతూ తోబుట్టువులు, స్నేహితులతో ఆనందంగా గడుపుతున్నారు. పార్కులు, పాఠశాలల మైదానాలు, ఇళ్ల వాకిళ్లు, చెట్ల నీడన సందడి చేస్తున్నారు. భూపాలపల్లి జిల్లా కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో శనివారం చిన్నారులు ఆటల్లో నిమగ్నమైన దృశ్యాలివీ.

ఫొటోలు : 'ఆంధ్రజ్యోతి' స్టాఫ్ ఫొటోగ్రాఫర్, భూపాలపల్లి





సినీ నటుడు విజయ్ దేవరకొండపై ఫిర్యాదు


సీఐ సత్యనారాయణరెడ్డికి ఫిర్యాదు చేస్తున్న గిరిజన నాయకులు

వరంగల్ క్రైం, మే 3 (ఆంధ్రజ్యోతి): షెడ్యూల్ ట్రైబ్స్‌ను పాకిస్థాన్ ఉగ్రవాదులతో పోల్చిన సినీ నటుడు విజయ దేవరకొండపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర నాయకుడు నాను నాయక్ శనివారం సుబేదారి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ నెల 26న ఓ సినిమా ప్రీరిలీజ్ కార్యక్రమంలో ట్రైబల్స్‌ను పాకిస్థాన్ ఉగ్రవాదులతో పోల్చుతూ తమ ఆత్మగౌరవాన్ని కించపరిచాడని ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఎయిర్‌పోర్టు, కోచ్‌ఫ్యాక్టరీ సాధన కాంగ్రెస్ ఘనతే

వరంగల్ ఎంపీ కడియం కావ్య

హనుమకొండ సిటీ, మే 3 (ఆంధ్రజ్యోతి): మామునూరు ఎయిర్‌పోర్టు, కాజీపేట కోచ్‌ఫ్యాక్టరీ సాధన ఘనత కాంగ్రెస్‌దే అని వరంగల్ ఎంపీ కడియం కావ్య అన్నారు. హనుమకొండ హంటర్‌రోడ్ సీఎస్ఆర్ గార్డెన్స్‌లో వర్ధన్నపేట శాసనసభ్యుడు కేఆర్ నాగరాజు అధ్యక్షతన పార్టీ సంస్థాగత నిర్మాణ, సన్నాహక సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఎంపీ కడియం కావ్య పాల్గొని మాట్లాడారు. రాష్ట్రప్రభుత్వం పేదల కడుపు నింపాలనే ఉద్దేశంతో తీసుకున్న సన్నబియ్యం పథకం ఎంతో చేయూతనిస్తోందన్నారు. బీఆర్ఎస్ రజతోత్సవాల పేరుతో ప్రజలను మభ్యపెట్టాలని చూస్తోందని విమర్శించారు. ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ.. పార్టీకి కార్యకర్తలే పట్టుకొమ్మలన్నారు. ప్రతీ కార్యకర్తకు న్యాయం జరిగే వరకు అహర్నిషలు కృషి చేస్తానన్నారు. ఏ పార్టీకైనా సంస్థాగత నిర్మాణమే ముఖ్యం అని, కాంగ్రెస్ పార్టీ సంస్థాగత నిర్మాణం చేపట్టడం చాలా సంతోషం అని అన్నారు. సమావేశానికి కాంగ్రెస్ వరంగల్ జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి వరద రాజేశ్వర్‌రావు అధ్యక్షత వహించగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, టెస్కాబ్ ఛైర్మన్ మార్నేని రవీందర్‌రావు, వరంగల్ జిల్లా పీసీసీ పరిశీలకుడు ఎమ్మెల్సీ ఎం.డి. అమీర్ అలీ ఖాన్, మేడి రవిచంద్ర, పీసీసీ పరిశీలకుడు కోటంరెడ్డి వినయ్ రెడ్డి, మక్సూద్ అహ్మద్‌తో పాటు హనుమకొండ కిసాన్ సెల్ అధ్యక్షుడు పింగిళి వెంకట్రాంనరసింహారెడ్డి, ఏఐసీసీ సభ్యుడు పులి అనిల్‌కుమార్, పీసీసీ సభ్యుడు నమిండ్ల శ్రీనివాస్, ఏఐసీసీ యూత్‌కాంగ్రెస్ నాయకురాలు తక్కళ్లపల్లి సాగరిక రావు, యూత్‌కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కేఆర్ దిలీప్‌రాజ్, వర్ధన్నపేట వ్యవసాయ మార్కెట్ ఛైర్మన్ నరుకుడు వెంకటయ్య, నియోజకవర్గ రాష్ట్ర, జిల్లా, మండల, డివి జన్, నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ కడియం కావ్య

ప్రజా పోరాటాలకు సన్నద్ధం కావాలి

సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి టీ శ్రీనివాసరావు

న్యూశాయంపేట, మే 3 (ఆంధ్రజ్యోతి): ప్రజా పోరాటాలకు సీపీఐ శ్రేణులు సన్నద్ధం కావాలని పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. శనివారం హనుమకొండ బాలసముద్రంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో హనుమకొండ కౌన్సిల్ సమావేశం కొట్టెపాక రవి అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలులో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. హామీల అమలు కోసం ప్రజలను సమీకరించి పోరాటం చేయాలన్నారు. కేంద్రంలో నరేంద్రమోదీ ప్రభుత్వం దేశాన్ని కార్పొరేట్‌లకు తాకట్టు పెట్టి దివాలా తీయించిందన్నారు. మోదీ నమ్మిన బంటు అదానీకి ప్రభుత్వ రంగ సంస్థలను దోచిపెట్టారని, అదానీ కుంభకోణంపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. విపక్ష పార్టీల నాయకులపై సీబీఐ, ఈడీలను ప్రయోగిస్తున్న మోదీ ప్రభుత్వం అదానీపై ఎందుకు ప్రయోగించడం లేదని ప్రశ్నించారు. రాష్ట్రంపై మోదీ ప్రభుత్వానిది సవతి తల్లి ప్రేమ అని, విభజన హామీలను అమలు చేయకుండా రాష్ట్రానికి, ముఖ్యంగా ఉమ్మడి వరంగల్ జిల్లాకు తీరని అన్యాయం చేశారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈనెల 26, 27న హసన్‌పర్తిలో సీపీఐ హనుమకొండ జిల్లా మహాసభలు జరగబోతున్నాయని, ఈ మహాసభలకు ప్రజలు సహకరించి విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఆదరి శ్రీనివాస్, మండ సదాలక్ష్మి, జిల్లా సహాయ కార్యదర్శులు తోట భిక్షపతి, మద్దెల ఎల్లేష్, సీనియర్ నాయకులు మోతె లింగారెడ్డి, కర్రె లక్ష్మణ్, ఉట్కూరి రాములు, బి.సంతోష్, రాజు గౌడ్, శంకర్, నేదునూరి రాజమౌళి, సదానందం, వెంకట్రాజం, సారంగపాణి, మెట్టు శ్యాసుందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తెలుగు భాషా సాహిత్యంలో పద్య స్థానం ప్రత్యేకం


శిక్షణ శిబిరంలో మాట్లాడుతున్న దత్తాత్రేయశర్మ

హనుమకొండ కల్చరల్, మే 3 (ఆంధ్రజ్యోతి) : తెలుగు భాషా సాహిత్యంలో పద్యానికి ఉన్న స్థానం ప్రత్యేకమైనదని, రాగయుక్తంగా పాడడం, చంద్రస్సుతో పద్యాలను రాయడం గొప్పకళ అని అవధాని విద్యా పరిషత్ అధ్యక్షుడు మరుమాముల దత్తాత్రేయశర్మ అన్నారు. వేసవి సెలవులను పురస్కరించుకొని హనుమకొండ లష్కర్ బజార్ పాఠశాలలో కాకతీయ పద్యకవితా వేదిక, అవధాన విద్యా వికాస పరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో నాలుగు రోజుల పాటు నిర్వహించే పద్యశిక్షణా శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. విశ్రాంత డీఈవో నన్నపురాజు రాజేశ్వర్ రాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో దత్తాత్రేయ శర్మ మాట్లాడుతూ.. తెలుగు సాహిత్యంలో ప్రత్యేకమైన పద్యగానం, పద్య రచనలపై ఔత్సాహికులకు ప్రత్యేక శిబిరం నిర్వహించడం అభినందనీయంటూ నిర్వాహకులు, ప్రముఖ అవధాని చేపూరి శ్రీరామ్‌ను అభినందించారు. తొలి తరగతిని వ్యాకరణ పండితుడు చిటికోటి విజయకుమార్ తీసుకున్నారు. భాషా పండితులు, ఔత్సాహిక భాషాభిమానులు పాల్గొంటున్న ఈ శిబిరానికి చేపూరి శ్రీ రామ్ కోఆర్డినేటర్‌గా వ్యవహరిస్తున్నారు. ప్రారంభ శిబిరంలో చైతన్య డీమ్డ్ వైస్ చాన్సలర్ దామోదర్, కేయూ అసిస్టెంట్ ప్రొఫెసర్ సరస్వతీభట్ల రామన్న, కాకతీయ పద్యకవితా వేదిక సభ్యులు అక్కెర కరుణాసాగర్, కొండా యాదగిరి, వెలుగు ప్రభాకర్, సిద్దెంకి బాబు, విష్ణుమూర్తి తదితరులు పాల్గొన్నారు.


ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న ఆదిత్య యాదవ్

విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి

వడ్డెపల్లి, మే 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పేరుకుపోయిన విద్యారంగ సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ విద్యార్థి ఉద్యమ రాష్ట్ర కన్వీనర్ మ్యాదరబోయిన ఆదిత్య యాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థుల హాజరు శాతం, సెమిస్టర్ గ్రేడ్ ఆధారంగా ఆటోమెటిక్ డిటెన్షన్ విధానాన్ని రద్దు చేయాలని, ఇది విద్యార్థుల భవిష్యత్‌పై తీవ్ర ప్రభావం చూపుతుందని అన్నారు. మాల్‌ప్రాక్టీస్ కేసుల్లో సెమిస్టర్ విధానాన్ని రద్దుచేసే నియమాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని అన్నారు. ఇంటర్నల్ మార్కుల నిష్పత్తిని 60గా, ఎక్స్‌టర్నల్ మార్కుల నిష్పత్తిని 40గా మార్చాలని డిమాండ్ చేశారు. సమావేశంలో విద్యార్థి సంఘం నేతలు వంశీరెడ్డి, కౌశిక్, సాయి, ధనుష్‌రెడ్డి, సాయికృష్ణ, భరత్, శశాంక్ తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ ఉత్పత్తులతో ఆరోగ్యానికి మేలు

వడ్డెపల్లి, మే 3 (ఆంధ్రజ్యోతి): సేంద్రియ ఎరువులతో పండించిన ఉత్పత్తులు ఆరోగ్యానికి ఎంతో మేలు చేకూర్చుతాయని ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్ సుంకరి జ్యోతి అన్నారు. హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లోని నేరెళ్ల వేణుమాధవ్ కళా ప్రాంగణంలో శనివారం ఏర్పాటు చేసిన వరంగల్ గ్రామ భారతి ప్రకృతి సేంద్రియ ఎరువుల సంతను ఆమెతో పాటు మాజీ మేయర్, బీజేపీ రాష్ట్ర నేత డాక్టర్ టి.రాజేశ్వర్‌రావు ప్రారంభించి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చిన్నారులకు పోషకాలు కలిగిన గ్రామీణ ఉత్పత్తులను అందించాలని పేర్కొన్నారు. వరంగల్ గ్రామ భారతి అధ్యక్షుడు ఎక్కటి అజిత్‌రెడ్డి, కార్యదర్శి చిన్నాల అనిత, కోశాధికారి బయ్య సారయ్య, ప్రముఖ సామాజిక వేత్త మిల్లెట్ ప్రమోటర్, నిమ్మల శ్రీనివాస్ పాల్గొన్నారు.

బీజేపీ మండల పదాధికారుల నియామకం

హసన్‌పర్తి, మే 3 (ఆంధ్రజ్యోతి): బీజేపీ వరంగల్ జిల్లా వర్ధన్నపేట నియోజకవర్గంలో సంరచనా పర్వ్‌లో భాగంగా జిల్లా ప్రభారి ఉప్పరి రమేష్ ఆదేశాలతో జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ సూచనల మేరకు శనివారం హసన్‌పర్తి మండల పదాధికారుల నియామకం జరిగింది. ఉపాధ్యక్షులుగా బోగి సుజాత, గొడిశాల మమత, బి.రవీందర్‌గౌడ్, టి.రఘుపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శులుగా దాట్ల సునీల్, దాది మధుసూదన్, ఒజ్జ కుమార్, ఆరెల్లి సతీష్, కోశాధికారిగా వీసం శ్రీనివాస్‌తో పాటు 23 మంది కార్యవర్గ సభ్యులతో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు మారం తిరుపతి నూతన కార్యవర్గ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపి పార్టీ బలోపేతంతో పాటు వికసిత్ భారత్ లక్ష్యంలో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు.

5, 6 తేదీల్లో ఢిల్లీలో బీఐఎస్ శిక్షణా తరగతులు

హనుమకొండ, మే 3 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం బ్యూరో ఇండియన్ స్టాండర్స్ (బీఐఎస్) న్యూఢిల్లీలో ఈనెల 5, 6 తేదీల్లో వినియోగదారుల ప్రతినిధులతో నిర్వహించే శిక్షణా తరగతులకు తెలంగాణ రాష్ట్రం నుంచి వరంగల్ జిల్లాకు చెందిన వినియోగదారుల మండలి జాతీయ ప్రధాన కార్యదర్శి సాంబరాజు చక్రపాణి హాజరవుతున్నారు. వస్తుసేవల నాణ్యతలో బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్స్ ప్రమాణాలు, వినియోగదారుల హక్కుల పరిరక్షణ రూల్స్ 2016, బంగారు వెండి ఆభరణాలపై హాల్‌మార్కింగ్ యూనిక్ ఐడెంటిఫికేషన్ విధానం కచ్చితంగా అమలు తదితర అంశాలపై రెండు రోజుల శిక్షణా తరగతులు నిర్వహిస్తారు. దేశ వ్యాప్తంగా బీఐఎస్ రిజిస్ట్రేషన్ ఉన్న వినియోగదారుల ప్రతినిధులు ఈ కార్యక్రమానికి హాజరవుతున్నారు. శిక్షణ తరగతుల అనంతరం భారత వినియోగదారుల సమాఖ్య 25 వసంతాల సిల్వర్‌జూబ్లీ వేడుకల్లో కూడా చక్రపాణి పాల్గొంటారు.

గ్రామ స్థాయిలో కార్యదర్శుల పాత్ర కీలకం


శిక్షణ శిబిరంలో పాల్గొన్న డీఆర్వో గణేష్

హసన్‌పర్తి, మే 3 (ఆంధ్రజ్యోతి): ప్రజా పాలనా విభాగంలో గ్రామ స్థాయిలో పంచాయతీ కార్యదర్శుల పాత్ర కీలకమని జిల్లా రెవెన్యూ అధికారి వై.వి.గణేష్ అన్నారు. మండల కేంద్రంలోని సంస్కృతి విహార్ టీటీడీసీ సెంటర్ డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ భవనంలో శనివారం పంచాయతీ కార్యదర్శుల రెండు రోజుల శిక్షణ ముగింపు కార్యక్రమం జరిగింది. భారత ప్రభుత్వం పరిపాలనా సంస్కరణలు, ప్రజా ఫిర్యాదుల విభాగం, సిబ్బంది, పెన్షన్ల మంత్రిత్వ శాఖ సహకారంతో తెలంగాణ ఏర్పాటు చేసిన సమాచార హక్కు, గ్రామసభ కోసం సామర్థ్య నిర్మాణంపై కేంద్రం పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ భాగస్వామ్యంతో హనుమకొండ ప్రాంతీయ శిక్షణ కేంద్రంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం శిక్షణ పూర్తిచేసుకున్న హనుమకొండ జిల్లాకు చెందిన 28 మంది పంచాయతీ కార్యదర్శులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ సిబ్బంది రవి, అధికార యంత్రాంగం, బోధనా సిబ్బంది పాల్గొన్నారు.


ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

ఎగ్జిబిషన్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే నాయిని

బాలసముద్రం, మే 3 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ బాలసముద్రంలోని కుడా మైదానంలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను శనివారం ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. వేసవి సెలవుల్లో విద్యార్థులు, పిల్లలు, పెద్దలందరూ సాయంత్రం వేళ సందర్శించి ఉల్లాసంగా, ఉత్సాహంగా మానసిక ప్రశాంతతను పొందాలని సూచించారు. ఎగ్జిబిషన్ యజమాని అస్లాం మాట్లాడుతూ.. ఈ ఎగ్జిబిషన్ నగర ప్రజల కోసం వెరైటీగా ఉండాలనే ఉద్దేశంతో భారీ వ్యయంతో కశ్మీర్ అందాలు, జలకన్యల విన్యాసాలు ప్రదర్శిస్తున్నట్లు తెలిపారు. అంతర్జాతీయ స్థాయిలో ఇటాలియన్ టైపు అమ్యూజ్‌మెంట్ పార్క్‌లో రేంజర్, రివాల్వింగ్ టవర్లు ప్రత్యేకంగా ఉన్నాయన్నారు. దేశంలోని భిన్న సంస్కృతులను ప్రతిబింబించే రాజస్థాన్, లక్నో, హరియాణా వంటి మరెన్నో రాష్ట్రాల కలంకారి, చేనేత, ఫ్యాన్సీ బ్యాంగిల్స్, ఇమిటేషన్ జ్యూవెల్లరి, లెదర్ గూడ్స్, రుచికరమైన కలకత్తా చాట్ బండార్, సిమ్లా మిర్చి, ఢిల్లీ పాపడాలు, శీతల పానీయాలు, ఐస్‌క్రీంలు సందర్శకుల కోసం 100కు పైగా స్టాల్స్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతీరోజు సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు ప్రదర్శన ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఈవీ. శ్రీనివాస్, సారంగపాణి, సత్యనారాయణ, కార్పొరేటర్ రావుల కోమలకిషన్, శ్రీమన్నారాయణ, వేల్పుల మోహన్‌రావు మేనేజర్లు శ్రీకాంత్, ఫిరోజ్ పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు యూనిఫామ్ పంపిణీ

హనుమకొండ సిటీ, మే 3 (ఆంధ్రజ్యోతి) : పశ్చిమ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ఆటోడ్రైవర్‌లకు యూనిఫారాలు పంపిణీ చేశారు. ఈ సందర్బంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ.. ఆటోడ్రైవర్‌ల ఇబ్బందులు తనకు తెలుసు అన్నారు. ఎలాంటి ఇబ్బందులున్నా తనవంతు సమాకారాన్ని అందిస్తానని అన్నారు. మీడియా, కమ్యూనికేషన్ ఛైర్మన్ కీతిడి దీపక్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కాకతీయ ఆటోడ్రైవర్ యూనియన్ నాయకులు దేవేందర్ రెడ్డి, రైకంటి రఘు, అంకూస్ అలీ, కుమార్ సయ్యద్ ఘూష్, అనందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

హసన్‌పర్తి, మే 3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని సీపీఎం జిల్లా కార్యదర్శి గాద ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో సీపీఎం మండల కమిటీ సమావేశం పుల్ల అశోక్ అధ్యక్షతన శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ముందుగా జమ్మూకశ్మీర్ ప్రాంతంలోని పహల్గాం ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన వారికి మౌనం పాటించి సంతాపం తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్లు, ఆటోడ్రైవర్లకు రూ.12వేలు, గృహలక్ష్మి పథకం కింద ప్రతీ మహిళకు రూ.2500, కొత్త రేషన్‌కార్డులు, జీరో కరెంటు బిల్లులు వంటి హామీలను తక్షణమే అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అదేవిధంగా గ్రామాల్లో నెల రోజులుగా సీపీఎం ఆధ్వర్యంలో చేపట్టిన సర్వేలో అనేక ప్రజా సమస్యలు వెలుగులోకి వచ్చినట్లు తెలిపారు. ముఖ్యంగా హసన్‌పర్తి టౌన్, నాగారం, మునిపల్లి, జయగిరి, పెంబర్తి, ఎర్రగట్టుగుట్ట, భీమారం, మల్లారెడ్డిపల్లి గ్రామాల్లో ఉన్న సమస్యలపై అధికారులు తక్షణమే స్పందించి పరిష్కారం చూపాలన్నారు. ఈ సమావేశంలో సీపీఎం మండల కార్యదర్శి గుమ్మడిరాజుల రాములు, మండల కమిటీ సభ్యులు మంద సుచందర్, వేలు సుమన్, వేలు రజిత, జూకంటి పద్మ, నాంపల్లి మౌనిక తదితరులు పాల్గొన్నారు.

పరకాల పీహెచ్‌సీ తనిఖీ

వరంగల్ మెడికల్, మే 3 (ఆంధ్రజ్యోతి): పరకాలలోని ఎన్సీడీ క్లినిక్, మెటర్నిటీ యూనిట్, పీహెచ్‌సీని హనుమకొండ జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎ.అప్పయ్య శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ.. దీర్ఘకాలిక వ్యాధులైన హైపర్ టెన్షన్, డయాబెటీస్ వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వం నుంచి అందుతున్న సేవల వివరాలను అడిగి తెలుసుకొని పలు సూచనలు చేశారు. వేసవికాలం దృష్ట్యా హీట్‌వేవ్, సన్‌స్ట్రోక్, ఓఆర్ఎస్ నిల్వ, ఎన్సీడీ మందుల స్టాక్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎన్సీడీ జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ ఇఫ్తిదర్ అహ్మద్, డాక్టర్ దివ్య, డాక్టర్ అపర్ణ, సిస్టర్లు నాగమణి, వెంకటలక్ష్మి, సునీత, ప్రశాంత్, విద్యాసాగర్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సీపీఐ మండల కార్యదర్శిగా శంకర్‌నాయక్

మడికొండ, మే 3 (ఆంధ్రజ్యోతి): భారతీయ కమ్యూనిస్టు పార్టీ(సీపీఐ) కాజీపేట మండల కమిటీ ఎన్నిక శనివారం జరిగింది. మండల కార్యదర్శిగా మడికొండకు చెందిన మాలోత్ శంకర్ నాయక్, సహాయ కార్యదర్శులుగా వేల్పుల సారంగపాణి, బరిగెల కుమారస్వామి, కోశాధికారిగా సలాకుల స్వరూప ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా మునిగాల ఐలయ్య, బొట్టు భిక్షపతి, మంద సుమన్, మునిగాల స్వామి, రాసమల్ల దీన, మద్దెల శ్రీనివాస్, రాసమల్ల కుమార్, ఇనంపెల్లి సల్మాన్, పూర్ణచందర్, జానపట్ల మంజులను ఎన్నుకున్నారు.

రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

వడ్డెపల్లి, మే 3 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని టీజీఎస్ ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయీస్ సిటిజన్స్ ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.నాగేశ్వర్‌రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లో టీజీఎస్ ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయీస్ సిటిజన్స్ ఫోరం వరంగల్ రీజియన్ అధ్యక్షుడు జేఎన్.భూషణం అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్టీసీ రిటైర్డ్ కార్మికులకు హైయ్యర్ పెన్షన్ మంజూరి చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. 2017 పే స్కేల్‌కు సంబంధించిన ఏరియర్స్ పే ఫిక్సేషన్ క్లియర్ చేయాలని కోరారు. సమావేశంలో సిటిజన్స్ ఫోరం వరంగల్ రీజియన్ ప్రధాన కార్యదర్శి కేడీ రెడ్డి, పీఆర్‌వో ఎస్ఎస్.మోహన్, కోశాధికారి ఎంఆర్.మొగిలి, జిల్లా నాయకులు లడే నర్సింగరావు, కిషన్‌రావు, టీడీ రావు, సాంబయ్య, కేవీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కుల గణన నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం

బాలసముద్రం, మే 3 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం జన గణనలో భాగంగా కుల గణన చేపట్టాలనే నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని బీసీ జాక్ రాష్ట్ర ఛైర్మన్ డాక్టర్ తిరునహరి శేషు ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం చరిత్రాత్మకమైనదని శేషు అభిప్రాయపడ్డారు. కుల గణన తర్వాత దేశంలో సామాజిక న్యాయ సాధనకు తొలి అడుగు పడిందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ నిర్ణయం తీసుకున్న ప్రధానమంత్రి నరేంద్రమోదీకి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా శ్వేతార్క గణనాథుడి శోభాయాత్ర

కాజీపేట, మే 3 (ఆంధ్రజ్యోతి): కాజీపేటలో శ్వేతార్క గణనాథుడి శోభాయాత్ర శుక్రవారం రాత్రి ఎంతో వైభవంగా జరిగింది. స్థానిక కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్, పలువురు వ్యాపారవేత్తలు ధ్వజారోహణం చేసి గజారోహణ ఊరేగింపు చేశారు. ఐనవోలు రాధాకృష్ణ, సాయికృష్ణ శర్మలు కర్పూర నారికేళ హారతి ఇచ్చి శోభాయాత్రను ప్రారంభించారు. ఈ యాత్ర పట్టణంలోని ప్రధాన రోడ్ల మీదుగా రహ్మత్‌నగర్ చౌరస్తా నుంచి తిరిగి దేవాలయం వరకు సాగింది. భక్తులు గణనాథుడికి మంగళహారతులతో నీరాజనాలు అందించారు. కార్యక్రమంలో దేవాలయం కార్యకర్తలు, సిబ్బంది, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి నినాదాలు చేస్తున్న బీజేపీ నేతలు

కుల గణన నిర్ణయం చరిత్రాత్మకం

బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్

వడ్డెపల్లి, మే 3 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్రమోదీ దేశవ్యాప్తంగా జన గణనలో భాగంగా కుల గణన చేపట్టాలని తీసుకున్న నిర్ణయం చరిత్రాత్మకమైనదని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్ అన్నారు. కుల గణనపై కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని హర్షిస్తూ శనివారం గ్రేటర్ వరంగల్ 56వ డివిజన్ గోపాల్‌పూర్‌లోని సర్దార్ సర్వాయి పాపన్న జంక్షన్ వద్ద బీజేపీ గోపాల్‌పూర్ జోనల్ అధ్యక్షుడు బండి హరీష్ ముదిరాజ్ ఆధ్వర్యంలో ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా కొండేటి శ్రీధర్ మాట్లాడుతూ.. ప్రధాని మోదీ స్ఫూర్తితో బీజేపీ దేశంలో మరింత బలపడుతుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా ఇన్‌చార్జ్ రామిండ్ల బాబురావు, జిల్లా కౌన్సిల్ మెంబర్ తక్కళ్లపల్లి అమృతరావు, ఓబీసీ మోర్చా జిల్లా కార్యాలయ కార్యదర్శి ఏ కృష్ణంరాజు, జిల్లా నాయకులు ఎర్రవల్లి లక్ష్మణ్‌రావు, బుచ్చిరాములు, పప్పు రమేష్, బొట్ల మమత, ఇమ్మడి సందీప్‌కుమార్, బండారి కుమార్, ఎల్లావుల లింగమూర్తి, బాలరాజు, కార్తీక్, జోగు వెంకటరాజం, ఏ రోహిత్‌రెడ్డి, బొట్ల ప్రశాంత్, తాడెం రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ ఫలితాల్లో కివి విద్యార్థుల హవా



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

కరీమాబాద్, మే3 (ఆంధ్రజ్యోతి): ఇటీవల విడుదలైన టెన్త్ ఫలితాల్లో వరంగల్ అండర్ రైల్వేగేటు ప్రాంతంలోని కరీమాబాద్ కివి పాఠశాల విద్యార్థులు అద్భుతమైన ఫలితాలను సాధించారు. పేంట్‌కర్ లిఖిత(577), నల్ల వినూత్న(576), చిదురాల ప్రశాంత్(576), సుంకరి సాయి అంజన్(574), దొంత సంజన(572)మార్కులు సాధించగా, మరో 33 మందికి 500పై చిలుకు మార్కులు వచ్చాయని ప్రిన్సిపాల్ దాసి సతీష్ మూర్తి తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను శనివారం ఆయన అభినందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ అన్నదేవర ప్రవీణ్‌కుమార్, డైరెక్టర్ దాసి రజిని, ఉపాధ్యాయులు మురళి, శాంతకుమారి, రమేష్, ఇంతియాజ్, రాకేష్, వెంకటేశ్వర్లు, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

'డిస్నీల్యాండ్' విద్యార్థులకు అభినందన


విద్యార్థులను అభినందిస్తున్న డిస్నీల్యాండ్ పాఠశాల యాజమాన్యం

దామెర, మే 3 (ఆంధ్రజ్యోతి) : తమ పాఠశాలలో పదో తరగతి చదివి, ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను డిస్నీల్యాండ్ పాఠశాల యాజమాన్యం అభినందించింది. దామెర మండలం ఒగ్లాపూర్‌లోని పాఠశాలలో శనివారం జరిగిన కార్యక్రమంలో పాఠశాల వ్యవస్థాపకులు డి.మల్లయ్య, డి.సదయ్య, బి.లక్ష్మీనివాసం, డైరెక్టర్స్ బి.శోభారాణి, డి.రాకేష్‌భాను, డి.దినేష్ చందర్ అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమ పాఠశాల విద్యార్థులు వరుసగా 20వ సారి కూడా సత్తా చాటారన్నారు. మొత్తం 133మంది పరీక్షలు రాయగా.. 130మంది ప్రథమ శ్రేణి పొందారన్నారు. విద్యార్థులు తాము ఎంచుకున్న లక్ష్యాన్ని చేరేవరకు ఎన్ని అవరోధాలు ఎదురైనా తట్టుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కాలం చెల్లిన ఐస్‌క్రీమ్ ఉత్పత్తులపై దాడులు

వరంగల్ క్రైం, మే 3 (ఆంధ్రజ్యోతి) : ఎర్రగట్టు గుట్ట సమీపంలోని అను మార్కెటింగ్ ఐస్‌క్రీమ్ డిస్ట్రిబ్యూటర్‌లో కాలం చెల్లిన రూ. 48,000 విలువ చేసే 3 రకాల ఉత్పత్తులను శనివారం టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ రంజిత్ టీం సభ్యులు పట్టుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపారు. వాటిని ఫుడ్‌సేఫ్టీ అధికారి పి.వేణుగోపాల్ అందజేసినట్లు తెలిపారు.